


సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 16 | సంచిక: 266

SUNDAY Special | ఆదివారం | 17-12-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




## ఆనందం.. భావోద్వేగం 'సాక్షి'గా..

సాక్షి ఎక్సలెన్స్ అవార్డ్స్ సంబరాలు..

- వివరాలు 11,12లో

మెగా ఈవెంట్ ఈ రోజు సాయంత్రం 5 గంటల నుంచి సాక్షి టీవీలో..



### ఆత్మాహుతికి ప్లాన్ వేశారు!

లోక్‌సభలో అలజడి సృష్టించిన నిందితులు తొలుత తమను తాము తగలబెట్టుకుందామని అనుకున్నట్లు తెలియవచ్చింది.

- వివరాలు 6లో



### చాట్‌జీపీటీకి పోటీగా జెమిని

ఓపెన్ ఏఐ తాలూకు చాట్ జీపీటీకి పోటీగా జెమిని పేరుతో గూగుల్ తాజాగా కొత్త ఏఐ మోడల్‌ను ప్రకటించింది.

- వివరాలు 6లో



### భారత్‌కు చిన్న నగరాలే కీలకం..

భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలన్న తన దీక్ష సాకారానికి చిన్న నగరాల అభివృద్ధే కీలకమని ప్రధాని చెప్పారు.

- వివరాలు 6లో



### 'అరేబియా'లో నౌక హైజాక్!

మాల్టా దేశానికి చెందిన సరకు రవాణా నౌక ఒకటి అరేబియా సముద్రంలో హైజాక్‌కు గురైంది.

- వివరాలు 6లో

# మేడిగడ్డపై విచారణ

## అన్నారం బ్యారేజీపైనా.. హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపిస్తాం
## సభ్యులకు బ్యారేజీలను చూపిస్తాం.. శాసనమండలిలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన

- ఏడాదిలోగా రెండు లక్షల ఉద్యోగాల భర్తీ, మహాలక్ష్మి పథకం పూర్తిస్థాయిలో అమలు
- పింఛన్ల పెంపు, ఇతర హామీల అమలుపైనా కార్యాచరణ చేపట్టాం
- ఉద్యోగుల సీపీఎస్, బదిలీలు, ఇతర అంశాలపై త్వరలో ప్రత్యేక భేటీ
- మూతపడిన చక్కెర కర్మాగారాలను తెరిపిస్తాం
- పంటల బీమా పథకాన్ని తీసుకు వస్తామని వెల్లడి
- గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాల తీర్మానంపై చర్చకు సీఎం సమాధానం



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటు, అన్నారం బ్యారేజీలో బుంగలు పడటంపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపిస్తామని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి శాసన మండలిలో ప్రకటించారు. నిష్పక్షపాత విచారణ జరిపించి.. కాంట్రాక్టులు ఎవరిచ్చారో, సమస్యలకు కారణం ఎవరో తేల్చి చర్యలు తీసుకుంటామని తెలిపారు. తమ ప్రభుత్వంలో నచ్చితే నజరానా (పురస్కారం), నచ్చకపోతే జుర్మానా (జరిమానా) ఉండవని పేర్కొన్నారు. గవర్నర్ ప్రసంగంపై శాసనమండలిలో శనివారం చేపట్టిన ధన్యవాద తీర్మానం చర్చకు సీఎం రేవంత్‌రెడ్డి సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన కాళేశ్వరం ప్రాజెక్టుపై విమర్శలు చేశారు. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన నాగార్జునసాగర్, శ్రీశైలం, జూరాల, శ్రీరాంసాగర్ ప్రాజెక్టులు ఎన్నో ప్రకృతి వైపరీత్యాలను తట్టుకుని నిలబడ్డాయని.. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు మాత్రం కళ్లముందే కుంగిపోయాయని వ్యాఖ్యానించారు. అలాంటిది తామేదో గొప్ప ప్రాజెక్టు కట్టామని, చిట్టచివరి ఆయకట్టుకు నీళ్లు ఇచ్చామని బీఆర్ఎస్ నేతలు చెప్పుకోవడం సరికాదని పేర్కొన్నారు. రూ.లక్ష కోట్ల

మిగతా 3వ పేజీలో ▶

## గ్యారంటీలకు చట్టబద్ధత..

హామీల అమలు కోసం కార్యాచరణ సిద్ధం చేస్తున్నాం..

- గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే చర్చలో సీఎం రేవంత్
- రాష్ట్రంలో నిరంకుశ, కుటుంబ పాలనకు కాలం చెల్లింది
- ప్రగతిభవన్ ఇనుప కంచెలను పగలగొట్టాం
- ఎవరైనా స్వేచ్ఛగా వచ్చి సమస్యలు చెబితే వినేందుకు సిద్ధం
- బీఆర్ఎస్ వాళ్లు ధర్నాచౌక్‌లో దీక్షలు చేసుకోవచ్చు
- ఏడో గ్యారంటీగా ప్రజాస్వామ్యాన్ని కాపాడుతామని వ్యాఖ్య

2లో

## అప్పుల రాష్ట్రంగా మార్చారు!

- ఒక్క ఎకరాకైనా అదనంగా నీళ్లు ఇచ్చారా?
- ఒక్కరికైనా ఉద్యోగం ఇచ్చారా?
- ఒక్క ఇందిరమ్మ ఇల్లయినా ఇచ్చారా?
- రాష్ట్రంలో పదేళ్లు విధ్వంసం చేశారు
- బీఆర్ఎస్ పాలనపై డిప్యూటీ సీఎం భట్టి

2లో

# అసత్యాలు, అభూత కల్పనలు

### అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగంపై కేటీఆర్ ధ్వజం

- ఇంత దారుణమైన ప్రసంగం శాసనసభ చరిత్రలో లేదు
- విధ్వంసం 55 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో జరిగింది
- 2014కి ముందు తెలంగాణలో పడావుపడ్డ భూములు, పాడుబడ్డ ఇళ్లు, ఆకలి కేకలు, ఆత్మహత్యలు.. పదేళ్లు ప్రభుత్వం నడిపిన వారిపై ఆ నెపాన్ని నెట్టేసే యత్నం చేస్తున్నారని మండిపాటు
- కేటీఆర్ ప్రసంగానికి పలుమార్లు అడ్డుతగిలిన మంత్రులు, సీఎం రేవంత్
- తెలంగాణ వచ్చిన తర్వాత జరిగిన పాలనపైనే చర్చకు అధికారపక్షం సూచనలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ దద్దరిల్లింది. చర్చ ప్రారంభమైన తొలి రోజే సభలో తీవ్ర రచ్చ జరిగింది. అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ మధ్య మాటలు తూటాల్లా పేలాయి. ఆరోపణలు, ప్రత్యారోపణలతో సభలో వాతావరణం వేడెక్కింది. అరుపులు, కేకలతో పలుమార్లు సభ మార్మోగిపోయింది. గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై శనివారం శాసనసభలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సభ్యుడు, మాజీ మంత్రి కేటీఆర్ తన ప్రసంగాన్ని ప్రారంభిస్తూనే ప్రభుత్వంపై దాడికి దిగారు. 'గవర్నర్ ప్రసంగం పూర్తిగా అసత్యాలు, అభూత కల్పనలు, తప్పులతడకగా ఉంది. ఇలాంటి ప్రసంగం వినడానికి సభ్యుడిగా సిగ్గుపడుతున్నా. ఇంత దారుణమైన అపసవ్యపు ప్రసంగం శాసనసభ చరిత్రలో విని ఉండము. కేవలం పదేళ్లు ప్రభుత్వం నడిపిన వారిపై నెపాన్ని నెట్టి వేసే ప్రయత్నం కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది' అని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా అధికార కాంగ్రెస్ సభ్యులు అభ్యంతరం తెలిపారు. కేటీఆర్ తన ప్రసంగంలో గత 55 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో నెలకొన్న పరిస్థితులపై ఆరోపణలు చేయగా పలుమార్లు మంత్రులు అడ్డుతగిలారు. తెలంగాణ ఏర్పాటునే ప్రామాణికంగా తీసుకుని 2014 జూన్ 2 నుంచి జరిగిన పరిణామాలపైనే చర్చించాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మరో నలుగురు మంత్రులు కేటీఆర్ ప్రసంగానికి పలుమార్లు అభ్యంతరం తెలుపుతూ ఎదురుదాడికి

మిగతా 2వ పేజీలో ▶

## న్యూస్‌రీల్

### భారత మహిళల రికార్డు..



ఇంగ్లండ్‌తో జరిగిన ఏకైక టెస్టులో భారత జట్టు 347 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. మహిళల టెస్టు చరిత్రలో ఇదే అతిపెద్ద విజయం. 479 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో 131 పరుగులకు ఆలౌట్ అయింది.

- వివరాలు 10లో

### ఆ 3 గంటల్లోనే మృత్యు ఘంటికలు

దేశవ్యాప్తంగా సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల మధ్యే ఎక్కువగా రోడ్డు ప్రమాద ఘటనలు జరుగుతున్నాయని జాతీయ నేర గణాంకాల సంస్థ వార్షిక నివేదిక–2022లో వెల్లడించింది. గతేడాది 4,46,768 ప్రమాదాలు నమోదవగా ఈ 3 గంటల్లోనే 90,663 ప్రమాదాలు జరిగినట్లు తెలిపింది.

- వివరాలు 14లో

### ప్రతీ ఇంటికి సంక్షేమ ఫలాలు

- చిన్నగోల్కొండలో వికాస్ భారత్ సంకల్ప్ యాత్ర రథాన్ని ప్రారంభించిన
- కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి -10లో

### కేసీఆర్ కుటుంబీకుల పాస్‌పోర్టులు సీజ్ చేయండి

- రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన బండి సంజయ్ - వివరాలు 10లో






### ఉద్యోగం రావట్లేదని యువకుడి బలవన్మరణం

- మహబూబాబాద్ జిల్లా డోర్నకల్‌లో ఘటన
- డిగ్రీ చదివి హైదరాబాద్‌లో పోటీ పరీక్షలకు సిద్ధమవుతూ ఇటీవలే స్వగ్రామానికి..
- ఆర్థిక ఇబ్బందులకుతోడు ఉద్యోగం రావట్లేదనే మనస్తాపంతో ఇంటి నుంచి బయటకు..
- బావిలో లభ్యమైన మృతదేహం -13లో

## అయోధ్యకు 1,000 రైళ్లు..

- భవ్య రామాలయం ప్రారంభ రోజు నుంచి 100 రోజులపాటు నడపాలని రైల్వే నిర్ణయం
- దేశవ్యాప్తంగా అన్ని నగరాల నుంచి నడవనున్న రైళ్లు
- భక్తుల నుంచి వచ్చే డిమాండ్‌కు అనుగుణంగా వాటి సంఖ్యను పెంచే అవకాశం.. రైళ్లలో ఆహారం అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్న ఐఆర్‌సీటీసీ
- ఈ నెల 23 నుంచి రిజర్వేషన్ టికెట్ బుకింగ్ ప్రారంభమయ్యే చాన్స్.. ఇప్పటికే దాదాపు పూర్తికావొచ్చిన అయోధ్య రైల్వే స్టేషన్ నవీకరణ

- వివరాలు 6లో

### ఆ హామీలకు రూ.3.10 లక్షల కోట్లు కావాలి..

- అయినా.. కాంగ్రెస్ వాటిని అమలు చేస్తుందని నమ్ముతున్నా: అక్బరుద్దీన్
- గవర్నర్ ప్రసంగంలోని పలు అంశాలపై అభ్యంతరం
- తమకు ఏ పార్టీతోనూ పొత్తు లేదని వ్యాఖ్య

- వివరాలు 3లో

### సెటైర్లు.. సవాళ్లు.. ప్రతిసవాళ్లు

- గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై వాడీవేడిగా అసెంబ్లీ
- బీఆర్ఎస్‌పై దాడితో ప్రసంగం మొదలుపెట్టిన రేవంత్..
- దీటుగా తిప్పికొడుతూ కేటీఆర్, హరీశ్‌రావు విమర్శలు

- వివరాలు 13లో


## మరో 1,890 స్టాఫ్ నర్స్ పోస్టులు

- అనుబంధ నోటిఫికేషన్ జారీ చేసిన ప్రభుత్వం
- దీంతో మొత్తం 7,094 ఖాళీల భర్తీకి ఏర్పాట్లు
- ఇప్పటికే పరీక్ష పూర్తి...త్వరలో ఫలితాలు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో కొత్త ప్రభుత్వం కొలువుతీరాక మొదటిసారిగా ఉద్యోగాల భర్తీ ప్రక్రియ ప్రారంభమైంది. మరో 1,890 స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీకి ప్రభుత్వం శనివారం అనుబంధ నోటిఫికేషన్ విడుదల చేసింది. గతంలో 5,204 స్టాఫ్ నర్స్ ఖాళీల భర్తీకి గతేడాది డిసెంబర్‌లో నోటిఫికేషన్ జారీ చేసిన సంగతి తెలిసిందే. ఆ పోస్టుల కోసం రాత పరీక్ష కూడా పూర్తయింది. 40 వేల మందికి పైగా పరీక్ష రాసి ఫలితాల కోసం ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా మరో 1,890 స్టాఫ్ నర్స్ ఖాళీలను కూడా ప్రభుత్వం కలిపింది. దీంతో ఈ పరీక్ష ద్వారా మొత్తం 7,094 ఖాళీలను భర్తీ చేయాలని నిర్ణయించినట్లు వైద్య, ఆరోగ్య సేవల నియామక బోర్డు సభ్య కార్యదర్శి గోపీకాంత్ రెడ్డి తెలిపారు. త్వరలో ఫలితాలు వెలువడతాయని ఆయన పేర్కొన్నారు.

### ఇదండీ సంగతి



ఇవ్వకుంటే ధర్నాచౌక్‌లో ధర్నా చేస్తారట సార్!



### రూ. 20 కోట్ల శునకం!!

- హైదరాబాద్ మియాపూర్‌లో సందడి చేసిన కకేషియన్ షెపర్డ్ జాతి కుక్క
- పెట్ షో కోసం బెంగళూరు నుంచి తీసుకొచ్చిన యజమాని
- సెల్ఫీలు తీసుకొనేందుకు పోటీ పడ్డ స్థానికులు

- వివరాలు 14లో







## క్లుప్తంగా...

### ప్రధాన ప్రతిపక్షానికి మాట్లాడే అవకాశం ఇవ్వడంలేదు

**మాజీ మంత్రి హరీశ్‌రావు**



సాక్షి, హైదరాబాద్‌: అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్షానికి మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని, కాంగ్రెస్‌ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. శనివారం ఆయన అసెంబ్లీ మీడియా పాయింట్‌ వద్ద మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌తో పాటు బీజేపీ, ఎంఐఎం సభ్యులకూ మాట్లాడే అవకాశం ఇవ్వడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వంపై అబద్ధాలు చెబుతూ, గోబెల్స్‌ ప్రచారం చేస్తున్నారని అన్నారు. దివంగత ప్రధాని పీవీ నరసింహారావు చనిపోతే కాంగ్రెస్‌ నాయకత్వం కనీసం నివాళులు అర్పించలేదని విమర్శించారు. సచివాలయం ముందు అమరుల స్థూపం కట్టింది బీఆర్‌ఎస్‌ అన్న విషయం తెలుసుకోవాలన్నారు. జై తెలంగాణ అంటే కాల్చేస్తా అంటూ గన్ను పట్టుకొని వచ్చింది రేవంత్‌రెడ్డే .. అని ధ్వజమెత్తారు.

### మేడిగడ్డ పనులు చేయబోమని చెప్పడం సరైంది కాదు

**కాంట్రాక్టు సంస్థపై చర్యలు తీసుకోవాలి: టీపీసీసీ నేత నిరంజన్‌**



సాక్షి, హైదరాబాద్‌: మేడిగడ్డ బ్యారేజి మరమ్మతు పనులు చేయబోమని ఎల్‌అండ్‌టీ సంస్థ చెప్పడం సరికాదని టీపీసీసీ సీనియర్‌ ఉపాధ్యక్షుడు జి. నిరంజన్‌ అన్నారు. శనివారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మేడిగడ్డ బ్యారేజి మరమ్మతులను కాంట్రాక్టు సంస్థే చేపడుతుందని, కూలిన పిల్లర్లను తిరిగి నిర్మిస్తామని అధికారులు చెప్పగా, పనులు చేయలేమని కాంట్రాక్టు సంస్థ ఇప్పుడు చెప్పడమేంటని ప్రశ్నించారు. సదరు సంస్థపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నిరంజన్‌ డిమాండ్‌ చేశారు.

### 'మీరు 65.. మేము 54' అనడం దేనికి సంకేతం

**బీఆర్‌ఎస్‌ను ప్రశ్నించిన సీపీఎం**



సాక్షి, హైదరాబాద్‌: 'మీరు 65, మేము 54 'అని అసెంబ్లీలో బీఆర్‌ఎస్‌ నేతలు అనడం దేనికి సంకేతమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రశ్నించారు. 'బీజేపీ 8 మంది బీజేపీ, ఏడుగురు ఎంఐఎం సభ్యులతో కలుపుకొని మేమంతా ఒక్కటేనని చెప్పదలుచుకున్నారా..'అని శనివారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. బీఆర్‌ఎస్‌ అధ్యక్షుడు కేసీఆర్‌ ఎన్నికల సందర్భంగా అనేక సభల్లో మాట్లాడుతూ తన చివరి శ్వాస వరకు బీఆర్‌ఎస్‌ లౌకికపార్టీగానే కొనసాగుతుందని నొక్కి చెప్పారని, మరి ఇప్పుడు సభలో ఈ ప్రస్తావన దానికి పూర్తిగా విరుద్ధం కదా?'అని అన్నారు. దేశవ్యాప్తంగా కులాలు, మతాలు, తెగల మధ్యఅస్థిత్వ భావజాలాన్ని ఉపయోగించి పబ్బం గడుపుకుంటున్న బీజేపీతో బీఆర్‌ఎస్‌ భవిష్యత్‌లో అంటకాగదలచుకున్నదా? అనే విషయాన్ని స్పష్టం చేయాలన్నారు. శాసనసభను అస్థిరం చేసే ఇలాంటి ప్రసంగాలు సరికాదని హితవు పలికారు. రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు ప్రజాసమస్యలపై చర్చలకు, పరిష్కారాలకు వేదిక కావాలని, సభ నడిచే సమయం మరింత పెరగాలని, ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చేలా ఉండాలని తమ్మినేని కోరారు.

### సీఎంను కలిసిన మోత్కుపల్లి

సాక్షి, హైదరాబాద్‌: సీఎం రేవంత్‌రెడ్డిని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు శనివారం అసెంబ్లీ హాల్‌లో కలిశారు. ఈ సందర్భంగా మోత్కుపల్లి మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం పేద ప్రజలకు అండగా ఉంటుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. పేదలకు ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు పరుస్తున్నందుకు సీఎంకు మోత్కుపల్లి ధన్యవాదాలు తెలిపారు.

# ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత

## హామీల అమలు కోసం కార్యాచరణ సిద్ధం చేస్తున్నాం

- గవర్నర్‌ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే చర్చలో సీఎం రేవంత్‌రెడ్డి
- రాష్ట్రంలో నిరంకుశ, కుటుంబ పాలనకు కాలం చెల్లింది
- ప్రగతిభవన్‌ ఇనుప కంచెలను పగలగొట్టాం
- ఎవరైనా స్వేచ్ఛగా వచ్చి సమస్యలు చెబితే వినేందుకు ప్రభుత్వం సిద్ధం
- బీఆర్‌ఎస్‌ వాళ్లు కావాలనుకుంటే ధర్నాచౌక్‌లో దీక్షలు చేసుకోవచ్చు
- గత పదేళ్లలో రాష్ట్రంలో 8 వేల మంది రైతుల ఆత్మహత్య
- పంటల బీమా పథకం పెట్టి ఉంటే ఇలా జరిగేది కాదు
- కాంగ్రెస్‌ విధానాలనే గవర్నర్‌ ప్రసంగంలో చెప్పారు.. అందులో తప్పులేదు
- ఏడో గ్యారంటీగా ప్రజాస్వామ్యాన్ని కాపాడుతామని సీఎం వ్యాఖ్య
- ధన్యవాదాల తీర్మానానికి అసెంబ్లీ ఆమోదం.. 20వ తేదీకి వాయిదా



శనివారం శాసనసభలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్‌: ఎన్నికల్లో కాంగ్రెస్‌ పార్టీ ఇచ్చిన హామీల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం తీసుకొస్తామని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి పునరుద్ఘాటించారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, రాజీవ్‌ ఆరోగ్యశ్రీ, ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లతోపాటు మహిళలకు ప్రతినెలా రూ.2,500 ఆర్థిక సాయం, రూ.500కే వంటగ్యాస్‌ సిలిండర్‌ వంటివన్నీ అమలు చేస్తామని ప్రకటించారు. ప్రభుత్వం ఏర్పడిన తొలిరోజే మంత్రివర్గ సమావేశం నిర్వహించి ఆరు గ్యారంటీలకు ఆమోదం తెలిపామని.. వాటికి చట్టబద్ధత కల్పించే కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని తెలిపారు. శనివారం శాసనసభలో గవర్నర్‌ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో రేవంత్‌ మాట్లాడారు. బీఆర్‌ఎస్‌ పాలనలోని వైఫల్యాలను ప్రస్తావిస్తూ విమర్శలు గుప్పించారు. రేవంత్‌ ప్రసంగంలోని ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే..

''కుటుంబ పాలనకు వ్యతిరేకంగా ప్రజలు తీర్పు ఇచ్చారు. ఓటమి తర్వాతైనా బీఆర్‌ఎస్‌లో మార్పు వస్తుందని ఆశించాం. శాసనసభలో గతంలో మంత్రులు, ఎమ్మెల్యేలుగా ఉన్న ఇతరులకు అవకాశం ఇస్తారనుకున్నాం. కానీ ఇప్పుడు కూడా ఆ కుటుంబ సభ్యులే మాట్లాడుతున్నారు. 'మా పార్టీ.. మా ఇష్టం'అనేది ఎక్కువకాలం చెల్లదు. ప్రజా జీవితంలో ఉన్నప్పుడు అడుగుతాం, కడుగుతామని శ్రీశ్రీ అన్నారు. నిరంకుశత్వం ఎక్కువ కాలం ఉండదు. మేం ప్రగతిభవన్‌ గడీలను బద్దలు కొట్టాక ప్రజలు తమ సమస్యలు చెప్పుకొనేందుకు రావడాన్ని బీఆర్‌ఎస్‌ నేతలు సహించలేకపోతున్నారు. గతంలో ఉప ముఖ్యమంత్రి మహమూద్‌ అలీ ప్రగతిభవన్‌కు వస్తే అనుమతి లేదని హోంగార్డే వెనక్కి పంపారు. నాటి ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్‌ సీఎంను కలిసేందుకు ప్రగతిభవన్‌కు వెళ్తే.. అనుమతి లేదని పోలీసులు వెనక్కి పంపిన చరిత్రను తెలంగాణ ప్రజలు మర్చిపోలేదు. ప్రజా యుద్ధనౌక గద్దర్‌ను కూడా ప్రగతిభవన్‌లోకి ప్రవేశం లేదని వెనక్కి పంపారు. మంత్రులు కూడా సీఎంను కలిసే అవకాశం లేని పరిస్థితి గత ప్రభుత్వంలో ఉంది. ఇప్పుడా ఇనుప కంచెలను పగలగొట్టి ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాం. ప్రజలకు స్వేచ్ఛ కల్పించాం. ఎవరైనా స్వేచ్ఛగా వచ్చి తమ సమస్యలు చెబితే వినేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది.

### పదేళ్లలో 8 వేల మంది రైతుల ఆత్మహత్యలు

రైతుల ఆదాయంలో తెలంగాణ దేశంలో 25వ స్థానంలో ఉంది. గత పదేళ్లలో తెలంగాణలో 8వేల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ఎన్‌సీఆర్‌బీ నివేదికలోనే వెల్లడైంది. 2018 నుంచి ఇప్పటి వరకు 18–60 ఏళ్లమధ్య వయసున్న 1,12,965 మంది రైతులు చనిపోతే.. వారికి రైతుబీమా కింద పరిహారం ఇచ్చారు. చనిపోయాక ఇవ్వడమా రైతు ప్రభుత్వమంటే? అదే పంటల బీమా పథకం పెట్టి ఉంటే రైతుల ఆత్మహత్యలు జరిగి ఉండేవి కాదు. కేసీఆర్‌ వరి వేస్తే ఉరే అని చెప్పి.. తన ఫామ్‌ హౌజ్‌లో మాత్రం 150 ఎకరాల్లో వరి పండించి, ఆ వడ్లను క్వింటాల్‌ రూ.4,250 లెక్కన అమ్ముకున్నారు. అదే రైతులకు మాత్రం రూ.1,400 లెక్కనే ఇచ్చారు. దీనిపై విచారణకు సిద్ధమా?

### పాలమూరు ప్రజలు గెలిపించకపోయి ఉంటే..

తలసరి విద్యుత్‌ వినియోగంలో తెలంగాణ నంబర్‌ వన్‌ అనేది పచ్చి అబద్ధం. యూటీలు, పలు రాష్ట్రాల తరువాత తెలంగాణ 10వ స్థానంలో ఉంది. రాష్ట్రంలో కోటి ఎకరాలకు కాల్వల ద్వారా నీరిస్తే.. 2014లో 19 లక్షలున్న పంపుసెట్ల సంఖ్య ఇప్పుడు 29లక్షలకు ఎందుకు చేరింది? రాష్ట్రంలో పాలమూరు, చేవెళ్ల ప్రాంతాలపై ఎందుకు వివక్ష కొనసాగింది? పాలమూరులో వలసలు ఆగలేదు. ఆర్‌డీఎస్‌ ప్రాజెక్టు ఇంకా పూర్తికాలేదు. కేసీఆర్‌ను పాలమూరు ప్రజలు ఎంపీగా గెలిపించకపోయి ఉంటే రాజకీయ భవిష్యత్తు ఏమై ఉండేది? ప్రాణహిత-చేవెళ్ల పథకాన్ని రద్దుచేసి ఈ ప్రాంతానికి తీవ్ర అన్యాయం చేశారు. మిడ్‌ మానేరు నిర్వాసితులు పరిహారం కోసం ఇప్పటికీ ఆందోళనలు చేస్తూనే ఉన్నారు. మిడ్‌మానేరు ఆర్‌ అండ్‌ ఆర్‌ పునరావాసంలో ఎంపీ సంతోష్‌కుమార్‌కు, ఆయన సోదరికి 250 గజాల చొప్పున ఇళ్ల స్థలాలు వచ్చాయి. ఇసుక దోపిడీని ప్రశ్నించిన నేరెళ్ల ప్రజలను కేసులు పెట్టి హింసించారు. దళితులను లాకప్‌లలో పెట్టి, కరెంట్‌ షాక్‌ ఇచ్చి హింసించారు. బీఆర్‌ఎస్‌ సభ్యులెవరినీ సభ నుంచి బయటికి పంపించం. వారిని ఇక్కడే కూర్చోబెట్టి కఠోర నిజాలు వినిపిస్తాం. వారికి ఇదే శిక్ష.

### ప్రజలకు క్షమాపణ చెప్పాల్సిందే..

గవర్నర్‌ ప్రసంగం వింటుంటే సిగ్గుపడ్డామని కేటీఆర్‌ అన్నారు. గత ప్రభుత్వం ఉన్నప్పుడు పదో తరగతి పరీక్షలు సరిగా నిర్వహించలేదు. ఇంటర్‌ పరీక్షలు సరిగా దిద్దక 25మంది విద్యార్థుల ఆత్మహత్యలకు కారణమయ్యారు. టీఎస్‌పీఎస్సీ ద్వారా ఉద్యోగ నియామకాలు చేపట్టలేక ప్రశ్నపత్రాలు అమ్ముకున్నవాళ్లు సిగ్గుతో తలదించుకుని ప్రజలకు క్షమాపణ చెప్పాల్సిందే. మేనేజ్‌మెంట్‌ కోటాలో ఇక్కడ (సీఎం స్థానంలో) కూర్చోవాలనుకుంటే కేటీఆర్‌కు నిరాశ ఎదురైంది. పదవి దక్కలేదనే నిరాశతోనే ఆయన అక్కసు వెళ్లగక్కుతున్నారు. సోనియాగాంధీ దయ వల్లే తెలంగాణ వచ్చిందని గతంలో కేసీఆర్‌ స్వయంగా అసెంబ్లీలో అంగీకరించారు. గవర్నర్‌ ప్రసంగం కాంగ్రెస్‌ మేనిఫెస్టోలా ఉందని కడియం శ్రీహరి అన్నారు. కాంగ్రెస్‌ విధానాలనే గవర్నర్‌ తన ప్రసంగంలో చెప్పారు. అందులో తప్పులేదు. ఆరు గ్యారంటీలతోపాటు ఏడో గ్యారంటీగా ప్రజాస్వామ్యాన్ని కాపాడుతామని మేం చెప్తున్నాం..''అని రేవంత్‌ చెప్పారు.

### శాసనసభ 20వ తేదీకి వాయిదా

ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్‌ చేసిన ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని శాసనసభ శనివారం ఆమోదించింది. తర్వాత శాసనసభను ఈనెల 20వ తేదీకి వాయిదా వేస్తున్నట్టు స్పీకర్‌ గడ్డం ప్రసాద్‌కుమార్‌ ప్రకటించారు.

### ధర్నాచౌక్‌ను పునరుద్ధరించాం

మేం నియంతృత్వం, నిర్బంధ పోకడకు వెళ్లం. గతంలో అసెంబ్లీలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సంపత్‌కుమార్‌ నిరసన తెలిపితే వారి శాసనసభ సభ్యత్వాలు రద్దు చేసిన చరిత్రను ప్రజలు మర్చిపోలేదు. గతంలో అమరవీరుల కుటుంబీకులను ఎప్పుడైనా ప్రగతిభవన్‌కు పిలిచి బుక్కెడు బువ్వ పెట్టి గౌరవించారా? ఉద్యమంలో బిడ్డలను కోల్పోయిన కుటుంబాలను ఆదుకున్నారా? పదేళ్లు అధికారంలో ఉండి తెలంగాణ ఉద్యమకారులపై కేసులు ఎత్తివేయలేదు. తెలంగాణ కోసం ఉద్యోగం వదులుకున్న డీఎస్పీ నళినికి ఎందుకు న్యాయం చేయలేదు? కేసీఆర్‌ తన కుటుంబంలోని కుమారుడు, కుమార్తె, బంధువులకు మాత్రం మంత్రి పదవులు ఇచ్చారు. ఉద్యమ పార్టీ అని చెప్పుకొనే బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం ధర్నాచౌక్‌ను ఎత్తివేసింది. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు మేం ధర్నాచౌక్‌ను పునరుద్ధరించాం. కావాలనుకుంటే కేటీఆర్, బీఆర్‌ఎస్‌ నేతలు ధర్నాచౌక్‌లో ఆమరణ నిరాహార దీక్షలు, ధర్నాలు చేసుకోవచ్చు.

### డ్రగ్స్‌ విషయంలో ఎవరినీ ఉపేక్షించం

''బీఆర్‌ఎస్‌ పాలనలో రాష్ట్రం గంజాయి, డ్రగ్స్‌కు అడ్డాగా మారింది. డ్రగ్స్‌ ఘటనపై సిట్‌ వేయాలని నేనే పోరాటం చేశాను. డ్రగ్స్‌ కోరల్లో చిక్కుకున్న పంజాబ్‌ మాదిరే మన రాష్ట్రాన్ని తయారు చేశారు. గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన టీఎస్‌ న్యాబ్‌ కాగితాలకే పరిమితమైంది. డ్రగ్స్‌ నివారణకు 319 మంది సిబ్బంది కావాలంటే ఇవ్వలేదు. న్యాబ్‌ రూ.29 కోట్ల నిధులు కోరితే ఇవ్వలేదు. మా ప్రభుత్వం డ్రగ్స్‌ను అరికట్టేందుకు పటిష్ట ప్రణాళికతో వెళ్తుంది. డ్రగ్స్‌ విషయంలో ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదు. కఠినంగా శిక్షిస్తాం. రాష్ట్ర సరిహద్దుల్లోకి డ్రగ్స్, గంజాయి వస్తే ఊరుకోం. ప్రతిపక్షాలు సహకరించాలని కోరుతున్నా. మేం పాలకులం కాదు.. సేవకులం. నాలుగున్నర కోట్ల ప్రజలకు సేవ చేసేందుకే ఇక్కడికి వచ్చాం.''

## ప్రజాభవన్‌లో భట్టి విందు.. సీఎం, మంత్రులు హాజరు



ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శనివారం రాత్రి ఇచ్చిన విందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. ఇంకా రాజ్యసభ సభ్యుడు జైరాంరమేశ్, శాసనసభ స్పీకర్‌ గడ్డం ప్రసాద్, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, సీతక్క, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డీజీపీ రవిగుప్తా, ప్రభుత్వ విప్‌లు, పలువురు ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. – సాక్షి, హైదరాబాద్‌

# అసత్యాలు, అభూత కల్పనలు

▶ మొదటి పేజీ తరువాయి


దిగడంతో సభలో స్వల్ప ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

**55 ఏళ్ల విధ్వంసం గురించి మాట్లాడుతాం**

ప్రభుత్వం గత పదేళ్ల విధ్వంసం గురించి మాట్లాడితే, తాము 55 ఏళ్ల కాంగ్రెస్‌ పాలనలో జరిగిన విధ్వంసం గురించి మాట్లాడాలా? వద్దా? అని కేటీఆర్‌ ప్రశ్నించారు. తెలంగాణలో 2014కి ముందు పడావుపడ్డ భూములు, పాడుబడ్డ ఇళ్లు, ఆకలికేకలు, ఆత్మహత్యలు, వలసలు, కరువులు, ఎన్‌కౌంటర్లు, కరెంట్‌ కోతలు, కటిక చీకట్లు, నెత్తురు బారిన నేలలు, నెత్తురు బారిన నేలలు ఉండేవని కేటీఆర్‌ గత 55 ఏళ్ల కాంగ్రెస్‌ పాలనపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. 'కొత్త ప్రభుత్వం వచ్చింది. మూడు నెలల సమయం ఇద్దాం. ఎలాగో అట్టర్‌ ఫ్లాప్‌ అవుతారు'అని తమ పార్టీ అధినేత కేసీఆర్‌ అన్నారని ఎద్దేవా చేశారు. ఆనాడు తాము పోరాడుతుంటే పదవుల కోసం తెలంగాణ కాంగ్రెస్‌ నేతలు పెదవులు మూసుకున్నారని కేటీఆర్‌ విమర్శించగా, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్ర అభ్యంతరం తెలిపారు. తన తండ్రి అంత్యక్రియల్లో పాల్గొన్న తర్వాత స్నానం చేయడానికి బావుల్లో నీళ్లు, కరెంట్‌ లేక ఎలా ఇబ్బంది పడ్డారో తెలుపుతూ కాంగ్రెస్‌ పాలనపై గతంలో సభలో రేవంత్‌రెడ్డి చేసిన విమర్శలను ఈ సందర్భంగా కేటీఆర్‌ గుర్తు చేశారు. నిర్బంధాలు, నియంతృత్వం తమ పదేళ్ల పాలనలో కాదని, ఇందిరమ్మ పాలనలోనే చోటుచేసుకున్నాయని కేటీఆర్‌ చెప్పారు. ఎమర్జెన్సీ, ఆర్టికల్‌ 365తో ప్రభుత్వాన్ని రద్దు చేయడం, ముల్కీ రూల్స్‌కు తూట్లు పొడవడం జరిగాయన్నారు. పోతిరెడ్డిపాడు వద్ద పొక్క గొట్టి నీళ్లు తీసుకెళ్తుంటే, హంద్రీ నీవాతో నీళ్లు తీసుకెళ్తుంటే టీ కాంగ్రెస్‌ నేతలు హారతులు పట్టారని ఆరోపించారు. చర్చల కోసం నక్సల్స్‌ను పిలిచి కాల్చి చంపింది ఎవరని ప్రశ్నించారు. వాస్తవానికి నిర్బంధం జూన్‌ 2, 2014తో ముగిసిందన్నారు.

**చీమల పుట్టలో చేరిన పాము ఎవరు?**

'శాసనసభలో మేము 39 మంది ఉండగా, కాంగ్రెస్‌ నుంచి 64 మంది ఉన్నారు. ఎందుకంత మిడిసిపడుతున్నారు? ఓట్ల తేడా కేవలం 1.85 శాతం మాత్రమే' అని తన ప్రసంగానికి అడ్డుపడుతున్న అధికారపక్ష సభ్యులనుద్దేశించి కేటీఆర్‌ మండిపడ్డారు. కేటీఆర్‌ వ్యాఖ్యలను తప్పుబడుతూ సీఎం రేవంత్‌రెడ్డి తీవ్రస్థాయిలో స్పందించారు. తెలంగాణ తెచ్చిన నాయకుడిని పట్టుకుని కల్వకుంట్ల చంద్రశేఖర్‌ రావు అని రేవంత్‌రెడ్డి ఏక వచనంతో సంబోధించడాన్ని కేటీఆర్‌ తప్పుబట్టారు. అప్పోసిన ఆంబోతు.. చీమలు పెట్టిన పుట్టలో దూరిన పాము ఎవరు? అని ప్రశ్నించారు. భట్టి, దామోదర, శ్రీధర్, ఉత్తమ్, కోమటిరెడ్డి పెట్టిన పార్టీలో దూరి సీఎం పదవి తీసుకున్న వ్యక్తి ఈ విషయాలు మాట్లాడటం చండాలంగా ఉందన్నారు. ఎన్‌ఆర్‌ఐలకు టికెట్లు అమ్ముకుంది ఎవరని ప్రశ్నించారు. వంద కోట్ల మంది భారతీయులను కాదని బయటి దేశం నుంచి అధ్యక్షురాలిని తెచ్చుకుంది ఎవరని నిలదీశారు. ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే రెండింటిని అమలు చేశామని ప్రభుత్వం చేసుకుంటున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. రెండు హామీల్లో అమలు చేసింది పావులా వంతు మాత్రమే అన్నారు. ప్రజావాణిని కొత్తగా ప్రారంభించడమేంటని, అది ప్రతి సోమవారం కలెక్టరేట్లలో జరుగుతోందని పేర్కొన్నారు. ప్రగతిభవన్‌ ఎదుట 2012లో నాటి సీఎం కిరణ్‌కుమార్‌ రెడ్డి ఇనుప కంచెలు వేశారన్నారు.





### అప్పులపై తప్పుడు ప్రచారం

గత పదేళ్లలో రాష్ట్ర విద్యుత్‌ సంస్థల ఆస్తులను రూ.1,37,571 కోట్లకు పెంచామని కేటీఆర్‌ గుర్తు చేశారు. ఈ విషయాన్ని దాచిపెట్టి రూ.81,516 కోట్ల అప్పులు చేశామని తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. పౌరసరఫరాల సంస్థ వద్ద రూ.30 వేల కోట్ల విలువ చేసే స్టాక్‌ ఉందని, మరో రూ.17 వేల కోట్లు ఎఫ్‌సీఐ నుంచి రావాల్సిఉందని, రెండు కలిపితే రూ.47 వేల కోట్లు అవుతుందని చెప్పారు. ఈ విషయాన్ని దాచి సంస్థ తరఫున రూ.56 వేల కోట్ల అప్పులు చేసినట్టు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. అప్పులను వృద్ధిరేటుతో పోల్చి చూడాలన్నారు. అమెరికాలో జీడీపీతో పోల్చితే 123 శాతం, జపాన్‌లో 215 శాతం, భారత్‌లో 57 శాతం అప్పులుండగా, తెలంగాణలో 27.8 శాతమే ఉన్నాయని చెప్పారు. అప్పుల్లో తెలంగాణ దేశంలోనే కింది నుంచి 24వ స్థానంలో ఉందని కేటీఆర్‌ పేర్కొన్నారు.

# రేవంత్‌ ప్రసంగానికి అడ్డు తగిలిన బీఆర్‌ఎస్‌

**వెల్‌లోకి వెళ్లి సభ్యుల నిరసన**

సాక్షి, హైదరాబాద్‌: గవర్నర్‌ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తున్న సమయంలో బీఆర్‌ఎస్‌ సభ్యులు పలుమార్లు అడ్డుతగిలారు. రేవంత్‌రెడ్డి తన ప్రసంగంలో బీఆర్‌ఎస్‌ పార్టీ పైన, కేసీఆర్‌ ప్రభుత్వంపైన విమర్శలు చేస్తుండటంతో రెండుసార్లు మాజీ మంత్రి హరీశ్‌రావు నేతృత్వంలో పలువురు బీఆర్‌ఎస్‌ సభ్యులు వెల్‌లోకి వెళ్లి నిరసన తెలిపారు. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వంలో జరిగిన తప్పిదాలను ప్రస్తావిస్తూ మాజీ మంత్రి కేటీఆర్‌ను ఉద్దేశిస్తూ 'సిగ్గుతో తలదించుకోవలసిందే'నని రేవంత్‌ వ్యాఖ్యానించగా హరీశ్‌రావు, పాడి కౌశిక్‌రెడ్డి, కల్వకుంట్ల సంజయ్, మాగంటి గోపీనాథ్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కాలేరు వెంకటేశ్‌ తదితరులు వెల్‌లోకి వెళ్లి నిరసన తెలిపారు. మీకు కూడా మాట్లాడేందుకు అవకాశం ఇస్తానని స్పీకర్‌ ప్రసాద్‌ కుమార్‌ తెలపడంతో సీట్లలో కూర్చున్నారు.

- రేవంత్‌ ప్రసంగంలో బీఆర్‌ఎస్‌ను, కేసీఆర్‌ను విమర్శిస్తున్నప్పుడు సభ్యులు పాడి కౌశిక్‌రెడ్డి, కల్వకుంట్ల సంజయ్‌ పలుమార్లు అరుస్తూ అడ్డు తగిలే ప్రయత్నం చేశారు.
- రేవంత్‌ మాటలకు కౌశిక్‌రెడ్డి అడ్డు తగులుతుంటే స్పీకర్‌ ప్రసాద్‌కుమార్‌ జోక్యం చేసుకుంటూ 'కౌశిక్‌రెడ్డి.. కొత్త సభ్యుడివి. సభ నాయకుడు మాట్లాడుతుంటే వినాల్సిందే'అని స్పష్టం చేశారు.
- డ్రగ్స్‌ మాఫియా గురించి రేవంత్‌ మాట్లాడుతూ యువతను నిర్వీర్యం చేస్తున్న డ్రగ్స్‌ గురించి మాట్లాడుతుంటే సపోర్ట్‌ చేసేందుకు మనసు రాలేదా అని ప్రశ్నించగా, 'వుయ్‌ సపోర్ట్‌ యూ'అని పాడి కౌశిక్‌రెడ్డి అరిచారు. దానికి రేవంత్‌ స్పందిస్తూ 'ఆయనకు తెలియక మాట్లాడుతున్నాడు. తరువాత ఆయన కష్టాలు ఆయనకుంటాయి'అని వ్యాఖ్యానించారు. కాగా తమ ప్రభుత్వ హయాంలో కూడా డ్రగ్స్‌ కట్టడికి సీవీ ఆనంద్‌ నేతృత్వంలో చర్యలు తీసుకున్నామని మాజీ మంత్రి కేటీఆర్‌ బదులిచ్చారు.
- రేవంత్‌ మాటలకు కౌశిక్‌రెడ్డి అడ్డు తగిలిన సమయంలో 'గట్టిగా అరుస్తున్న ఆయన కూడా మేనేజ్‌మెంట్‌ కోటానే'అని వ్యాఖ్యానించారు.

# కాళేశ్వరం, మిషన్‌ భగీరథపై న్యాయవిచారణ జరిపించాలి

- మండలిలో గవర్నర్‌ ప్రసంగంపై తీర్మానం ప్రవేశపెట్టిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి
- 30 సార్లు ప్రయత్నించినా కేసీఆర్‌ను కలవలేకపోయా: అలుగుబెల్లి



సాక్షి, హైదరాబాద్‌: పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్‌ పాలనలో తెలంగాణ అప్పులకుప్పలా మారిందని కాంగ్రెస్‌ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి విమర్శించారు. కమీషన్ల కోసమే కాళేశ్వరం, మిషన్‌ భగీరథ ప్రాజెక్టులను చేపట్టారని, అనవసరమైన ఖర్చులతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ఆగం చేశారన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా శాసనమండలిలో శనివారం గవర్నర్‌ ప్రసంగంపై ధన్యవాద తీర్మానాన్ని జీవన్‌రెడ్డి ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా గవర్నర్‌ ప్రసంగాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక స్థితిని ప్రస్తావించారు. సాంకేతిక పరిజ్ఞానం అంతంతమాత్రంగా ఉన్న రోజుల్లో నిర్మించిన నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులు ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉన్నాయని, కానీ అత్యంత సాంకేతిక పరిజ్ఞానం ఉన్న ప్రస్తుత రోజుల్లో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు లోపభూయిష్టంగా మారడం విడ్డూరమే అని అన్నారు. మేడిగడ్డ బ్యారేజీ దెబ్బతినడంతో పాటు అన్నారం బ్యారేజీలో సైతం లీకేజీలు ఏర్పడటం విచారకరమన్నారు. ఈ ప్రాజెక్టుల నిర్మాణ పనులకు సంబంధించి ఎల్‌అండ్‌టీ తొలుత చేపడుతుందని చెప్పినప్పటికీ... ఇప్పుడు చేయనని అంటోందని చెప్పారు. ఈ ప్రాజెక్టుల నిర్మాణంపై న్యాయ విచారణ చేపట్టాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. మిషన్‌ భగీరథ ప్రాజెక్టు కోసం అప్పటి రాష్ట్ర ప్రభుత్వం రూ.40 వేల కోట్లు ఖర్చు చేసిందని, అప్పటికే చాలా గ్రామాల్లో మంచినీటి సరఫరా వ్యవస్థ ఉన్నప్పటికీ వృథా ఖర్చులతో మళ్లీ మిషన్‌ భగీరథ పనులు చేపట్టి ప్రజాధనాన్ని నీటిపాలు చేశారని విమర్శించారు. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటే నిరుద్యోగులు హర్షించేవారని, కానీ వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో వారు మానసికంగా ఆందోళన చెందారన్నారు. జీవో 317 ద్వారా ఉద్యోగులు నష్టపోయారని, వారికి ఈ ప్రభుత్వం న్యాయం చేస్తుందని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా కేంద్రంగా ప్రత్యేక జోన్‌లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

**ప్రజలను కలిసే సీఎం రేవంత్‌: నర్సిరెడ్డి**

పదేళ్ల కేసీఆర్‌ పాలనలో సామాన్యుడిని సీఎం కలిసే పరిస్థితే ఉండేది కాదని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి వ్యాఖ్యానించారు. మండలిలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఆయన బలపర్చారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ తను ఎమ్మెల్సీగా ఎన్నికయ్యాక దాదాపు 30 సార్లు కేసీఆర్‌ను కలిసేందుకు ప్రయత్నించినా అవకాశం దక్కలేదని, ఒకసారి అవమానానికి సైతం గురయ్యానన్నారు. కానీ రేవంత్‌రెడ్డి సీఎం అయిన మరుసటిరోజే ప్రజాభవన్‌లో కలిశానని చెప్పారు. ప్రజలను కలిసి వారి సమస్యలు వినే వ్యక్తి ముఖ్యమంత్రి అయ్యారని, ఈ ఐదేళ్ల కాలంలో ఇదే తరహాలో పాలన సాగాలని ఆయన ఆకాంక్షించారు.

# అప్పుల రాష్ట్రంగా మార్చారు!

**మంత్రి భట్టి విక్రమార్క ధ్వజం**

సాక్షి, హైదరాబాద్‌: 'సంపదతో కూడిన మిగులు బడ్జెట్‌ రాష్ట్రాన్ని మీ చేతిలో పెడితే రూ.5 లక్షల కోట్లు అప్పు చేసి అప్పుల రాష్ట్రంగా మార్చారు. కృష్ణా, గోదావరి నుంచి ఓ చుక్క నీటినైనా తెచ్చారా? ఒక్క ఎకరాకైనా అదనంగా నీళ్లు ఇచ్చారా? రూ.లక్షల కోట్లు వృథా చేశారు. ఒక్కరికైనా ఉద్యోగం ఇచ్చారా? ఒక్క ఇందిరమ్మ ఇల్లయినా ఇచ్చారా? రాష్ట్రంలో పదేళ్లు విధ్వంసం చేశారు. స్వేచ్ఛ లేకుండా చేశారు. ప్రజలు స్వేచ్ఛ ఇచ్చేటువంటి తీర్పునిచ్చారు అని గవర్నర్‌ ప్రసంగంలో చెప్పాం'అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. గత 55 ఏళ్ల కాంగ్రెస్‌ పాలనపై కేటీఆర్‌ విమర్శలు చేస్తుండగా భట్టి విక్రమార్క పలుమార్లు అడ్డుపడి మాట్లాడారు. 'మనం తెలంగాణ శాసనసభలో చర్చిస్తున్నాం. 2014 జూన్‌ 2 నుంచి జరిగిన పనుల గురించే మాట్లాడుకోవాలి'అని చెప్పారు. 55 ఏళ్ల ఉమ్మడి రాష్ట్ర పాలన వద్దనే ప్రత్యేక రాష్ట్రం తెచ్చుకున్నామన్నారు. నాడు కాంగ్రెస్‌ మంత్రులందరూ రాజీనామా చేసి ప్రత్యేక రాష్ట్రం కావాలని తీర్మానం చేశారని, కేంద్ర నాయకత్వాన్ని ఒప్పించారని చెప్పారు. పార్లమెంట్‌లో సరైన బలం లేకపోయినా కాంగ్రెస్‌ మిగిలిన పార్టీలను ఒప్పించి ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిందన్నారు. చర్చ తొలిరోజే దాడితో ప్రసంగాన్ని మొదలుపెడితే ప్రభుత్వం తగిన రీతిలో సమాధానం ఇవ్వాల్సి ఉంటుందన్నారు. కాంగ్రెస్‌ పాలనలోనే ఆర్‌డబ్ల్యూఎస్‌ పథకం కింద 70–80 శాతం ప్రాంతాలకు తాగునీళ్లు ఇచ్చామని భట్టి గుర్తు చేశారు. మిషన్‌ భగీరథ కోసం రూ.43 వేల కోట్లు ఖర్చు పెట్టి నీళ్లు ఎక్కడ ఇచ్చారని కేటీఆర్‌ను ప్రశ్నించారు. నల్లగొండకు 2014కు ముందు నీళ్లు రాలేదా? అని పేర్కొన్నారు.

**సీఎం ఎంపిక హైకమాండ్‌దే: మంత్రి దామోదర**

కాంగ్రెస్‌ పార్టీ మెజారిటీ సాధించినప్పుడు సీఎం ఎంపిక బాధ్యతను హైకమాండ్‌కు అప్పగించే సంప్రదాయం ఉందని మంత్రి దామోదర రాజనరసింహ చెప్పారు. హైకమాండ్‌ తీసుకునే నిర్ణయాన్ని తామంతా శిరసావహిస్తామని ప్రజలకు కూడా తెలుసన్నారు. సీనియర్‌ కాంగ్రెస్‌ నేతలను కాదని రేవంత్‌రెడ్డిని సీఎం చేయడంపై కేటీఆర్‌ చేసిన విమర్శకు దామోదర ఈ మేరకు స్పందించారు.

**పైన పటారం.. లోన లొటారం: మంత్రి పొన్నం**

గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ పాలన పైన పటారం.. లోన లొటారం అన్న చందంగా సాగిందని మంత్రి పొన్నం ప్రభాకర్‌ ఎద్దేవా చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో నిర్లక్ష్యానికి గురైందనే తెలంగాణ తెచ్చుకున్నామని, తెలంగాణ వచ్చిన తర్వాత జరిగిన కార్యక్రమాల గురించి మాట్లాడుకుందామని కేటీఆర్‌కు సూచించారు. మా తాత మీసాల మీద నిమ్మకాయ పెట్టాడంటే నడవదని పొన్నం చెప్పగా.. దీనికి కేటీఆర్‌ గట్టిగా స్పందించారు. 'మా తాతలు నెయ్యి తాగిన్రు.. మా మూతులు వాసన చూడండి'అంటే కుదరదని కౌంటర్‌ ఇచ్చారు. నాగార్జునసాగర్, శ్రీశైలం కట్టామని క్రెడిట్‌ మాత్రమే తీసుకుంటామంటే నడవదని, కాంగ్రెస్‌ దురాగతాలను బరాబర్‌ చెప్తామని పేర్కొన్నారు.



**మీరా మమ్మల్ని అధికారంలోకి తెచ్చింది: మంత్రి శ్రీధర్‌ బాబు**

గత పదేళ్ల బీఆర్‌ఎస్‌ పాలనతో సైతం 50 ఏళ్ల కాంగ్రెస్‌ పాలన గురించే చెప్పారని మంత్రి శ్రీధర్‌బాబు వ్యాఖ్యానించారు. ఇందిరమ్మ రాజ్యంలోనే సామాజిక న్యాయం, పేదలకు న్యాయం జరిగాయని, ఇళ్లు, భూములు, పోడు భూములొచ్చాయని చెప్పారు. అలాంటి ప్రభుత్వం కోసమే మళ్లీ ప్రజలు తీర్పు ఇచ్చారన్నారు. ఉమ్మడి ఏపీలో 1999లో 91 మంది కాంగ్రెస్‌ ఎమ్మెల్యేలున్నారంటూ.. కాంగ్రెస్‌ను తామే గెలిపించామన్న హరీశ్‌రావు వ్యాఖ్యలను తిప్పికొట్టారు. 'నాడు మీరెంత మంది ఉన్నారు? ఎన్ని సీట్లలో పోటీ చేసి ఎంత మంది గెలిచారు? మీరా మమ్మల్ని అధికారంలోకి తెచ్చింది'అని నిలదీశారు.

### 90 లక్షల మెట్రిక్‌ టన్నుల ధాన్యానికి లెక్కల్లేవు: ఉత్తమ్‌

బీఆర్‌ఎస్‌ పాలనలో పౌరసరఫరాల విభాగాన్ని అల్లకల్లోలం చేశారని, ఆ శాఖ వద్ద 90 లక్షల మెట్రిక్‌ టన్నుల ధాన్యానికి లెక్కల్లేవని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఈ ధాన్యం ఉందా? లేదా? ఉంటే ఎక్కడుంది? అనే అంశాలకు కాగితాల్లో ఎక్కడా వివరాలు లేకపోవడం గమనార్హమని, దీనిపై సమగ్ర పరిశీలన ప్రారంభించినట్లు మంత్రి వివరించారు. పదేళ్లలో ఈ శాఖ రూ.56 వేల కోట్ల నష్టాల్లో ఉందని చెప్పారు. రేషన్‌ బియ్యం చాలాచోట్ల లబ్ధిదారులకు చేరడం లేదని, దీనిపై మరింత లోతైన చర్యలు చేపడతామన్నారు. గవర్నర్‌ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై బీఆర్‌ఎస్‌ సభ్యులు మధుసూదనాచారి, దేశపతి శ్రీనివాస్‌ మాట్లాడుతూ, కాంగ్రెస్‌ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాలని, మానవహక్కుల పరిరక్షణపై ప్రభుత్వం ప్రకటన హర్షణీయమని, భావప్రకటన స్వేచ్ఛపై సీఎం చేస్తున్న ప్రకటనలు అమలు జరిగేలా చూడాలని అన్నారు.

# కేసీఆర్‌కు పదవులిచ్చింది కాంగ్రెస్సే..

**యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా ఆయనకు అవకాశమిచ్చింది: సీఎం రేవంత్**

- ఎంపీగా గెలిపించింది.. కేంద్రంలో మంత్రి పదవులిచ్చింది
- కొందరు ఎన్నారైలకు ప్రజాస్వామిక స్ఫూర్తి అర్థం కాదు
- మేనేజ్‌మెంట్ కోటా కింద 'ఎన్ఆర్ఐ' కేటీఆర్ ఎమ్మెల్యే అయ్యారు
- గత పదేళ్ల పాలనపైనే ప్రస్తుతం సభలో చర్చ జరుగుతోంది
- గత కాంగ్రెస్ పాలనపై ఒక రోజంతా చర్చకు సిద్ధం
- అసెంబ్లీలో కేటీఆర్ ప్రసంగంపై ముఖ్యమంత్రి రేవంత్


సభలో మాట్లాడుతున్న సీఎం రేవంత్

సాక్షి, హైదరాబాద్: 'పదే పదే గత కాంగ్రెస్ పాలన గురించి, ప్రభుత్వాల గురించి (కేటీఆర్) మాట్లాడుతున్నారు. గత పాలనలోనే కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుకు యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా అవకాశం ఇచ్చిందే కాంగ్రెస్ పార్టీ. కాంగ్రెస్ తరఫున సింగిల్ విండో డైరెక్టర్‌గా పోటీకి అవకాశమిస్తే ఓడిపోయారు. కేసీఆర్‌ను ఎంపీగా గెలిపించింది కాంగ్రెస్ పార్టీనే. ఆయనకు నౌకాయాన శాఖ, ఆ తర్వాత కార్మిక శాఖ మంత్రి పదవులు ఇచ్చింది. కేసీఆర్ కుటుంబ సభ్యుడి (హరీశ్‌రావు)ని ఎమ్మెల్యే కాక ముందే మంత్రిని చేసింది. ఆ తర్వాత ఎమ్మెల్యే కావడానికి సహకరించింది' అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై శనివారం అసెంబ్లీలో జరిగిన చర్చలో బీఆర్ఎస్ సభ్యుడు కేటీఆర్ చేసిన విమర్శలపై ముఖ్యమంత్రి స్పందించారు.

**వారి గౌరవానికి తగదు:** 'కొంతమంది ఎన్నారైలకు ప్రజాస్వామిక స్ఫూర్తి అర్థం కాదు. ప్రజాస్వామ్యంలో 49కి సున్నా, 51కి వంద శాతం విలువ ఉంటది. 51 శాతం సీట్లు ఉన్న వారు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తరు. 49 శాతం ఉన్న వారు ప్రతిపక్షంలో కూర్చొని ప్రభుత్వం తీసుకునే పరిపాలన నిర్ణయాలు, శాసనాలను సహేతుకంగా విశ్లేషించి సలహాలు, సూచనలు ఇస్తారు. వారు 64 మంది ఉంటే, మేము 39 మంది ఉన్నం. మేము అచ్చోసిన ఆంబోతుల్లాగా ఉన్నం. మేం పోడియంలోకి వచ్చి కుస్తీలు కొట్లాడుతం అని మాట్లాడటం సరికాదు. ఈ రకమైన భాష వారి గౌరవానికి, ఈ సభను నడిపించుకోవడానికి సహకరించదు' అని కేటీఆర్‌పై రేవంత్‌రెడ్డి మండిపడ్డారు.

**గత కాంగ్రెస్ పాలనలో బీఆర్ఎస్‌కూ భాగస్వామ్యం**

గతం గురించి మాట్లాడాలని ఉంటే సభలో ఒక రోజంతా జూన్ 2, 2014కి ముందు జరిగిన 55 ఏళ్ల పరిపాలనపై చర్చ పెట్టడానికి సిద్ధంగా ఉన్నామని రేవంత్‌రెడ్డి అన్నారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి నాయకత్వమే దేశానికి బలమైనదని, బీఆర్ఎస్ నేతలు అందులో మంత్రులుగా పనిచేశారన్నారు. 'పోతిరెడ్డిపాడు పొక్కపెద్దది చేసినప్పుడు నాయిని నరసింహారెడ్డి కడప జిల్లా ఇన్‌చార్జి మంత్రి. దానికి వ్యతిరేకంగా ఆనాడు పోరాడింది పి.జనార్దన్ రెడ్డి ఒక్కరే. ఇక్కడ ఉన్నోళ్లు ఎవరూ (బీఆర్ఎస్ సభ్యులు) ప్రాణత్యాగాలు చేస్తామని కొట్లాడలేదు. 2014 జూన్ 2 నుంచి జరిగిన పరిపాలన, విధ్వంసం, నాయకత్వ వ్యవహారశైలి మీదే ప్రస్తుతం చర్చిస్తున్నాం. గత కాంగ్రెస్ పాలనలో చాలామంది బీఆర్ఎస్ సభ్యులకు పాత్ర ఉంది. వారు మంత్రులుగా కూడా చేశారు. దానం నాగేందర్, శ్రీనివాస్ యాదవ్, హరీశ్‌రావు, కడియం, పోచారం, గంగుల కమలాకర్ వంటి వాళ్లందరూ కాంగ్రెస్ పాలనలో పనిచేసిన వారే. ఏవైతే పాపాలు జరిగాయని కేటీఆర్ అంటున్నారో, ఆ పాపాల్లో సంపూర్ణమైన బాధ్యత వాళ్లదే' అని రేవంత్ చెప్పారు. వరంగల్‌లో జరిగిన ఎన్‌కౌంటర్లకు కారణం ఎవరని ఆయన ప్రశ్నించారు. తమకు ఐదేళ్ల సమయం ఉందని, గత పదేళ్లలో జరిగిన పాలనపై ఎక్స్‌రే తీసినట్టుగా ఎక్కడ ఏం ఉన్నాయో అన్ని వివరిస్తామని చెప్పారు. గత పదేళ్లలో జరిగిన విధ్వంసం, ఆర్థిక నేరాలపై చర్చకు పెడతామని రేవంత్ పేర్కొన్నారు.

### చీమలు పెట్టిన పుట్టలో చేరిన పాము..

''ఇప్పుడు మాట్లాడుతున్న ఆయన (కేటీఆర్) ఎలా ఎమ్మెల్యే అయ్యారు? వారి తండ్రి (కేసీఆర్) గురువు అయిన చంద్రబాబుతో పొత్తు పెట్టుకుని ఆ పార్టీ (టీడీపీ) కండువా కప్పుకున్నారు. కేకే మహేందర్ రెడ్డి సిరిసిల్లలో (టీఆర్ఎస్) పార్టీని నిర్మించుకుని తెలంగాణ ఉద్యమంలో ముందుండి పోరాడారు. చీమల పుట్టలో పాములు దూరినట్టు ఎన్ఆర్ఐగా.. అంటే 'నాన్ రిలయబుల్ ఇండియన్'గా మేనేజ్‌మెంట్ కోటాలో టికెట్ తీసుకుని సిరిసిల్ల నుంచి కేటీఆర్ పోటీ చేశారు. మహేందర్ రెడ్డికి అన్యాయం చేసి ఈరోజు ఇక్కడికి వచ్చారు'' అని రేవంత్‌రెడ్డి ఆరోపించారు.

## ఆత్మీయతకు నిలువెత్తు రూపు డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి

**సభలో మహానేత ప్రస్తావన**



సాక్షి, హైదరాబాద్: గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై శనివారం శాసనసభలో ఓవైపు వాడీవేడిగా చర్చ జరుగుతుండగా మరోవైపు పలువురు సభ్యులు దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి ప్రస్తావన తేవటం ఆసక్తిగా మారింది. తొలుత మజ్లిస్ పార్టీ సభ్యుడు అక్బరుద్దీన్ ఒవైసీ రాజశేఖరరెడ్డి ఆత్మీయత గురించి ప్రత్యేకంగా మాట్లాడారు. ముస్లింలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలనే అంశాన్ని ప్రస్తావించినప్పుడు ఆయన వై.ఎస్. గురించి క్లుప్తంగా విశ్లేషించారు. 'డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డిని ప్రతిసారీ తలుచుకుంటాను. ఎందుకంటే ఆయన మనస్తత్వం ఎంతో ఆకట్టుకునేది. ఆయనను మరవలేం. ఆయన చాలా సానుభూతిపరుడు, ప్రేమ ఆప్యాయతలు చూపే మనిషి. మేం కాంగ్రెస్‌కు దగ్గరగా ఉంటామన్న అభిప్రాయం ఏర్పడడానికి డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డినే కారణం. ఆయన మా సమస్యలను వేగంగా పరిష్కరించటం వల్లనే ఆయనంటే మాకు అభిమానం. మా విన్నపాలను కార్యరూపంలోకి తెచ్చేవారు. అందుకే మేం కచ్చితంగా రాజశేఖరరెడ్డికి చాలా సన్నిహితంగా ఉండే వాళ్లం' అని పేర్కొన్నారు. ఆరోగ్య శ్రీ పథకాన్ని, ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్ అంశాన్ని ప్రస్తావించినప్పుడు కూడా వై.ఎస్. ప్రస్తావన తెచ్చారు. బీఆర్ఎస్ పార్టీ ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్ల అంశాన్ని అప్పట్లో పేర్కొందని, కానీ అమలులోకి రాలేదని, ఇప్పుడు కాంగ్రెస్ దాన్ని అమలు చేస్తుందా అని ప్రశ్నించారు. దాని అమలు ఏమోగానీ.. రాజశేఖరరెడ్డి అమలులోకి తెచ్చిన 4 శాతం రిజర్వేషన్లను కాపాడాల్సిన అవసరం ఉందని అక్బరుద్దీన్ పేర్కొన్నారు.

## వైఎస్‌కు ఉన్న దక్షత ఉంటే భారీ హామీల అమలు సాధ్యమే

**సీపీఐ సభ్యుడు కూనంనేని సాంబశివరావు**



సాక్షి, హైదరాబాద్: ''కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలుకు భారీగా నిధులు అవసరమవుతాయి. వాటిని ఎలా సమకూర్చుకుంటారు, ఎలా అమలు చేస్తారంటూ చాలా మంది అడుగుతున్నారు. కానీ, డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డికి ఉన్న దీక్ష, పట్టుదల, దక్షత, ప్రణాళికలుంటే వాటి అమలు సాధ్యమే. అప్పట్లో వై.ఎస్.కూడా ఎన్నో హామీలిచ్చారు. వాటి అమలుకు కూడా చాలా నిధులు అవసరమయ్యాయి. మరి ఆ నిధులు ఎలా సమకూరాయి. దానికి ఆయన దక్షతనే కారణం. అలాంటి, ప్రణాళికాబద్ధ పనితీరు ఉంటే ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ కూడా ఈ హామీలను నెరవేర్చగలదు''అని పేర్కొన్నారు.

## కూనంనేనితో బీఆర్ఎస్ సభ్యుల వాగ్వాదం

సాక్షి, హైదరాబాద్: శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు చెప్పే తీర్మానంపై చర్చ సందర్భంగా సీపీఐ సభ్యుడు కూనంనేని సాంబశివరావు, బీఆర్ఎస్ సభ్యుల మధ్య వాదోపవాదాలు చోటుచేసుకున్నాయి. అన్ని పక్షాల సభ్యుల ప్రసంగాల క్రమంలో చివరలో కూనంనేని మాట్లాడారు. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమికి కారణాలను విశ్లేషించిన ఆయన.. కాంగ్రెస్ ఇప్పుడు అలాంటి తప్పులు చేయొద్దంటూ చెప్పే ప్రయత్నం చేశారు. ఈక్రమంలో బీఆర్ఎస్ హయాంలో వైరి పక్ష సభ్యులను కొనుగోలు చేశారన్నారు. దీనిపై బీఆర్ఎస్ సభ్యులు అభ్యంతరం చెప్పారు. 'వేరే పార్టీ ఎమ్మెల్యేలను కొనుగోలు చేశారో లేదో నాకు తెలియదు. అయితే కొనుగోలు చేశారని జనం అనుకుంటున్నారు. కొన్నారంటూ నేను చేసిన మాటను వెనక్కు తీసుకుంటున్నాను. ఉద్యమ పార్టీగా చెప్పుకొనే బీఆర్ఎస్ అధికారంలో ఉండగా స్వేచ్ఛను హరించారు. కోదండరాం, రేవంత్‌రెడ్డి, నాలాంటి వారిని నిర్బంధించారు. ఇటీవలి ఎన్నికల తర్వాత పంజరం నుంచి బయటకొచ్చామన్న భావనలో జనం ఉన్నారు. ధర్నాలు, నిరసనలు తెలిపేందుకు వీల్లేకుండా చేశారు. అసెంబ్లీలో మాట్లాడే స్వేచ్ఛను కూడా హరించారు. 26 సంస్థలను నిషేధించారు. అందుకే జనంలో ఆ పార్టీపై తిరుగుబాటు వ్యక్తమైంది'అని కూనంనేని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలను బీఆర్ఎస్ సభ్యులు తప్పుబడుతూ ఆయన ప్రసంగాన్ని అడ్డుకున్నారు. ఇంటికో ఉద్యోగం లాంటి హామీలను విస్మరించారని కూనంనేని పేర్కొనగా.. తాము ఇంటికో ఉద్యోగం ఇస్తామన్న హామీ ఇచ్చినట్టు నిరూపిస్తారా అంటూ హరీశ్‌రావు సవాల్ విసిరారు. సభలో తనను బీఆర్ఎస్ నేతలు బెదిరించలేరని, ఆ పార్టీ ఓటమికి కారణాలను విశ్లేషిస్తుంటే ఇలా స్పందించడం సరికాదని కూనంనేని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధనిక రాష్ట్రమని, తలసరి ఆదాయంలో తెలంగాణ నంబర్ వన్ అని బీఆర్ఎస్ నేతలు చెబుతున్నప్పుడు, ఆ ప్రభుత్వ హయాంలో ఒకటో తారీఖున ఉద్యోగులకు జీతాలు ఎందుకు ఇవ్వలేకపోయారని ప్రశ్నించారు. కేసీఆర్ మంచి విజన్ ఉన్న నేత అని, కానీ ఆయన తీరుకు ఇప్పుడు బాధేస్తోందన్నారు. అప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పిదాలను ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం చేయొద్దని హితవు పలికారు.

## మరో రెండు రోజులు సమావేశాలు

- ఈనెల 20, 21 తేదీల్లో నిర్వహించే చాన్స్.. 6 గ్యారంటీలకు చట్టబద్ధత!
- ఎజెండాపై ఒకటి రెండు రోజుల్లో బులెటిన్ జారీ చేయనున్న స్పీకర్ కార్యాలయం

సాక్షి, హైదరాబాద్: ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించేందుకు ఈనెల 20, 21 తేదీల్లో రెండు రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలను నిర్వహించనున్నట్టు తెలిసింది. తెలంగాణ మూడో శాసన సభ తొలి విడత సమా వేశాలను ఈనెల 20కి వాయిదా వేస్తున్నట్టు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ శనివారం ప్రకటించారు. శాసనసభ బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) ఇంకా ఏర్పాటు కాకపోవడంతో.. 20న తిరిగి ప్రారంభమయ్యే శాసనసభ సమావేశాల ఎజెండాపై స్పీకర్ కార్యాలయం బులెటిన్ విడుదల చేసే అవకాశం ఉందని అధికారులు చెప్తున్నారు.




**ఎనిమిది రోజుల పాటు కొనసాగి..**

ఎన్నికల ఫలితాలు, కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటు తర్వాత ఈ నెల 9న శాసనసభ సమావేశాలు ప్రారంభమైన విషయం తెలిసిందే. తొలిరోజున ప్రొటెం స్పీకర్‌గా వ్యవహరించిన అక్బరుద్దీన్ ఒవైసీ కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలతో ప్రమాణ స్వీకారం చేయించారు. 12న స్పీకర్ ఎన్నిక నోటిఫికేషన్ జారీ చేశారు. 13న నామినేషన్లు స్వీకరించగా.. కాంగ్రెస్ వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్ ఒక్కరే నామినేషన్ వేశారు. 14న కొత్త స్పీకర్‌గా ప్రసాద్ కుమార్ ఏకగ్రీవ ఎన్నికను ప్రొటెం స్పీకర్ ప్రకటించి ఆయనకు స్పీకర్ కుర్చీని అప్పగించారు. కొత్త స్పీకర్‌ను అభినందిస్తూ అధికార, విపక్ష సభ్యులు ప్రసంగించారు. 15న శాసనసభ, శాసన మండలి ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ తమిళిసై ప్రసంగించారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై ఉభయ సభలు శనివారం చర్చ జరిపి ఆమోదించాయి.

## మా వల్లే కాంగ్రెస్ అధికారంలోకి..

**వైఎస్ ప్రభుత్వంలో 14 నెలలకే మంత్రులుగా రాజీనామా చేశాం**

- అసెంబ్లీలో సీఎం రేవంత్ వ్యాఖ్యలపై హరీశ్‌రావు స్పందన



సాక్షి, హైదరాబాద్: 2004లో కాంగ్రెస్‌ని అధికారంలోకి తెచ్చిన ఘనత తమదేనని బీఆర్ఎస్ సభ్యుడు, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు స్పష్టం చేశారు. నాడు చంద్రబాబు చేతిలో కనీసం ప్రతిపక్ష హోదా దక్కకుండా చిత్తుగా ఓడిపోయిన కాంగ్రెస్ పార్టీకి జీవం పోసింది టీఆర్ఎస్, కేసీఆర్ మాత్రమేనని అన్నారు. కేసీఆర్‌కు అవకాశం ఇచ్చింది కాంగ్రెస్సే అంటూ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను తప్పుబడుతూ శనివారం ఆయన శాసనసభలో ఈ మేరకు స్పష్టం చేశారు. కాంగ్రెస్‌కు తామే భిక్ష పెట్టామన్నారు. యూపీఏ కూటమి కామన్ మినిమమ్ ప్రోగ్రాంలో తెలంగాణ ఏర్పాటును చేర్చిన తర్వాతే యూపీఏలో కేసీఆర్ చేరినట్టు తెలిపారు. కేసీఆర్‌కు తొలుత షిప్పింగ్ శాఖ ఇవ్వగా, డీఎంకే పార్టీ ఆ శాఖను కోరుకుంటే కేసీఆర్ వదులుకున్నారని గుర్తు చేశారు. మంత్రి పదవుల కోసం కాదు, తెలంగాణ కోసమే కూటమిలో చేరిన విషయాన్ని అప్పట్లో కేసీఆర్ స్పష్టం చేశారన్నారు. రేవంత్‌రెడ్డి ఏబీవీపీలో ప్రారంభమై టీఆర్ఎస్, టీడీపీల్లో చేరి ఆ తర్వాత కాంగ్రెస్‌లోకి వచ్చారని, రేపు ఎక్కడ ఉంటారో తెలియదని పేర్కొన్నారు. తెలంగాణకు ఒక రూపాయి ఇవ్వనని నాటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి అంటే కేవలం తాము మాత్రమే పోరాడామని చెప్పారు.

**మంత్రులుగా 14 నెలలే చేశాం...**

దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వంలో తాము కేవలం 14 నెలలు మాత్రమే మంత్రులుగా పనిచేశామని హరీశ్ తెలిపారు. పోతిరెడ్డిపాడుతో తెలంగాణకు దక్కాల్సిన జలాలను రాయలసీమకు తరలించుకోవడం, తెలంగాణను ముంచి పులిచింతల కట్టి ఆంధ్రకు నీళ్ల మళ్లించడం, 610 జీవో అమలులో నిర్లక్ష్యం, నక్సలైట్లను చర్చల పేరుతో పిలిచి ఎన్‌కౌంటర్లు చేయడం వంటి ఆరు కారణాలను పేర్కొంటూ నాడు ఆరు మంది తమ పార్టీ సభ్యులు మంత్రి పదవులకు రాజీనామా చేశారని గుర్తుచేశా రు. పోతిరెడ్డిపాడుపై మా పార్టీ నాయకులే కొట్లాడారని గుర్తు చేశారు. కాంగ్రెస్ నుంచి కేవలం పీజేఆర్ ఒక్కరే కొట్లాడారన్నారు. ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి సభను తప్పుదోవపట్టించే విధంగా మాట్లాడారని ఆరోపించారు.

## ఆ హామీలకు రూ.3.10 లక్షల కోట్లు కావాలి

**అయినా.. కాంగ్రెస్‌కు వాటిని అమలు చేసే సమర్థత ఉంది: అక్బరుద్దీన్**



సాక్షి, హైదరాబాద్: 'కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను అమలు చేయాలంటే సాలీనా రూ.3.10 లక్షల కోట్లు అవసరం. ఆ పార్టీ ప్రత్యేకంగా పేర్కొన్న ఆరు గ్యారంటీలను అమలు చేసేందుకే ఏకంగా రూ.2.16 లక్షల కోట్లు ఖర్చవుతాయి. ఇది చిన్నమొత్తం కాదు. అయితే ఆ పార్టీకి గొప్ప అనుభవం ఉంది, గొప్ప నేతలున్నారు. ఎలా పాలించాలో, ఎలా హామీలను అమలు చేయాలో బాగా తెలుసు. ఈ భారీ హామీలను కూడా అలాగే కచ్చితంగా అమలు చేస్తారని నేను నమ్ముతున్నా' అంటూ మజ్లిస్ పార్టీ శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ పేర్కొన్నారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా ఆయన శాసనసభలో సుదీర్ఘంగా ప్రసంగించారు. గవర్నర్ ప్రసంగంలోని అంశాలు అభ్యంతరకరంగా ఉన్నాయని అక్బరుద్దీన్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలన నుంచి ప్రజలు విముక్తులయ్యారంటూ పేర్కొన్న వ్యాఖ్యలను ఆయన ఖండించారు. తన 25 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇలాంటి ప్రసంగాన్ని చూడలేదన్నారు.

**మాకు ఎవరితోనూ అలయెన్స్ లేదు..**

'రాష్ట్రంలో ముస్లింలు అప్పుడు బీఆర్ఎస్‌ను గెలిపించారు. ఇప్పుడు కాంగ్రెస్‌ను గెలిపించారు. కానీ, ఈ రెండు పార్టీలు ఈసారి ఒక్క ముస్లింను కూడా గెలిపించలేదు. మమ్మల్ని ఓడించేందుకు కొందరు కుట్ర పన్నారు. కానీ వాటిని పటాపంచలు చేస్తూ ప్రజలు మా సీట్లు మాకు అప్పగించారు. ఈపార్టీ అటు మారుతుంది. ఆ పార్టీ ఇటు మారుతుంది. కానీ మేం ఇలా స్థిరంగానే ఉంటాం' అని అక్బరుద్దీన్ పేర్కొన్నారు. నిన్న సీఎంతో జరిగిన మీటింగుకు హాజరైతే మేం కాంగ్రెస్ పార్టీకి దగ్గరవుతున్నామని కొన్ని పత్రికల్లో వచ్చింది. కానీ మాకు ఎవరితో అలయెన్స్ లేదు' అని అక్బర్ స్పష్టం చేశారు.

### హామీలను అమలు చేయాలి: మహేశ్వర్‌రెడ్డి

కాంగ్రెస్ పార్టీ పేర్కొన్న 412 హామీలను నెరవేర్చాలని, వాటి విషయంలో వెనక్కు తగ్గితే బీజేపీ చూస్తూ ఊరుకోదని ఆ పార్టీ సభ్యుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ హామీలను అమలు చేయాలంటే ఎన్ని నిధులు అవసరమో ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉచితాలతో ఉపయోగం లేదని మేధావులు చెప్పినా వినకుండా హామీలు గుప్పించారని, వాటన్నింటిని ఎలా అమలు చేస్తారో కూడా ప్రభుత్వం చెప్పాలని పేర్కొన్నారు. తెలంగాణ సాధనలో సోనియా పాత్ర గురించి గవర్నర్ ప్రసంగంలో పేర్కొని, అప్పట్లో ఎంతో చొరవ చూపిన బీజేపీ పాత్ర గురించి ప్రస్తావించకపోవటం దారుణమని ఆయన అన్నారు.

# మేడిగడ్డపై విచారణ

▶ మొదటి పేజీ తరువాయి

ప్రాజెక్టును ఇసుకపై కట్టడం ఏమిటని ప్రశ్నించారు. అసెంబ్లీ సమావేశాల తర్వాత సభ్యులను తీసుకెళ్లి మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలను చూపిస్తామన్నారు.

**సాంకేతిక నిపుణులతో పరిశీలించాలి..**

సీఎం రేవంత్ మాట్లాడుతున్న సమయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జోక్యం చేసుకున్నారు. మేడిగడ్డ, అన్నారం వద్ద ఏదో ఘోరం జరిగిపోయిందంటూ.. ఏదో పర్యాటక ప్రదేశానికి వెళ్లినట్టు శాసనసభ, మండలి సభ్యులను తీసుకెళ్లడం కంటే సాంకేతికంగా నిపుణులతో పరిశీలించడం మంచిదని సూచించారు. తాము ఏ పరీక్షకైనా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. దీనిపై రేవంత్ ప్రతిస్పందిస్తూ.. మేడిగడ్డ పరిశీలనకు బీఆర్ఎస్ వారు రానంటే తమకు అభ్యంతరమేమీ లేదని, మిగతా సభ్యులకు అవకాశం కల్పిస్తే బీఆర్ఎస్ వారికి అభ్యంతరం ఎందుకని ప్రశ్నించారు. మేడిగడ్డ కుంగుబాటు, అన్నారం వద్ద బుంగలు పడటంపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపిస్తామని ప్రకటించారు. ఎవరు అడ్డుపడినా సరే.. ఏడాదిలోగా రెండు లక్షల ఉద్యోగాల భర్తీ, మహాలక్ష్మి పథకం అమలు, పింఛన్లను రూ.4 వేలకు పెంచడం వంటి హామీలను అమలు చేసి చూపిస్తామన్నారు.

**చక్కెర కర్మాగారాలను తెరిపిస్తాం**

మూతపడిన నిజాం చక్కెర కర్మాగారాలను తిరిగి ప్రారంభించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, ఇది తమ గ్యారంటీ అని సీఎం రేవంత్ ప్రకటించారు. దీనిపై మంత్రులు, ఉన్నతాధికారులతో కమిటీ వేస్తామని చెప్పారు. అసెంబ్లీ సమావేశాలు ముగిశాక.. ప్రభుత్వ ఉద్యోగుల కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం మార్పు, టీచర్లు–ఉద్యోగుల బదిలీలకు సంబంధించిన 317 జీవో, స్కూల్ సర్వీసెస్, జీతాలు వంటి అంశాలపై ఎమ్మెల్సీలు, టీచర్ల సంఘాలతో ప్రత్యేక భేటీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. తమ ప్రభుత్వం పంటల బీమా పథకాన్ని తీసుకొస్తుందని, రైతుబీమా పథకాన్ని కూడా మరింత పటిష్టంగా అమలు చేసేందుకు చర్యలు చేపడతామని చెప్పారు.

**కవిత సవరణ.. వెనక్కి..**

ఉభయ సభల సంయుక్త సమావేశంలో గవర్నర్ తమిళి సై సౌందరరాజన్ చేసిన ప్రసంగంలో భాషా ప్రయోగం సరిగా లేదని, దానిని మార్చాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కోరారు. ఈ మేరకు ధన్యవాద తీర్మానానికి సవరణలు కోరారు. దీంతో శాసనసభ వ్యవహారాల మంత్రి డి.శ్రీధర్‌బాబు కలిగించుకుని.. ఎవరినీ వ్యక్తిగతంగా కించపరిచే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని, సవరణ డిమాండ్‌ను ఉప సంహరించుకోవాలని కోరారు. కవిత ప్రతిస్పందిస్తూ.. గవర్నర్ ప్రసంగంలోని భాషతో తాము ఏకీభవించడం లేదని, దానిపై నిరసన తెలుపుతూనే ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు సవరణ డిమాండ్‌ను ఉపసంహరించుకుంటున్నామని ప్రకటించారు. కాగా ధన్యవాద తీర్మానాన్ని ఆమోదించిన అనంతరం శాసన మండలిని నిరవధికంగా వాయిదా వేస్తున్నట్టు చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రకటించారు. వచ్చే బడ్జెట్ సమావేశాల సమయంలో మండలిని కూడా అసెంబ్లీ ప్రాంగణంలోకి తెచ్చే అంశంపై సానుకూల నిర్ణయం తీసుకున్నట్టు ప్రకటించారు.

### నా భాష ఇలాగే ఉంటుంది..!

అసెంబ్లీ ఎదుట ఏర్పాటు చేసిన ముళ్లకంచెలను తొలగించే విషయంపై అన్నిపార్టీలతో చర్చిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. నిజానికి ఈ ప్రాంగణం ప్రభుత్వ పరిధిలోనిది కాదని.. అసెంబ్లీ స్పీకర్, కౌన్సిల్ చైర్మన్ సమావేశమై ఏ ఆదేశాలిస్తే వాటిని పాటిస్తామని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. దీంతో సీఎం సంయమనం, సహనంతో ఉండాలని, పరుష పదజాలంతో భయపెట్టేలా మాట్లాడవద్దని కోరుతున్నామని దేశపతి పేర్కొన్నారు. దీనిపై రేవంత్ స్పందిస్తూ.. ''గ్రామం నుంచి వచ్చాను. రైతుబిడ్డను. ప్రభుత్వ బడిలో చదువుకున్నాను, నల్లమల అటవీ ప్రాంతం నుంచి వచ్చాను. నా భాష ఇలాగే ఉంటుంది. ఏం అనుకున్నానో అదే చెబుతాను. నా మాటలకు తప్పు చేయనివారు ఎందుకు భయపడాలి?'' అని రేవంత్ ప్రశ్నించారు.

### హైదరాబాద్‌ను అభివృద్ధి నమూనా చేస్తాం

హైదరాబాద్‌ను ప్రపంచంతో పోటీపడే అభివృద్ధి నమూనాగా మార్చుతామని సీఎం రేవంత్ చెప్పారు. మూసీ నదిని శుభ్రమైన నీటితో కళకళలాడేలా చేస్తామని.. మూసీ పరీవాహకం మొత్తం (నల్లగొండ దాకా) ప్రత్యేక కారిడార్ ఏర్పాటు చేస్తామన్నారు. తనకు శాసన మండలిపై ప్రత్యేక అభిమానం ఉందని.. పదిహేనేళ్ల కింద తాను ఎమ్మెల్సీగా అడుగుపెట్టి సీనియర్ సభ్యులు చుక్కా రామయ్య, ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ వంటి వారి నుంచి ఎంతో నేర్చుకున్నానని చెప్పారు. కాగా.. మైనారిటీలకు ఇచ్చిన రూ.లక్ష సబ్సిడీ చెక్కు బౌన్స్ అయిందని, ఆ సొమ్మును ఇప్పించాలని ఎంఐఎం ఎమ్మెల్సీ మీర్జా అహ్మద్ బేగ్ కోరగా.. గతంలో ఉన్నది నకిలీ ప్రభుత్వమని రేవంత్‌రెడ్డి విమర్శించారు. ఆ సొమ్ముపై సానుకూల నిర్ణయం తీసుకుంటామన్నారు.

## అసెంబ్లీకి కేంద్ర మాజీమంత్రి జైరాం రమేశ్

**సీఎం రేవంత్‌కు అభినందనలు**



సాక్షి, హైదరాబాద్: కేంద్ర మాజీమంత్రి, సీడబ్ల్యూసీ సభ్యుడు జైరాం రమేశ్ శనివారం అసెంబ్లీకి వచ్చారు. రాష్ట్రంలో కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి, ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో ఆయనను సీఎం చాంబర్‌లో కలిసి అభినందనలు తెలియజేశారు. రేవంత్‌తో కొంతసేపు మాట్లాడిన జైరాం, ఆ తర్వాత ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్కతో సమావేశమయ్యారు. రేవంత్‌ను కలిసిన సందర్భంగా అక్కడే ఉన్న కొందరు మంత్రులను కూడా జైరాం అభినందించారు. అయితే ఉన్నట్టుండి జైరాం అసెంబ్లీకి రావడం చర్చనీయాంశమైంది. ఢిల్లీ నుంచి ఏదైనా కబురు తెచ్చారా, మర్యాదపూర్వకంగా కలిశారా అన్న దానిపై కాంగ్రెస్ వర్గాల్లో ఆసక్తికర చర్చ జరిగింది. సీఎం రేవంత్‌ను జైరాం ఏఐసీసీ పక్షాన మర్యాదపూర్వకంగా కలిశారని, ఇందులో ప్రత్యేకత ఏమీలేదని సీఎంవో వర్గాలు వెల్లడించాయి.

## ప్రజలకు నష్టాలు జరిగితే ప్రశ్నిస్తూనే ఉంటాం

**బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత**



సాక్షి, హైదరాబాద్: ప్రజలకు నష్టాలు జరిగితే ప్రశ్నిస్తూనే ఉంటామని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. శనివారం శాసనమండలి మీడియా పాయింట్ వద్ద ఆమె మాట్లాడుతూ గవర్నర్ ప్రసంగం బాధాకరంగా ఉందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఏం చేస్తోందో చెప్పాలే తప్పా, గత ప్రభుత్వ పాలన ఇలా ఉందని ఎన్నిరోజులు చెబుతారని ప్రశ్నించారు. 'మండలిలో మాకు మెజారిటీ సభ్యులున్నా ప్రభుత్వ సూచన మేరకు నేను మండలిలో వేసిన సవరణను వెనక్కి తీసుకున్నాను'అని తెలిపారు.

## ప్యానెల్ చైర్మన్లుగా నలుగురు సభ్యుల ఎంపిక

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ సమావేశాల తొలి సెషన్‌కి ప్యానెల్ చైర్మన్లుగా రేవూరి ప్రకాశ్‌రెడ్డి, బాలునాయక్(కాంగ్రెస్), కౌసర్ మొహియుద్దీన్(ఎంఐఎం), కూనంనేని సాంబశివరావు(సీపీఐ)లను నామినేట్ చేసినట్టు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ శనివారం సభలో ప్రకటించారు.

# మేడిగడ్డపై ఎల్ అండ్ టీ యూ–టర్న్

**బ్యారేజీ పునరుద్ధరణ బాధ్యతల నుంచి తప్పుకున్న నిర్మాణ సంస్థ**

- మళ్లీ కొత్త ఒప్పందం చేసుకుంటేనే పనులు చేపడతామని స్పష్టీకరణ
- ఈ నెల 5న ఎల్ అండ్ టీ నుంచి నీటిపారుదల శాఖకు లేఖ
- ధ్రువీకరించిన నీటిపారుదల శాఖ ఉన్నతస్థాయి వర్గాలు
- గతంలో సొంత ఖర్చుతో పునరుద్ధరిస్తామని ప్రకటించిన ఎల్ అండ్ టీ




సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ బ్యారేజీ 7వ బ్లాకును సొంత ఖర్చుతో పునరుద్ధరిస్తామని గతంలో చేసిన ప్రకటనపై నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ యూ–టర్న్ తీసుకుంది. గత అక్టోబర్ 21న మేడిగడ్డ బ్యారేజీలోని 7వ బ్లాకు కుంగిపోయిన విషయం తెలిసిందే. సొంత ఖర్చుతోనే బ్యారేజీ పునరుద్ధరణ చేపడతామని మరుసటి రోజు ఎల్‌అండ్‌టీ జనరల్ మేనేజర్ సురేష్‌కుమార్ ఓ ప్రకటన విడుదల చేశారు. బ్యారేజీ కుంగిన ఘటనపై నాటి నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్ ఎల్ అండ్ టీ జనరల్ మేనేజర్ సురేష్‌కుమార్‌తో అక్టోబర్ 23న జలసౌధలో సమీక్ష నిర్వహించారు. డిఫెక్ట్ లయబిలిటీ పీరియడ్ నిబంధనలో భాగంగా బ్యారేజీ పునరుద్ధరణ పనులను ఎల్‌అండ్‌టీ సొంత ఖర్చుతో చేసేందుకు ఒప్పుకుందని ఆయన మీడియాకు వెల్లడించారు. బ్యారేజీకి సంబంధించిన రెండేళ్ల డిఫెక్ట్ లయబిలిటీ పీరియడ్ 2022 జూన్ 29తో ముగిసిన నేపథ్యంలో పునరుద్ధరణ బాధ్యత తమది కాదని తాజాగా ఎల్‌అండ్‌టీ సంస్థ మాట మార్చింది. బ్లాకు పునర్నిర్మాణం పనుల కోసం ప్రభుత్వం కొత్త ఒప్పందం చేసుకోవాలని చెప్పింది. ఈ మేరకు ఎల్‌అండ్‌టీ సంస్థ నుంచి ఈ నెల 5న తమకు లేఖ అందిందని నీటిపారుదల శాఖ ఉన్నత స్థాయి వర్గాలు ధ్రువీకరించాయి. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాతే ఎల్ అండ్ టీ నుంచి లేఖ అందినట్టు చెప్పాయి. బ్యారేజీ పునరుద్ధరణ పనుల కోసం తొలుత ఎగువ నుంచి వస్తున్న వరదను దారి మళ్లించడం కోసం రూ.55.75 కోట్లతో కాఫర్ డ్యామ్ నిర్మించాల్సి ఉంటుందని, ఈ మేరకు వ్యయం భరించేందుకు ప్రభుత్వం ముందుకొస్తేనే పనులు ప్రారంభిస్తామని లేఖలో ఎల్ అండ్ టీ స్పష్టం చేయడం గమనార్హం. బ్యారేజీ పునరుద్ధరణ పనులకు మరో రూ.500 కోట్ల వ్యయం కానుందని ప్రాథమిక అంచనా వేశారు. మరోవైపు ప్లానింగ్, డిజైన్, నాణ్యతాలోపాలతోనే మేడిగడ్డ బ్యారేజీ కుంగిన ఘటనపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్డీఎస్ఏ) నిపుణుల బృందం ఇప్పటికే నివేదిక సమర్పించింది. రాష్ట్ర నీటిపారుదల శాఖ ఇంజనీర్లు ఇచ్చిన డిజైన్ ప్రకారమే మేడిగడ్డ బ్యారేజీ నిర్మించామని ఎల్ అండ్ టీ పేర్కొంది.

**లేఖను దాచిపెట్టారు!**

ఎల్ అండ్ టీ రాసిన లేఖను నీటిపారుదల శాఖ రహస్యంగా ఉంచడంపై ఆరోపణలు చెలరేగాయి. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఈ నెల 11న జలసౌధలో సాగునీటి ప్రాజెక్టులపై ఈఎన్‌సీలతో సమీక్ష నిర్వహించారు. ఈ నెల 14న ఉత్తమ్‌తో సహా మరో నలుగురు మంత్రులు నీటిపారుదల శాఖపై సమీక్ష జరిపారు. వాస్తవాలు దాస్తున్నారని రెండు సమీక్షల్లోనూ ఈఎన్‌సీలపై మంత్రులు మండిపడ్డారు. మంత్రులు రెండుసార్లు సమీక్షలు నిర్వహించినా, ఎల్ అండ్ టీ లేఖ విషయాన్ని అధికారులు ప్రస్తావించలేదని తెలిసింది. మేడిగడ్డ బ్యారేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపిస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో అధికారుల్లో ఆందోళన మొదలైంది.

TENDER NOTICE
OLD USED GUNNY BAGS FOR SALE
Contract Period:
1st Jan-2024 to 31st March-2024
200 to 250 Tons per Month at the following locations
TS: 1. Chegunta, Medak Dt. 2. Turkayamjal, RR Dt.
AP: 1. Rajahmundry 2. Anakapally
Interested parties may send their sealed tenders (quote the rate before tax) along with Rs. 10,00,000/- DD per each plant on or before 5:30 PM on 30th December, 2023 to:
(Tenders/Quotations received after 5:30 PM on 30-12-2023 will not be considered)
The General Manager
M/s. VENKATESHWARA HATCHERIES PVT LTD.
INTEGRATION DIVISION
Zonal Office: Survey No. 128, 4th Floor, Ratna Arcade, Above Vijetha Super Market, Kompally, Hyderabad - 500 014, Telangana. Ph: 040 - 2716 5501 / 02
V.H. GROUP
Subject to M/s. VENKATESHWARA HATCHERIES PVT LTD. Terms and Conditions



మీరు నన్ను వెదకిన యెడల, పూర్ణమనస్సుతో నన్ను గూర్చి విచారణ చేయునెడల మీరు నన్ను కనుగొందురు.

– క్రైస్తవ ధర్మం



## గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు మార్గశిర మాసం, **తిథి:** శు.పంచమి రా.8.48 వరకు, తదుపరి షష్ఠి, **నక్షత్రం:** శ్రవణం ఉ.8.07 వరకు, తదుపరి ధనిష్ఠ, **వర్జ్యం:** ప.11.52 నుండి 1.20 వరకు, **దుర్ముహూర్తం:** ప.4.01 నుండి 4.49 వరకు, **అమృతఘడియలు:** రా.8.50 నుండి 10.20 వరకు, ధనుర్మాసం ప్రారంభం.

సూర్యోదయం : 6.27
సూర్యాస్తమయం : 5.25
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

మల్లికార్జున్ ఖర్గే (ఎ.ఐ.సి.సి. అధ్యక్షుడు)

## రాయని డైరీ

మాధవ్ శింగరాజు

కమల్‌నాథ్ విషణ్ణ వదనంతో ఉన్నారు. గోవింద్ సింగ్ వివర్ణ ముఖుడై ఉన్నారు. దీపక్ బైజ్ బాధాతప్త హృదయ జ్వాలాముఖిలా కనిపిస్తున్నాడు. లాల్‌స్వతాలో దేనిపట్లో విముఖత వ్యక్తమౌతోంది కానీ, అదేమిటో వ్యక్తం అవడం లేదు! నలుగురూ నాలుగు రాష్ట్రాల పీసీసీ అధ్యక్షులు.

"తెలిసిన జవాబులకే కొన్నిసార్లు ప్రశ్నలు వేసుకుని జవాబులు వెతుక్కోవలసి వస్తుంది..." అన్నాను – ఒక భారమైన నిట్టూర్పుతో కమల్‌నాథ్, లాల్‌స్వతాల వైపు చూస్తూ.

వారిద్దరూ పక్కపక్కనే కూర్చొని ఉన్నందు వల్ల ఇద్దరి వైపూ ఏకకాలంలో చూడగల సదుపాయం కలిగింది నాకు. ఇద్దరూ సమ వయస్కులు. కమల్‌నాథ్‌కు 77. లాల్‌స్వతాకు 77.

వాళ్లిద్దరివైపూ చూశాక, వివర్ణ ముఖుడై ఉన్న గోవింద్ సింగ్ వైపు చూశాను. అతడికి 59. నలుగురిలోకీ చిన్నవాడు 42 ఏళ్ల దీపక్ బైజ్. ఆఖర్న అతడి వైపు చూశాను. ఎక్కువ వయసున్న కమల్‌నాథ్, గోవింద్‌సింగ్, లాల్‌స్వతాల కంటే.. తక్కువ వయసున్న దీపక్



బైజ్ ఎక్కువగా కలతపడి ఉన్నాడు.

"ఇలా ఎలా జరిగిందో తెలియడం లేదు ఖర్గేజీ. ప్రజలు బీజేపీ చెప్పిన అబద్ధాలను నిజాలుగా, కాంగ్రెస్ చెప్పిన నిజాలను అబద్ధాలుగా కన్‌ఫ్యూజ్ అయినట్లున్నారు.." అన్నాడు దీపక్ బైజ్. ఛత్తీస్‌గఢ్ పీసీసీ అధ్యక్షుడు అతడు. కాంగ్రెస్‌కు 35, బీజేపీకి 54 వచ్చాయక్కడ.

ఎన్నికలకు ముందు ఆ రాష్ట్రంలో కాంగ్రెస్ ఉండేది. ఎన్నికల తర్వాత కూడా కాంగ్రెస్సే ఉంటుందని నాకంటే ఎక్కువగా నమ్మినట్లున్నాడు దీపక్ బైజ్. ఫలితాలు వచ్చి రెండు వారాలు గడుస్తున్నా ఓటమిని జీర్ణించుకోలేకపోతున్నాడు.

రాజస్థాన్‌లో కూడా ఎన్నికల ముందు కాంగ్రెస్సే ఉండేది. పార్టీ అధ్యక్షుడిగా గోవింద్‌సింగ్ ఉండేవారు. ఎన్నికల తర్వాత కూడా గోవింద్‌సింగ్ ఉన్నారు కానీ, కాంగ్రెస్సే లేదు.

"మనం ఎందుకు గెలవలేకపోయాం గోవింద్‌జీ..?" అని నేను అడిగేలోపే, "కర్ణాటకలో, హిమాచల్ ప్రదేశ్‌లో తృణీకరించిన విధంగానే రాజస్థాన్‌లో కూడా బీజేపీని ప్రజలు తృణీకరిస్తారని ఎన్నికలకు ముందు నేను చెప్పినట్లే జరిగింది ఖర్గేజీ. కానీ ఆ తృణీకారం కాస్త అటూ ఇటూ అయ్యిందంతే..." అన్నారు గోవింద్‌సింగ్! 115, 69 అంటే కాస్తేనా అటూ ఇటూ అయినట్లు!

కమల్‌నాథ్ నా వైపే చూస్తూ ఏదో చెప్పడానికి ప్రయత్నిస్తున్నట్లుగా నాకు అనిపించి, ఆయన్ని ఇబ్బంది పెట్టడం ఎందుకని నేనే ఆయన వైపు చూశాను. మధ్యప్రదేశ్ పీసీసీ అధ్యక్షులు ఆయన.

"ప్రజలు మనల్ని ఓడించలేదు ఖర్గేజీ. ఈవీఎంలు వాళ్లను గెలిపించాయి..." అన్నారు కమల్‌నాథ్... నేనేమీ అడక్కుండానే. ఈవీఎంలు ఆ ఇచ్చేదేదో బీజేపీకే మొత్తంగా ఇవ్వకుండా బీజేపీకి 163, కాంగ్రెస్‌కు 66 ఇచ్చి బీజేపీని ఎందుకు గెలిపించినట్లో?

లాల్‌స్వతా నాకేదో చెప్పబోయి కూడా చెప్పడానికేముందిలే అన్నట్లుగా ఆగిపోయారు. మిజోరమ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆయన. పార్టీకి అక్కడ ఒక్క సీటు కూడా రాలేదు!

"తెలిసిన జవాబులకే కొన్నిసార్లు ప్రశ్నలు వేసుకుని జవాబులు వెతుక్కోవలసి వస్తుంది అని కదా అన్నాను. జవాబే లేనివాటికి కూడా కొన్నిసార్లు ప్రశ్నలను వేసుకోవలసి వస్తుంది..." అని మళ్లొకసారి భారంగా నిట్టూర్చాను.

ఆ మాటకు పీసీసీ అధ్యక్షులు నలుగురూ ఒకేసారి నా వైపు చూశారు! ఆ చూడటం ఎలా ఉందంటే... నేను వారికి ప్రశ్నగా కనిపిస్తున్నానా? జవాబుగా కనిపిస్తున్నానా అని నాకే సందేహం కలిగించేలా ఉంది!

కాంగ్రెస్ పార్టీలో అధ్యక్షుడే ప్రశ్న, అధ్యక్షుడే జవాబు అయినప్పుడు... పీసీసీ అధ్యక్షులు ఏఐసీసీ అధ్యక్షుడిని ఎలా చూస్తే ఏమిటి? ఏఐసీసీ అధ్యక్షుడు పీసీసీ అధ్యక్షులకు ఎలా కనిపిస్తే ఏమిటి?

# రెడీ ఫర్ లాంగ్ ఇన్నింగ్స్!



జనతంత్రం

వర్ధెల్లి మురళి

ఆ రైతు పేరు అప్పలనాయుడు. విజయనగరం జిల్లా జామి మండల వాస్తవ్యులు. వ్యవసాయ రంగంపై వైఎస్ జగన్ వేసిన బలమైన ముద్ర గురించి చెబుతూ ఒక కొత్త కోణాన్ని ఆవిష్కరించారు. అది 'రైతు భరోసా' పేరుతో అందజేస్తున్న నగదు సాయం గురించి కాదు. అందుబాటులోకి వచ్చిన 9 గంటల నాణ్యమైన విద్యుత్తు గురించీ కాదు. ఈ–క్రాప్ ప్రయోజనాల గురించి కాదు. ఆర్‌బీకే సెంటర్లు అందజేస్తున్న నైపుణ్యాభివృద్ధి, యంత్ర సేవ గురించి కూడా కాదు. ధాన్యం పండించే తన లాంటి రైతులకు వైఎస్ జగన్ ప్రభుత్వం వల్ల ఎకరాకు పది నుంచి పన్నెండు వేల రూపాయల పరోక్ష లబ్ధి చేకూరుతున్నదని అప్పలనాయుడు చెప్పుకొచ్చారు.

ఇదేమీ రహస్యం కాదు. రైతులందరికీ అనుభవంలోకి వచ్చిన విషయమే. కానీ మన అధికార యంత్రాంగం, రాజకీయ నాయకులే దీన్ని గుర్తించినట్టు లేదు. గుర్తించినా ఎక్కడా మాట్లాడినట్టు లేదు. అప్పలనాయుడు చెప్పిన ఆ లెక్కను ఒకసారి చూద్దాం. విత్తనాల కోసం ఒకసారి, ఎరువుల కోసం మరొకసారి కనీసం రెండుసార్లు రైతులు మండల కేంద్రానికి వెళ్లవలసి వచ్చేది. రానూపోనూ ప్రయాణ ఖర్చులూ, భోజనం ఖర్చుతో పాటు ఒకరోజు వేతనాన్ని ఆ రైతు కోల్పోవలసి వచ్చేది. దానికితోడు ఎరువుల బస్తాలు తెచ్చుకునేందుకు ఆటో ఖర్చులు అదనం. ఎకరాకు సరిపోయే విత్తనాలకు ఆర్‌బీకేలో ఇప్పుడు 300 రూపాయలు ప్రభుత్వ రాయితీ లభిస్తున్నది. అప్పుడీ భారం రైతు మీదనే పడేది.

ఎరువుల కొరతను అవకాశంగా తీసుకొని... అవసరం లేని పురుగు మందుల డబ్బా తీసుకుంటేనే ఎరువుల బస్తా ఇస్తామని వ్యాపారులు పేచీ పెట్టేవారు. ఇప్పుడా వృథా ఖర్చు పూర్తిగా పోయింది. ధాన్యం దిగుబడి సగటున ఎకరాకు 30 నుంచి 33 బస్తాలు (75 కిలోల బస్తా) వస్తుంది. ఆ రోజుల్లో దళారులు కొనుగోలు చేసేటప్పుడు ప్రతి క్వింటాల్‌కు అదనంగా కనీసం 5 కిలోలు తూకం వేసుకునేవారు. ఇప్పుడు క్వింటాల్ ధాన్యానికి మద్దతు ధర రూ.2100. తప్పుడు తూకంతో ఎకరాకు ఒకటిన్నర క్వింటాళ్ల కిమ్మత్తు పైకాన్ని రైతు కోల్పోయేవాడు. ఆ రోజుల్లో మద్దతు ధర మీద క్వింటాల్‌కు 150 నుంచి 200 రూపాయల వరకు దళారులు మినహాయించుకొని రైతులకివ్వడం సర్వ సాధారణం. ఇవన్నీ లెక్కేసి చూస్తే అధమపక్షం రైతుకు జరుగుతున్న లబ్ధి ఎకరాకు పన్నెండు వేల పైమాటేనని అప్పలనాయుడు లెక్క. ఊరూరా వెలసిన ఆర్‌బీకే సెంటర్ల పుణ్యమా అని రైతుకు దొరికిన గొప్ప ఊరట ఇది.

వ్యవసాయ రంగంలో ఇటువంటి మార్పులు ఇంకెన్నో ఉన్నాయి. ఇనుమడించిన రైతు ఆత్మవిశ్వాసానికి గుర్తుగా ఈ ఒక్క గొంతుక చాలు. ఈ ఆత్మవిశ్వాసం ఒక్క రైతాంగంలోనే కాదు. వెనుకబడిపోయిన అన్ని వర్గాల్లోనూ కనిపిస్తున్నది. వెన్నెముకలు నిటారుగా నిలబడుతున్నవి. వ్యవసాయం, విద్య, వైద్య రంగాల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వపు విప్లవ శంఖారావం పేద వర్గాలను ఉత్తేజితం చేస్తున్నది. సాధికార రథయాత్రలతో వారిప్పుడు జాగృతమవుతున్నారు. పైసా ఖర్చు లేకుండా పాతిక లక్షల విలువైన వైద్య సేవలను పెద్దాసుపత్రుల్లో పొందగలిగే అవకాశం ఇప్పుడు రాష్ట్రంలోని 90 శాతం ప్రజలకు 'ఆరోగ్యశ్రీ' పేరుతో అందుబాటులో ఉన్నది. ఇంత పెద్ద ఉచిత పథకం ఇంకెక్కడా లేదు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనంత పటిష్ఠంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు తయారయ్యాయి. ఫ్యామిలీ డాక్టర్ బృందాలు పల్లెపల్లెనా పర్యటిస్తున్నాయి. అన్ని స్థాయిల్లోని ప్రభుత్వాసుపత్రుల్లో ఔట్ పేషంట్ల సంఖ్య యాభై శాతం నుంచి వందశాతం వరకు పెరిగింది. ఈ పెరుగుదల అక్కడ లభిస్తున్న వైద్య సేవల నాణ్యతా ప్రమాణాలకు సూచిక.

రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన విద్యా విధానం ఇప్పటికే జాతీయ – అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలనందుకుంటున్నది. నిరుపేద కుటుంబాల్లో పుట్టిన బిడ్డలు ఐక్యరాజ్య సమితి వేదికపై నిలబడి తమ గళాన్ని వినిపించడం సంచలనాన్ని సృష్టించింది. పెద్దపెద్ద నగరాల్లో సంపన్నుల సంతానానికి మాత్రమే లభించే నాణ్యమైన చదువును సర్కారు బడుల్లో పేద పిల్లలకు ప్రభుత్వం ఉచితంగా సమకూర్చింది. నాడు శిథిలావస్థకు చేరిన సర్కారు బడులు మళ్లీ వసంతాన్ని చిగురిస్తున్నాయి. కొత్త తరానికి అత్యవసరమైన డిజిటల్ సాంకేతికతను పాఠశాల స్థాయి విద్యార్థులకు కూడా ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. పెత్తందారీ శక్తులు పేదల విద్యపై కళ్లల్లో నిప్పులు పోసుకుంటున్నా జగన్ ప్రభుత్వం విద్యా విప్లవంలో వెనక్కి తిరిగి చూడటం లేదు.

వైఎస్ జగన్ ప్రభుత్వం సాధించిన విజయాలు ఈ మూడు రంగాలకే పరిమితం కాలేదు. సమస్త జీవన రంగాల్లోనూ ఊర్ధ్వ ముఖ చలనం మనకు కనిపిస్తుంది. అందుకు కారణం ప్రభుత్వ కర్తవ్యాలపై అధినేతకు ఉన్న స్పష్టమైన అవగాహన. ఒక నిర్దిష్టమైన లక్ష్యం, ఆ లక్ష్యాన్ని చేరుకోవడానికి అవసరమైన కచ్చితమైన ప్రణాళికను రూపొందించుకోవడంలో జగన్ ప్రభుత్వం దేశంలో అందరికంటే ముందువరసలో నిలబడింది. రాజ్యాంగ మౌలిక సూత్రమైన ఆర్థిక, సామాజిక, రాజకీయ సమానత్వాన్ని సాధించడం కోసం ఇంత వేగంగా పనిచేసిన ప్రభుత్వం కూడా ఇంకొకటి లేదు. అందువల్ల సహజంగానే పెత్తందారీ శక్తుల కంటగింపునకు కూడా ఈ ప్రభుత్వం గురవుతున్నది.

ఆత్మవిశ్వాసం ఒక్క రైతాంగంలోనే కాదు. వెనుకబడిపోయిన అన్ని వర్గాల్లోనూ కనిపిస్తున్నది. వెన్నెముకలు నిటారుగా నిలబడుతున్నవి. వ్యవసాయం, విద్య, వైద్య రంగాల్లో జగన్ ప్రభుత్వపు విప్లవ శంఖారావం పేద వర్గాలను ఉత్తేజితం చేస్తున్నది. సాధికార రథయాత్రలతో వారిప్పుడు జాగృతమవుతున్నారు. పైసా ఖర్చు లేకుండా పాతిక లక్షల విలువైన వైద్య సేవలను పెద్దాసుపత్రుల్లో పొందగలిగే అవకాశం ఇప్పుడు రాష్ట్రంలోని 90 శాతం ప్రజలకు 'ఆరోగ్యశ్రీ' పేరుతో అందుబాటులో ఉన్నది. ఇంత పెద్ద ఉచిత పథకం ఇంకెక్కడా లేదు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనంత పటిష్ఠంగా ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు తయారయ్యాయి. ఫ్యామిలీ డాక్టర్ బృందాలు పల్లెపల్లెనా పర్యటిస్తున్నాయి. అన్ని స్థాయిల్లోని ప్రభుత్వాసుపత్రుల్లో ఔట్ పేషంట్ల సంఖ్య యాభై నుంచి వందశాతం పెరిగింది. ఈ పెరుగుదల అక్కడ లభిస్తున్న వైద్యసేవల నాణ్యతా ప్రమాణాలకు సూచిక.

రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన విద్యా విధానం ఇప్పటికే జాతీయ – అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలనందుకుంటున్నది. నిరుపేద కుటుంబాల్లో పుట్టిన బిడ్డలు ఐక్యరాజ్య సమితి వేదికపై నిలబడి తమ గళాన్ని వినిపించడం సంచలనాన్ని సృష్టించింది. పెద్దపెద్ద నగరాల్లో సంపన్నుల సంతానానికి మాత్రమే లభించే నాణ్యమైన చదువును సర్కారు బడుల్లో పేద పిల్లలకు ప్రభుత్వం ఉచితంగా సమకూర్చింది.

ఆంధ్రప్రదేశ్‌లో పెత్తందారీ శక్తుల రాజకీయ నాయకత్వం మరింత ప్రమాదకరమైన మాఫియా ముఠా. క్షీరసాగర మథనంలో అమృతంతోపాటు గరళం కూడా పుట్టిందట. మన దేశంలో ఆర్థిక సంస్కరణలు మొదలైనప్పుడు అభివృద్ధితోపాటు దాని కవలగా పుట్టిన అవినీతి పాలిటి వారసత్వం ఈ ముఠా. పేద ప్రజల సాధికారతకు పెద్ద శత్రువు ఈ యెల్లో ముఠా. అందువల్లనే అది జగన్ ప్రభుత్వంపై కత్తి కట్టింది. అధర్మ యుద్ధాన్ని ప్రకటించింది. అందుకు ప్రతిగా ప్రభుత్వం వెనుక పేదవర్గాలు సమీకృతమవుతున్నాయి. కొద్ది నెలల్లో ఎన్నికలు రానున్న తరుణంలో రాష్ట్రం పెత్తందార్లు – పేదవర్గాలు అనే రాజకీయ వైరి శిబిరాలుగా చీలిపోయింది. ఈ రెండు శిబిరాలూ ఇప్పుడు ఎదురెదురు మోహరించి నిలబడ్డాయి.

సమాజంలో పేదలు – పెత్తందార్లు అనే చీలిక వచ్చినప్పుడు మెజారిటీ ప్రజలైన పేదవర్గాలే ఎన్నికల్లో ఏకపక్ష విజయం సాధిస్తారని చెప్పడానికి ఏ సర్వేనూ ఆశ్రయించవలసిన పని లేదు. కామన్‌సెన్స్ చాలు. గతంలో అంతో ఇంతో విశ్వసనీయతను నిరూపించుకున్న కొన్ని సర్వే సంస్థలు కూడా మరోసారి వైసీపీ భారీ విజయాన్ని నమోదు చేయబోతున్నదని ఇప్పటికే ప్రకటించాయి. మొన్నటి తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని చాలా సంస్థలు చెప్పాయి. అందరిలోకీ సీట్ల సంఖ్యను వాస్తవానికి అతి దగ్గరగా టైమ్స్‌నౌ – ఈటీజీ గ్రూప్ అంచనా వేసింది. కాంగ్రెస్‌కు 65, బీఆర్‌ఎస్‌కు 41, బీజేపీకి 7, ఎమ్‌ఐఎమ్‌కు 6 సీట్లు వస్తాయని ఈ గ్రూప్ అంచనా వేసింది. 96 శాతం కచ్చితత్వాన్ని నిరూపించుకున్నది.

టైమ్స్ నౌ – ఈటీజీ గ్రూప్ తాజా సర్వే ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లోని మొత్తం 25 లోక్‌సభ సీట్లకు గాను వైసీపీ 24 నుంచి 25 సీట్లను గెలుచుకోబోతున్నది. టీడీపీకి సున్నా నుంచి ఒక్క సీటు వరకు లభించే అవకాశం ఉన్నది. అంటే టీడీపీ మహా అయితే ఒక్క సీటు గెలుచుకుంటుంది. ఈ సీట్లను అసెంబ్లీ స్థానాల లెక్కలోకి అనువదిస్తే ఫలితం సుస్పష్టం. గతంలో గెలిచిన 151 కంటే పైమాటే తప్ప తగ్గే అవకాశం ఉండదు. కర్ణాటక ఎన్నికల ఫలితాలను కచ్చితంగా అంచనా వేసిన సంస్థల్లో పొలిటికల్ క్రిటిక్ ఒకటి. ఆ సంస్థ ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో సర్వే చేసి గత ఎన్నికల్లో వైసీపీ సాధించిన ఓట్ల శాతాన్ని యథాతథంగా నిలబెట్టుకుంటుందని నిర్ధారించింది. టీడీపీ కంటే వైసీపీ 11 శాతం ఎక్కువ ఓట్లు తెచ్చుకుంటుందని చెప్పింది. 2019 ఎన్నికల ఫలితాలు పునరావృతమవుతాయని అర్థం.

ఈ పరిస్థితి యెల్లో ముఠాకు అర్థమైనందు వల్లనే అది నిగ్రహాన్ని కోల్పోయి ప్రవర్తిస్తున్నది. ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే ఎన్నికల ఫలితాలను అంచనా వేయ డానికి మూడు పద్ధతులున్నాయి. వివిధ వర్గాలకు చెందిన తటస్థ ఓటర్ల మనోభిప్రాయాలను తెలుసుకోవడం మొదటి పద్ధతి. గతంలో క్రెడిబిలిటీని నిలబెట్టుకున్న జాతీయ సంస్థల సర్వేలను గమనించడం రెండో పద్ధతి. ఇది కొంతమేరకు ట్రెండ్‌ను సూచిస్తుంది. ఇక ఏపీకి మాత్రమే పరిమితమైన మూడో పద్ధతి. యెల్లో మీడియాను గమనించడం. సునామీ, భూకంపాలు వచ్చే ముందు కొన్ని రకాల జంతువులు, పక్షులు విచిత్రంగా ప్రవర్తిస్తాయి. తమకు ఇష్టంలేని ప్రభుత్వం రాబోతున్నదని నిర్ధారణ కాగానే యెల్లో మీడియా ప్రవర్తన కూడా జుగుప్సాకరంగా మారిపోతుంది. ఇదొక లిట్మస్ టెస్ట్.

మొన్నటి తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని చాలా సంస్థలు చెప్పాయి. అందరిలోకీ సీట్ల సంఖ్యను వాస్తవానికి అతి దగ్గరగా టైమ్స్‌నౌ – ఈటీజీ గ్రూప్ అంచనా వేసింది. కాంగ్రెస్‌కు 65, బీఆర్‌ఎస్‌కు 41, బీజేపీకి 7, ఎమ్‌ఐఎమ్‌కు 6 సీట్లు వస్తాయని ఈ గ్రూప్ అంచనా వేసింది. 96 శాతం కచ్చితత్వాన్ని నిరూపించుకున్నది. టైమ్స్ నౌ – ఈటీజీ గ్రూప్ తాజా సర్వే ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లోని మొత్తం 25 లోక్‌సభ సీట్లకు గాను వైసీపీ 24 నుంచి 25 సీట్లను గెలుచుకోబోతున్నది. టీడీపీకి సున్నా నుంచి ఒక్క సీటు వరకు లభించే అవకాశం ఉన్నది. అంటే టీడీపీ మహా అయితే ఒక్క సీటు గెలుచుకుంటుంది. ఈ సీట్లను అసెంబ్లీ స్థానాల లెక్కలోకి అనువదిస్తే ఫలితం సుస్పష్టం. గతంలో గెలిచిన 151 కంటే పైమాటే తప్ప తగ్గే అవకాశం ఉండదు. కర్ణాటక ఎన్నికల ఫలితాలను కచ్చితంగా అంచనా వేసిన సంస్థల్లో పొలిటికల్ క్రిటిక్ ఒకటి. ఆ సంస్థ ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో సర్వే చేసి గత ఎన్నికల్లో వైసీపీ సాధించిన ఓట్ల శాతాన్ని యథాతథంగా నిలబెట్టుకుంటుందని నిర్ధారించింది. టీడీపీ కంటే వైసీపీ 11 శాతం ఎక్కువ ఓట్లు తెచ్చుకుంటుందని చెప్పింది. 2019 ఎన్నికల ఫలితాలు పునరావృతమవుతాయని అర్థం. ఈ పరిస్థితి యెల్లో ముఠాకు అర్థమైనందు వల్లనే అది నిగ్రహాన్ని కోల్పోయి ప్రవర్తిస్తున్నది.


ఇప్పుడు యెల్లో మీడియా ప్రవర్తిస్తున్న తీరును బట్టి కూడా వైసీపీ భారీ విజయాన్ని అంచనా వేసుకోవచ్చు. పేద పిల్లలకు మంచి చదువులు వద్దట. ట్యాబ్‌లు, ల్యాప్‌టాప్‌లు ఇస్తే చెడిపోతారట, సంపన్నుల పిల్లలకిస్తే ఫరవాలేదు. వారు చెడిపోరు. వారు పుట్టుకతోనే సద్బుద్ధి కలిగి ఉంటారు. వారు సజ్జనులు. దుర్జనులైన అలగా జనానికి ట్యాబ్‌లు ఇస్తే తక్షణం చెడిపోతారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వాళ్లను చెడగొడుతున్నదట. పైగా ఈ ప్రభుత్వం పన్నులు వేస్తున్నదట. ఆ అధికారం ఒక్క చంద్రబాబుకే ఉండాలట! ఈ రకమైన యెల్లో మీడియా విపరీత ప్రవర్తనను తెలుగు పాఠక జనం ఇంకో వంద రోజులు భరించవలసి ఉంటుంది. మరోపక్క వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూల్‌గా తన సామాజిక న్యాయ సిద్ధాంతానికి మరింత పదును పెట్టే పనిలో నిమగ్నమయ్యారు. ఇటీవల మార్పు చేర్పులు చేసిన 11 సీట్లను గమనిస్తే ఈ విషయం అర్థమవుతుంది. ఇందులోనే బీసీలకు మరో రెండు సీట్లు పెంచారు. గెలుపు మీద పూర్తిస్థాయి విశ్వాసం ఉన్నవారే ఇటువంటి ప్రయోగాలకు సిద్ధమవుతారు. రెండోసారి గెలుపు కోసం మాత్రమే కాదు, సుదీర్ఘ ఇన్నింగ్స్‌కే జగన్‌మోహన్‌రెడ్డి పూర్తిస్థాయిలో సిద్ధమవుతున్నట్టు కనిపిస్తున్నదనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

vardhelli1959@gmail.com

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

# రానున్నది ఉష్ణ ప్రకోపమే!

అభిప్రాయం



కె. బి. గోపాలం

వాతావరణం, శీతోష్ణస్థితి గురించి లెక్కలు తీసి రికార్డుగా దాచి ఉంచడం మొదలుపెట్టి 170 సంవత్సరాలకు పైనే అయింది. ఈ మొత్తం కాలంలోనూ 2023వ సంవత్సరం అన్నిటికన్నా వేడి అయినదిగా నమోదవుతుంది అని పరిశోధకులు అప్పుడే చెప్పేస్తున్నారు. ఇటీవలి కాలం ఇంత వేడిగా ఉండడానికి మనుషుల కారణంగా మారుతున్న శీతోష్ణస్థితి మాత్రమే అని ఎటువంటి అనుమానం లేకుండా తేల్చేస్తున్నారు.

యూరోపియన్ యూనియన్ స్పేస్ ప్రోగ్రామ్ వారి 'కోపర్నికస్ క్లైమేట్ ఛేంజ్ సర్వీస్' వారి లెక్కల ప్రకారం, ఇంతకు ముందు ఎప్పుడూ వేసంగి ఇంత వేడిగా ఉన్నది లేదు. గతంలో కంటే ఈసారి ఉష్ణోగ్రత 0.32 డిగ్రీ సెల్సియస్ సగటున ఎక్కువగా ఉన్నట్టు లెక్క తేలింది. ప్రపంచం మొత్తం మీద మునుపెన్నడూ లేని మూడు వేడి దినాలు నమోదైనట్లు కూడా తెలిసింది. ఇప్పటికే ఈ ఏడాది వేసవికాలం మునుపెన్నడూ లేనంత వేడిగా ఉందని లెక్కతేల్చి పెట్టారు. 2023వ సంవత్సరంలో నెలల ప్రకారం లెక్కలు చూచినా... ప్రపంచమంతటా ఆరు మాసాలు అంతకు ముందు ఎన్నడూ లేని వేడి కనబరిచినట్టు ఇప్పటికే లెక్కలు వచ్చాయి. అంటార్కిటికాలో మంచు కూడా అంతకు ముందు ఎన్నడూ లేనంతగా కరిగిపోయినట్టు కూడా గమనించారు.

ప్రపంచంలో పారిశ్రామికీకరణ కన్నా ముందు కూడా వాతావరణంలోని వేడి గురించిన రికార్డులు ఉన్నాయి. ఈ సంవత్సరం ఇప్పటి వరకు సగటున ప్రపంచం మొత్తం మీద 1.46 డిగ్రీల సెల్సియస్ వేడి పారిశ్రామికీకరణకు ముందున్న వేడి కన్నా ఎక్కువగా ఉంది. పరిశ్రమల వల్ల వాతావరణం వేడెక్కుతున్నదన్న భావన చాలాకాలంగా ప్రపంచంలో ఉండటం తెలి



సిందే. 2016లో వేడిమి ఎక్కువగా ఉన్నట్టు ఇప్పటి వరకు ఉన్న రికార్డులు తెలుపుతున్నాయి. అయితే ఈ సంవత్సరం వేడి 2016లో కన్నా ఎక్కువగా ఉన్నట్టు నమోదయింది. ఈ ప్రకారంగా ఇప్పటి వరకు రికార్డులో ఉన్న సంవత్సరాల అన్నింటిలోకీ 2023 అత్యంత వేడిగా ఉన్నట్టు లెక్క తేలింది. ఈ విషయాన్ని ఈ మధ్యనే 'సీ త్రీ ఎస్' సంస్థ పరిశోధకురాలు సమంతా బర్జెస్ ఒక ప్రకటనలో బయటపెట్టారు.

శరత్ కాలం కూడా వేడిగా ఉండడానికి 'ఎల్ నినో' కారణం అని ఇప్పటికే మనకంతా తెలుసు. ఎల్ నినో వల్ల భూమధ్య రేఖ వద్ద సముద్రాలలో ఉపరితలం నీరు వేడెక్కుతుంది. దాని వల్ల ప్రపంచంలోని గాలులు వేడవుతాయి. 2023 జూన్‌లోనే ఈ ప్రక్రియ మొదలైంది. వచ్చే ఏడాది కూడా ఈ వేడి కొనసాగుతుందని అంటున్నారు. గడచిన మూడు సంవత్సరాల పాటు ఎల్ నినోకు వ్యతిరేకంగా ఉండే 'లా నినా' అనే పరిస్థితి కారణంగా వేడిమి కొంతవరకు అదుపులో ఉంది. ఈ 'లా నినా' ప్రస్తుతం లేదు. కనుక వేడిమి హద్దు లేకుండా పెరుగుతున్నది. మరికొంతమంది నిపుణులు టోంగాలో సముద్రం లోపల 2022లో పేలిన అగ్నిపర్వతం కారణంగా వేడి నీటి ఆవిరులు వాతావరణంలో పెరిగాయనీ, ఈ సంవత్సరం వేడి పెరుగుదలకు అది కూడా కొంతవరకు కారణం కావచ్చుననీ అంటున్నారు. అయితే పరిశోధకులు మాత్రం ఈ విషయం గురించి అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

ప్రపంచమంతటా వాతావరణం వేడిగా మారడానికి 'గ్లోబల్ వార్మింగ్' అన్న ప్రక్రియ కారణం అని అందరికీ తెలుసు. గ్రీన్ హౌస్ వాయువుల కారణంగా ఈ పరిస్థితి ఎదురవుతున్నదని కూడా తెలుసు. ఈ ప్రక్రియ వల్ల ప్రపంచ వాతావరణంలో 25 బిలియన్‌ల అణుబాంబుల శక్తికి సమానంగా ఉష్ణశక్తి చేరిందని పరిశోధకులు అంచనా వేస్తున్నారు. ఇదంతా గడిచిన 50 సంవత్సరాల పాటు జరిగిన మార్పు. ఈ మార్పు ఒక పక్కన గాలిని వేడెక్కిస్తుండగా, మరొక పక్కన ఊహకు అందకుండా ఎల్ నినో వచ్చే పరిస్థితులకు దారితీస్తున్నది.

రానురానూ పరిస్థితి మరింత దారుణంగా మారుతున్నది. డిసెంబర్ 4న 'కాప్' 28 అనే యునైటెడ్ నేషన్స్ క్లైమేట్ ఛేంజ్ కాన్ఫరెన్స్ జరిగింది. వాతావరణంలోకి కార్బన్ డై ఆక్సైడ్‌ను పంపించడం ఈ సంవత్సరం అంతకు ముందు ఎన్నడూ లేని స్థాయికి చేరిందని అక్కడ ప్రకటించారు. పరిస్థితి ఇలాగుంటే, వాతావరణం నియంత్రణలో ఉంటుందని అనుకోవడానికి వీలే లేదు అన్నారు అక్కడ.

గ్లోబల్ వార్మింగ్ ప్రభావాలు ప్రస్ఫుటంగా బయట పడుతున్నాయి. ప్రపంచమంతటా తీర ప్రాంతాల్లో ఉన్న నగరాలు ముంపునకు గురవుతున్నాయి. ప్రపంచంలోని పెద్ద పెద్ద సరస్సులు, జలాశయాలు సగం కుదించుకుపోయాయి. సముద్ర అంతర్భాగంలో ఉండే గల్ఫ్ ప్రవాహం కూడా ప్రభావం కనపరుస్తున్నది. సముద్ర మట్టాలు ఎక్కడికక్కడ పెరుగుతున్నాయి.

అయితే పరిశోధకులు, పరిస్థితిని చక్కదిద్దుకోవడానికి అవకాశాలు ఇంకా ఉన్నాయి అని ఆశాభావం కనబరుస్తున్నారు. వాతావరణంలో మార్పులను మనకు అనుకూలంగా మార్చే మార్గాలు లేకపోలేదు అంటున్నారు పెన్సిల్వేనియా విశ్వ విద్యాలయం పరిశోధకులు. కానీ ఆ అవకాశం కూడా రానురానూ తగ్గిపోతున్నది అన్నది వారి అభిప్రాయం.

వ్యాసకర్త సైన్స్ రచయిత

**గమనిక:** డిసెంబర్ 16 శనివారం నాటి సంపాదకీయం 'కీచక న్యాయంపై కొరడా!'లో ప్రస్తావించిన న్యాయమూర్తి పేరును రంజన్ గొగోయ్ అని చదువుకోగలరు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 425 9899

# క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- 22న ఎల్బీస్టేడియంలో విందుకు సీఎం హాజరు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. శనివారం రాత్రి ప్రజాభవన్ కార్యాలయంలో ఆయన క్రిస్మస్ వేడుకల నిర్వహణపై సెలబ్రేషన్ కమిటీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వస్తున్న మొదటి పండుగ క్రిస్మస్‌ను ఘనంగా నిర్వహించాలన్నారు. వేడుకలను పురస్కరించుకుని పేద కుటుంబాలకు గిఫ్ట్ ప్యాక్‌ల పంపిణీ, విందును ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అలాగే ఈనెల 22న ఎల్బీ స్టేడియంలో నిర్వహిస్తున్న విందు కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరవుతున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ పరిధిలోని 200 ప్రాంతాల్లో 500 మందికి, 95 అసెంబ్లీ నియోజకవర్గాల్లో వెయ్యి మందికి చొప్పున గిఫ్ట్ ప్యాక్‌లను పంపిణీ చేయడంతో పాటు విందు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా క్రిస్మస్ వేడుకల నిర్వహణ గురించి మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి సయ్యద్ ఉమర్ జలీల్ డిప్యూటీ సీఎం భట్టికి వివరించారు. సమావేశంలో ఎంసీహెచ్‌ఆర్‌డి అడిషనల్ డైరెక్టర్ బి.ఎం ఎక్కా, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎం.డి. కాంతి వెస్లీ, జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రోస్, హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి, సైబరాబాద్ సీపీ మహంతి, రాచకొండ సీపీ సుధీర్ బాబు పాల్గొన్నారు.

# ఫైన్ ఆర్ట్స్‌లో చేరివుంటే రేవంత్ సీఎం అయ్యేవారా?

- సీఎంకు అభినందన సభలో జేఎన్‌టీయూ ఫైన్ ఆర్ట్స్ మాజీ ప్రిన్సిపాల్ దశరథరెడ్డి



పంజగుట్ట (హైదరాబాద్): కాన్వాస్‌పై అద్భుతంగా బొమ్మలు గీసే కళాకారుడిగా రేవంత్ రెడ్డి జేఎన్‌టీయూలోని ఫైన్ ఆర్ట్స్ కోర్సులో చేరివుంటే నేడు రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యేవారా అని జేఎన్‌టీయూ ఫైన్ ఆర్ట్స్ మాజీ ప్రిన్సిపాల్ దశరథరెడ్డి అన్నారు. లలితకళారంగానికి చెందిన కళాకారుడు రాష్ట్ర ముఖ్యమంత్రి కావడం కళాకారులందరికీ ఎంతో సంతోషంగా ఉందన్నారు. సీఎంగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన అభినందన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 1980–90 మధ్య కాలంలో ఫైన్ ఆర్ట్స్ కోర్సులో చేరేందుకు రేవంత్ రెడ్డి ప్రవేశ పరీక్ష రాయగా అందులో ఆయనకు 8వ ర్యాంకు వచ్చిందని గుర్తు చేశారు. అయితే ఓపెన్ కేటగిరీలో 7వ ర్యాంకు వస్తేనే సీటు వస్తుందని, మిగిలిన సీట్లు రిజర్వేషన్‌కు వెళ్తాయని రేవంత్‌కు చెప్పానని వివరించారు. నాడు సీటు రాకపోవడంతో రాజకీయాల్లో చేరి అంచెలంచెలుగా ఎదుగుతూ రాష్ట్రానికి సీఎం అయ్యారని వివరించారు.

# రొయ్య.. ఇక ఇంటికేనయ్యా!

సాక్షి, అమరావతి: రొయ్యల వినియోగం పెంచేందుకు ఏపీ ప్రభుత్వం ఓ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుడుతోంది. ఎగుమతులకే పరిమితమైన ఎక్స్‌పోర్ట్ క్వాలిటీ రొయ్యలను ఇక నేరుగా వినియోగదారుల చెంతకు చేర్చాలని సంకల్పించింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో ఈ ప్రక్రియను అమలుచేసేందుకు ఏపీ రొయ్య రైతుల ఫెడరేషన్ సైతం ముందుకొచ్చింది. సాధారణంగా.. స్థానికంగా సాగై మార్కెట్లోకి వచ్చే 80–120 కౌంట్ రొయ్యలు కాకుండా మిగిలిన కౌంట్ రొయ్యలు వివిధ రూపాల్లో ఎగుమతి అవుతుంటాయి. ఇప్పుడు ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో ఈ హైకౌంట్ రొయ్యలను కూడా వివిధ రూపాల్లో డోర్ డెలివరీ చేయనున్నారు. ఇందులో భాగంగా.. ముందుగా పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం పరిసర ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా దీనిని అమలుచేస్తున్నారు. ఆ తర్వాత డిమాండ్ ఆధారంగా రాష్ట్రంలోని ప్రముఖ నగరాలు, పట్టణ ప్రాంతాలకు ఈ విధానాన్ని విస్తరించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

# రాష్ట్రంలో ప్రజల ప్రభుత్వం వచ్చింది: భట్టి




డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి సీతక్కను సత్కరిస్తున్న గిరిజన ఉద్యోగ , ప్రజా, విద్యార్థి సంఘాల ప్రతినిధులు

గన్‌ఫౌండ్రీ(హైదరాబాద్): రాష్ట్రంలో ప్రజల ప్రభుత్వం వచ్చిందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. శనివారం ఇక్కడ రవీంద్రభారతిలో గిరిజన ఉద్యోగ, ప్రజా, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గిరిజన ఎమ్మెల్యేలకు ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. భట్టివిక్రమార్క మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల మేలుకోరే ప్రభుత్వమని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలతో బడుగు, బలహీన వర్గాలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కొత్తగా కొలువుదీరిన శాసన సభలో 23 మంది ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీ నుంచి ఎన్నికవడం సంతోషంగా ఉందన్నారు. పంచాయతీరాజ్, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క మాట్లాడుతూ గిరిజన, ఆదివాసీల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. గతంలో గిరిజనులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని, తమ ప్రభుత్వంలో అటువంటి పరిస్థితులను తీసుకురాబోమని తెలిపారు. అంతకుముందు ఆదివాసీల సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు రాంచంద్రనాయక్, పాయం వెంకటేశ్వర్లు, వెడ్మ బొజ్జు, కోరం కనకయ్య, నేనావత్ బాలునాయక్, మాలోత్ రాందాస్, ఆదినారాయణ, భూక్యా మురళీనాయక్, మాజీమంత్రులు బలరాంనాయక్, రవీంద్రనాయక్, కార్యక్రమ సమన్వయకర్తలు బట్టు రమేష్, శరత్ పాల్గొన్నారు.

# వికేంద్రీకరణతో సత్ఫలితాలు

- ఆమేరకు పాలనా సంస్కరణలు చేపట్టాలి
- ఐఐటీ గ్రాడ్యుయేట్స్‌కే కాదు.. సామాన్యులకూ ఉపాధి అవకాశాలు ఉండాలి
- ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్



ముఫఖంజా ఇంజనీరింగ్ కాలేజీలో మాట్లాడుతున్న రఘురామ్ రాజన్

సాక్షి, హైదరాబాద్: వికేంద్రీకరణతో ప్రజాస్వామ్య వ్యవస్థలను మెరుగుపరచడంపై దృష్టి సారించేలా పాలనా సంస్కరణలు చేపట్టాల్సిన అవసరం ఉందని ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ అభిప్రాయపడ్డారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం కన్నా చిన్నవైన దేశాల్లో సైతం వికేంద్రీకరణ పాలన ఇస్తున్న సత్ఫలితాలను ఆయన ఉదహరించారు. ప్రముఖులు, నిపుణుల అభిప్రాయాల చర్చా వేదిక 'మంథన్' ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లోని ముఫఖంజా ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తాను పెన్సిల్వేనియా స్టేట్ యూనివర్సిటీ ఆర్థిక శాస్త్ర అసిస్టెంట్ ప్రొఫెసర్ రోహిత్ లాంబాతో కలిసి రాసిన' బ్రేకింగ్ ది మౌల్డ్: రీఇమేజినింగ్ ఇండియాస్ ఎకనామిక్ ఫ్యూచర్' పుస్తకంపై నిర్వహించిన ఈ చర్చావేదికలో పుస్తకంలోని మూడు ముఖ్యమైన పార్శ్వాలను రాజన్ ప్రస్తావించారు. ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న భారత ఆర్థిక వ్యవస్థ ఉద్యోగాల కల్పనలో తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోందన్నారు. అయితే దేశం అభివృద్ధి పథంలో పయనించే ప్రతీ దశలో ఉద్యోగాల కల్పన జరగాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఐఐటీ గ్రాడ్యుయేట్స్‌కు మాత్రమే కాదు సాధారణ విద్య అభ్యసించిన సామాన్యులకు సైతం ఉపాధి అవకాశాలు ఉండాలని సూచించారు. నైపుణ్యం పెంపొందించడం ద్వారా సగటు ఉద్యోగాలను నాణ్యమైన ఉద్యోగాలుగా మార్చుకోవచ్చని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం సాధించిన వందేళ్లకు అంటే వచ్చే 2047కల్లా ప్రపంచంలో బలమైన ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా ఎదుగుతామని ప్రధాని మోదీ చెబుతున్న విషయాన్ని రాజన్ ప్రస్తావించారు. అది గొప్ప ఆశయమని, అలాంటి ఆశయాలు దేశాన్ని సరైన పంథాలో నడిపిస్తాయన్నారు. అయితే ప్రస్తుతం మన జీడీపీ వార్షిక వృద్ధి 6 శాతంగా, తలసరి ఆదాయం 2,500 డాలర్ల కన్నా తక్కువగా ఉన్న పరిస్థితుల్లో మరో 24 ఏళ్లలో మనం సాధించే వృద్ధిని బట్టి అప్పటికి అది సుమారు 10 వేల డాలర్లకు చేరవచ్చని లెక్కగట్టారు. ప్రస్తుతం చైనా, దక్షిణ కొరియా, అమెరికా వంటి దేశాలు ఇప్పటికే అంతకుమించిన తలసరి ఆదాయాన్ని సాధించిన విషయాన్ని గుర్తుంచుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పుస్తకం సహరచయిత రోహిత్ లాంబా పాల్గొన్నారు.

# అచీవర్స్ జాబితాలో ఏపీ

- లాజిస్టిక్స్ ఇండెక్స్‌లో తొలి స్థానం

న్యూఢిల్లీ: సరుకు రవాణా సేవల సామర్థ్యం విషయంలో ఆంధ్రప్రదేశ్ మరో ఘనతను సొంతం చేసుకుంది. లాజిస్టిక్స్ ఇండెక్స్ చార్ట్–2023లో అచీవర్స్‌గా నిలిచిన 13 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో ఆంధ్రప్రదేశ్ తొలి స్థానం సొంతం చేసుకుంది. కర్ణాటక, తమిళనాడు, చండీగఢ్, గుజరాత్, సిక్కిం, త్రిపుర, ఢిల్లీ, అస్సాం, హరియాణా, పంజాబ్, తెలంగాణ, ఉత్తర ప్రదేశ్ సైతం అచీవర్స్‌గా స్థానం దక్కించుకున్నాయి. వివిధ రాష్ట్రాలలో సరుకు రవాణా సౌలభ్యం–2023 పేరుతో రూపొందిన నివేదికను కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ మంత్రి పీయూష్ గోయల్ శనివారం విడుదల చేశారు. రాష్ట్రాల్లో సరుకు రవాణా పర్యావరణ వ్యవస్థ పనితీరు ఆధారంగా ర్యాంక్ ఇస్తారు. ఎగుమతులు, ఆర్థిక వృద్ధిని ప్రోత్సహించడానికి అవసరమైన సరుకు రవాణా సేవల సామర్థ్యాన్ని లాజిస్టిక్స్ ఇండెక్స్ చార్ట్ సూచిస్తుంది. దేశ వాణిజ్యాన్ని మెరుగుపరచడానికి, లావాదేవీల ఖర్చులను తగ్గించడానికి అవసరమైన రాష్ట్రాల్లో సరుకు రవాణా పనితీరును మెరుగుపరచడంపై దృష్టిని పెంపొందించడం ఈ సూచిక లక్ష్యం. వాటాదారులు ఎదుర్కొంటున్న కీలక రవాణా సంబంధ సవాళ్లు, సూచనాత్మక సిఫార్సులను నివేదికలో పొందుపరుస్తారు. లాజిస్టిక్స్ పనితీరును మెరుగుపరిచేందుకు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల మధ్య ఆరోగ్యకర పోటీని పెంపొందించడంలో నివేదిక కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి ఈ సందర్భంగా చెప్పారు. 2023 మే–జూలై మధ్య దేశవ్యాప్తంగా నిర్వహించిన ప్రాథమిక సర్వేలో 7,300కి పైగా ప్రతిస్పందనల ఆధారంగా నివేదిక రూపొందింది. సూచీలో మిగిలిన రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు ఫాస్ట్ మూవర్స్, ఆస్పైరర్స్‌గా నిలిచాయి.

**తెలంగాణ స్టేట్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్**
(తెలంగాణ ప్రభుత్వరంగ సంస్థ)
తెలంగాణ స్టేట్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్ కాంపౌండ్, సైఫాబాద్, హైదరాబాద్–500004
ఫోన్స్:040-27855008, 040-23230742, ఫ్యాక్స్: 040-23297143, ఇ-మెయిల్: headoffice@tsphcl.com

**ఇ-ప్రొక్యూర్‌మెంట్-టెండరు ప్రకటన-31**

దిగువ తెలిపిన 01 పని కోసం టెండరు నం.T162/2023-24 తేది: 16-12-2023 కోసం సివిల్ పని కోసం టెండర్లు కోరబడుచున్నవి: టెండరు నం., జిల్లాలలో గల పని & మొత్తం ECV (రూ.లక్షలలో) వరుసగా దిగువ విధంగా ఉన్నాయి: T162-హైదరాబాద్-1-936.62. **టెండరు నం.T162/23-24 కోసం బిడ్ దాఖలుకు ఆఖరి తేదీ/సమయం:** 30-12-2023/ సా.5.00 గం. తదుపరి వివరాలను **www.tender.telangana.gov.in** వెబ్‌సైట్‌లో చూడవచ్చును.

సం/- చీఫ్ ఇంజనీర్

DIPR RO No.8723-PP/CL/Advt/1/2023-24, Dt: 16-12-2023

**సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం**
తెలంగాణ స్టేట్ ఎడ్యుకేషన్ & వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, హైదరాబాద్

**ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీసు**

టెండరు నోటీసు నం.**SE/TSEWIDC/HYD/NIT/1080 to 1091/2023-24** తేది: 16.12.2023

దిగువ తెలిపిన పనుల కోసం అర్హులైన కాంట్రాక్టర్లందరి నుండి టెండర్లు కోరబడుచున్నవి: తెలంగాణ రాష్ట్రంలోని MGU నల్గొండకు అడ్మిన్ బ్లాక్ మరియు ప్రహరీగోడ, TSRSకు ప్రిన్సిపల్ క్వార్టర్స్ మరియు స్టాఫ్ క్వార్టర్స్, TSRSCకు డార్మిటరీ హాల్స్ నిర్మాణం (12 పనులు) (రూ.18.00 నుండి 1180.62 లక్షలు). ఆన్‌లైన్‌లో బిడ్ దాఖలు మరియు స్వీకరణకు చివరి తేది: 02.01.2024 సా.4.00 గం. వరకు. **గమనిక:** ధర సర్దుబాటు G.O.Ms.No.94 of Transport, Roads & Buildings (R.1) Dept., dt.16.04.08 ప్రకారం స్టీల్ మరియు సిమెంట్ కోసం మాత్రమే వర్తిస్తుంది. పూర్తి వివరాల కోసం https://tender.telangana.gov.in చూడండి లేదా సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం, TSEWIDC, 3వ బ్లాక్, 4వ అంతస్తు, రాజీవ్ విద్యా మిషన్ బిల్డింగ్, SCERT కాంపౌండ్, ఇ-సేవ ఎదురుగా, ఎల్బీ స్టేడియం, హైదరాబాద్, ఫోన్ నం.29565991 వారిని స్వయంగా సంప్రదించండి.

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, TSEWIDC, హైదరాబాద్

DIPR RO No.8731-PP/CL/Advt/1/2023-24, Dt: 16.12.2023

తెలంగాణ ప్రభుత్వం
**తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ**

**TSWREIS, TTWREIS, MJPTBCWREIS, TREIS**
గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశమునకై
2024–25 విద్యా సంవత్సరానికి
**ఉమ్మడి ప్రవేశ పరీక్ష ప్రకటన**

తెలంగాణ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులకు అభివృద్ధి చెందిన ఇతర వర్గాల పిల్లలతో సమానంగా నాణ్యమైన విద్యను అందిస్తూ వారిలో సహజ సిద్ధమైన నైపుణ్యాలను వెలికితీస్తూ ఆ విద్యార్థులను 21వ శతాబ్దపు సవాళ్ళను ధీటుగా ఎదురుకోవడానికి సిద్ధం చేస్తుంది. ఈ లక్ష్యంతో SC, ST, BC మరియు జనరల్ గురుకుల పాఠశాలలను సంక్షేమ శాఖల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా నెలకొల్పింది. ఇంగ్లీష్ మీడియంలో విజయవంతంగా నడుస్తున్న ఈ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశమునకై తేది. 11-02-2024 నాడు ఉదయం 11:00 గంటల నుండి మధ్యాహ్నం 01:00 గంట వరకు అన్ని జిల్లాలలో (ఎంపిక చేయబడిన కేంద్రాలలో) ప్రవేశ పరీక్ష నిర్వహించబడును. అభ్యర్థులు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించాలి. అన్ని వివరాలకు, ప్రాస్పెక్టస్ కొరకు http://tswreis.ac.in (లేదా) http://tgtwgurukulam.telangana.gov.in (లేదా) http://mjptbcwreis.telangana.gov.in (లేదా) http://tgcet.cgg.gov.in లను దర్శించండి.


**దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు సూచనలు:**

1. అభ్యర్థులు తమ అర్హతలను పరిశీలించుకుని తేది.18-12-2023 నుండి 06-01-2024 వరకు ఆన్‌లైన్‌లో రూ.100/- రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకొనవచ్చును. ఒక ఫోన్ నెంబర్‌తో ఒక దరఖాస్తు మాత్రమే చేయవచ్చును.
2. అభ్యర్థికి బదులుగా వేరేవారి ఫోటోలు పెట్టి దరఖాస్తు చేసినచో అట్టి వారిపై సెక్షన్ 416 ఆఫ్ IPC 1860 ప్రకారం క్రిమినల్ చర్యలు చేపట్టబడును.
3. విద్యార్థుల ఎంపికకు "పాత జిల్లా" ఒక యూనిట్‌గా పరిగణింపబడుతుంది.
4. ఇతర సమాచారం కొరకు హెల్ప్‌లైన్ నెంబర్ **1800 425 45678** ని లేదా ప్రాస్పెక్టస్‌లో పేర్కొన్న సంబంధిత జిల్లా ప్రధానాచార్యులను ఫోన్‌లో సంప్రదించవచ్చు (ఉ.10:30 గం.ల నుండి సా.5:00 గం.ల వరకు).
5. 2023–2024 విద్యా సంవత్సరంలో 4వ తరగతి చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. (విద్యార్థినీ/విద్యార్థులు ఈ సంవత్సరం 4వ తరగతి చదువుతున్నట్లుగా ధ్రువీకరణ పత్రాన్ని అనగా బోనఫైడ్ / స్టడీ సర్టిఫికెట్‌ను అప్‌లోడ్ చేయవలసి ఉంటుంది).

**మన గురుకులాలు – విద్యార్థుల ప్రగతికి సోపానాలు**

సం/- Dr. ఇ. నవీన్ నికోలస్, ఐ.ఏ.యస్.
Secretary TSWREIS & Chief Convenor, VTG CET-2024

DIPR RO No.8675-PP/CL/ADVT/1/2023-24, Dt:15-12-2023



# చాట్‌జీపీటీకి పోటీగా జెమినీ

## రంగంలోకి దిగిన గూగుల్
### ఏఐ రంగంలో ముదురుతున్న పోరు




భవిష్యత్తంతా కృత్రిమ మేధదే. ఇది అందరూ ముక్తకంఠంతో చెబుతున్న మాట. ఈ నేపథ్యంలో ఆ రంగంపై పట్టు బిగించేందుకు ఐటీ దిగ్గజాలన్నీ శాయశక్తులా ప్రయత్నిస్తున్నాయి. మైక్రోసాఫ్ట్ ఇప్పటికే ఓపెన్‌ఏఐ యాజమాన్యంలోని చాట్‌జీపీటీ ప్రాజెక్టులో మెజారిటీ భాగస్వామి కావడం ద్వారా ఈ దిశగా తొలి అడుగు వేసింది. గడచిన ఏడాది కాలంలో మరెన్నో ఏఐ మోడళ్లు తెరపైకి వచ్చినా ఓపెన్ ఏఐ తాలూకు జీపీటీ మోడళ్లతో పోటీ పడలేకపోతున్నాయి. దానికి పోటీగా జెమినీ పేరుతో గూగుల్ తాజాగా కొత్త ఏఐ మోడల్‌ను ప్రకటించింది. దీనిపై ఇప్పుడు అంతటా ఆసక్తి నెలకొంది...

**మొగ్గు జెమినీకే కనిపిస్తున్నా...**

అవడానికి చాట్‌జీపీటీ, జెమినీ రెండూ జెనరేటివ్ ఏఐ మోడళ్లే. ఇవి ఇన్‌పుట్ ట్రెనింగ్ డేటా తాలూకు ప్యాట్రన్ల ఆధారంగా పిక్చర్లు, పదాలు, ఇతర మీడియా వంటి కొత్త డేటాను కోరిన విధంగా జెనరేట్ చేస్తాయి. చాట్‌జీపీటీ ప్రధానంగా లార్జ్ లాంగ్వేజ్ మోడల్ (ఎల్‌ఎల్‌ఎం). ఇది టెక్స్ట్ జెనరేట్ చేయడంపై ఎక్కువగా దృష్టి పెడుతుంది. అలాగే జీపీటీ ఆధారిత వెబ్ సంభాషణల యాప్‌గా కూడా పని చేస్తుంది. గూగుల్‌కు కూడా బార్డ్ పేరుతో ఇలాంటి యాప్ ఇప్పటికే ఉంది. ఇది గతంలో లాఎండీఏ లాంగ్వేజ్ మోడ్‌పై ఆధారపడేది. ఇప్పుడు జెమినీ కోసమని పీఏఎల్‌ఎం2 మోడ్‌గా దాన్ని అప్‌గ్రేడ్ చేస్తోంది గూగుల్. ఇది మల్టీ మోడల్ తరహా మోడల్ కావడమే చాట్‌జీపీటీతో పాటు ఇతర అన్ని ఏఐల కంటే జెమినీని ఇప్పుడు ప్రత్యేకంగా నిలుపుతోంది. ఎందుకంటే ఇది మల్టిపుల్ ఇన్‌పుట్, ఔట్‌పుట్ మోడ్లతో నేరుగా పని చేయగలదు. అంతేగాక టెక్స్ట్, ఆడియో, వీడియోలను కూడా బాగా సపోర్ట్ చేస్తుంది. ఓపెన్ ఏఐ కూడా ఇలాంటి సామర్థ్యంతో కూడిన జీపీటీ-4 విజన్ మోడల్‌ను ప్రకటించినా అది జెమినీ మాదిరిగా పూర్తిస్థాయి మల్టీమోడల్ కాదు. ఎందుకంటే ఇది ప్రధానంగా టెక్స్ట్ పైనే ఆధారపడుతుంది. ఉదాహరణకు ఆడియో ఇన్‌పుట్స్‌ను స్పీచ్ ఔట్‌పుట్‌గా మార్చేందుకు విష్పర్ అనే స్పీచ్ టు టెక్స్ట్ ఇన్‌పుట్ లెర్నింగ్ మోడల్ సాయం తీసుకుంటుంది. ఇమేజీలను అందించాలన్నా అంతే. అది జెనరేట్ చేసే టెక్స్ట్ ప్రాంప్టులను డాల్-ఈ2 అనే మరో డీప్ లెర్నింగ్ మోడల్ ఇమేజీలుగా మారుస్తుంది. కానీ గూగుల్ మాత్రం జెమినీని ఇలా కాకుండా పూర్తిస్థాయి మల్టీ మోడల్ ఏఐగా తీర్చిదిద్దుతోంది. ఇతర లెర్నింగ్ మోడళ్ల సాయంతో నిమిత్తం లేకుండా నేరుగా ఆడియో, ఇమేజీలు, వీడియో, టెక్స్ట్ వంటి ఇన్‌పుట్ టైప్‌లను అది తనంత తానే కావాల్సిన ఔట్‌పుట్లుగా మార్చేస్తుంది. జీపీటీ-4తో పోలిస్తే జెమినీ పనితీరు ఎలా ఉంటుందో ఇప్పటికి తెలియకపోయినా దాన్ని చాలా హెచ్చు సామర్థ్యంతో రూపొందిస్తున్నట్టు గూగుల్ ప్రకటించుకుంది. దానికిప్పటికే జెమినీ 1.0 అల్ట్రా అని కూడా పేరు పెట్టింది. ప్రయోగాత్మకంగా చేసిన పరీక్షల్లో ఇది జీపీటీ-4 కంటే మిన్నగా తేలిందని చెబుతోంది కూడా. ఇందుకు రుజువుగా ఓ వీడియో కూడా విడుదల చేసింది. కాకపోతే అందులో చూపించిన టాస్కులను రియల్‌టైమ్‌లో చేయడంలో జెమినీ ఏ మేరకు కృతకృత్యమవుతుందో చూడాల్సి ఉంది.

**అంతిమ లబ్ధి యూజర్లకే...**

ఈ సందేహాల మాట ఎలా ఉన్నా జెమినీ వంటి భారీ మల్టీమోడల్ మోడళ్లు జెనరేటివ్ ఏఐ రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడతాయని ఐటీ రంగ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఎందుకంటే ప్రధానంగా టెక్స్ట్ ఆధారితమైన జీపీటీ-4 ఇప్పటికే ఏకంగా 500 బిలియన్ పదాలపై శిక్షణ పొందింది! అంటే, పబ్లిక్ డొమైన్లో అందుబాటులో ఉన్న నాణ్యమైన పదాలన్నీ దానికిప్పటికే చిరపరిచితమని చెప్పవచ్చు. ఇలాంటి ట్రెనింగ్ డేటాతో పాటు మోడల్ తాలూకు సంక్లిష్టత ఎంత ఎక్కువగా ఉంటే దాని పనితీరు అంత ప్రభావవంతంగా ఉంటుంది. అయితే ఇలాంటి అన్ని రకాల డేటాను నేరుగా వాడగల జెమినీ వంటి ఏఐ మోడళ్లు ముమ్మందు మరింత సామర్థ్యం సంతరించుకోవడం ఖాయంగా కన్పిస్తోంది. అదే సమయంలో దీనికి పోటీగా ఓపెన్ ఏఐ కూడా అప్‌గ్రేడెడ్ జీపీటీ-5 వెర్షన్‌పై ఇప్పటికే ముమ్మరంగా కృషి చేస్తోంది. ఈ నిరంతర పోటీ అంతిమంగా యూజర్లకే మరింత లబ్ధి చేకూరుస్తుందని ఐటీ రంగ నిపుణులు చెబుతున్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

---

## జన గణన తరువాత మహిళా బిల్లు అమలు

**కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్**

**శివాజీనగర(బెంగళూరు):** 2024లో జన గణన పూర్తయ్యాక మహిళా రిజర్వేషన్ బిల్లును అమల్లోకి తీసుకొచ్చేందుకు కేంద్రం చర్యలు తీసుకుంటుందని ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. కర్ణాటకలోని మూడుబిద్రిలో రాణి అబ్బక్క స్మారక తపాలా స్టాంపును శనివారం ఆమె విడుదల చేసి మాట్లాడారు. ప్రధాని మోదీకి దేశ నిర్మాణంలో మహిళల పాత్రపై ఉన్న ఎంతో విశ్వాసం వల్లనే మహిళా బిల్లు వాస్తవ రూపం దాల్చిందని చెప్పారు. 16వ శతాబ్దంలో పోర్చుగీసు వారికి వ్యతిరేకంగా పోరాడిన ఉళ్ళాల రాణి అబ్బక్క ధైర్యం, ధీరత్వం గొప్పదన్నారు. సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా పోరాడిన అనేక మంది గుర్తు తెలియని పోరాటయోధుల సేవలను స్మరించుకునేందుకు కేంద్రం ప్రయత్నాలు చేస్తోందన్నారు. ఆజాదీ కా అమృత మహోత్సవంలో భాగంగా ప్రభుత్వం 14,500 మంది స్వాతంత్ర్య సమరవీరుల కథలతో డిజిటల్ భాండాగారాన్ని రూపొందిస్తోందని చెప్పారు.

## నిరుద్యోగం, అధిక ధరలే కారణం

**పార్లమెంట్ వద్ద అలజడిపై రాహుల్**

**న్యూఢిల్లీ:** ఈ నెల 13వ తేదీన పార్లమెంట్ వద్ద చోటుచేసుకున్న 'పొగ' అలజడికి దేశంలో తీవ్రమైన నిరుద్యోగం, పెరుగుతున్న ధరలే కారణమని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఉద్యోగాలు లభించని యువతే లోక్‌సభలో అలజడి సృష్టించిందని చెప్పారు. యువతలో ఎంతో కాలంగా పెరుగుతూ వస్తున్న ఆగ్రహం ఫలితంగానే ఈ ఘటన చోటు చేసుకుందన్నారు. 'దేశంలో అత్యంత తీవ్రమైన అంశం నిరుద్యోగం. దేశమంతటా ఈ సమస్యతో యువత రగులుతోంది. మోదీ జీ విధానాల ఫలితంగానే యువతకు ఉద్యోగాలు దొరకడం లేదు'అని ఆయన మీడియాతో అన్నారు. పార్లమెంట్ వద్ద జరిగిన ఘటనకు భద్రతా వైఫల్యమనే కారణమనే విషయం స్పష్టంగానే తెలుస్తోంది. కానీ, దేశం ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య నిరుద్యోగమే దీనికి కారణం 'అని అనంతరం ఆయన 'ఎక్స్'లో తెలిపారు.

## కువైట్ పాలకుడు కన్నుమూత



**దుబాయ్:** కువైట్ పాలకుడు అమీర్ షేక్ నవాఫ్ అల్ అహ్మద్ అల్ సబాహ్(86)శనివారం కన్నుమూశారు. ఈ విషయాన్ని ఒక మంత్రి వెల్లడించారు. ఆయన మరణానికి గల కారణాలను మాత్రం పేర్కొనలేదు. ఉప పాలకుడిగా వ్యవహరిస్తున్న ఆయన సవతి సోదరుడు షేక్ మెషల్ అల్ అహ్మద్ అల్ జబేర్(83)తదుపరి పాలనా పగ్గాలు చేపడతారని తెలుస్తోంది. జబేర్‌కు ప్రపంచంలోనే అత్యంత వృద్ధుడైన యువరాజుగా పేరుంది. నవంబర్‌లో షేక్ నవాఫ్ గుర్తు తెలియని కారణాలతో అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చేరారు. ఆ తర్వాత ఆయన ఆరోగ్య పరిస్థితికి సంబంధించి ఎటువంటి వార్తలు బయటకు రాలేదు.

## ఆన్‌లైన్ డిగ్రీ కోర్సులతో జాగ్రత్త: యూజీసీ

**న్యూఢిల్లీ:** విదేశీ యూనివర్సిటీల సహకారంతో కాలేజీలు, ఎడ్‌టెక్ కంపెనీలు అందించే డిగ్రీలకు తమ గుర్తింపు లేదని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) స్పష్టం చేసింది. ఇటువంటి డిగ్రీలకు ఏమాత్రం విలువ లేదని, ఆయా కోర్సుల్లో చేరవద్దని విద్యార్థులను హెచ్చరించింది. విదేశీ వర్సిటీలు, విద్యా సంస్థలతో కొన్ని ఉన్నత విద్యా సంస్థలు, కాలేజీలు పొందే అనుబంధ గుర్తింపు, ఒప్పందాలను తాము అనుమతించడం లేదని యూజీసీ సెక్రటరీ మనీశ్ జోషి చెప్పారు. ఆయా సంస్థలు ఇచ్చే డిగ్రీలు, డిప్లొమాలకు ఎటువంటి విలువా ఉండదని వివరించారు.

## బందీలపై కాల్పులు!

- ఇజ్రాయెల్ సైన్యం అత్యుత్సాహం
- ముగ్గురు బందీల దుర్మరణం

**రఫా(గాజా స్ట్రిప్):** కదనరంగంలో తమను దీటుగా ఎదిరించే సత్తా హమాస్ సాయుధులకు లేదని అతివిశ్వాసంతో ఉన్న ఇజ్రాయెల్ సేనలు జరిపిన విచక్షణారహిత కాల్పుల్లో ముగ్గురు అమాయక బందీలు బలైపోయారు. హమాస్ మిలిటెంట్లుగా భావించి వారిని హతమార్చామని ఇజ్రాయెల్ సైన్యం తర్వాత తీరిగ్గా చెప్పింది. ఉత్తరగాజాలోని షెజాయా పట్టణంలో హమాస్ మిలిటెంట్లుగా భావించి వారిపై కాల్పులు జరిపామని ఇజ్రాయెల్ సైన్యం(ఐడీఎఫ్) అధికార ప్రతినిధి రియర్ అడ్మిరల్ డేనియల్ చెప్పారు. దాడి వివరాలను మరో ఉన్నతాధికారి వెల్లడించారు. ' ఇజ్రాయెల్ దాడికి భయపడి ఈ ముగ్గురినీ బంధించిన హమాస్ మిలిటెంట్లు అక్కడి నుంచి పారిపోయారు. దీంతో ఈ ముగ్గురు బందీలు చొక్కాలు విప్పేసి తెల్ల జెండాలు ఊపుతూ భవనం బయటకు వచ్చారు. అయినా సరే సైన్యం వీరిపైకి తుపాకీ గుళ్ల వర్షం కురిపించింది. దీంతో ఇద్దరు మరణించారు. మూడో వ్యక్తి ప్రాణభయంతో మళ్లీ భవంతిలో పలికి ఏడుస్తూ పరుగెత్తాడు. అయినాసరే సైన్యం కాల్పులు జరపడంతో అతనూ మరణించాడు'' అని సైన్యాధికారి ఒకరు వెల్లడించారు. ఈ కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన వారిని ఇజ్రాయెల్‌కు చెందిన యోటమ్ హైమ్(28), సమీర్ తలాల్కా(22), అలోన్ షామ్‌రిజ్(26)గా గుర్తించారు. ఈ ఘటనపై దీనిపై ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

---

# చిన్న నగరాలే కీలకం

- ప్రధానమంత్రి నరేంద్రమోదీ వెల్లడి
- వికసిత్ భారత్ సంకల్ప్ లబ్ధిదారులతో మాట్లాడిన ప్రధాని

**న్యూఢిల్లీ:** భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలన్న తన దీక్ష సాకారానికి దేశంలోని చిన్న నగరాలు అభివృద్ధి చెందడం కీలకమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. వికసిత్ భారత్ సంకల్ప్ లబ్ధిదారులనుద్దేశించి శనివారం ఆయన వర్చువల్‌గా మాట్లాడారు. వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర ప్రారంభమైన నెల రోజుల్లోనే దేశంలోని వేలాది గ్రామాలు, నగరాలకు చేరిందని, ఇందులో చిన్న నగరాలే ఎక్కువగా ఉన్నాయని ఆయన చెప్పారు. 'పేదలు, రైతులు, చిన్న వ్యాపారులు, ఇంకా సమాజంలోని వివిధ వర్గాలకు చెందిన వారికి మా ప్రభుత్వం సాయంగా నిలుస్తోంది. అందరి నుండి ఆశ ఎక్కడ ముగుస్తుందో అక్కడి నుంచే మోదీ గ్యారెంటీ మొదలవుతుంది'అని ప్రధాని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరి కష్టాలను దూరం చేసేందుకు తమ ప్రభుత్వం కుటుంబ సభ్యుడి మాదిరిగా ప్రయత్నాలు సాగిస్తోందని చెప్పారు. 'దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత చాలా కాలం వరకు అభివృద్ధి పెద్ద నగరాలకు మాత్రమే పరిమితంగా మారింది. మా ప్రభుత్వం చిన్న నగరాల అభివృద్ధిపై దృష్టి పెట్టింది. అభివృద్ధి చెందిన భారత్ బలమైన పునాదులను వేసింది'అని అన్నారు. 'ఈ యాత్రను జెండా ఊపి మోదీ ప్రారంభించినప్పటికీ నిజానికి ప్రజలే ముందుండి నడిపారు. మధ్యమధ్యలో అంతరాయం కలిగిన చోట్ల, ప్రజలే చొరవ తీసుకుని ఇతర నగరాలు, పల్లెలకు యాత్రను కొనసాగించారు'అని చెప్పారు. మన దేశ మహిళలు స్వావలంబన సాధించడమే కాకుండా, ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారన్నారు. ఇటువంటి అంకితభావం, కష్టించే తత్వం ఉన్న వారి కోసం తమ ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని చెప్పారు. ఈ సందర్భంగా ప్రధాని వివిధ ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో ముచ్చటించారు. దేశవ్యాప్తంగా ఉన్న వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర లబ్ధిదారులు వేలాదిగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాలుపంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ఇటీవల అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, మిజోరం రాష్ట్రాల్లో సాగే వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలను జెండా ఊపి ప్రారంభించారు. మిగతా రాష్ట్రాల్లో నవంబర్ 15వ తేదీనే యాత్రలు మొదలుకాగా, ఎన్నికల నియమావళి అడ్డు రావడంతో ఈ అయిదు రాష్ట్రాల్లో యాత్ర ఆలస్యమైంది. ప్రభుత్వ పథకాలను అర్హులైన లబ్ధిదారులందరికీ నిర్దేశిత గడువులోగా పూర్తి స్థాయిలో అందించడమే వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర లక్ష్యం.



శనివారం ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో సమావేశానికి ముందు మోదీ, హాయితమ్‌ల కరచాలనం

# సరికొత్త మలుపు

- ప్రధాని మోదీతో ఒమన్ సుల్తాన్ భేటీ
- దార్శనిక పత్రంపై ఇరు నేతల అంగీకారం

**న్యూఢిల్లీ:** భారత్-ఒమన్‌ల మధ్య వ్యూహాత్మక సంబంధాల్లో మరో ముందడుగు పడింది. సుమారు 10 కీలక రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని పెంచుకునేందుకు రూపొందించిన దార్శనిక పత్రంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఒమన్ సుల్తాన్ హాయితమ్ బిన్ తారిఖ్ ఏకాభిప్రాయానికి వచ్చారు. రెండు దేశాల సంబంధాల్లో ఇది సరికొత్త మలుపు కానుందని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. త్వరలోనే రెండు దేశాల మధ్య కుదిరే సమగ్ర వాణిజ్య భాగస్వామ్య ఒప్పందం(సీఈపీఏ)కి ఇది దోహదపడుతుందని భావిస్తున్నారు. మొట్టమొదటి సారిగా భారత్‌లో పర్యటిస్తున్న ఒమన్ సుల్తాన్ హాయితమ్ బిన్ తారిఖ్ శుక్రవారం ఢిల్లీ చేరుకున్నారు. శనివారం ఆయన ప్రధాని మోదీని కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇద్దరు నేతలు హమాస్-ఇజ్రాయెల్ మధ్య కొనసాగుతున్న యుద్ధంతో ఉత్పన్నమైన పరిస్థితులపై చర్చలు జరిపారు. పాలస్తీనా సమస్యకు పరిష్కారమైన రెండు దేశాల సిద్ధాంతాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నాలు సాగించాలని వారు అభిప్రాయపడినట్లు విదేశాంగ శాఖ కార్యదర్శి వినయ్ క్వాత్రా చెప్పారు. అదేవిధంగా, ఇద్దరు నేతలు ఒమన్-భారత్ సంయుక్త పెట్టుబడి నిధికి మూడో విడతగా రూ.2,500 కోట్లు సమకూర్చుతామని ప్రకటించారు. ఈ మొత్తాన్ని భారత ఆర్థిక వ్యవస్థలో అత్యంత వేగంగా అభివృద్ధి నమోదు చేసుకున్న రంగాల్లో పెట్టుబడులుగా వినియోగిస్తారు. భారత్‌లోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఒమన్ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ భాగస్వామ్యం కింద ఇప్పటి వరకు రెండు విడతల్లో రూ.2,500 కోట్ల మేర పెట్టుబడులు పెట్టాయి. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఆర్థిక నేరాలపై పోరు, సాంస్కృతిక సంబంధాలతోపాటు ఒమన్‌లోని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ కల్చరల్ రిలేషన్స్ కార్యాలయంలో హిందీ విభాగాన్ని ఏర్పాటు చేయడానికి సంబంధించిన ఒప్పందాలపై రెండు దేశాలు సంతకాలు చేశాయని విదేశాంగ శాఖ తెలిపింది.

---

# ఆత్మాహుతికి ప్లాన్ వేశారు!

**లోక్‌సభలో కరపత్రాలు పంచాలనీ నిందితులు భావించారు**

**చివరికి సభలోకి దూకే ప్లాన్ అమలు: పోలీసులు**

**న్యూఢిల్లీ:** లోక్‌సభలో అలజడి సృష్టించిన నిందితులు తొలుత సులువుగా మంటలంటుకునే జెల్ వంటిది ఒంటి నిండా పూసుకుని తమను తాము తగలబెట్టుకుందామని అనుకున్నారట. పార్లమెంటు లోపలికి చొచ్చుకెళ్లి సభ్యులందరికీ అందేలా కరపత్రాలు విసిరితే ఎలా ఉంటుందని కూడా ఆలోచించారట. ''తమ నిరసనను, తాము ఇవ్వదలచిన సందేశాన్ని వీలైనంత ప్రభావవంతంగా ప్రభుత్వానికి, ప్రజలకు చేర్చేందుకు ఇలాంటి పలు అవకాశాలను పరిశీలించారు. చివరికి లోక్‌సభలోకి దూకి పొగ గొట్టాలు విసిరి అలజడి సృష్టించాలని నిర్ణయించుకుని అమలు చేశారు'' అని నిందితులను విచారిస్తున్న పోలీసు బృందంలోని అధికారి ఒకరు వెల్లడించారు. గత బుధవారం లోక్‌సభ లోపల, బయట పొగ గొట్టాలు విసిరిన కలకలం రేపిన సాగర్ శర్మ, డి.మనోరంజన్, అమోల్ షిండే, నీలం దేవి, సంబంధిత వీడియోలను సోషల్ మీడియాలో వైరల్ చేసిన ప్రధాన నిందితుడు లలిత్ ఝూలను పోలీసు ప్రత్యేక విభాగం తాలూకు కౌంటర్ ఇంటలిజెన్స్ విభాగం విచారిస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా వారు ఆశ్రయం పొందిన, కుట్ర పన్నిన ప్రాంతాలకు శుక్రవారం రాత్రి వారిని తీసుకెళ్లారు. అలాగే నిందితులకు లోక్‌సభ పాస్‌లు సిఫార్సు చేసిన బీజేపీ ఎంపీ ప్రతాప్ సింహా స్టేట్‌మెంట్‌ను కూడా నమోదు చేయాలని భావిస్తున్నారు. లోక్‌సభలో కలకలం జరిగిన తీరుపై పార్లమెంటు అనుమతితో సీన్ రీ కన్‌స్ట్రక్ట్ చేసే ఆలోచన కూడా ఉన్నట్టు సమాచారం. లలిత్‌కు సహకరించిన మహేశ్ కుమావత్, కైలాశ్‌లకు క్లీన్‌చిట్ ఇవ్వలేదని పోలీసులు తెలిపారు. లలిత్‌ను బుధవారం పార్లమెంటు ప్రాంగణం నుంచి పారిపోయి అతను రాజస్థాన్‌లో తలదాచుకున్న నగౌర్‌కు కూడా తీసుకెళ్లనున్నారు. అక్కడ తనతోపాటు సన్నిహితుల సెల్ ఫోన్లను ధ్వంసం చేశానని లలిత్ చెప్పిన ప్రదేశంలో ఆధారాలు సేకరించనున్నారు.

**పార్లమెంటు భద్రతపై సమీక్షకు కమిటీ: స్పీకర్ ఓం బిర్లా**

పార్లమెంటు భద్రతపై తాను కూడా ఒక ఉన్నత స్థాయి కమిటీని నియమించినట్టు లోక్‌సభ స్పీకర్ ప్రకటించారు. ఇలాంటి భద్రతా వైఫల్యాలు పునరావృతం కాకుండా అన్ని అంశాలను సమగ్రంగా సమీక్షించి దాన్ని కట్టుదిట్టం చేసేందుకు అమలు చేయాల్సిన కార్యాచరణ ప్రణాళికను కమిటీ సూచిస్తుందని వెల్లడించారు. ఈ మేరకు లోక్‌సభ సభ్యులకు ఆయన లేఖ రాశారు. దీనిపై కేంద్ర హోం శాఖ నియమించిన విచారణ కమిటీ నివేదికను కూడా సభ ముందుంచుతామని తెలిపారు.

**ఇల్లు వదిలి వెళ్లకండి**

**మైసూరు:** పార్లమెంటులో అలజడి సృష్టించిన కేసులో నిందితుడు మనోరంజన్ కుటుంబ సభ్యులెవరూ ఇంటి నుంచి బయటకు వెళ్లరాదని కేంద్ర నిఘా విభాగం అధికారులు ఆదేశించారు. మైసూరు విజయనగరలోని మనోరంజన్ ఇంటిని నిఘా అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేసి విప్లవ సాహిత్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. మనోరంజన్ కుటుంబ సభ్యులు తమ అనుమతి లేకుండా ఇంటి నుంచి బయటికి వెళ్లవద్దని ఆదేశించారు. అత్యవసర పరిస్థితి వస్తే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. బంధువులు, ఇతరులెవరూ ఆ ఇంటికి వెళ్లరాదని, ఎవరైనా ఫోన్లు చేస్తే సంబంధిత వివరాలను అందజేయాలని సూచించారు.

**మహేశ్‌కు ఏడు రోజుల కస్టడీ**

ఈ కేసులో అరెస్టయిన ఆరో నిందితుడు మహేశ్ కుమావత్‌ను ఢిల్లీ కోర్టు శనివారం ఏడు రోజుల పోలీసు కస్టడీకి అప్పగించింది. అతడు కనీసం రెండేళ్లుగా ఈ కుట్రలో నిందితులకు సహకరిస్తున్నట్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదించారు. దీన్ని పూర్తిగా ఛేదించాలంటే అతన్ని లోతుగా విచారించాల్సి ఉందన్నారు. దాంతో ప్రత్యేక జడ్జి హర్‌దీప్ కౌర్ ఈ మేరకు తీర్పు వెలువరించారు. సాక్ష్యాలను ధ్వంసం చేయడం, నేరపూరిత కుట్ర ఆరోపణలపై మహేశ్‌ను ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. లలిత్‌తో పాటు అతను తనంత తానుగా లొంగిపోవడం తెలిసిందే.

## రతన్ టాటాకు ప్రాణ హాని

- భద్రత పెంచకుంటే మిస్త్రీకి పట్టిన గతే
- ముంబై పోలీసులకు ఫోన్ కాల్
- మనోవైకల్య బాధితుని నిర్వాకం

**ముంబై:** టాటా సన్స్ మాజీ చైర్మన్, దిగ్గజ పారిశ్రామికవేత్త రతన్ టాటాకు ప్రాణ హాని ఉందంటూ వచ్చిన ఫోన్ కాల్ శనివారం ముంబై పోలీసులను ఉరుకులు పరుగులు పెట్టించింది. రతన్ టాటాకు తక్షణం భద్రత పెంచాలని, లేదంటే టాటా సన్స్ మరో మాజీ చైర్మన్, పారిశ్రామికవేత్త సైరస్ మిస్త్రీకి పట్టిన గతే పడుతుందని కాలర్ హెచ్చరించాడు. సైరస్ మిస్త్రీ 2022 సెప్టెంబర్ నాలుగో తేదీన కారు ప్రమాదంలో దుర్మరణం పాలవడం తెలిసిందే. దాంతో పోలీసులు ఆగమేఘాల మీద రతన్ టాటా భద్రతను పెంచారు. కాల్ కర్ణాటక నుంచి వచ్చినట్టు తేల్చారు. కాల్ చేసిన వ్యక్తిని పుణేకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. అయితే, అతను ఐదు రోజులుగా ఆచూకీ లేడంటూ భార్య అప్పటికే స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టిన విషయం పోలీసుల దర్యాప్తు సందర్భంగా వెలుగులోకి వచ్చింది. బంధుమిత్రులను విచారించగా ఇంజనీరింగ్, ఎంబీఏ ఫైనాన్స్ చేసిన అతనికి కొంతకాలంగా మతిస్థిమితం లేదని తేలింది. కర్ణాటకలో వేరొకరి ఇంట్లోంచి ఫోన్ తీసుకుని వారికి చెప్పకుండానే ముంబై కంట్రోల్ రూమ్‌కు ఇతను ఫోన్ చేసి హెచ్చరించినట్లు దర్యాప్తులో తేలింది. మనోవైకల్య బాధితుడు కావడంతో కేసు నమోదు, విచారణ వంటి చర్యలు చేపట్టకూడదని పోలీసులు నిర్ణయించారు.

## అరేబియా సముద్రంలో నౌక హైజాక్!

**వెంబడించి విజయవంతంగా అడ్డుకున్న భారత నేవీ**

**న్యూఢిల్లీ:** మాల్టా దేశానికి చెందిన సరుకు రవాణా నౌక ఒకటి అరేబియా సముద్రంలో హైజాక్‌కు గురైంది. ఈ ఘటన జరిగినపుడు నౌకలో 18 మంది సిబ్బంది ఉన్నారు. హైజాక్ విషయం తెల్సుకున్న భారత నావికాదళాలు వెంటనే స్పందించి ఆ వైపుగా పయనమయ్యాయి. సముద్రపు దొంగలు ఆ నౌకను తమ అధీనంలోకి తీసుకుని నడుపుతుండగా భారత యుద్ధనౌక దానిని విజయవంతంగా అడ్డుకుంది. అక్కడి పరిణామాలను ఎప్పటికప్పుడు నిశితంగా గమనిస్తున్నట్లు భారత నావికాదళం శనివారం తెలిపింది. ప్రస్తుతం నౌక సోమాలియా తీరం వైపుగా వెళ్తోంది. సంబంధిత వివరాలను ఇండియన్ నేవీ వెల్లడించింది. అరేబియా సముద్ర జలాల్లో గురువారం 'ఎంవీ రుయెన్' నౌకను ఆరుగురు సముద్రపు దొంగలు హైజాక్ చేశారు. పైరేట్లు నౌకలోకి చొరబడుతుండగానే నౌకలోని సిబ్బంది ఆ విషయాన్ని బ్రిటన్ సముద్ర రవాణా పోర్టల్‌కు అత్యవసర సందేశం(మేడే)గా తెలియజేశారు. హైజాక్ విషయం తెల్సిన వెంటనే భారత నావికా దళాలు అప్రమత్తమయ్యాయి. అదే ప్రాంతంలో గస్తీ కాస్తున్న భారత గస్తీ విమానం, గల్ఫ్ ఆఫ్ ఆడెన్ వద్ద విధుల్లో ఉన్న భారత నావికాదళ యాంటీ-పైరసీ పెట్రోల్ యుద్ధనౌకలు రంగంలోకి దిగాయి. హైజాక్‌కు గురైన నౌక ఉన్న ప్రాంతాన్ని గుర్తించి అటుగా దూసుకెళ్లి ఆ నౌకను శనివారం ఉదయం విజయవంతంగా అడ్డుకున్నాయి. ' రవాణా నౌకల సురక్షిత ప్రయాణానికి భారత నావికాదళం కట్టుబడి ఉంది. అంతర్జాతీయ భాగస్వాములు, మిత్ర దేశాలకు సాయపడటంతో ఎప్పుడూ ముందుంటుంది' అని భారత నేవీ తర్వాత ఒక ప్రకటనలో పేర్కొంది.

---

# అయోధ్యకు 1,000 రైళ్లు..

**సాక్షి, న్యూఢిల్లీ:** ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో భవ్య రామ మందిరం ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు శరవేగంగా కొనసాగుతున్నాయి. వచ్చే ఏడాది జనవరి 22వ తేదీన ఆలయంలో ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం తర్వాత జనవరి 23వ తేదీ నుంచి భక్తులకు దర్శనభాగ్యం కల్పించనున్నారు. ఈ నేపథ్యంలో దేశ విదేశాల నుంచి లక్షలాది మంది భక్తులు అయోధ్య పట్టణానికి పోటెత్తనున్నారు. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు చెందిన భక్తులు రైలు మార్గంలో అయోధ్యకు చేరేందుకు వీలుగా రైల్వే సర్వీసులను భారీగా పెంచాలని భారతీయ రైల్వే నిర్ణయించింది. రద్దీని దృష్టిలో ఉంచుకుని రామాలయం ప్రారంభం అయిన రోజు నుంచి తొలి 100 రోజుల పాటు అయోధ్యకు వేయికి పైగా రైళ్లను నడిపాలని నిర్ణయించింది. ఈ మేరకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు రైల్వే శాఖ వర్గాలు తాజాగా వెల్లడించాయి.



**19వ తేదీ నుంచే మొదలు!**

మందిర ప్రారంభోత్సవానికి కొన్ని రోజుల ముందు నుంచే ఈ అదనపు రైల్వే సర్వీసులు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. జనవరి 19వ నుంచి ఈ అదనపు రైళ్లను నడపాలని రైల్వే శాఖ అధికారులు భావిస్తున్నారు. 100 రోజుల పాటు ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై, నాగ్‌పూర్, లక్నో, జమ్మూ, పుణె, కోల్‌కతా సహా దేశవ్యాప్తంగా నగరాలు, పట్టణాల నుంచి అయోధ్యకు రైళ్లు నడపనున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. డిమాండ్‌కు అనుగుణంగా ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. వీటితోపాటు కొన్ని రైళ్లను ప్రత్యేకంగా భక్తుల కోసం రిజర్వ్‌చేసి నడపనున్నారు. ప్రతిరోజూ ఈ రైళ్లలో ప్రయాణించే భక్తులకు ఆహారం అందించేందుకు ఐఆర్‌సీటీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేయనుంది. ఈ రైళ్లలో ప్రయాణించాలనుకునే వారికోసం ఈనెల 23 నుంచి రిజర్వేషన్ టికెట్ బుకింగ్‌కు అవకాశం కల్పించనున్నారు. అయితే దీనిపై రైల్వే శాఖ నుంచి ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు. మరోవైపు, భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని అయోధ్యలోని రైల్వేస్టేషన్‌లో ఆధునికీకరణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. రోజుకు 50,000 మంది ప్రయాణికులు వచ్చినా ఎలాంటి ఇబ్బందులు పడకుండా సకల సదుపాయాలు అందుబాటులో ఉండేలా రైల్వేస్టేషన్‌ను నవీకరిస్తున్నారు. జనవరి 15వ తేదీ కల్లా స్టేషన్ పనులు పూర్తి అయ్యే అవకాశం ఉంది. సంక్రాంతి తర్వాత రామ్ లల్లా ప్రతిష్ఠాపన క్రతువు మొదలుపెట్టి దాదాపు పది రోజుల పాటు 'ప్రాణ ప్రతిష్ఠ' కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీని ఆలయ నిర్వహణ సంస్థ ప్రత్యేకంగా ఆహ్వానించడం తెల్సిందే. మోదీతోపాటు 4,000 మంది సాధువులు, వేలాది మంది ప్రముఖులు ఈ ప్రతిష్ఠాత్మకమైన కార్యక్రమంలో పాలుపంచుకోనున్నారు.

## కశ్మీర్‌కు చొరబాట్ల ముప్పు

**సిద్ధంగా 300 మంది ముష్కరులు!**

**శ్రీనగర్:** పాకిస్తాన్ వైపు నుంచి సరిహద్దుల గుండా జమ్మూ కశ్మీర్లోకి చొరబడేందుకు కనీసం 250 నుంచి 300 మంది దాకా ఉగ్ర ముష్కరులు నక్కి ఉన్నట్టు బీఎస్‌ఎఫ్ శనివారం తెలిపింది. ఈ మేరకు నిఘా వర్గాల నుంచి పక్కా సమాచరముందని బీఎస్‌ఎఫ్ ఐజీ అశోక్ యాదవ్ తెలిపారు. అయితే భద్రతా దళాలు అప్రమత్తంగా ఉన్నాయని, వారి ఎత్తులను తిప్పికొడతాయని పేర్కొన్నారు. ఈ విషయంలో సైన్యంతో కలిసి సమన్వయంతో సాగుతున్నామని విలేకరులకు వివరించారు. కొన్నేళ్లుగా జమ్మూ కశ్మీర్ వాసులతో భద్రతా దళాలకు అనుబంధం, సమన్వయం పెరుగుతోందని ఆయన తెలిపారు. వారి సహకారంతో స్థానికంగా అభివృద్ధి కార్యకలాపాలను మరింతగా ముందుకు తీసుకెళ్తామన్నారు.

## మధ్యప్రదేశ్ పీసీసీ చీఫ్‌గా జితూ పట్వారీ

**కమల్ నాథ్‌కు ఉద్వాసన**

**న్యూఢిల్లీ:** మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఘోర పరాజయం నేపథ్యంలో పీసీసీ చీఫ్ కమల్ నాథ్‌కు అధిష్ఠానం ఉద్వాసన పలికింది. ఆయన స్థానంలో జితూ పట్వారీకి బాధ్యతలు అప్పగిస్తూ పార్టీ చీఫ్ ఖర్గే శనివారం ఆదేశాలిచ్చారు. ఈ నియామకం వెంటనే అమల్లోకి వస్తుందని అందులో పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 163 సీట్లలో విజయం సాధించగా, కాంగ్రెస్‌కు 66 సీట్లే దక్కిన సంగతి తెలిసిందే.

## ట్రాఫిక్ రూల్స్ పాటించలేదో.. నేరుగా మీ కంపెనీకే నోటీసులు

**టెకీల కోసం బెంగళూరు ట్రాఫిక్ పోలీసుల వినూత్న ప్రయోగం**

**బెంగళూరు:** రోడ్లపై ట్రాఫిక్ సిగ్నళ్లు, స్పీడ్ లిమిట్లను పట్టించుకోకుండా వాహనంపై ముందుకు దూసుకెళ్లే టెకీలకు కళ్లెం వేసేందుకు బెంగళూరు ట్రాఫిక్ పోలీసులు వినూత్న ప్రయోగం చేపట్టారు. దీని ప్రకారం..రహదారి నిబంధనలను బేఖాతరు చేసే టెకీలకు కాకుండా వారు పనిచేసే సంస్థలకు నేరుగా ట్రాఫిక్ పోలీసులు ఇకపై నోటీసులు అందజేస్తారు. అవుటర్ రింగ్ రోడ్, వైట్‌ఫీల్డ్ ప్రాంతంలో ఉన్న ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కారిడార్‌లో ఈ వారంలో ఇది ప్రయోగాత్మకంగా మొదలైంది. ట్రాఫిక్ ఉల్లంఘనల సంఖ్యలో భారీ తగ్గుదల నమోదైనట్లు గుర్తిస్తే ఈ పద్ధతినే మిగతా ప్రాంతాలకు సైతం క్రమేపీ విస్తరిస్తామని బెంగళూరు ట్రాఫిక్ ఉన్నతాధికారులు అంటున్నారు. రహదారి భద్రత, ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంచడమే తమ లక్ష్యమంటున్నారు. ఈస్ట్ డివిజన్ పరిధిలోని ట్రాఫిక్ ఉల్లంఘనుల్లో ఇక్కడి టెక్నాలజీ సంస్థల్లో పనిచేసే వారే అత్యధికులు ఉండటంతో వారినే లక్ష్యంగా చేసుకుని ఈ కార్యక్రమం తీసుకువచ్చామన్నారు.



## ‘అవిశ్రాంత’ సేవకులు

కరీంనగర్ జిల్లాలో విశ్రాంత ఉద్యోగులు 13 వేల మందికి పైగా ఉన్నారు. వృద్ధులకు ఉచిత వైద్య శిబిరాలు, యోగా శిక్షణ వంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

8లో▸



## రాజన్నకు మొక్కులు

వేములవాడ: రాజన్నను శనివారం 15 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ధర్మగుండంలో స్నానాలు చేసి, వందకుపైగా అభిషేకాలు, 2 వేలకుపైగా కోడె మొక్కులు చెల్లించుకున్నారు.

## వాతావరణం

గరిష్టం/కనిష్టం
28.0/17.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు సాధారణంగా ఉంటాయి. చలి తీవ్రత పెరుగుతుంది. రాత్రి చలిగాలులు వీస్తాయి.

# హాస్టళ్లలో గజగజ

- చలికి వణుకుతున్న విద్యార్థులు
- పలుచోట్ల బెడ్లు లేక నేలపై నిద్రిస్తున్న వైనం
- రక్షణ కల్పించని పలుచటి దుప్పట్లు
- బ్లాంకెట్లు, కార్పెట్లు సరిపడా ఇవ్వని ప్రభుత్వం
- నాలుగు నెలలుగా అందని కాస్మెటిక్ చార్జీలు
- జిల్లాలోని 54 వసతిగృహాల్లో పరిస్థితి

‘వసతి గృహాలు చలి గుప్పిట్లో చిక్కుకున్నాయి.. విద్యార్థులు గజగజ వణుకుతున్నారు.. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పడిపోతూ చలితీవ్రత పెరుగుతోంది. దీంతో పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రయితే చాలు.. చాలీచాలని దుప్పట్లను కాళ్లతో తన్నుకుంటూ సరిపుచ్చుకుంటున్నారు. ఇదీ ఏళ్లుగా హాస్టళ్ల విద్యార్థులు ఎదుర్కొంటున్న దుస్థితి. అధికారులు, పాలకులు ఎన్ని సంక్షేమ పలుకులు పలికినా క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు. ప్రస్తుతం మరో మూడు రోజులు చలి పంజా విసురుతుందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు.’



నగునూరు బీసీ హాస్టల్లో నేలపై నిద్రిస్తున్న విద్యార్థులు

కరీంనగర్:

వారం రోజులుగా జిల్లా ప్రజలతోపాటు సంక్షేమ హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులు చలితో వణికిపోతున్నారు. మునుపెన్నడూ లేని విధంగా ఉష్ణోగ్రతలు 20 నుంచి 15 డిగ్రీలకు పడిపోవడంతో చలిగాలులు వీస్తున్నాయి. రాత్రి వేళల్లో ఎన్ని దుప్పట్లు కప్పుకున్నా సరిపోవడం లేదు. చలితీవ్రతకు పెద్దల నుంచి చిన్న పిల్లల వరకు నానాతంటాలు పడుతున్నారు. ప్రభుత్వ వసతిగృహాల్లో ఉండే విద్యార్థులకు సర్కారు సరఫరా చేసిన పలుచటి దుప్పట్లు చలి నుంచి రక్షణ కల్పించడం లేదు.

### 5,071 మంది విద్యార్థులు

కరీంనగర్ జిల్లాలోని 54 వసతిగృహాల్లో 5,071 మంది విద్యార్థినీ విద్యార్థులు వసతి పొందుతున్నారు. కరీంనగర్ నియోజకవర్గంలోని ఎలగందల్, కరీంనగర్ పట్టణంలోని ఇంటిగ్రేటెడ్, రాంనగర్ ఎస్సీ బాలుర, ముకరాంపురలోని బీసీ, నగునూర్ బీసీ, చొప్పదండిలోని ఇంటిగ్రేటెడ్, రామడుగు, వెదిర, గంగాధర, హుజూరాబాద్ నియోజకవర్గంలోని ఎస్సీ, బీసీ, జమ్మికుంట, వీణవంక, హుస్నాబాద్ నియోజకవర్గంలోని సైదాపూర్, చిగురుమామిడి తదితర హాస్టళ్లను శుక్రవారం రాత్రి ‘సాక్షి’ విజిట్ చేసింది. ఈ సందర్భంగా సరిపడా దుప్పట్లు, కార్పెట్లు పంపిణీ చేశారని అధికారులు తెలిపారు. విద్యార్థులు మాత్రం సరిపడా ఇవ్వలేదని, గతేడాది అందించిన పలుచటి దుప్పట్లు, కార్పెట్లు కప్పుకుంటున్నామని అన్నారు. నేలపై నిద్రించాల్సి వస్తుండటంతో చలికి తట్టుకోలేకపోతున్నామని పేర్కొన్నారు. వసతిగృహాలకు చాపలు సరఫరా చేయలేదు. చాలా మంది పిల్లలు తమ ఇళ్ల నుంచి అదనంగా దుప్పట్లు తెచ్చుకున్నారు. కొన్ని హాస్టళ్లలో కిటికీలు సక్రమంగా లేవు.

### సబ్బుల బిల్లులు పెండింగ్

జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్ల పిల్లలకు కాస్మెటిక్ చార్జీలు 4 నెలలుగా అందడం లేదు. సబ్బుల బిల్లులు కొన్నిచోట్ల మూడు నెలలు, మరికొన్ని చోట్ల ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయి. వసతిగృహాల్లో మౌలిక వసతుల్లేవు. చలి తీవ్రతకు చాలామంది ఇళ్లకు వెళ్లేందుకే ఆసక్తి చూపుతున్నారు.

### ఇళ్లకు వెళ్లిన ప్రీమెట్రిక్ విద్యార్థులు..

ప్రీమెట్రిక్ హాస్టళ్ల విద్యార్థులు చలి కారణంగా తమ ఇళ్లకు వెళ్లిపోయారు. ఏటా విద్యాసంవత్సరం ప్రారంభంలోనే ప్లేట్లు, గ్లాసులు, యూనిఫాం, ట్రంకు పెట్టెలు, బెడ్‌షీట్లు అందజేయాలి. కానీ ఆచరణకు నోచుకోవడం లేదు. ఈ సీజన్‌లో ఇంకా దుప్పట్లు, బెడ్‌షీట్లు అందని వసతిగృహాల పిల్లలు ప్రభుత్వం త్వరగా అందించాలని కోరుతున్నారు. ఈ విషయమై బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖల అధికారుల వివరణ కోరగా కొనుగోలులో భాగంగా ప్రభుత్వమే ఖరీదు చేసి, అందిస్తుందని, రెండు దఫాలుగా ఇచ్చిందని తెలిపారు. కొన్ని హాస్టళ్లలో ఇటీవలే పంపిణీ చేశామని, మిగతాచోట్ల త్వరలోనే ఇస్తామని పేర్కొన్నారు.

### బస్టాండ్, కూడళ్లలో..

ఎక్కడినుంచో వలస వచ్చినవారు కొందరైతే.. అందరూ ఉండి, అనాథలుగా మిలిగివారు మరికొందరు.. జిల్లా కేంద్రంలో ఇలాంటివారి కోసం మున్సిపాలిటీ, కార్పొరేషన్ ఆధ్వర్యంలో షెల్టర్ హోమ్స్ ఏర్పాటు చేశారు. కానీ, బాధితులు వాటిలో ఉండకుండా బస్టాండ్‌తోపాటు కూడళ్లలో చలిలోనే వణుకుతూ నిద్రపోవడం కనిపించింది. రాంపూర్‌కు చెందిన కిరణ్ తనకు ఎవరూ లేరని, 20 ఏళ్లుగా పని చేసుకుంటూ బస్టాండ్ వద్ద షట్టర్ల ఎదుట నిద్రిస్తున్నట్లు తెలిపాడు.



హుజూరాబాద్ ఎస్సీ హాస్టల్లో భోజనం కోసం క్యూ



కరీంనగర్ బీసీ హాస్టల్లో..

| శాఖలవారీగా జిల్లాలోని హాస్టళ్లు, విద్యార్థులు | |
|---|---|
| బీసీ సంక్షేమ శాఖలో | |
| 19 (ప్రీమెట్రిక్, పోస్టుమెట్రిక్) | 1,847 |
| ఎస్సీ సంక్షేమ శాఖలో | |
| 31 (ప్రీమెట్రిక్, పోస్టుమెట్రిక్) | 2,618 |
| ఎస్టీ సంక్షేమ శాఖలో | |
| 04 (ప్రీమెట్రిక్, పోస్టుమెట్రిక్) | 606 |
| మొత్తం 54 | 5,071 |

### ఈసారి బ్లాంకెట్లు ఇవ్వలేదు



మాది పరకాల. రెండేళ్లుగా హాస్టల్లో ఉంటూ చదువుకుంటున్న. ప్రతీ ఏడాది చలికాలంలో బ్లాంకెట్లు, స్వెటర్లు ఇచ్చేవారు. ఈసారి ఇంకా ఇవ్వలేదు. వారం రోజుల సంది చలి తీవ్రంగా ఉంది. ఇంటి నుంచి తెచ్చుకున్న చద్దర్లనే కప్పుకుంటున్న.

– ఎ.వివేక్, పదోతరగతి, హుజూరాబాద్ ఎస్సీ హాస్టల్

### పాత దుప్పట్లు కప్పకుంటున్నం



చలికాలం ప్రారంభం కావడంతో మేము చాలా ఇబ్బంది పడుతున్నం. పాత దుప్పట్లు కప్పుకుంటున్నం. మా సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి.

– రాకేశ్, పదోతరగతి, వెదిర ఎస్సీ హాస్టల్

### సవతి తల్లి ప్రేమ తగదు



హాస్టళ్ల విద్యార్థులపై ప్రభుత్వానికి సవతి తల్లి ప్రేమ తగదు. కాస్మెటిక్ చార్జీలను నాలుగు నెలలుగా చెల్లించకపోవడం బాధాకరం. ఏటా ఇవ్వాల్సిన దుప్పట్లు, కార్పెట్లను కొన్నిచోట్ల ఇవ్వలేదు. అధికారులు ఇకనైనా సదుపాయాలు కల్పించాలి.

– మచ్చ రమేశ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

### స్వెట్టర్లు ఇవ్వాలి

జిల్లా కేంద్రంలోని ముకరంపురలో గల బీసీ హాస్టల్‌ను విజిట్ చేయగా తమకు స్వెట్టర్లు, దుప్పట్లు ఇవ్వడం లేదని విద్యార్థులు తెలిపారు. ఎస్సీ హాస్టల్‌లో ఇస్తున్నట్లుగా ఇచ్చేలా చూడాలని ‘సాక్షి’కి విన్నవించారు.



## న్యూస్‌రీల్

### ఆరోపణలపై విచారణ చేపట్టాలి

- సీడీఎంఏను కోరిన నగరపాలక సంస్థ కమిషనర్
- రెండున్నరేళ్ల ఫైల్‌కు కదలిక

సాక్షి ఎఫెక్ట్

కరీంనగర్ కార్పొరేషన్: అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు అధికారులు కమిషనర్లుగా పదోన్నతి పొందిన వ్యవహారంపై ఎట్టకేలకు కదలిక వచ్చింది. రెండున్నరేళ్లుగా కావాలని తొక్కిపెట్టిన ఫైల్‌ను బయటకు తీయాల్సిన పరిస్థితి అనివార్యంగా ఏర్పడింది. ‘ఆరోపణలున్నా అందలం’ పేరిట శనివారం ‘సాక్షి’ ప్రచురించిన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. రెవెన్యూ విభాగంలో జరిగిన అవినీతి, ఇద్దరు అధికారుల చార్జెస్‌ఫ్రేమ్‌పై సమగ్ర విచారణ చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ బి.శ్రీనివాస్ శనివారం సీడీఎంఏను కోరారు. ఆస్తి పన్నును దుర్వినియోగం చేసిన వ్యవహారంపై ఆడిట్ రిపోర్ట్ ఆధారంగా చార్జెస్‌ఫ్రేమ్ చేసినట్లు అందులో పేర్కొన్నారు. ఇందుకు సదరు అధికారులు నగరపాలక సంస్థకు బదులు కూడా ఇచ్చినట్లు తెలిపారు. కాగా, రెండున్నరేళ్ల తర్వాత విచారణ కోరడం కలకలం సృష్టిస్తోంది.

### ఢిల్లీలో గణతంత్ర దినోత్సవ పరేడ్‌కు ఎంపిక




వలంటీర్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రామకృష్ణ, అధ్యాపకులు

కరీంనగర్ సిటీ: ఢిల్లీలో గణతంత్ర దినోత్సవ పరేడ్‌కు కరీంనగర్‌లోని ఎస్సారార్ డిగ్రీ, పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్–4కు చెందిన వలంటీర్, బీఎస్సీ తృతీయ సంవత్సర విద్యార్థిని మారుపాక కీర్తి ఎంపికైంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడ కేఎల్ యూనివర్సిటీలో ఈ ఏడాది నవంబర్ 1 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించిన దక్షిణ భారత ప్రీ రిపబ్లిక్ డే పరేడ్, శిక్షణ కార్యక్రమానికి ఆమె శాతవాహన యూనివర్సిటీ తరఫున హాజరైనట్లు ప్రిన్సిపాల్ రామకృష్ణ తెలిపారు. 200 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో పోటీ పడి, ఢిల్లీలో జరిగే పరేడ్‌కు ఎంపికవడం తమ కళాశాలకు గర్వకారణమని పేర్కొన్నారు. శనివారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కీర్తిని ప్రిన్సిపాల్‌తోపాటు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు సురేశ్‌కుమార్, నాయుడు చంద్రమౌళి, వరప్రసాద్, శారద, టీజీసీజీటీఏ రాష్ట్ర సెక్రటరీ సురేందర్ రెడ్డి, కళాశాల స్టాఫ్ క్లబ్ సెక్రటరీ శ్రీనివాస్, అధ్యాపకులు అభినందించారు.

### వెనకబడిన విద్యార్థులపై దృష్టిసారించాలి

- డీఈవో జనార్దన్‌రావు



మాట్లాడుతున్న డీఈవో జనార్దన్‌రావు

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్‌లోని సుభాష్‌నగర్ ప్రభుత్వ పాఠశాల సైన్స్ వింగ్‌ను శనివారం డీఈవో జనార్దన్‌రావు సందర్శించారు. ఈ సందర్భంగా సైన్స్ ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. చదువులో వెనకబడిన పదోతరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టిసారించి, వారు ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించేలా చూడాలన్నారు. పిల్లల ప్రగతిని ఎప్పటికప్పుడు అంచనా వేయాలని సూచించారు. కలెక్టర్ త్వరలో భౌతిక, రసాయన శాస్త్రాల టీచర్లతో సమావేశం ఏర్పాటు చేయనున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కరీంనగర్ మండల విద్యాధికారి మధుసూదనాచారి, సమగ్ర శిక్ష కో–ఆర్డినేటర్ అశోక్ రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి శ్రీజైపాల్ రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు ఖాజా నజీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

### ‘పిల్లల కోసం’ తనిఖీ

కరీంనగర్ సిటీ: కరీంనగర్‌లోని రాంనగర్, సుభాష్‌నగర్, జ్యోతినగర్ ప్రైమరీ స్కూళ్లలో పిల్లల కోసం కార్యక్రమాన్ని శనివారం జిల్లా నోడల్ అధికారి టి.రాజయ్య, సమన్వయకుడు వాసాల వరప్రసాద్ తనిఖీ చేశారు. చదవడం, రాయడం రాని 3, 4, 5వ తరగతుల పిల్లలకు వలంటీర్లుగా ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థుల స్నేహపూర్వక బోధనను పరిశీలించారు. అనంతరం వారిని అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.రామకృష్ణ, డి.డి.నాయుడు, బి.సురేశ్‌కుమార్, బి.చంద్రమౌళి, బి.శారద, డీఈవో కార్యాలయ సీఎంవో ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ అవినీతిపై పోరాడండి

- వచ్చే నెల కరీంనగర్‌లో ఆత్మీయ సమ్మేళనం
- ఎంపీ బండి సంజయ్
- బీజేపీ పదాధికారులతో సమావేశం



మాట్లాడుతున్న ఎంపీ సంజయ్, హాజరైన పదాధికారులు

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ కార్పొరేషన్ సహా పార్లమెంట్ పరిధిలోని చొప్పదండి, సిరిసిల్ల, వేములవాడ తదితర మున్సిపాలిటీలు, స్థానిక సంస్థల్లో బీఆర్ఎస్ అవినీతి, అక్రమాలపై పోరాడాలని ఎంపీ బండి సంజయ్ పిలుపునిచ్చారు. శనివారం కరీంనగర్‌లోని ఈఎస్ గార్డెన్స్‌లో పార్లమెంటరీ నియోజకవర్గ పదాధికారులతో ఆయన సమావేశమయ్యారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. కరీంనగర్ కార్పొరేషన్‌లో అవినీతికి అంతులేకుండా పోయిందని, శ్మశానవాటికలో యంత్రాల ద్వారా గడ్డి పీకామని చెప్పి, దొంగ బిల్లులు పెట్టి రూ.12 లక్షలు దోచుకున్నారని అన్నారు. బిల్లులో ఓ వాహనం నంబర్ రాస్తే.. దానిపై ఆరా తీయగా అది బైక్ అని తేలిందని తెలిపారు. వాళ్ల అవినీతికి ఇదో మచ్చు తునక అన్నారు. రెండు, మూడు రోజుల్లో కరీంనగర్ కార్పొరేషన్‌లో మేయర్ సహా బీఆర్ఎస్ కార్పొరేటర్ల అవినీతి, అక్రమాలపై పూర్తి వివరాలు తెప్పించుకోవాలని, పోరాటాలతో వారికి ముచ్చెమటలు పట్టించాలని సూచించారు.

### కొండగట్టుకు నిధులేమయ్యాయి?

కొండగట్టు ఆలయానికి ఇస్తానన్న నిధులేమయ్యాయో తేల్చేవరకు పోరాడాలని ఎంపీ సంజయ్ అన్నారు. ఈ విషయంలో కేసీఆర్, కవిత క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేయాలన్నారు. ప్రజలను దోచుకుతిన్న బీఆర్ఎస్‌ను పూర్తిగా తరిమికొట్టాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ కొత్తగా అధికారంలోకి వచ్చిందని, హామీలు అమలు చేయడానికి కొంత సమయం ఇద్దామని చెప్పారు. బెజ్జంకిని కరీంనగర్‌లో కలపాలన్నది ప్రజల డిమాండ్ అని, దీనికోసం బీజేపీ కార్యకర్తలంతా రోడ్డెక్కాలని కోరారు.

### కలిసికట్టుగా ముందుకుసాగాలి

అంతర్గత విభేదాలను పక్కనపెట్టి, కలిసికట్టుగా ముందుకుసాగాలని ఎంపీ అన్నారు. ప్రతీ కార్యకర్త ఓటరు నమోదు కార్యక్రమంలో పాల్గొని, ఇంటింటికీ తిరిగి కొత్త ఓటర్లను చేర్పించాలని సూచించారు. వచ్చే నెల తొలి వారంలో పార్లమెంట్ నియోజకవర్గ స్థాయిలో కార్యకర్తలతో కరీంనగర్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తామని పేర్కొన్నారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.

### కేంద్ర పథకాలను వివరించేందుకే ‘వికసిత్ భారత్’



కరీంనగర్‌టౌన్: ఈ నెల16 నుంచి 26 జనవరి 2024 వరకు చేపట్టనున్న వికసిత్ భారత్ సంకల్ప యాత్ర అవగాహన ప్రచార వాహనాలను ప్రధాని మోదీ శనివారం సాయంత్రం వర్చువల్‌గా ప్రారంభించారు. కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఎంపీ సంజయ్, కలెక్టర్ పమేలా సత్పతి, ఇతర అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రధాని ప్రసంగాన్ని ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా వీక్షించారు. ఎంపీ మాట్లాడుతూ.. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశంగా తయారు కావాలన్న లక్ష్యంతో ప్రధాని ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను దేశంలోని ప్రతీ మారుమూల గ్రామాలకు చేర్చేలా యాత్ర ఉంటుందన్నారు. పథకాల లబ్ధిదారులను కలుస్తామన్నారు. డీఆర్డీవో శ్రీలత, ఎల్‌డీఎం ఆంజనేయులు, ఎస్బీయం కిషన్ స్వామి, డీఎంహెచ్‌వో లలితాదేవి, ఎన్వైకే కో–ఆర్డినేటర్ రాంబాబు, ఎస్‌ఐవో శివరాములు, డీడబ్ల్యూవో సరస్వతి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# సత్ప్రవర్తన, సమయపాలన పాటించాలి

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ వెంకటేశ్



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్

కరీంనగర్‌కల్చరల్: కరీంనగర్‌లోని ప్రభుత్వ మహిళా కళాశాల ఆవరణలో గల ప్రభుత్వ షెడ్యూల్డ్ కులాల బాలికల వసతి గృహం–2లో చట్టాలపై విద్యార్థులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్ మాట్లాడుతూ.. విద్యార్థులకు రాజ్యాంగం కల్పిస్తున్న హక్కులు, విధులు, ర్యాగింగ్ నిరోధక చట్టం, మోటారు వాహనాల చట్టం తదితరాలపై అవగాహన కల్పించారు. విద్యార్థినులు ఎటువంటి చట్టపరమైన సమస్యలు ఎదుర్కోకూడదని, విద్యార్థి దశ నుంచి సత్ప్రవర్తన, సమయపాలన పాటిస్తూ కష్టపడి చదివి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ఎలాంటి న్యాయపరమైన సహాయాన్ని అందించడానికైనా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిద్ధంగా ఉంటుందని పేర్కొన్నారు. వసతి గృహాన్ని సందర్శించి, సౌకర్యాలపై ఆరా తీశారు. సమస్యలుంటే తమను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మహేశ్, హాస్టల్ వార్డెన్ లచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.


## యశోద మెడికల్ సెంటర్

యశోద హాస్పిటల్స్

3-1-397/ఎ, హెచ్.డి.ఎఫ్.సి బ్యాంక్ ప్రక్కన, అంబేడ్కర్ రోడ్, కరీంనగర్

సూపర్ స్పెషాలిటీ వైద్యనిపుణులు మీ చేరువలో

| ప్రత్యేకతలు | వైద్యులు | తేది |
|---|---|---|
| హీమాటో అంకాలజీ వ్యాధులు : ప్లేట్‌లెట్స్ సంఖ్య తగ్గడం / పెరగడం, బ్లడ్ క్యాన్సర్, లుకేమియా, లింఫోమా, మైలోమా, రక్తహీనత, అన్ని రకాల రక్త సంబంధిత వ్యాధులు, బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ | డా॥ మాధవ్ దంతాల | 19-12-2023 3వ మంగళవారం ఉదయం10 గం॥ నుండి మధ్యాహ్నం 4 గం॥ వరకు |
| జాయింట్ రీప్లేస్‌మెంట్ : రోబోటిక్ జాయింట్ రీప్లేస్మెంట్ పద్ధతి ద్వారా భుజం మరియు మోకాళ్ళ మార్పిడి, భుజం మరియు మోకాళ్ళకు కీ హోల్ సర్జరీ, మోకాళ్ళ లిగ్మెంట్ గాయాలు, భుజం గూడు తప్పుట & కండరం చిరుగు, మృదులాస్థి (కార్టిలేజ్) సర్జరీ, స్పైనల్ చికిత్స వ్యాధులు | డా॥ సునీల్ దాచేపల్లి | |
| రక్తనాళాలకు వ్యాధులు : రక్తప్రసరణ ఆగిపోవుట, పాదములు నల్ల బడుట, రక్తనాళములు చిట్లి పోవుట, కాళ్ళ నరాలు ఉబ్బడం, రక్తనాళాల పునరుద్ధరణ | డా॥ డి. ప్రభాకర్ | |
| ఊపిరితిత్తుల వ్యాధుల కన్సల్టేషన్: దీర్ఘకాలిక దగ్గు, శ్వాసలో గురక, శ్వాస తీసుకోవటంలో కష్టం, టిబి (క్షయ), ఊపిరితిత్తులలో ఇన్ఫెక్షన్, ఆస్తమా ఊపిరితిత్తుల క్యాన్సర్ | డా॥ విశ్వేశ్వరన్ బి. | 20-12-2023 3వ బుధవారం ఉదయం10 గం॥ నుండి మధ్యాహ్నం 4 గం॥ వరకు |
| కండరాలు, కీళ్ళ నొప్పుల వ్యాధులు : కండరాల నొప్పులు, కీళ్ళవాపులు, ఆటోఇమ్యూన్, అస్థిరకముల ఎముకల వ్యాధులు | డా॥ బి. రాజేంద్ర వరప్రసాద్ | 21-12-2023 3వ గురువారం ఉదయం10 గం॥ నుండి సాయంత్రం 4 గం॥ వరకు |
| కిడ్నీ వ్యాధులు : మూత్రపిండాలలో రాళ్ళు, మంట, మూత్ర విసర్జనలో సమస్యలు, అధిక రక్తపోటు, షుగర్ వ్యాధిగ్రస్తులలో మూత్రపిండాల సమస్యలు | డా॥ దిలీప్ యం. బాబు | |
| గ్యాస్ట్రో వ్యాధులు : దీర్ఘకాలిక జీర్ణకోశ సంబంధిత సమస్యలు, కాలేయ సమస్యలు - కామెర్లు, లివర్ గడ్డలు, పిత్తాశయం, పిత్తనాళంలో రాళ్ళు, క్లోమ గ్రంథి - రాళ్ళు పాంక్రియాస్ క్యాన్సర్, పేగుపూత, రెక్టమ్ క్యాన్సర్ | డా॥ మూడే జయంత్ | 22-12-2023 4వ శుక్రవారం ఉదయం 10 గం॥ నుండి మధ్యాహ్నం 4 గం॥ వరకు |
| ఆర్థోపెడిక్ / కీళ్ళమార్పిడి కన్సల్టేషన్: మోకాళ్ళు, తుంటి, మోచేయి, కీళ్ళ మార్పిడి, మరియు ఎముకల సంబంధిత వ్యాధులు | డా॥ మహమ్మద్ ఏజాజ్ ఉద్దీన్ | |
| అంకాలజి వ్యాధులు: అతిగా బరువు తగ్గడం, కడుపు నొప్పి, రొమ్ములో గడ్డలు, కడుపులో గడ్డలు, అధిక రుతుస్రావం, నోటిలో పుండ్లు, మాట మార్పు రావడం, మానని పుండ్లు లేదా గాయాలు, శరీరంలో ఎక్కడైనా గడ్డలు, దీర్ఘకాలిక దగ్గు | డా॥ వెంకట్ బిందు కొల్లి | |
| మణికట్టు, చేతి & పునర్నిర్మాణ కన్సల్టేషన్: పుట్టుకతో వచ్చే చేతి వైపరీత్యాలు, రీప్లాంటేషన్ శస్త్రచికిత్స, పిల్లలు మరియు పెద్దలలో మెడ నుండి భుజము మీదుగా చేయికి పోవు నాడుల శస్త్రచికిత్సలు, చేతి పగుళ్ళు, వేలు వైకల్యాలు | డా॥ మనీష్ కుమార్ జైన్ | 23-12-2023 4వ శనివారం ఉదయం 10 గం॥ నుండి మధ్యాహ్నం 3 గం॥ వరకు |
| గ్యాస్ట్రో వ్యాధులు : ప్యాంక్రియాస్, లివర్, జీర్ణకోశ, ఊబకాయం, అబ్డామినల్ క్యాన్సర్ మరియు పేగులకు సంబంధించిన వ్యాధులు | డా॥ డి. విశ్వనాథ్ రెడ్డి | 24-12-2023 4వ ఆదివారం ఉదయం 10 గం॥ నుండి మధ్యాహ్నం 3 గం॥ వరకు |

అపాయింట్‌మెంట్ కొరకు: 915 424 6125


# విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠాలు బోధించాలి

- కలెక్టర్ పమేలా సత్పతి
- చింతకుంట హైస్కూల్ తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కొత్తపల్లి(కరీంనగర్): విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠ్యాంశాలు బోధించాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కొత్తపల్లి మండలంలోని చింతకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులతో మాట్లాడారు. ఉదయం అల్పాహారంతోపాటు మధ్యాహ్న భోజనంలో పప్పు వంటి బలవర్ధకమైన ఆహారం అందించాలని హెచ్ఎంకు సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజన మెనూ వివరాలు తెలుసుకున్నారు. తొమ్మిదో తరగతి విద్యార్థుల సిలబస్‌పై ఆరా తీశారు. పిల్లలకు సైన్స్ సబ్జెక్టులో కొన్ని ప్రశ్నలు వేసి, సమాధానం చెప్పలేని వారికి అర్థమయ్యేలా వివరించారు. డీఈవో జనార్దన్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### పవర్ కట్ ప్రాంతాలు

కొత్తపల్లి(కరీంనగర్): విద్యుత్ మరమ్మతు చేపడుతున్నందున ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు 11 కేవీ విద్యానగర్ ఫీడర్ పరిధిలోని విజయదుర్గ కాలనీ, విద్యానగర్, ఆర్టీసీ వర్క్‌షాపు వెనక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–2 ఏడీఈ ఎం.సుధీర్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే, 33/11 కేవీ భగత్‌నగర్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ నిర్వహణ పనుల కారణంగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు భగత్‌నగర్, ముకరంపుర, విఘ్నేశ్వరకాలనీ, ఎన్‌జీవోస్ కాలనీ, ఎర్రగుట్టపల్లి, కట్టరాంపూర్, అంబేడ్కర్ స్టేడియం, కలెక్టర్ కాంప్లెక్స్, బస్టాండ్, వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్, ఎల్ఐసీ ఆఫీస్, తిరుమల్‌నగర్, గణేశ్‌నగర్, హనుమాన్‌నగర్, దోబీవాడ, కమాన్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

## క్లుప్తంగా

### రిజర్వేషన్లు పారదర్శకంగా అమలు చేయాలి

- భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షుడు దొబ్బల స్వామి


మాట్లాడుతున్న నాయకులు

కోనరావుపేట(వేములవాడ): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ ప్రక్రియ పారదర్శకంగా అమలు చేయాలని భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షుడు దొబ్బల ప్రవీణ్ కోరారు. కోనరావుపేటలో శనివారం మాట్లాడుతూ గతంలో చాలా గ్రామాల్లో రిజర్వేషన్ల ప్రక్రియ సజావుగా లేక ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అన్యాయం జరిగిందన్నారు. ఆయా సామాజికవర్గాల్లో చదువుకున్న యువకులకు నిరాశే మిగిలిందన్నారు. రిజర్వేషన్ అమలు చేయడంలో ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు గురికాకుండా న్యాయబద్ధంగా జనాభా ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు మానం సుమన్, ఎరవెల్లి విజయ్, సందీప్, సురేశ్, ప్రశాంత్, శ్రీనివాస్, బాబు తదితరులు పాల్గొన్నారు.

### ఉరివేసుకొని వివాహిత ఆత్మహత్య


లావుడ్య శీల మృతదేహం

రుద్రంగి(వేములవాడ): రుద్రంగి మండలం అడ్డబోర్‌తండాకు చెందిన వివాహిత లావుడ్య శీల(30) మానసికస్థితి సరిగా లేక శుక్రవారం రాత్రి ఇంట్లోనే ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. భర్త లావుడ్య మోహన్ ఉదయం లేచి చూసే సమయానికి బెడ్‌రూమ్‌లోని ఫ్యాన్‌కు ఉరివేసుకొని విగతజీవిగా కనిపించింది. వెంటనే రుద్రంగి పోలీసులకు మోహన్ సమాచారం ఇవ్వగా ఎస్సై రాజేశ్, హెడ్‌కానిస్టేబుల్ బాపురెడ్డి పంచనామా చేసి, పోస్టుమార్టం కోసం సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. భర్త మోహన్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### 22 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం


రేషన్ బియ్యం పరిశీలిస్తున్న అధికారులు

గోదావరిఖని:స్థానిక అశోక్‌నగర్ ఏరియాలో రేషన్ బియ్యం నిల్వ ఉంచారన్న సమాచారం మేరకు శనివారం ఆకస్మిక దాడిచేసి పట్టుకున్నట్లు అధికారులు తెలిపారు. 22 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నామని, ఇంటి యాజమానిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అలాగే వాల శ్రీనివాసరావుకు చెందిన రేషన్‌షాప్ తనిఖీ చేయగా అదనంగా 14క్వింటాళ్ల బియ్యం ఉన్నట్లు గుర్తించి షాపుపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. దాడిలో జిల్లా సివిల్ సప్లయి అధికారి ప్రేమ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ శంకర్, పోలీసులు పాల్గొన్నారు.

# అ'విశ్రాంత' సేవకులు

- 1984లో పెన్షనర్స్ అసోసియేషన్ ఏర్పాటు
- జిల్లాలో 13 వేల మందికి పైగా సభ్యులు
- వృద్ధులకు వైద్య శిబిరాలు, యోగా శిక్షణ తరగతులు
- నేడు పెన్షనర్స్ డే

కరీంనగర్: ప్రభుత్వ ఉద్యోగులుగా సుదీర్ఘకాలం సేవలందించి, ఉద్యోగ విరమణ పొందారు. ఇంటికే పరిమితమై టీవీ చూస్తూ కాలక్షేపం చేయాల్సిన వయసులో సమాజహితం కోసం తాము సైతం అంటున్నారు. సేవే పరమావధిగా సంఘం ఏర్పాటు చేసుకొని, తమ హక్కుల కోసమే పోరాడుతూ వృద్ధులకు మూడు నెలలకోసారి ఉచిత వైద్యశిబిరాలు, యోగా శిక్షణ తరగతులు, మొక్కలు నాటడం, పెన్షనర్ల సమస్యలను పరిష్కరించడం, చలివేంద్రాల ఏర్పాటు, నెలవారీ బులెటిన్ పత్రికను వెలువరించడం వంటి సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. నేడు పెన్షనర్స్ డే సందర్భంగా అలాంటి వారిపై అందిస్తున్న కథనం.

**నకారా కేసులో చారిత్రక తీర్పు**

1982 డిసెంబర్ 17 రిటైర్డ్ ఉద్యోగులందరికీ ఆత్మగౌరవ దినం. నకారా కేసులో సుప్రీంకోర్టు చారిత్రక తీర్పు ఇచ్చింది. రిటైర్డ్ ఉద్యోగులు అంతిమ శ్వాస వరకు ప్రభుత్వ ఉద్యోగులుగానే గుర్తించబడతారని, వారికి ఇచ్చే పెన్షన్ దయ, భిక్ష కాదని, దాదాపు మూడు దశాబ్దాల సేవలకు ప్రతిఫలమని చెప్పింది. కరీంనగర్ జిల్లాలో 13 వేల మందికి పైగా రిటైర్డ్ ఉద్యోగులు ఉన్నారు. వీరిలో కొందరు 1984లో పెన్షనర్స్ సంఘం ఏర్పాటు చేయగా మిగతావారు సభ్యులుగా చేరారు. 1995లో రూ.7 లక్షలతో జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్‌లో పెన్షనర్స్ భవన్ నిర్మించారు. దాని కేంద్రంగా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ భావితరానికి ఆదర్శంగా నిలుస్తున్నారు.


ప్రశాంత్‌నగర్ కాలనీలోని పెన్షనర్స్ భవన్

**గ్రంథాలయం, ఆటలకు గదులు**

పెన్షనర్స్ భవన్‌లో ఒక గదిలో గ్రంథాలయం, హాల్‌లో టీవీతోపాటు క్యారమ్స్, చెస్ ఆడుకునేందుకు గదులు, అందుబాటులో దినపత్రికలు ఉన్నాయి. ప్రతీరోజు ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పెన్షనర్లు కబుర్లు చెప్పుకుంటూ దినపత్రికలను తిరిగేస్తున్నారు. రూ.2 లక్షల విలువైన పుస్తకాలు గ్రంథాలయంలో ఏర్పాటు చేశారు. పెన్షనర్లు చేపడుతున్న కార్యక్రమాలు, ప్రభుత్వం అందించే సహాయసహకారాలు, హక్కులపై సమతమార్గ్ పేరిట నెలవారీ బులెటిన్ ప్రచురిస్తున్నారు. అలాగే, సంఘం సభ్యుల కుటుంబసభ్యులు చనిపోతే అంత్యక్రియలకు హాజరవుతున్నారు.

**నేడు పెన్షనర్ల దంపతులకు సన్మానం**

డిసెంబర్ 17ను పెన్షనర్ల ఆత్మగౌరవ దినంగా భావిస్తూ ఏటా ఏదో ఒక సామాజిక కార్యక్రమం చేపట్టడం ఆనవాయితీగా కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం 75 ఏళ్లు నిండిన పెన్షనర్ల దంపతులను సన్మానించనున్నారు. జిల్లాలోని 16 మండలాల్లో సంఘానికి సొంత భవనాలు నిర్మించుకున్నారు. వీరిని చూసి నేటి యువత చాలా నేర్చుకోవచ్చని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**సమస్యల పరిష్కారానికి కృషి**



విశ్రాంత జీవనాన్ని ప్రశాంతంగా గడిపేందుకు పెన్షనర్స్ భవన్‌లో యోగా, సాహిత్యం క్లాసులు నిర్వహిస్తున్నాం. పింఛన్‌దారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాం. ఏటా డిసెంబర్ 17న పెన్షనర్స్ డేను ఘనంగా నిర్వహిస్తున్నాం.

– మోసం అంజయ్య, రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

**ఆనందంగా ఉంది**



ఉద్యోగ విరమణ అనంతరం అందరం ఒక చోట కలిసి కూర్చోవడం, బాధలను పంచుకోవడం, సామాజిక సేవలో భాగస్వాములవడం ఆనందంగా ఉంది. ఒంటరి వారం కాము అన్న సంకేతాన్ని పింఛన్‌దారులకు ఇస్తున్నాం.

– దామెర మహేందర్‌రెడ్డి, అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి

**బస్ చార్జీలో రాయితీ ఇవ్వాలి**



మహారాష్ట్ర, కర్ణాటక ప్రభుత్వాల మాదిరిగా రిటైర్డ్ ఉద్యోగులకు బస్ చార్జీలో 50 శాతం రాయితీ ఇవ్వాలి. మెడికల్ రీయింబర్స్‌మెంట్ సౌకర్యం కల్పించాలి. 65 ఏళ్లు నిండిన పెన్షనర్లకు పంజాబ్ రాష్ట్రంలోలాగా అదనపు పెన్షన్ జమ చేయాలి.

– తాళ్లపల్లి అంజయ్యగౌడ్, రిటైర్డ్ ఉద్యోగి

# సారూ.. ఉద్యోగం ఇప్పించండి

- కాంగ్రెస్ ప్రభుత్వానికి హోంగార్డు పద్మ విన్నపం


పద్మ

గోదావరిఖని: సమస్యలు పరిష్కరించాలని గొంతెత్తినందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం తనను విధుల నుంచి తొలగించిందని, జీవనోపాధి లేకుండా రోడ్డున పడేసిందని ఓ హోంగార్డు ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ పోషణ భారమై.. దిక్కుతోచని స్థితిలో ఉన్న తనకు మళ్లీ ఉద్యోగం ఇప్పించాలని అధికారులను వేడుకుంటున్నారు. కార్యాలయాల చుట్టూ అనేకమార్లు ప్రదక్షిణలు చేసినా, నాయకులు, అధికారులకు వినతిపత్రాలు అందించినా న్యాయం జరగడం లేదని వాపోయారు. ఈమేరకు శనివారం సీఎం నిర్వహించే ప్రజాదర్బార్‌కు వెళ్లారు. అక్కడ తన గోడు వెళ్లబోసుకున్నారు.

**ఉద్యోగ భద్రత కోసం ఆందోళన..**

సమస్యలు పరిష్కరించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలనే డిమాండ్‌తో 2016లో హోంగార్డులు ధర్నా చేశారు. గోదావరిఖనికి చెందిన హోంగార్డు మామిడి పద్మ ఆందోళనల్లో పాల్గొని బీఆర్‌ఎస్ ప్రభుత్వ తీరును విమర్శించారు. పర్యవసనంగా ఆమె తన ఉద్యోగం కోల్పోవాల్సి వచ్చింది. దీంతో ఆమెకు తన ముగ్గురు పిల్లల పోషణ ఇబ్బందిగా మారింది. భర్త వదిలేయడంతో ఏ పనిచేసుకోవాలో తెలియక, తన ఉద్యోగం తిరిగి ఇప్పించాలని సీపీ, డీజీపీ, హోంమంత్రిని వేడుకున్నారు. హోంగార్డు పద్మ 2009లో వేములవాడలో తొలిపోస్టింగ్, రెండేళ్లు పనిచేసిన తర్వాత కరీంనగర్, గోదావరిఖనికి ట్రాన్స్‌ఫర్ అయ్యారు. జీతాలు పెంచి ప్రతినెలా చెల్లించాలనే డిమాండ్‌తో ఏడేళ్ల క్రితం వేర్వేరు జిల్లాల నుంచి వచ్చి గాంధీ ఆస్పత్రి వద్ద హోంగార్డులు ధర్నా చేశారు. ఇందులో పాల్గొన్నందుకు పద్మ తన ఉద్యోగాన్ని కోల్పోవాల్సి వచ్చింది. అంతేకాకుండా ఈమెపై అనేక కేసులు బనాయించడంతో కోర్టుల చుట్టూ తిరగాల్సి వచ్చింది. ఈరోజు తన గోడును కాంగ్రెస్ ప్రభుత్వమైనా పట్టించుకుంటుందనే ఉద్దేశంతో ప్రజాదర్బార్‌కు హాజరయ్యారు. సీఎం రేవంత్‌రెడ్డి తన సమస్య పరిష్కరించి ఉద్యోగం ఇప్పించాలని ఆమె వేడుకున్నారు.

# ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేయించిన వారిపై కేసు

జగిత్యాలక్రైం: జగిత్యాలరూరల్ మండలం నర్సింగాపూర్ శివారు సర్వేనంబరు 437లోని ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకునేలా ప్రోత్సహించిన ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు. ప్రభుత్వ భూమిలో నెలరోజులుగా సుమారు 800 మంది వివిధ జిల్లాల్లోని గ్రామాల నుంచి ప్రజలను మభ్యపెట్టి తీసుకొచ్చి ఇళ్ల స్థలాలు ఇప్పిస్తామని చెప్పి అక్రమంగా గుడిసెలు వేయించిన సీపీఎం ఎన్జీవో నాయకుడు గర్వందుల రమేశ్, సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎల్లెల బాలకృష్ణ, సీఐటీయూ నాయకురాలు ఇందూరు సులోచన, సీపీఎం నాయకులు కుంచెపు శంకర్, సీపీఐ జిల్లా కార్యదర్శి యాళ్ల అరుణ్, సీపీఎం జిల్లా కార్యదర్శి గుగ్లోతు తిరుపతినాయక్, కడకుంట్ల నాగరాజుపై రూరల్ తహసీల్దార్ రాంమోహన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నర్సింగాపూర్ గ్రామ రెవెన్యూ శివారులో 437లో ఉన్న ప్రభుత్వ భూమిని గతంలో వివిధ శాఖలకు కేటాయించారు. అందులో ఇటీవల కొంతమంది అక్రమంగా ప్రవేశించి ప్రభుత్వ అనుమతులకు విరుద్ధంగా తాత్కాలికంగా గుడిసెలు నిర్మించేందుకు వీరు ప్రోత్సహించినందుకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

# మిడ్‌మానేరు కుడి కాల్వలో పడిన కారు

- డోర్ తీసుకొని, బయటపడిన వ్యక్తి

గన్నేరువరం: ఓ కారు ప్రమాదవశాత్తు మిడ్ మానేరు కుడికాల్వలో పడింది. దాన్ని నడిపిన వ్యక్తి డోర్ తీసుకొని, ప్రాణాలతో బయటపడ్డాడు. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. గన్నేరువరం మండలంలోని గునుకులకొండాపూర్‌కు చెందిన సిందే చందర్ శుక్రవారం పనిమీద సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని దాచారం గ్రామానికి వెళ్లాడు. అనంతరం వీరాపూర్ మీదుగా గన్నేరువరం మండలంలోని చీమలకుంటపల్లె వెళ్లి, రాత్రి తిరిగి స్వగ్రామం వస్తున్నాడు. గునుకులకొండాపూర్– చీమలకుంటపల్లె మధ్యలోని మిడ్ మానేరు ప్రాజెక్టు కుడి కాల్వ వద్ద జేసీబీని తప్పించబోయి అదుపుతప్పి, విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. అనంతరం కాల్వలోకి జారుతున్న క్రమంలో చందర్ చాకచక్యంగా డోర్ తీసుకొని, బయటపడ్డాడు. కారు కాల్వలో మునిగిపోయింది. ఈ ఘటనలో స్తంభం విరిగిపోయింది. విద్యుత్ సరఫరా లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. చందర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, జేసీబీ సహాయంతో శనివారం కారును బయటకు తీశారు.


వరద కాల్వ మునిగిన కారు

# అరుణాచలం తీర్థయాత్రకు ఆర్టీసీ ఆఫర్

- వేములవాడ నుంచి అరుణాచలం ట్రిప్
- రూ.4,500 చార్జీలతో మూడు రోజుల ప్యాకేజీ
- వేములవాడ డీఎం మురళీకృష్ణ

సిరిసిల్లటౌన్: తమిళనాడులోని అరుణాచలం క్షేత్రంలో డిసెంబర్ 26న గిరి ప్రదక్షిణకు ఆర్టీసీ బంపర్ ఆఫర్ ప్రకటించింది. వేములవాడ డిపో నుంచి అరుణాచలం తీర్థయాత్రకు సూపర్‌లగ్జరీ బస్సును నడుపుతున్నట్లు డిపో మేనేజర్ మురళీకృష్ణ శనివారం తెలిపారు. ఈనెల 24వ తేదీ రాత్రి 8 గంటలకు బయలుదేరి కరీంనగర్ మీదుగా, ఆంధ్రప్రదేశ్‌లోని కాణిపాకం, వెల్లూరు క్షేత్రాలను సందర్శిస్తూ 25వ తేదీ రాత్రి 8 గంటలకు అరుణాచలం చేరుకుంటుందని తెలిపారు. తిరుగుప్రయాణం 27వ తేదీ సాయంత్రం 5గంటలకు ప్రారంభమై 28న జోగులాంబ క్షేత్రం చేరుకుంటుందని అదే రోజు సాయంత్రం రాత్రి వరకు వేములవాడకు చేరుకుంటుందని తెలిపారు. పెద్దలకు ఒక్కొక్కరికి రూ.4,500, పిల్లలకు రూ.3,400 టిక్కెట్ ధర ఉంటుందన్నారు. వివరాలకు 73828 51826లో సంప్రదించాలని కోరారు.

### చికిత్స పొందుతూ బాలుడి మృతి

సిరిసిల్లక్రైం: ప్రమాదవశాత్తు ఉడికిన పప్పులో పడి గాయపడిన ఆరేళ్ల బాలుడు చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందాడు. సిరిసిల్ల ఎస్సై శ్రీనివాస్‌రావు తెలిపిన వివరాలు. ఎల్లారెడ్డిపేట మండలం గుండారం గ్రామానికి చెందిన రజిత సిరిసిల్లలోని జ్యోతిరావుపూలే బాలికల వసతిగృహంలో వంట మనిషిగా పనిచేస్తుంది. రోజువారీగా వంట చేయడానికి వచ్చే సమయంలో గత నెల 11న ఆమె ఆరేళ్ల కుమారుడు వర్షిత్ వెంట వచ్చాడు. ప్రమాదవశాత్తు ఉడికిన పప్పులో పడ్డాడు. తీవ్రంగా గాయపడ్డ బాలుడిని చికిత్స కోసం సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ వర్షిత్ వరంగల్‌లో శుక్రవారం రాత్రి మృతి చెందాడు. వంటల కాంట్రాక్టర్ రవిపై మృతుడి తండ్రి సురేష్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# 'వాగేశ్వరి'లో ముగిసిన వర్క్‌షాప్

తిమ్మాపూర్(మానకొండూర్): మండలంలోని రామకృష్ణకాలనీ వాగేశ్వరి ఇంజినీరింగ్ కళాశాలలో మూడు రోజులుగా టాస్క్, ఫ్రంట్ ఎండ్ టెక్నాలజీస్ ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ సీఎస్ఈ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన వర్క్‌షాప్ శనివారం ముగిసింది. కళాశాల చైర్మన్ జి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. వర్క్‌షాప్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు. టాస్క్ ట్రైనర్ సిరిచందన మాట్లాడుతూ.. ఫ్రంట్ ఎండ్ టెక్నాలజీస్‌ను వాడుకొని, వెబ్‌సైట్ రూపొందించాలన్నారు. భవిష్యత్‌లో వెబ్ డిజైనర్లుగా స్థిరపడేందుకు ఇది ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థులు తమ అకాడమిక్స్‌తోపాటు ఇలాంటి వర్క్‌షాప్స్‌లో పాల్గొనడం ద్వారా కొత్త టెక్నాలజీపై అవగాహన పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ చంద్రమౌళి, అధ్యాపకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ట్రైనర్ సిరిచందన

### విద్యుత్‌షాక్‌తో రైతు..


మల్లేశం (ఫైల్)

జగిత్యాలక్రైం: జగిత్యాలరూరల్ మండలం గుట్రాజ్‌పల్లికి చెందిన రైతు జుర్రు మల్లేశం (55) శనివారం విద్యుత్‌షాక్‌తో మృతిచెందాడు. మల్లేశం శనివారం తన వ్యవసాయ పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లగా మోటార్ నుంచి వచ్చే విద్యుత్ వైర్లు తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబసభ్యులు అతడిని కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య స్వప్న, నలుగురు కూతుళ్లు ఉన్నారు. నిత్యం అందరితో కలిసిమెలిసి ఉండే మల్లేశం విద్యుత్‌షాక్‌తో మృతిచెందడం, ఆయనకు నలుగురు కూతుళ్లు ఉండడంతో గ్రామస్తులు శోకసంద్రంలో మునిగిపోయారు.

# నాలుగు ఇళ్లలో చోరీ

- నాలుగు తులాల బంగారం, రెండు కిలోల వెండి అపహరణ


వివరాలు సేకరిస్తున్న క్లూస్ టీం

మల్లాపూర్: మండల కేంద్రంలో శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు నాలుగిళ్లల్లో చోరీకి పాల్పడ్డారు. నాలుగుతులాల బంగారం, రెండు కిలోల వెండిని దొంగిలించారు. బాధితులు, మెట్‌పల్లి సీఐ లక్ష్మీనారాయణ, ఎస్సై నవీన్‌కుమార్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బురం అరవింద్, మాతే విమల, రమ్యశ్రీ, చింతకుంట రేవతి ఇళ్లకు తాళం వేసి వెళ్లారు. గుర్తు తెలియని దుండగులు వారి ఇళ్లలో చోరబడ్డారు. బాధిత కుటుంబాలు ఉదయం వచ్చి చూసే సరికి వస్తువులు, బట్టలు చిందరవందరగా పడి ఉన్నాయి. ఆభరణాలు, వెండి వస్తువులు కనిపించకపోవడంతో దొంగతనం జరిగిందని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ, ఎస్సై పోలీస్ సిబ్బందితో క్లూస్‌టీంతో వచ్చి విచారణ చేపట్టారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేయనున్నట్లు సీఐ తెలిపారు.

### ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి..

మల్యాల: ఆర్థిక ఇబ్బందులతో ఈనెల 3న క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మల్యాల మండలం ముత్యంపేటకు చెందిన ఒల్లాల నవీన్ గౌడ్ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడికి భార్య దివ్య, ఇద్దరు కూతుళ్లు నైనిక, వశిష్ఠ ఉన్నారు. సర్పంచ్ బద్దం తిరుపతిరెడ్డి, గౌడ సంఘ నాయకులు, స్థానికులు మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు.

# ఔట్ సోర్సింగ్ పోస్టుల మెరిట్ జాబితా

సిరిసిల్ల: జిల్లా పౌర సంబంధాల అధికారి ఆఫీస్‌లో ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని భర్తీ చేసే మెరిట్ జాబితాను వెల్లడించినట్లు డీపీఆర్వో మామిండ్ల దశరథం శనివారం ప్రకటించారు. వచ్చిన దరఖాస్తుల్లో అర్హులైన అభ్యర్థుల మెరిట్ జాబితాలో ఏపీఆర్వోకు ఐదుగురు, పబ్లిసిటీ అసిస్టెంట్(ఫొటోగ్రాఫర్) ముగ్గురు అర్హత సాధించారని వివరించారు. మరో పబ్లి సిటీ అసిస్టెంట్(వీడియోగ్రాఫర్)కు రెండు దరఖాస్తులు రాగా.. విద్య అర్హతలు లేవని దశరథం తెలిపారు. ఒక ఆఫీస్ సబార్డినేట్ పోస్టుకు సంబంధించి ఎంపానల్డ్ ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ నుంచి అభ్యర్థిని ఇవ్వవలసిందిగా సూచించినట్లు తెలిపారు. జాబితాపై అభ్యంతరాలు ఉంటే 18వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా డీపీఆర్వో ఆఫీస్‌లో తెలియజేయాలని కోరారు. కలెక్టర్ ఇంటర్వ్యూలు నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తారని తెలిపారు.

### బైక్‌ను ఢీకొన్న కారు

- వ్యక్తికి తీవ్ర గాయాలు

మానకొండూర్: మండల కేంద్రంలోని కరీంనగర్–వరంగల్ ప్రధాన రహదారిపై బైక్‌ను కారు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. మానకొండూర్ మండలంలోని గంగిపల్లికి చెందిన ముల్కల సుధాకర్ పని నిమిత్తం శనివారం తన బైక్‌పై కరీంనగర్ వెళ్తున్నాడు. మండల కేంద్రంలోని వాటర్ ట్యాంక్ సమీపంలో వెనక నుంచి అతివేగంగా వచ్చిన గుర్తు తెలియని కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సుధాకర్ తీవ్రంగా గాయపడ్డాడు. అతని పరిస్థితి విషమంగా ఉండటంతో స్థానికులు హుటాహుటిన కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు.

# దైవ దర్శనానికి వెళ్తూ.. మృత్యు ఒడికి

- కారును లారీ ఢీకొని బావ, బావమరిది దుర్మరణం
- మరొకరికి తీవ్ర గాయాలు
- శంకరపట్నం మండలం తాడికల్ శివారులో ఘటన

శంకరపట్నం(మానకొండూర్): దైవ దర్శనానికి వెళ్తూ రోడ్డు ప్రమాదంలో బావ, బావమరిది మృత్యు ఒడికి చేరారు. ఈ ఘటనలో మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని టేకుమట్ల మండలం పెద్దపల్లి గ్రామానికి చెందిన బొల్లకొండ ఆకాశ్(22), ఏంపేడు గ్రామానికి చెందిన మాడగోడి శ్రావణ్(30) బావ, బావమరిది. ఈ ఇద్దరు, ఆకాశ్ స్నేహితుడు రాకేశ్ శుక్రవారం అర్ధరాత్రి దాటాక కారులో వేములవాడ రాజరాజేశ్వరస్వామి దర్శనానికి బయలుదేరారు. శంకరపట్నం మండలంలోని తాడికల్ శివారులోకి రాగానే ఎదురుగా కరీంనగర్ నుంచి వరంగల్ వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆకాశ్, శ్రావణ్ అక్కడికక్కడే మృతిచెందారు. రాకేశ్‌కు తీవ్ర గాయాలవడంతో స్థానికులు 108 వాహనంలో కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. హుజూరాబాద్ రూరల్ సీఐ సంతోష్‌కుమార్, ఎస్సై లక్ష్మారెడ్డి ఘటనాస్థలికి చేరుకొని, పరిశీలించారు. ఆకాశ్ తండ్రి రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.


శ్రావణ్ (ఫైల్)


ఆకాశ్ (ఫైల్)

# జీఎస్టీ నకిలీ బిల్లుల్లో ఉద్యోగి పాత్ర?

- మెయిల్ ఐడీ, ఫోన్‌నంబర్లు మార్చిన ఉద్యోగి
- హైదరాబాద్‌లో విచారణకు హాజరు

జగిత్యాలక్రైం: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన జీఎస్టీ నకిలీ బిల్లుల వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతోంది. ఇందులో ఇంటిదొంగనే సూత్రధారి అని విచారణలో వెల్లడైంది. జగిత్యాల రూరల్ మండలం కండ్లపల్లి గ్రామానికి చెందిన చంద సాయి వాణిజ్య పన్నుల శాఖలో పనిచేస్తున్న ఓ ఉద్యోగితో చేతులు కలిపి ప్రభుత్వానికి సుమారు రూ.283 కోట్ల జీఎస్టీ ఎగవేతకు పథకం పన్నారు. జగిత్యాల వాణిజ్య పన్నుల శాఖలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి సాయితో చేతులు కలిపి జీఎస్టీ నంబరు ఉన్న వారి మెయిల్‌ఐడీ మార్పుతోపాటు, వారి ఫోన్ నంబర్లు మార్చి ఈ వ్యవహారం నడిపినట్లు వెల్లడైంది. దీంతో వాణిజ్య పన్నుల శాఖ అధికారులు గురువారం విచారణకు వస్తున్నారని తెలిసి సదరు ఉద్యోగి సెలవులో వెళ్లినట్లు గుర్తించారు. శుక్రవారం హైదరాబాద్‌లో సాయిని విచారించగా సదరు ఉద్యోగి పేరు వెల్లడించారని, ఆయనను శనివారం హైదరాబాద్‌కు పిలిపించి పూర్తిస్థాయిలో విచారణ చేపడుతున్నారని తెల్సింది. వ్యవహారం వెనుక ఎంత మంది ఉన్నారు..? అనే కోణంతోపాటు.. ఎంత మేర అవినీతి జరిగిందనే కోణంలో వాణిజ్య పన్నుల శాఖ అధికారులు లోతైన విచారణ చేపడుతున్నారు. పలు సాక్ష్యాధారాలు సేకరిస్తున్నారు.

# నేడు 'ఆది'కి స్వాగత యాత్ర

- కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణాధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్

సిరిసిల్లటౌన్: ప్రభుత్వ విప్‌గా నియమితులైన డీసీసీ అధ్యక్షుడు, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు ఘన స్వాగతం పలుకుతూ.. పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తామని కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్ తెలిపారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆదివారం ఉదయం 10.30 గంటలకు మానేరు బ్రిడ్జి వద్ద ఆది శ్రీనివాస్‌కు ఘన స్వాగతం పలికి, అక్కడే కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహానికి పూలమాల వేస్తారన్నారు. తదుపరి కార్యకర్తలతో గాంధీ, అంబేడ్కర్‌చౌక్‌ల వరకు బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కాంగ్రెస్ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొంటారన్నారు. నాగుల సత్యనారాయణ, సంగీతం శ్రీనివాస్, గడ్డం నర్సయ్య, వైద్య శివప్రసాద్, సూర దేవరాజు, స్వర్గం ప్రసాద్ ఉన్నారు.

# ఆవిర్భావ వేడుకలకు ఏర్పాట్లు

గోదావరిఖని: సింగరేణి ఆవిర్భావ ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని ఆర్జీ–2 జీఎం ఎల్వీ సూర్యనారాయణ సూచించారు. శనివారం జీఎంకార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈనెల 23న అబ్దుల్ కలాం స్టేడియంలో ఆవిర్భావ వేడుకలు నిర్వహిస్తామన్నారు. సింగరేణి ఘనకీర్తి తెలియజేసేలా గనుల నమూనాలు, రెస్క్యూ, వైద్య, అటవీ, పర్యావరణం, సింగరేణి సేవా సమితి స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఎంపికచేసిన ఉత్తమ ఉద్యోగ సన్మాన గ్రహీతలు, వారి కుటుంబ సభ్యులకు సముచిత స్థానాలు ఏర్పాటు చేయాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టాలని చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం అబ్దుల్ సలీం, ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఏరియా ఇంజినీర్ నరసింహరావు, డీజీఎం(సివిల్) ధనుంజయ, డీజీఎం(పర్సనల్) రాజేంద్రప్రసాద్, సీనియర్ సెక్యూరిటీ అధికారి షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సూర్యనారాయణ

# ఆరోగ్య పరిరక్షణపై దృష్టి

- ఎన్టీపీసీ సీజీఎం కేదార్ రంజన్ పాండు

జ్యోతినగర్(రామగుండం): ఉద్యోగుల, వారి కుటుంబాల ఆరోగ్య పరిరక్షణకు ఎన్టీపీసీ కృషి చేస్తుందని ప్రాజెక్టు చీఫ్ జనరల్ మేనేజర్ కేదార్ రంజన్ పాండు అన్నారు. శనివారం పర్మినెంట్ టౌన్‌షిప్‌లోని ధన్వంతరి ఆస్పత్రిలో అపోలో రీచ్ ఆస్పత్రి సహకారంతో రెండు రోజుల పాటు జరిగే టీఎంటీ మెడికల్ క్యాంపు, కాకతీయ ఆడిటోరియంలో కార్డియాలజీ, డయాబెటీస్ ఓపెన్ ఫోరం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సంస్థ విద్యుత్ ఉత్పత్తితో పాటు ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని అపోలో హాస్పిటల్ జూబ్లీహిల్స్‌కు చెందిన కార్డియాలజిస్ట్, డయాబెటాలజిస్టుతో నిర్వహించిన ఓపెన్ ఫోరంలో మధుమేహం, గుండెపోటు నివారణపై పలు అంశాలను వివరించారు. అధికారులు లహరి, దేశాయ్, ఉద్యోగ గుర్తింపు సంఘం ప్రధానకార్యదర్శి బండారి కనకయ్య, అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సీజీఎం కేదార్ రంజన్ పాండు

సాక్షి క్లాసిఫైడ్స్

**REAL ESTATE**
**LAND FOR SALE**

■ 3 ఎకరాల వ్యవసాయ భూమి అమ్మకానికి కలదు. Near వంగపల్లి క్రాస్ రోడ్, Village: లక్ష్మీపూర్, పరకాల – హుజూరాబాద్ హైవే, మం: కమలాపూర్, జిల్లా: హనుమకొండ. సంప్ర॥ 8121374317. [K- 1185692]

**SERVICES**
బిల్డింగ్ కిరాయికి ఇవ్వబడును

■ కరీంనగర్ పట్టణంలో సర్కస్ గ్రౌండ్ వెనుకాల G+1 బిల్డింగ్ కమర్షియల్‌కు ఆఫీసులకు, హాస్టల్స్‌కు అద్దెకు ఇవ్వబడును. (డా॥ డి.సి. తిరుపతి రావు వెనుకాల) సంప్ర: సెల్: 9490808202. [K- 1185746]

**BUSINESS OFFER**

■ ద్వారకా ఎంటర్‌ప్రైజెస్: పేపర్ ప్లేట్స్ & LED మెషీన్స్‌పై ప్రతినెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం, ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు ఒప్పందం. 9310515624, 8800496710 [H-42904]

**WANTED**

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్ టైమ్‌గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. సంప్ర॥ 9177736926. [M-1167554]

■ హరేకృష్ణహోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ: 18K. ఫోన్: 9640258899 / 9640468899. [H-793662]

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో లేడికేర్‌టేకర్స్, లేడినర్సులు, కాంపౌండర్స్, ఆయాలు భార్యాభర్తలు కావలెను. ఫోన్: 9391036931, 9246585901. [HA-12583]

■ రామకృష్ణ గ్రూప్ (T.S.No-1) Hyd శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులకు/ పేషెంట్ల సేవక, వంట/ఇంటిపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో+వ+జీతం 15-21వేలు, ఏజెంట్లకు 5వేలు కమీషన్. తెలంగాణ అంతటా వర్కర్లను మీ ఇంటికి పంపగలము. Ph: 9515119570/ 9515108830 [H-793524]

■ పనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర॥ 9391912949, 040-40123376. [H-788229]

**గమనిక**
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933
9951602824

www.sakshi.com

## క్లుప్తంగా

### ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి సమావేశాల్లో మణికంఠరెడ్డి

కరీంనగర్‌కల్చరల్: అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) జాతీయ సమితి సమావేశాలు శనివారం నుంచి రెండు రోజుల పాటు ముంబైలోని భూపేష్ గుప్త భవన్‌లో జరగనున్నాయి. ఈ సమావేశాలకు కరీంనగర్‌కు చెందిన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సమావేశాల్లో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలపై, ఏఐఎస్ఎఫ్ భవిష్యత్ విద్యార్థి ఉద్యమంపై చర్చించడం జరిగిందన్నారు. బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యావిధానం 2020 పూర్తిగా విద్యావిధానాన్ని నిర్వీర్యం చేసేవిధంగా, విద్య కాషాయీకరణ చేసేలా ఉందని, తెలంగాణ విభజన హామీ చట్టం ప్రకారం తెలంగాణకి విద్యాసంస్థలను కేటాయించకుండా బీజేపీ ప్రభుత్వం తెలంగాణ పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తోందన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలని, నూతన జాతీయ విద్యావిధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్, వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జనవరి 12న చలో పార్లమెంట్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

### ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న నాయకులు

విద్యానగర్(కరీంనగర్): ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరిస్తూ తగిన ఆర్థిక సాయమందించాలని కరీంనగర్ ఆటో కార్మిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు మద్దెల రాజేందర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం కరీంనగర్ ప్రెస్ భవన్‌లో మాట్లాడుతూ.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఉపాధి కోల్పోవాల్సి వస్తోందని, వారికి ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో ఆటో డ్రైవర్లు నష్టపోతున్నందున ఆర్థికంగా సాయమందించాలన్నారు. ఆటోలపై వసూలు చేస్తున్న అన్ని పన్నులను రద్దు చేయాలని కోరారు. ప్రతి ఆటో డ్రైవర్ కుటుంబానికి నెలకు తగిన జీవనభృతి ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి బండారి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా విజయ్ దివస్



బహుమతి అందించిన ప్రిన్సిపాల్ శ్రీనివాస్

కరీంనగర్‌కల్చరల్: జిల్లా కేంద్రంలోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాలలో శనివారం విజయ్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ సీహెచ్.శ్రీనివాస్ మాట్లాడుతూ.. 1971లో జరిగిన యుద్ధంలో పాకిస్తాన్‌పై మన దేశం సాధించిన విజయాన్ని స్మరించుకుంటూ ఏటా డిసెంబర్ 16న విజయ్ దివస్ పేరిట వేడుకలు జరుపుకుంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన పోటీలు నిర్వహించిన ఆంగ్ల అధ్యాపకుడు సాగర్‌ను అభినందించారు. అనంతరం విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జి.శ్రీనివాస్, ఏవో శ్రవణ్‌కుమార్, ఏసీవోటీ సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వానికి, ప్రజలకు వారధి మీడియా

- జమాతే ఇస్లామీ హింద్ రాష్ట్ర అధ్యక్షుడు ఖలీద్ ముభాషిర్ జాఫర్




మాట్లాడుతున్న ముభాషిర్ జాఫర్

కరీంనగర్ కల్చరల్: ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా.. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా పని చేస్తాయని జమాతే ఇస్లామీ హింద్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఖలీద్ ముభాషిర్ జాఫర్ అన్నారు. శనివారం కరీంనగర్‌లోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ప్రజాభిప్రాయాన్ని రూపొందించడంలో మీడియా పాత్ర అనే అంశంపై మాట్లాడారు. మీడియా ప్రజాస్వామ్య సౌధానికి నాలుగో స్తంభం అని, సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ప్రభుత్వం విధానపరమైన మార్పులు, చేర్పులు చేసుకునేందుకు మీడియా తోడ్పడుతుందని పేర్కొన్నారు. జిల్లా అధ్యక్ష, మాజీ అధ్యక్షులు మహమ్మద్ షోయబ్ అహ్మదాఖాన్, మహమ్మద్ ఖైరొద్దీన్, నాయకులు మహమ్మద్ అజీజ్, మహమ్మద్ మోయిజ్ హమీద్, మహమ్మద్ ఉమర్ అహ్మద్ ఖాన్ తదితరులున్నారు.



### చక్రాల కుర్చీలకు బాధ్యులెవరు?

కరీంనగర్ ఎంపీడీవో కార్యాలయంలో భద్రపరిచిన చక్రాల కుర్చీలకు బాధ్యత వహించడంలో అధికారులు మీనమేషాలను లెక్కిస్తున్నారు. గత నెల 30న జరిగిన అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ రోజు వృద్ధులు, దివ్యాంగుల కోసం ఉపయోగించిన చక్రాల కుర్చీలను సిబ్బంది ఎంపీడీవో కార్యాలయానికి తరలించారు. అయితే కుర్చీలను సంరక్షించే బాధ్యత అధికారులకు తలనొప్పిగా మారింది. త్వరలో లోక్‌సభ, సర్పంచ్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అందుబాటులో ఉండేలా గ్రామ పంచాయతీలకు అప్పగించేందుకు తగిన చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజాప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.

– కరీంనగర్‌రూరల్

### రోడ్డుపై చెట్టు కొమ్మ



కరీంనగర్‌కార్పొరేషన్: నగరంలోని 59వ డివిజన్ పరిధి జ్యోతినగర్‌లో రోడ్డుకు అడ్డుగా విరిగిపడిన చెట్టు కొమ్మ ప్రమాదకరంగా మారింది. రెండు రోజుల క్రితం ఈ చెట్టు కొమ్మ విరిగి పడిపోగా.. ఇప్పటివరకు తొలగించకపోవడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. హనుమాన్ దేవాలయం ప్రాంతం నుంచి రాధానిలయం వైపు వెళ్లే మెయిన్ రోడ్డు కావడంతో రాత్రి ప్రయాణికులు ప్రమాదానికి గురయ్యే అవకాశముందని, వెంటనే ఈ కొమ్మను తొలగించాలని నగరపాలక సంస్థ అధికారులను వారు కోరుతున్నారు.

### నేదునూర్ పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం



మాట్లాడుతున్న హెచ్ఎం లక్ష్మణ్‌రావు

తిమ్మాపూర్: మండలంలోని నేదునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో విద్యార్థుల హాజరు, బేసిక్స్(చదవడం, రాయడం, చతుర్విధ ప్రక్రియలు), విద్యార్థుల ప్రగతి గురించి చర్చించారు. విద్యార్థులు ఆంగ్లంలో మాట్లాడేలా ప్రోత్సహించాలని, మధ్యాహ్న భోజనం నాణ్యతతో, శుభ్రంగా వండాలని తల్లిదండ్రులు సూచించారు. సమావేశంలో నేదునూరు, లక్ష్మీదేవిపల్లి, వచ్చునూరు, గొల్లపల్లి గ్రామాల విద్యార్థుల తల్లిదండ్రులు, హెచ్ఎం లక్ష్మణ్‌రావు, ఉపాధ్యాయులు ఘనీ, అనీస్, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

# భారత్ సంకల్ప యాత్ర షురూ

- కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన
- గ్రామాల్లో 23 వరకు ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా ప్రచారం




కరీంనగర్‌రూరల్: వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ద్వారా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశాల మేరకు శనివారం నుంచి ఈనెల 23 వరకు కరీంనగర్ మండలంలోని 17 గ్రామాల్లో విస్తృత ప్రచారం చేపట్టేందుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్ ఉన్న వ్యాన్‌ను నిర్ణీత తేదీ, సమయంలో ఆయా గ్రామాల్లోని ప్రధాన చౌరస్తాలో నిలిపి ఉంచుతారు. వివిధ పథకాలను డాక్యుమెంటరీ రూపంలో ప్రదర్శించి అవగాహన కల్పిస్తారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు మండల స్థాయిలో ఎంపీడీవో, ఎంపీవో, ఎంఏవో, పీఆర్ ఏఈ, ఐకేపీ ఏపీఎంలు, గ్రామస్థాయిలో కో–ఆర్డినేటర్లుగా పంచాయతీ కార్యదర్శులు, క్లస్టర్ అధికారులుగా ఏఈవోలు, సంబంధిత బ్యాంకర్లను నియమించారు. శనివారం నగునూరులో ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా అధికారులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలపై అవగాహన కల్పించారు.

**రేపటి నుంచి గ్రామాలవారీగా..**

ఈనెల 18న ఫకీర్‌పేట, జూబ్లీనగర్, ఎలబోతారం, 19న బహదూర్‌ఖాన్‌పేట, చామనపల్లి, దుబ్బపల్లి, 20న చెర్లభూత్కూర్, తాహెర్‌కొండాపూర్, మందులపల్లి, 21న మొగ్దుంపూర్, ఇరుకుల్ల, నల్లగుంటపల్లి, 22న చేగుర్తి, దుర్శేడ్, గోపాల్‌పూర్, 23న బొమ్మకల్ గ్రామాల్లో ఎల్ఈడీ స్క్రీన్ ప్రదర్శన ఉంటుంది.

# అంబేడ్కర్‌నగర్ రోడ్డు పనుల్లో రగడ



ఆందోళన చేస్తున్న కుటుంబానికి సర్దిచెబుతున్న కార్పొరేటర్

కరీంనగర్‌కార్పొరేషన్: నగరపాలక సంస్థ పరిధిలోని 24వ డివిజన్ అంబేడ్కర్‌నగర్‌లో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో శనివారం రగడ చోటు చేసుకొంది. అంబేడ్కర్‌నగర్‌లోని ఓ వీధిలో సీసీ రోడ్డు నిర్మాణం జరుగుతున్న సమయంలో డ్రైనేజీ నిర్మించాకే రోడ్డు వేయాలంటూ ఓ కుటుంబం పనులు అడ్డుకున్నారు. డ్రైనేజీ లేకపోతే తమ ఇంట్లోకి నీళ్లు వస్తాయని, పనులు ఆపాల్సిందేనంటూ భీష్మించుకు కూర్చున్నారు. 30 సంవత్సరాల తరువాత ఈ వీధిలో రోడ్డు వేస్తున్నారని, ఈ రోడ్డును అడ్డుకోవద్దంటూ స్థానికులు వారించారు. ఈ క్రమంలో స్థానికులు, ఆ కుటుంబానికి నడుమ పలుమార్లు వాగ్వాదం చోటుచేసుకొంది. స్థానిక కార్పొరేటర్ కుర్ర తిరుపతి జోక్యం చేసుకొని రెండు నెలల్లో తాను డ్రైనేజీ నిర్మిస్తానని, రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకోవద్దంటూ ఆ కుటుంబానికి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. కాని డ్రైనేజీ తవ్వాల్సిందేనని పట్టుబట్టడంతో.. జేసీబీతో తాత్కాలికంగా ఇంటి ముందు కాలువ తవ్వడంతో వారు శాంతించారు. దాదాపు నాలుగు గంటల తరువాత సీసీ రోడ్డు పనులు చేపట్టడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

# వివాదాస్పదంగా కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణం



పనులు జరుగుతున్న స్థలం

కరీంనగర్‌కార్పొరేషన్: నగరంలోని 50వ డివిజన్ పరిధి దోబీవాడలో నిర్మిస్తున్న ఓ కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణం వివాదాస్పదంగా మారింది. నివాస గృహాల మధ్య నిర్మిస్తున్న ఈ కమర్షియల్ కాంప్లెక్స్‌తో ఇళ్లు దెబ్బతింటున్నాయని, ఇబ్బందులు పడాల్సి వస్తోందంటూ శనివారం డి.శ్రీధర్ ఆధ్వర్యంలో స్థానికులు నగరపాలక సంస్థ కమిషనర్ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. కమర్షియల్ కాంప్లెక్స్ కావడంతో పిల్లర్ కోసం చాలా లోతుగా తవ్వుతున్నారని, దీంతో పక్కనున్న ఇళ్లు కూలిపోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. సైడ్‌వాల్ కట్టుకొని నిర్మాణం చేయాల్సి ఉండగా.. నిర్మాణదారులు పట్టించుకోవడం లేదన్నారు. పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు క్షేత్రస్థాయిలో సందర్శించకుండానే అనుమతి ఇచ్చారని, తాము ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

### రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

మానకొండూర్: మండల కేంద్రంలోని కరీంనగర్–వరంగల్ రహదారిపై ద్విచక్ర వాహనాన్ని వెనక నుంచి కారు ఢీకొట్టడంతో ఒకరికి గాయాలయ్యాయి. సైదాపూర్ మండలం జాగీర్‌పల్లికి చెందిన కంది రవీందర్‌రెడ్డి కరీంనగర్ నుంచి హుజూరాబాద్ వైపు తన ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. కరీంనగర్ నుంచి హుజూరాబాద్ వైపు వెళ్తున్న కారు అతివేగంతో వెనుక నుంచి ఢీకొట్టడంతో రవీందర్‌రెడ్డికి గాయాలైనాయి. చికిత్స నిమిత్తం 108లో కరీంనగర్ హాస్పిటల్‌కు తరలించారు.

# ఎల్ఈడీ స్క్రీన్‌లో పథకాల ప్రదర్శన



నగునూరులో ఎల్ఈడీ స్క్రీన్ ప్రదర్శన చూస్తున్న గ్రామస్తులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం నగునూరులో వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా శనివారం రాత్రి ఎల్ఈడీ స్క్రీన్‌లో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రదర్శించారు. ప్రధానంగా కేంద్రం ప్రవేశపెట్టిన సామాజిక భద్రత, ఆయుష్మాన్ భారత్, ఆత్మనిర్భర్ భారత్, పీఎం జన్‌ధన్ తదితర పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి, ఎంఏవో సత్యం, బ్యాంకరు కిశోర్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి మల్లయ్య, వివిధ శాఖలకు చెందిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు బ్లాంకెట్లు పంపిణీ



బ్లాంకెట్లు అందజేస్తున్న సమద్ నవాబ్

కరీంనగర్‌కల్చరల్: ఖాదిమానే మిల్లత్ కరీంనగర్ ఆధ్వర్యంలో చలికాలం దృష్ట్యా 105 మంది పేదలకు శనివారం బ్లాంకెట్లను పంపిణీ చేశారు. ఖాదిమానే మిల్లత్ కార్యదర్శి సమద్ నవాబ్ సొంత డబ్బుతో తన తల్లి పేరిట జ్ఞాపకార్థంగా కొద్ది సంవత్సరాల నుంచి ప్రతి ఏటా పేదలకు చలికాలం దృష్ట్యా బ్లాంకెట్లను పంపిణీ చేస్తున్నారు. సమద్ నవాబ్ మాట్లాడుతూ.. మిల్లత్ స్వచ్ఛంద సేవాసంస్థ ద్వారా పేద రోగులకు వైద్య సదుపాయం, ప్రతినెల వితంతువులకు పెన్షన్లు, నిరుపేద ఖైదీలను జైలు నుంచి విడిపించడానికి న్యాయ సహాయం, ఒకటోతరగతి నుంచి పదోతరగతి వరకు చదివే నిరుపేద విద్యార్థులకు విద్యాపరమైన నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, పలకలు, సంచులు వంటివి సమకూర్చడం, అనాథల అంత్యక్రియలకు ఏర్పాటు చేయడం, పేదలు తమ కాళ్లపై నిలబడి బతికేలా వారి జీవనోపాధి కోసం ఉచితంగా టైలరింగ్ సెంటర్ ఏర్పాటు, పేద, మధ్యతరగతి వ్యాపారుల కోసం వడ్డీ లేని రుణాలను అందించడం వంటి సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. సంస్థ అధ్యక్షుడు మహమ్మద్ అంజాదుల్లా బేగ్, కోశాధికారి మాక్బూల్ హుస్సేన్, ఉపాధ్యక్షుడు సయ్యద్ ఫసియొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

### ఉక్కు మనిషి ఇందిరాగాంధీ



కరీంనగర్ కార్పొరేషన్: మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ఉక్కు మహిళ అని, వీరత్వానికి ఆమె ప్రతీక అని కాంగ్రెస్ నాయకులు కొనియాడారు. 1971లో బంగ్లాదేశ్ లిబరేషన్ వార్‌లో విజయం సాధించిన సందర్భంగా శనివారం గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు చేయాలని ఏఐసీసీ పిలుపు మేరకు బస్ స్టేషన్ సర్కిల్ వద్ద ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేసి చిత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్, కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, రెహమత్ హుస్సేన్, వెన్న రాజమల్లయ్య, సుజిత్‌కుమార్, సిరాజ్ హుస్సేన్, మహాలక్ష్మి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



### అయ్యప్ప శోభాయాత్ర

మానకొండూర్: నగర సంకీర్తన కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రంలోని అయ్యప్ప స్వాములు చెరువుకట్ట నుంచి తూర్పు దర్వాజ వరకు స్వామివారి శోభాయాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేశారు. గురుస్వామి శ్రీనివాస్‌రెడ్డి, భక్తులు గోశెట్టి సత్యనారాయణ, అపరాజు శ్రీనివాస్, కూన శంకర్, నరేందర్, బొల్లం శ్రీనివాస్, ఆకుల రాజు తదితరులు పాల్గొన్నారు.

### అంబేడ్కర్ విగ్రహాన్ని అల్గునూర్ చౌరస్తాలో ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న కనకయ్య

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్ 8వ డివిజన్ పరిధిలోని అల్గునూర్ చౌరస్తాలో రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ కరీంనగర్ జిల్లా అధికార ప్రతినిధి గూడ కనకయ్య డిమాండ్ చేశారు. శనివారం కరీంనగర్ ప్రెస్ భవన్‌లో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అంబేడ్కర్ విగ్రహాన్ని అల్గునూర్ చౌరస్తాలో ఏర్పాటు చేస్తానని చెప్పి ఉన్న విగ్రహాన్ని తొలిగించి రోడ్డు పక్కన పెట్టించి పట్టించుకోలేదని, ప్రస్తుత ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఈ విషయంలో దృష్టి సారించి అల్గునూర్ చౌరస్తాలో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అల్గునూర్ చౌరస్తాలో సులభ్ కాంప్లెక్స్ నిర్మించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు సుధాకర్, సిరిసిల్ల నర్సయ్య, కట్కం సంజీవ్, చంద్రయ్య, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

# ధర్మన్న మృతి తీరని లోటు



నివాళి అర్పిస్తున్న నాయకులు

విద్యానగర్(కరీంనగర్): షోలాపూర్ మాజీ ఎంపీ, మహారాష్ట్ర మేయర్, బీఆర్ఎస్ నేత సాధుల ధర్మన్న మృతి పట్ల పద్మశాలి సంఘం నాయకులు సంతాపం ప్రకటించారు. శనివారం కరీంనగర్‌లోని పద్మశాలి ట్రస్ట్ భవన్‌లో సంతాప సభ నిర్వహించారు. ఈ సభలో పద్మశాలి సంఘం ట్రస్ట్ అధ్యక్షుడు స్వర్గం మల్లేశం, ప్రధాన కార్యదర్శి అల్స భద్రయ్య, జిల్లా పద్మశాలి సంఘం గౌరవాధ్యక్షుడు వాసాల రమేశ్, ప్రధాన కార్యదర్శి వల్లాల కృష్ణహరి, జిల్లా నాయకులు ఇప్పనపల్లి సాంబయ్య, స్వర్గం నర్సయ్య, వచ్చునూరి నర్సయ్య, వేముల చంద్రశేఖర్, కొక్కుల భాస్కర్, గడ్డం వెంకటేశం, స్వర్గం రాజేశం, వంగరి అంజయ్య, అడిచర్ల రాజు, దేవసాని పాపన్న, వెంగల్దాస్ అశోక్, మిట్టపల్లి ప్రవీణ్, పాము రాజేశం తదితరులు పాల్గొని ఆయన పద్మశాలి కులస్తులకు అందించిన సేవలను కొనియాడారు. ఆయన మృతి పద్మశాలి సంఘాలకు తీరని లోటన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కరీంనగర్ జిల్లా :
9951602933, 9951602958, 9951602824
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
కరీంనగర్ : రాజశేఖర్ - 9618304759
చొప్పదండి : మొండయ్య - 7997958217
మానకొండూర్ : మహేశ్ - 9573106760
హుజూరాబాద్ : ప్రశాంత్ - 7331119941
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899




## నాలుగో స్థానంతో ముగించిన భారత్

జూనియర్ పురుషుల హాకీ ప్రపంచకప్‌ను భారత్ నిరాశాజనకంగా ముగించింది. భారీ విజయంతో టోర్నీని మొదలు పెట్టిన జట్టు చివరకు నాలుగో స్థానంతో సరిపెట్టుకుంది. కౌలాలంపూర్‌లో శనివారం ముగిసిన ఈ టోర్నమెంట్‌లో శనివారం కాంస్య పతకం కోసం జరిగిన పోరులో భారత్ 1-3 గోల్స్ తేడాతో స్పెయిన్ చేతిలో ఓటమిపాలైంది. భారత్ తరఫున 28వ నిమిషంలో పెనాల్టీని జోజో సునీల్ గోల్‌గా మలచగా...స్పెయిన్ తరఫున అల్వరెజ్ నికోలస్ 25వ, 51వ నిమిషాల్లో, పెకామ్ పౌ 40వ నిమిషంలో ఫీల్డ్ గోల్స్ సాధించారు. ఈ టోర్నీలో జర్మనీ విజేతగా నిలిచింది. ఫైనల్లో జర్మనీ 2-1 స్కోరుతో ఫ్రాన్స్‌పై విజయం సాధించింది. జర్మనీ తరఫున కార్స్ జాన్ (32వ ని.), హోల్డర్‌మన్ (40వ ని.) గోల్స్ చేయగా, ఫ్రాన్స్ తరఫున వెరిర్ జ్యూల్స్ (17వ ని.) గోల్ సాధించాడు.

## పట్టు బిగించిన ఆస్ట్రేలియా

### తొలి ఇన్నింగ్స్‌లో పాక్ 271 ఆలౌట్


లయన్

పెర్త్: పాకిస్తాన్‌తో జరుగుతున్న తొలి టెస్టులో ఆస్ట్రేలియా తమ ఆధిక్యాన్ని మరింత పెంచుకుంది. మ్యాచ్ మూడో రోజు శనివారం ఆట ముగిసే సమయానికి ఆసీస్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 2 వికెట్లు కోల్పోయి 84 పరుగులు చేసింది. డేవిడ్ వార్నర్ (0), లబుషేన్ (2) విఫలం కాగా...ఉస్మాన్ ఖాజా (34 నాటౌట్), స్టీవ్ స్మిత్ (43 నాటౌట్) ప్రస్తుతం క్రీజ్‌లో ఉన్నారు. వీరిద్దరు మూడో వికెట్‌కు ఇప్పటికే అభేద్యంగా 79 పరుగులు జత చేశారు. ప్రస్తుతం ఆస్ట్రేలియా ఓవరాల్ ఆధిక్యం 300 పరుగులకు చేరింది. అంతకు ముందు ఓవర్‌నైట్ స్కోరు 132/2తో ఆట కొనసాగించిన పాకిస్తాన్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 271 పరుగులకు ఆలౌటైంది. దాంతో ఆసీస్‌కు 216 పరుగుల ఆధిక్యం లభించింది. ఇమామ్ ఉల్ హక్ (199 బంతుల్లో 62; 4 ఫోర్లు) టాప్ స్కోరర్‌గా నిలవగా...చివర్లో సాద్ షకీల్ (28), ఆగా సల్మాన్ (28 నాటౌట్) చివర్లో కొన్ని పరుగులు జత చేశారు. 3 వికెట్లు తీసిన నాథన్ లయన్ తన టెస్టు వికెట్ల సంఖ్యను 499కి చేర్చుకోగా...కమిన్స్, స్టార్క్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. అయితే ఫాలో ఆన్ ఇవ్వకుండా ఆసీస్ రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు దిగింది.

## ‘విజయ్ హజారే’ విజేత హర్యానా

### ఫైనల్లో 30 పరుగులతో రాజస్తాన్‌పై గెలుపు

రాజ్‌కోట్: దేశవాళీ వన్డే టోర్నీ ‘విజయ్‌హజారే ట్రోఫీ’లో హర్యానా మొదటిసారి చాంపియన్‌గా నిలిచింది. శనివారం జరిగిన ఫైనల్లో హర్యానా 30 పరుగుల తేడాతో రాజస్తాన్‌ను ఓడించి టైటిల్‌ను సొంతం చేసుకుంది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన హర్యానా 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 287 పరుగులు చేసింది. అంకిత్ కుమార్ (91 బంతుల్లో 88; 12 ఫోర్లు, 1 సిక్స్), కెప్టెన్ అశోక్ మేనరియా (96 బంతుల్లో 70; 8 ఫోర్లు) అర్ధ సెంచరీలు చేయగా...అనికేత్ చౌదరి 4 వికెట్లు పడగొట్టాడు. అనంతరం రాజస్తాన్ 48 ఓవర్లలో 257 పరుగులకు ఆలౌటైంది. అభిజిత్ తోమర్ (129 బంతుల్లో 106; 10 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీతో పాటు కునాల్ రాథోడ్ (65 బంతుల్లో 79; 4 ఫోర్లు, 5 సిక్స్‌లు) రాణించినా రాజస్తాన్‌కు ఓటమి తప్పలేదు.




# భారత మహిళల మరో చరిత్ర

- టెస్టు క్రికెట్‌లో అతి పెద్ద విజయం
- 347 పరుగులతో ఇంగ్లండ్ చిత్తు
- రెండో ఇన్నింగ్స్‌లో 131కే ఆలౌట్

ముంబై: మహిళల టెస్టు క్రికెట్ చరిత్రలో భారత జట్టు కొత్త రికార్డును నమోదు చేసింది. పరుగులపరంగా అతి పెద్ద విజయాన్ని నమోదు చేసి సొంత గడ్డపై సత్తా చాటింది. ఇంగ్లండ్‌తో జరిగిన ఏకైక టెస్టులో భారత్ 347 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. భారత బౌలింగ్ ధాటికి మూడు రోజుల్లోపే ఈ మ్యాచ్ ముగియడం విశేషం. తొలి ఇన్నింగ్స్‌లో 35.3 ఓవర్లు ఆడిన ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో మరీ పేలవంగా 27.3 ఓవర్లకే కుప్పకూలింది. 479 పరుగుల విజయలక్ష్యంతో శనివారం బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ 131 పరుగులకే ఆలౌటైంది. హీతర్ నైట్ (21)దే అత్యధిక స్కోరు కావడం ఆ జట్టు పరిస్థితిని చూపిస్తోంది. మిగిలిన బ్యాటర్లలో ఎవరూ కూడా భారత బౌలర్లను కనీసం ప్రతిఘటించలేకపోయారు. తొలి ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లుతో చెలరేగిన ఆఫ్‌స్పిన్నర్ దీప్తి శర్మ రెండో ఇన్నింగ్స్‌లోనూ (4/32) ప్రత్యర్థిని పడగొట్టడంలో కీలక పాత్ర పోషించింది. పేసర్ పూజ వస్త్రకర్ ఆరంభంలో 3 కీలక వికెట్లు పడగొట్టగా, లెఫ్టార్మ్ స్పిన్నర్ రాజేశ్వరి గైక్వాడ్‌కు 2 వికెట్లు దక్కాయి. అంతకు ముందు ఓవర్‌నైట్ స్కోరు 186/6 వద్దనే భారత్ తమ రెండో ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో 292 పరుగుల ఆధిక్యం సాధించిన జట్టు ఇంగ్లండ్ ముందు 479 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. మ్యాచ్‌లో మొత్తం 39 పరుగులిచ్చి 9 వికెట్లు పడగొట్టడంతో పాటు 87 పరుగులు సాధించిన దీప్తి శర్మ ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’గా నిలిచింది. సొంతగడ్డపై భారత మహిళల జట్టు ఇంగ్లండ్‌ను ఓడించడం ఇదే మొదటిసారి (ఆరు టెస్టుల్లో) కావడం విశేషం. తాజా విజయం భారత జట్టు ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. గురువారంనుంచి వాంఖెడే స్టేడియంలో ఆస్ట్రేలియాతో ఏకైక టెస్టులో తలపడనున్న నేపథ్యంలో తాజా గెలుపు మరింత ప్రేరణ అందించడం ఖాయం. మరో వైపు ఇంగ్లండ్‌తో టెస్టులోనే అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగు పెట్టి అర్ధ సెంచరీ సాధించిన శుభ సతీశ్ ఆసీస్‌తో మ్యాచ్‌కు దూరం కానుంది. ఎడమచేతికి ఫ్రాక్చర్ కావడంతో ఆమె కోలుకునే అవకాశాలు దాదాపుగా లేవు.

**స్కోరు వివరాలు:**

**భారత్ తొలి ఇన్నింగ్స్:** 428, ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ 136, భారత్ రెండో ఇన్నింగ్స్ 186/6 డిక్లేర్డ్, ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్: డంక్లీ (సి) (సబ్) హర్లీన్ 15; బీమాంట్ (బి) రేణుక 17; నైట్ (సి) యస్తిక (బి) పూజ 21; నాట్ సివర్ (బి) పూజ 0; వైట్ (సి) రాణా (బి) దీప్తి 12; జోన్స్ (సి) షఫాలీ (బి) దీప్తి 5; ఎకెల్‌స్టోన్ (బి) రాజేశ్వరి 10; డీన్ (నాటౌట్) 20; క్రాస్ (బి) దీప్తి 16; ఫైలర్ (బి) దీప్తి 0; బెల్ (సి) జెమీమా (బి) రాజేశ్వరి 8; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (27.3 ఓవర్లలో ఆలౌట్) 131. వికెట్ల పతనం:** 1-27, 2-37, 3-37, 4-68, 5-68, 6-83, 7-83, 8-108, 9-108, 10-131. **బౌలింగ్:** రేణుకా సింగ్ 6-1-30-1, స్నేహ్ రాణా 4-0-19-0, పూజ వస్త్రకర్ 4-1-23-3, దీప్తి శర్మ 8-2-32-4, రాజేశ్వరి 5.3-1-20-2.

**347** మహిళల టెస్టుల్లో పరుగులపరంగా అతి పెద్ద విజయం. గతంలో శ్రీలంక (309 పరుగులు) పేరిట ఉన్న రికార్డును భారత్ సవరించింది. ఈ రెండూ మినహా ఇతర టెస్టు విజయాలన్నీ 200 పరుగుల లోపు తేడాతోనే వచ్చాయి.

**3** ఇంగ్లండ్‌పై భారత్‌కు ఇది మూడో విజయం. 15 టెస్టుల్లో భారత్ 1 మ్యాచ్ ఓడగా 11 ‘డ్రా’గా ముగిశాయి. మిగిలిన రెండు సార్లు ఇంగ్లండ్‌లోనే భారత్ గెలిచింది.

**27.3** రెండో ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ ఆడిన ఓవర్లు. ఆలౌట్ అయిన సమయంలో ఏ జట్టుకైనా ఇదే అతి చిన్న ఇన్నింగ్స్.

## షమీ అవుట్... చహర్ స్థానంలో ఆకాశ్‌దీప్


ఆకాశ్

ముంబై: భారత స్టార్ పేస్ బౌలర్ మొహమ్మద్ షమీ దక్షిణాఫ్రికాతో జరిగే రెండు టెస్టుల సిరీస్‌కు దూరమయ్యాడు. కాలి మడమ గాయంతో బాధపడుతున్న షమీ పూర్తిగా కోలుకోలేదు. అతడిని జట్టులోకి ఎంపిక చేసినా... ఫిట్‌నెస్ పరీక్ష తర్వాతే బరిలోకి దిగుతాడని బీసీసీఐ ముందే ప్రకటించింది. అతడిని పరీక్షించిన వైద్య బృందం ఫిట్‌గా లేడని తేల్చడంతో షమీ టెస్టు సిరీస్‌నుంచి తప్పుకోక తప్పలేదు. అతని స్థానంలో బోర్డు ఎవరినీ ఎంపిక చేయలేదు. వన్డే టీమ్‌లో ఉన్న పేస్ బౌలర్ దీపక్ చహర్ వ్యక్తిగత కారణాలతో సిరీస్‌నుంచి తప్పుకున్నాడు. అతని స్థానంలో బెంగాల్ పేసర్ ఆకాశ్‌దీప్‌ను సెలక్టర్లు ఎంపిక చేశారు. ఆకాశ్ 28 దేశవాళీ వన్డేల్లో 24.50 సగటుతో 42 వికెట్లు పడగొట్టాడు. మరో వైపు శ్రేయస్ అయ్యర్ తొలి వన్డే మాత్రమే ఆడి టెస్టు సిరీస్‌కు సన్నద్ధమయ్యేందుకు జట్టుతో కలుస్తాడు.

# వన్డే సమరానికి సై

- నేడు భారత్, దక్షిణాఫ్రికా మొదటి మ్యాచ్
- ప్రపంచకప్ తర్వాత టీమిండియా తొలి పోరు
- మ.గం.1.30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం


మార్క్‌రమ్


రాహుల్

జొహన్నెస్‌బర్గ్: సొంతగడ్డపై వన్డే వరల్డ్ కప్ ఫైనల్లో అనూహ్యంగా పరాజయంపాలైన దాదాపు నెల రోజుల తర్వాత భారత జట్టు మరో వన్డే పోరులో బరిలోకి దిగుతోంది. అయితే ఆ టోర్నీలో ఆడిన వారిలో పలువురు కీలక ఆటగాళ్లు లేకుండానే రాహుల్ నాయకత్వంలో యువ క్రికెటర్లతో కూడిన టీమిండియా సిద్ధమైంది. మరో వైపు వరల్డ్ కప్ సెమీఫైనల్లో ఓటమి తర్వాత దక్షిణాఫ్రికాకు కూడా ఇదే తొలి మ్యాచ్. సఫారీ టీమ్ కూడా స్వదేశంలో పలువురు కొత్త ఆటగాళ్లకు అవకాశం కల్పిస్తోంది. ఈ నేపథ్యంలో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఇరు జట్ల మధ్య ఆదివారం వాండరర్స్ మైదానంలో తొలి వన్డే జరగనుంది. ‘బ్రెస్ట్ క్యాన్సర్’ అవగాహన కార్యక్రమంలో భాగంగా మైదానం మొత్తం గులాబీమయం కానుంది. దక్షిణాఫ్రికా ఆటగాళ్లు గులాబీ రంగు జెర్సీలతోనే బరిలోకి దిగుతారు.

**ఎవరెవరికి చాన్స్!**

వన్డే సిరీస్ కోసం భారత జట్టులోకి ఎంపిక చేసిన ఆటగాళ్ల బృందంలో 9 మందికి 10కంటే తక్కువ వన్డేలు ఆడిన అనుభవం ఉంది. దేశవాళీ వన్డేల్లో ప్రదర్శనతో పాటు టి20 టీమ్‌లో సభ్యులుగా సత్తా చాటిన కుర్రాళ్లకు ఇక్కడా అవకాశం దక్కనుంది. రుతురాజ్, తిలక్, రింకూ సింగ్‌లాంటి బ్యాటర్లు దీనిని ఉపయోగించుకునేందుకు సిద్ధంగా ఉన్నారు. మిడిలార్డర్‌లో సంజు సామ్సన్‌కు మ్యాచ్ దక్కుతుందా అనేది ఆసక్తికరం. వన్డేల కోసమే ఎంపిక చేసిన తమిళనాడు ఓపెనర్ సాయి సుదర్శన్‌కు కూడా టీమ్ మేనేజ్‌మెంట్ పరీక్షించవచ్చు. కెప్టెన్‌గా గతంలోనూ మంచి అనుభవం ఉన్న కేఎల్ రాహుల్ ఈసారి కూడా యువ ఆటగాళ్లతో జట్టును ఎలా నడిపిస్తాడనేది చూడాలి. షమీ, బుమ్రా, సిరాజ్‌లు అందుబాటులో లేరు. దాంతో ముకేశ్, అర్ష్‌దీప్, అవేశ్‌లపైనే భారం ఉంది. అయితే స్పిన్‌లో మాత్రం పరిస్థితి మెరుగ్గా ఉంది. ఫామ్‌లో ఉన్న కుల్దీప్‌తో పాటు అక్షర్, పునరాగమనంలో సత్తా చాటాలని పట్టుదలగా ఉన్న చహల్‌లను ఎదుర్కోవడం సఫారీలకు అంత సులభం కాదు.

**బ్యాటింగ్‌పైనే భారం...**

దక్షిణాఫ్రికా పరిమిత ఓవర్ల క్రికెట్‌లో దూకుడైన ఆటగాళ్లలో మిల్లర్, క్లాసెన్, కెప్టెన్ మార్క్‌రమ్‌లకు పేరుంది. భారత్‌తో టి20 సిరీస్‌లో ఈ ముగ్గురినుంచి చెప్పుకోదగ్గ మెరుపులు రాలేదు. వన్డేల్లోనైనా తమ స్థాయికి తగినట్లుగా ఆడితే సఫారీ జట్టు పైచేయి సాధించగలదు. ఓపెనర్‌గా రీజా హెన్‌డ్రిక్స్‌కు ఇకపై పూర్తి స్థాయిలో అవకాశాలు రానున్నాయి. వాటిని అతను ఎంత సమర్థంగా ఉపయోగించుకుంటాడనేది చూడాలి. బ్యాటింగ్‌లో భారీ స్కోరు సాధించడంపైనే జట్టు విజయావకాశాలు ఆధారపడి ఉన్నాయి. ఎందుకంటే ఆ జట్టు బౌలింగ్ దళంలో పూర్తిగా అనుభవరాహిత్యం కనిపిస్తోంది. విలియమ్స్, బర్జర్, ముల్డర్ లు టీమిండియాకు కట్టడి చేయగలరా అనేది సందేహమే.

**జట్ల వివరాలు (అంచనా)**

**భారత్:** రాహుల్ (కెప్టెన్), రుతురాజ్, సుదర్శన్, తిలక్, శ్రేయస్, రింకూ/సామ్సన్, అక్షర్, అర్ష్‌దీప్, అవేశ్, కుల్దీప్, ముకేశ్.

**దక్షిణాఫ్రికా:** మార్క్‌రమ్ (కెప్టెన్), హెన్‌డ్రిక్స్, డి జోర్జి, వాన్‌డర్ డసెన్, క్లాసెన్, మిల్లర్, ఫెలుక్వాయో, ముల్డర్, బర్జర్, మహరాజ్/ షమ్సీ, విలియమ్స్

**పిచ్, వాతావరణం**

బ్యాటింగ్‌కు బాగా అనుకూల మైదానం. భారీ స్కోర్లు ఖాయం. గత నాలుగు వన్డేల్లో మూడు సార్లు తొలి ఇన్నింగ్స్‌లో 300కు పైగా స్కోర్లు నమోదయ్యాయి. వర్షసూచన లేదు.

**రాష్ట్రీయం**

## కేంద్ర పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారు

### ‘వికసిత్ భారత్ సంకల్ప యాత్ర’ ప్రారంభోత్సవంలో గవర్నర్ తమిళి సై


వికసిత్ భారత్ సంకల్ప యాత్రను జెండా ఊపి ప్రారంభిస్తున్న గవర్నర్ తమిళిసై

శామీర్‌పేట్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పేర్కొన్నారు. మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం బొమ్మరాశిపేట గ్రామంలో శనివారం ‘వికసిత్ భారత్ సంకల్ప యాత్ర’ను గవర్నర్ తమిళిసై, ప్రధాని మోదీ (వర్చువల్)గా జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ...దేశం అన్ని రంగాల్లోనూ ఇతర దేశాలకంటే ముందు ఉంటూ ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ ద్వారా రూ.5 లక్షల వైద్య బీమా అందుతుందని, ఈ పథకం ద్వారా పేద కుటుంబాలకు సైతం కార్పొరేట్ ఆస్పత్రుల్లో కూడా వైద్యం లభిస్తుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పీఎం ఆవాస్ యోజన పథకం ద్వారా ఇళ్లు నిర్మించడం జరుగుతుందని, ముద్ర యోజన పథకం ద్వారా వ్యాపారులు యజమానులు అయ్యారని సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం సంకల్పం (ప్రతిజ్ఞ) చేశారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను తిలకించారు.

## చేనేత పెట్టుబడులకు కృషి చేయాలి

### చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల



సాక్షి, హైదరాబాద్: చేనేత పరిశ్రమలకు భారీ ఎత్తున పెట్టుబడులు వచ్చేలా అధికారులు కృషి చేయాలని చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. శనివారం సచివాలయంలో ఆయా శాఖల అధికారులతో మంత్రి తుమ్మల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చేనేత, జౌళి రంగాల పునర్వైభవం కోసం అధికార యంత్రాంగం పనిచేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని పథకాలకు సకాలంలో నిధులు విడుదల చేయాలని, కేంద్ర ప్రభుత్వం నుంచి అందాల్సిన నిధులపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. డిజైనింగ్, శిక్షణ, ఉత్పత్తి, మార్కెటింగ్ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పోచంపల్లి గద్వాల చేనేత పరిశ్రమలకు సంబంధించిన పూర్తి వివరాలతో నివేదిక సిద్ధం చేసి అందించాలన్నారు. వరంగల్ టెక్స్‌టైల్ పార్క్‌ను గ్రీన్‌పార్క్‌గా తీర్చిదిద్దేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని, దీనికి సంబంధించిన ప్రణాళికలపై కార్యాచరణ ప్రారంభించాలని మంత్రి తుమ్మల ఆదేశాలు జారీ చేశారు.

### వితంతు, వారి కుమార్తెల వివాహానికి ‘ముత్తూట్’ సాయం

సాక్షి, హైదరాబాద్: ప్రతీ ఏటా రాష్ట్రంలోని వితంతువులకు, వారి కుమార్తెల వివాహానికి ఆర్థిక సహాయాన్ని అందించేందుకు బంగారంపై రుణాలు ఇచ్చే అతి పెద్ద సంస్థగా పేరొందిన ‘ముత్తూట్ ఫైనాన్స్’2023 ఏడాదికి అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. అర్హులైన వారికి రూ.50 వేల నగదును అందజేస్తారని ముత్తూట్ ఫైనాన్స్ సీఎస్ఆర్ అధిపతి బాబు జాన్ మలయిల్ శనివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఇందుకు అర్హతగా కుటుంబ నెలవారీ ఆదాయం రూ.10 వేల కంటే తక్కువ ఉండాలని తెలిపారు. దరఖాస్తుతోపాటు స్థానిక ప్రజాప్రతినిధుల సిఫారసులేఖ, వివాహ ఆహ్వాన పత్రం, రేషన్‌కార్డు లేదా ఆధార్‌కార్డు, ఆదాయ ధ్రువీకరణ, వితంతువులకు ఒంటరి మహిళ అని రుజువు చేసే ఏదేని పత్రం తప్పనిసరిగా జతపరచాలి. దరఖాస్తులు ఈనెల 25న సాయంత్రం 5.30 గంటలలోపు లక్ష్మీనారాయణ యమగాని, ముత్తూట్ ఫైనాన్స్ లిమిటెడ్, మేనేజర్ –సీఎస్ఆర్, హైదరాబాద్ చిరునామాకు అందజేయాలన్నారు.

# ప్రతీ ఇంటికి సంక్షేమ ఫలాలు

- కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి
- చిన్నగోల్కొండలో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర రథాన్ని ప్రారంభించిన మంత్రి


డ్రోన్‌ను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

శంషాబాద్ రూరల్: వచ్చే 25 ఏళ్లలో భారతదేశం మరింత అభివృద్ధి చెందేలా కేంద్ర ప్రభుత్వం ‘వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర’కు శ్రీకారం చుట్టిందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన రంగారెడ్డి జిల్లా చిన్నగోల్కొండలో జెండా ఊపి సంకల్ప రథాన్ని ప్రారంభించారు. దేశాన్ని మరింత అభివృద్ధి బాటలో నడిపించేందుకు ప్రధాని మోదీ సంకల్పించారని, ఇందులో భాగంగా ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు చేరేలా.. అర్హులైన వారి చెంతకు పథకాలను ఈ రథం ద్వారా తీసుకెళ్తామని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో రాష్ట్రంలో ఈ కార్యక్రమం వాయిదా పడిందని, ఈ నేపథ్యంలో శనివారం ప్రారంభించిన యాత్రను జనవరి 25 వరకు కొనసాగిస్తామని, రథాన్ని ప్రతి ఊరుకు తీసుకువెళ్లి కేంద్ర పథకాలపై అవగాహన కల్పిస్తామని వివరించారు. అలాగే అర్హులకు పథకాల మంజూరు పత్రాలు అందజేస్తామని చెప్పారు. మోదీ పాలనలో గత 9 ఏళ్లలో దేశంలో శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయని కిషన్‌రెడ్డి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చిరు వ్యాపారులు, మహిళా సంఘాలకు రుణాలు, పేదల ఆరోగ్యం కోసం ఉచిత వైద్య చికిత్స, రైతులకు పెట్టుబడి సాయం, గూడు లేని పేదలకు పక్కా ఇళ్లు, ఉచిత రేషన్, గ్యాస్ కనెక్షన్లవంటి పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు.

**ప్రతి గ్రామానికి డ్రోన్ మంజూరు..**

రైతులు పంటలకు మందులు పిచికారీ చేయడానికి వీలుగా కేంద్ర ప్రభుత్వం ప్రతి గ్రామంలో ఒక మహిళా సంఘానికి డ్రోన్ సౌకర్యం సమకూర్చుతున్నట్లు మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. పైలట్ ప్రాజెక్టుగా తొలుత 15 వేల డ్రోన్‌లను ఇవ్వనున్నట్లు చెప్పారు.

## కేసీఆర్ కుటుంబీకుల పాస్‌పోర్టులు సీజ్ చేయండి

### బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి బండి సంజయ్


మాట్లాడుతున్న బండి సంజయ్‌కుమార్

కరీంనగర్‌టౌన్: అధికారంలో ఉన్నన్నాళ్లు అవినీతి, అరాచకాలతో ప్రజల సొమ్మును దోచుకుతిన్న మాజీ సీఎం కేసీఆర్ కుటుంబసభ్యులు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పాస్‌పోర్టులను సీజ్ చేయాలని బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ కోరారు. కేసీఆర్ హయాంలో పదవీవిరమణ చేసినప్పటికీ సీఎంవోలో పనిచేస్తూ ఆ కుటుంబానికి దోచిపెట్టిన అధికారుల పాస్‌పోర్టులను సైతం జప్తు చేయాలని రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వారంతా విదేశాలకు పారిపోయే ప్రమాదం ఉందని సంచలన వ్యాఖ్యలు చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న కేసీఆర్‌ను ఈ విషయంలో మినహాయించాలన్నారు. కరీంనగర్‌లో శనివారం నిర్వహించిన బీజేపీ పార్లమెంటరీ నియోజకవర్గ పదాధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పార్టీపరంగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, వికసిత్ భారత్ సంకల్పయాత్ర ఉద్దేశాలను వివరించారు. తెలంగాణను బంగారుపల్లెంలో పెట్టి కాంగ్రెస్ చేతిలో పెట్టామంటూ మాజీ ఎంపీ వినోద్‌కుమార్, బీఆర్ఎస్ నేతలు చెబుతుండటాన్ని తప్పుపట్టారు. రాష్ట్రం బంగారుపల్లెమే అయితే ఉద్యోగులకు ఒకటో తేదీ నాడే ఎందుకు జీతాలివ్వలేదని ప్రశ్నించారు. సుమారు రూ.6 లక్షల కోట్ల అప్పు చేసి తెలంగాణను సర్వనాశనం ఎందుకు చేశారని, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఎందుకియ్యలేదని నిలదీశారు. దేశమంతా మోదీ, బీజేపీ గాలి వీస్తోందని, 350 ఎంపీ స్థానాలతో మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ అధికార ప్రతినిధి రాణిరుద్రమ తదితరులు పాల్గొన్నారు.

## దుర్గం చెరువు పరిస్థితిపై నిపుణుల కమిటీ

- అమికస్ క్యూరీగా న్యాయవాది వేదుల శ్రీనివాస్‌ను నియమించిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: దుర్గం చెరువులో వందలాది చేపలు మృతి చెందిన ఘటన, చెరువు పరిస్థితిపై వివరాలు తెలుసుకునేందుకు తమకు సహకరించడం కోసం అమికస్ క్యూరీగా న్యాయవాది వేదుల శ్రీనివాస్‌ను హైకోర్టు నియమించింది. ‘అధికారులను రక్షించే ప్రయత్నం చేయవద్దు. అధికారులు చెప్పే కారణాలను వినదల్చుకోలేదు. అంతా బాగుందని చెప్పే వారి నివేదికపై ఆధార పడలేం. మేమే ఓ కమిటీని ఏర్పాటు చేసి చెరువు పరిస్థితిని తెలుసుకుంటాం. ఆ కమిటీ చెరువును సందర్శించి రక్షణ చర్యలపై నివేదిక అందజేస్తుంది. మురికినీరు చేరకుండా నివారణ చర్యలను సూచిస్తుంది. తప్పు చేసిన వారిని రక్షించడం కాదు.. స్వచ్ఛ చెరువును భావితరాలకు అందించేలా మీ(జీపీ) వాదనలు ఉండాలి’ అని చెప్పింది. సీనియర్ న్యాయవాది, పర్యావరణవేత్త, ఎన్జీవో సహా నిపుణులు ఉండేలా ఓ కమిటీ నియామకం చేయాలని భావించిన న్యాయస్థానం.. ఈ అంశంలో సహకారం అందించాలని వేదులను కోరింది. దుర్గం చెరువులో కాలుష్యం చేరి ఊపిరి పీల్చు కోవడం కూడా కష్టంగా మారి వందలాది చేపలు మృతి చెందాయంటూ ఓ పత్రికలో వచ్చిన కథ నాన్ని హైకోర్టు సుమోటో ప్రజాప్రయోజన వ్యాజ్యంగా విచారణకు స్వీకరించింది. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ ఆరాధే, జస్టిస్ అనిల్ కుమార్ జూకంటి ధర్మాసనం శనివారం విచారణ చేపట్టింది. వరద కారణంగా మురుగునీరు చేరి చేపలు చనిపోయా యన్న నీటిపారుదల శాఖ అధికారుల వాదనను కోర్టు తిరస్కరించింది. వాదనలు విన్న ధర్మాసనం.. సూచనలు చేయాలని అమికస్ క్యూరీని కోరుతూ, తదుపరి విచారణను 22కు వాయిదా వేసింది.

## ఆరు గ్యారంటీల అమలెలా చెప్పండి?

### బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు లక్ష్మణ్



సాక్షి, హైదరాబాద్: ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు, ఆరు గ్యారంటీలను ఎలా అమలు చేస్తారో కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పడం లేదని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ విమర్శించారు. రాష్ట్రం అప్పుల్లో ఉందన్న విషయం అందరికీ తెలుసునని, అందువల్ల నష్టాల్లో ఉందన్న నెపంతో తప్పించుకునే ప్రయత్నం చేయొద్దని హెచ్చరించారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ గవర్నర్ ప్రసంగంలో.. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చే అంశాల ప్రస్తావన.. కార్యాచరణ లేవన్నారు. శాసనసభలో గవర్నర్ తొలి ప్రసంగం నిరుత్సాహపరిచిందని చెప్పారు. వాస్తవానికి దూరంగా.. కేవలం పొగడ్తల కోసమే కాంగ్రెస్ పార్టీ పాకులాడిందని మండిపడ్డారు. ప్రజా సమస్యల పరిష్కారం విషయంలో స్పష్టత లేకుండా గవర్నర్ ప్రసంగం రూపొందించారన్నారు. గవర్నర్ ప్రసంగంలో రైతు రుణమాఫీ, రైతుబంధు ఊసే లేదని, ఆరు గ్యారంటీలకు నిధులు ఎలా తెస్తారో స్పష్టత లేదని వివరించారు. మొదటి కేబినెట్ సమావేశంలోనే మెగా డీఎస్సీపై ప్రకటన చేస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. పోలీస్ స్టేషన్‌లో గిరిజన యువకుడి లాకప్ మరణానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. హామీల అమలుకు కొత్త ప్రభుత్వానికి వంద రోజులు సమయం ఇచ్చి.. ఆపై ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తామని లక్ష్మణ్ తెలిపారు.

## అయ్యప్ప భక్తులకు సౌకర్యాలు ఏర్పాటు చేయండి

### కేరళ ముఖ్యమంత్రికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి లేఖ

సాక్షి, హైదరాబాద్: కేరళలోని శబరిమల అయ్యప్పస్వామి క్షేత్రంలో కనీస సౌకర్యాలు లేక భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని కేరళ ముఖ్యమంతి పినరయి విజయన్‌కు శనివారం ఆయన లేఖ రాశారు. శబరిమలలో భక్తులకు సౌకర్యాలు కల్పించే విషయంలో కేంద్ర ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం ఉంటుందని ఆయన లేఖలో పేర్కొన్నారు. ఏటా శబరిమలకు తెలుగు రాష్ట్రాల నుంచి వెళ్లే భక్తుల సంఖ్య 15 లక్షలకు పైగానే ఉంటుందని తెలిపారు. అయితే ఈసారి శబరిమలలో ఏర్పాట్లు సరిగాలేని కారణంగా భక్తులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నట్లు.. పత్రికలు, టీవీ చానళ్లలో వస్తున్న వార్తల ద్వారా తెలుస్తోందన్నారు. ఇటీవలే శబరిమల అయ్యప్ప సన్నిధానంలో దర్శనం సందర్భంగా తొక్కిసలాటలో ఓ బాలిక చనిపోయిన విషయం తెలిసి బాధ కలిగిందన్నారు. భక్తుల పాదయాత్ర మార్గాల్లో భోజనం, నీరు, వైద్యంతో సహా స్వాములకు అవసరమైన ఇతర ఏర్పాట్లను వెంటనే చేయాలని విజ్ఞప్తిచేశారు. అవసరమైతే స్వచ్ఛంద సేవాసంస్థలను కూడా భాగస్వాములను చేయాలని కోరారు.

## రాజీమార్గంతో సంబంధాల పునరుద్ధరణ

### రెరా చైర్మన్ సత్యనారాయణ



సాక్షి, హైదరాబాద్: సామాజిక, వృత్తి, వ్యాపారపరమైన మానవసంబంధాలను పునరుద్ధరించడంలో మధ్యవర్తిత్వంతో కూడిన రాజీమార్గం ఎంతో దోహదపడుతుందని రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ(రెరా) చైర్మన్ ఎస్.సత్యనారాయణ అన్నారు. ఐఏఎంసీ ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్, మీడియేషన్ వారు రెండు రోజులపాటు రెరా అధికారులకు, నారెడ్కో, క్రెడాయ్, రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్‌లో ఎంపికైన ప్యానల్ సభ్యులకు ‘మధ్యవర్తిత్వం–రాజీమార్గం’ అనే అంశంపై నానక్‌రాంగూడా ఐఏఎంసీ కేంద్రంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రియల్ ఎస్టేట్ రంగంలో పారదర్శకత, జవాబుదారీతనం తప్పనిసరి అని అన్నారు. ‘రెరా’ అథారిటీ సభ్యులు కె.శ్రీనివాసరావు, జె.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఐఏఎంసీ శిక్షణా కార్యక్రమాలను ప్యానల్ సభ్యులు, ‘రెరా’ అధికారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ‘రెరా’ అధికారులు లతీఫ్ ఉర్ రెహమాన్, ఎండీ తారిక్‌ఖాన్, ఎస్.సత్తయ్య, నరెడ్కో ప్రెసిడెంట్ సునీల్ చంద్రారెడ్డి, జనరల్ సెక్రటరీ విజయసాయి, క్రెడాయ్ రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం, కొనుగోలుదారులు, రియల్ ఎస్టేట్ డెవలపర్లకు ఐఏఎంసీ సీనియర్ మీడియేటర్ అవగాహన కలిగించారు.

SAKSHI
SAKSHI DIGITAL
MEDIA GROUP



ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్‌కు స్వాగతం పలుకుతున్న వై.ఎస్. భారతి రెడ్డి

# ప్రతిభా పురస్కారాల సాక్షిగా...




సాక్షి ఎక్సలెన్స్ అవార్డ్స్ 9th ఎడిషన్ మెగా ఈవెంట్
నేటి సాయంత్రం
5.00 గంటల నుంచి
మీ సాక్షి SAKSHI TV లో

నిస్వార్థంగా సేవ చేసిన వారు కొందరైతే.. పూట గడవని స్థితి నుంచి పదిమంది ఆకలి తీర్చే స్థాయికి ఎదిగిన వారు మరికొందరు... అలాగే పిన్న వయస్సులోనే ప్రతిభ చూపేవారు... తమ ప్రతిభను సమాజ హితం కోసం... దేశానికి పతకాల పంటను అందించడం కోసం తోడ్పడే వారు... ఎంచుకున్న రంగంలో విశేష కృషి చేసిన వారు ఎందరో... ఇలాంటి వారిలో ప్రతి ఏటా తమ దృష్టికి వచ్చిన కొందరిని సాక్షి గుర్తించి అభినందిస్తోంది... సత్కరించి గౌరవిస్తోంది. ఇందులో భాగంగా 9వ ఎడిషన్‌కు సంబంధించిన 'సాక్షి' ప్రతిభా పురస్కార ప్రదానోత్సవం హైదరాబాద్‌లోని జెఆర్‌సీ కన్వెన్షన్ హాలులో నవంబర్ 16, గురువారం జరిగింది. ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పెద్దలు, ప్రముఖుల సమక్షంలో కన్నుల పండువగా జరిగిన ఈ కార్యక్రమంలో పురస్కారాలు అందుకున్న వారి వివరాలు, స్పందనలు.

Presented by
Bharathi CEMENT
SUPERIOR QUALITY. GUARANTEED.
ULTRAFAST
FAST SETTING CEMENT
Powered by
VIT
Vellore Institute of Technology

## లాన్స్‌నాయక్ బొగ్గల సాయి తేజ | స్పెషల్ జ్యూరీ పురస్కారం (మరణానంతరం)

చిత్తూరుజిల్లాలోని ఎగువ రేగడ పల్లి గ్రామానికి చెందిన యువతేజం బొగ్గల సాయితేజ బాల్యం నుంచే సైన్యంలో చేరాలని కలలు కన్నారు. 2013లో బెంగళూరు రెజిమెంట్‌లో ఆర్మీజవాన్‌గా చేరి తన ఆశయాన్ని నెరవేర్చుకున్నారు. స్వల్పకాలంలోనే ఉన్నతాధికారుల మన్ననలు పొందారు సాయితేజ. అతని శక్తి యుక్తులను గుర్తించిన త్రివిధ దళాధిపతి బిపిన్ రావత్... ఆయనను తన వ్యక్తిగత భద్రతాసిబ్బందిలో ఒకరిగా నియమించుకున్నారు. అయితే... అనూహ్యంగా 2021 డిసెంబర్‌లో తమిళనాడులో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో బిపిన్ రావత్‌తోపాటు సాయి తేజ కూడా అమరుడయ్యారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు. సోదరుడు మహేష్ కూడా సైన్యంలో ఉన్నారు. విధి నిర్వహణలో అమరుడైన వీర జవాన్ లాన్స్ నాయక్ సాయితేజకు సెల్యూట్ చేస్తూ సాక్షి ఎక్సలెన్స్ – మరణానంతర పురస్కారాన్ని కుటుంబ సభ్యులకు అందజేసింది సాక్షి మీడియా గ్రూప్.



● భార్య: శ్యామల, తండ్రి మోహన్, తల్లి: భువనేశ్వరి



సాయితేజ
(ఫైల్ ఫొటో)

**తల్లిదండ్రుల స్పందన:** మా సాయితేజ చిన్నప్పటి నుంచే దేశం గురించి ఆలోచించే వాడు. దేశసేవ గురించి ఎన్నో విషయాలు చెప్పేవాడు. తనే సొంతంగా వెళ్లి ఆర్మీలో సెలక్ట్ అయ్యాడు. అక్కడ దేశం కోసం అమరుడయ్యాడు. కొడుకు మీద మీద ప్రేమతో గుడికట్టి, మేమూ ఆ ప్రాంగణంలోనే ఉంటున్నాం. ఈ అవార్డు మాకు నిత్య స్మరణీయం.

## పంతంగి భార్గవి | యంగ్ అచీవర్ ఆఫ్ ది ఇయర్ (ఎడ్యుకేషన్)

పంతంగి భార్గవి తండ్రి ఒక ప్రైవేట్ సంస్థలో సెక్యూరిటీ గార్డు. మధ్యతరగతి కుటుంబానికి చెందిన ఈ చదువుల తల్లి తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్లో చదువుకుంది. అర్హత పరీక్షలో ఉత్తీర్ణత సాధించి గౌలిదొడ్డిలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కాలేజీలో సీటు సంపాదించుకుంది. ఐఐటీలో సీటు సాధించడమే లక్ష్యంగా పుస్తకాలతో కుస్తీ పట్టి చిక్కుప్రశ్నలు పరిష్కరించే మెళకువలను ఆకళింపు చేసుకుంది భార్గవి. కరోనా మహమ్మారి విరుచుకుపడినా మనోధైర్యం కోల్పోకుండా ఆన్‌లైన్ క్లాసుల ద్వారా సాధన కొనసాగించింది. జేఈఈ అడ్వాన్స్‌డ్ ఎగ్జామ్‌లో ర్యాంక్ సాధించి బాంబే ఐఐటీలో ఇంజినీరింగ్‌లో చేరింది... సాధన చేస్తే సాధ్యం కానిదేమీ లేదని నిరూపించిన భార్గవిని యంగ్ అచీవర్ ఆఫ్ ది ఇయర్ – ఎడ్యుకేషన్ అవార్డ్‌తో సత్కరించింది సాక్షి మీడియా గ్రూప్.



● భార్గవి అక్క ఝాన్సీ, తండ్రి పరమేశ్



● భార్గవి

**భార్గవి సోదరి స్పందన:**
మా అమ్మానాన్న మమ్మల్ని చదివించడానికి ఎంత కష్టపడ్డారో మాటల్లో చెప్పలేను. నేను బీటెక్ చేసి టీసీఎస్‌లో ఉద్యోగం చేస్తున్నాను. తమ్ముడు చదువుకుంటున్నాడు. చెల్లికి ఇంత గొప్ప పురస్కారం లభించడం మాకెంతో సంతోషంగా ఉంది. మాటలు రావడం లేదు.

## జాస్పర్ పాల్ | యంగ్ అచీవర్ ఆఫ్ ది ఇయర్ (సోషల్ సర్వీస్)

హైదరాబాద్‌కు చెందిన 27 ఏళ్ల జాస్పర్‌పాల్.... 2014లో ఒక ఘోర రోడ్డుప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడ్డారు. అది దేవుడు తనకు ఇచ్చిన పునర్జన్మగా భావించిన జాస్పర్ ఆ క్షణమే ఒక గట్టి సంకల్పం తీసుకున్నారు. నిలువ నీడ లేని వృద్ధులను చేరదీసి ఆశ్రయం కల్పించేందుకు 2017లో సెకండ్ ఛాన్స్ ఫౌండేషన్ స్థాపించారు. ఫుట్‌పాత్‌లపై నిస్సహాయంగా పడి ఉన్న వృద్ధులను చేరదీసి.. జీవిత చరమాంకంలో వారికి ఊరట కల్పిస్తున్నారు. ఇప్పటివరకు 2000 మందికి ఆశ్రయం కల్పించారు. 300 మందిని తిరిగి వారి కుటుంబసభ్యుల వద్దకు చేర్చారు. హైదరాబాద్‌లో జాస్పర్ నిర్వహిస్తున్న షెల్టర్‌హోమ్స్‌లో సుమారు 200 మంది ఆశ్రయం పొందుతున్నారు. అంతేకాదు...ఫ్రీ హాస్పిటల్ ఫర్ ది హోమ్‌లెస్ పేరుతో నిలువ నీడలేని వారికి ఉచిత వైద్య సేవలు అందిస్తున్న జాస్పర్ పాల్‌ని సాక్షి యంగ్ అచీవర్ ఆఫ్ ద ఇయర్ – సోషల్ సర్వీస్ అవార్డు వరించింది.



దీప్తి రావుల (వి-హబ్ సీఈవో), ప్రశాంత్‌కుమార్ (గ్రూప్–ఎం సౌత్ ఏషియా మేనేజింగ్ ఇండియా, సీఈవో)ల నుంచి అవార్డు స్వీకరిస్తున్న జాస్పర్ పాల్

**పురస్కార గ్రహీత స్పందన:** తొమ్మిదేళ్లుగా సామాజిక సేవలో ఉన్నాను. రకరకాల కారణాలతో వృద్ధులను వారి పిల్లలు వదిలేయడం గమనించాను. ఒంటరి వృద్ధులను చూసినప్పుడు బాధగా అనిపించేది. దీనికో పరిష్కారం కనుక్కోవాలని ఓల్డేజ్ హోమ్ ఏర్పాటు ద్వారా ఎందరో వృద్ధులను కాపాడగలిగాను. దీన్ని సాక్షి గుర్తించి అవార్డు ఇవ్వడం... పెద్దల ఆశీస్సులు లభించినంత ఆనందంగా ఉంది.

## పార్టిసిపేటరి రూరల్ డెవలప్‌మెంట్ ఇన్షియేటివ్ సొసైటీ | ఎక్సలెన్స్ ఇన్ ఫార్మింగ్ (ప్రొ. ఎస్వీ రెడ్డి, ప్రెసిడెంట్ అండ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్)



రైతన్నకు వెన్నుదన్నుగా నిలిచి వారి జీవన ప్రమాణాల మెరుగుదలకు కృషి చేస్తోంది పార్టిసిపేటరి రూరల్ డెవలప్‌మెంట్ ఇన్షియేటివ్ సొసైటీ. హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న ఈ సంస్థ వ్యవసాయం, పర్యావరణం, ఎరువులు, పురుగుమందుల వినియోగంపై రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. అధిక దిగుబడులు సాధించేలా రైతులకు మెళకువలు నేర్పించి, సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకునేలా శిక్షణ ఇస్తోంది. ఫలితంగా ఒక్కో రైతుకు ఎకరాకు పది వేల నుంచి 25 వేల వరకు అధికంగా ఆదాయం చేకూరుతోంది. గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాల మెరుగుకు కృషి చేస్తున్న ఈ సొసైటీని ఎక్సలెన్స్ ఇన్ ఫార్మింగ్ అవార్డుతో సత్కరించింది సాక్షి మీడియా గ్రూప్.

**పురస్కార గ్రహీత స్పందన:** సరిగ్గా చేసుకుంటే వ్యవసాయం లాభదాయకమే. ఖర్చులు తగ్గించుకోవాలి. కొత్త వంగడాలతో శ్రద్ధగా సేద్యం చేయాలి. రైతులకు నేను చెప్పే మాట ఒక్కటే... 'రసాయన ఎరువులకు బదులు గ్రీన్‌లేబుల్ ఉన్న పెస్టిసైడ్స్‌ని వాడాలి'. తెలుగు నేలకు చేస్తున్న కృషికి గుర్తింపుగా ఇచ్చిన ఈ అవార్డు అమ్మ ప్రశంసలా ఉంది.

## కేదర్ల రంగయ్య | ఎక్సలెన్స్ ఇన్ ఎడ్యుకేషన్



కొమురంభీం జిల్లా కెరమెరి మండలం సావర్ఖేడ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న కేదర్ల రంగయ్య తాను పనిచేస్తున్న గ్రామంలోనే నివాసం ఉంటూ... తన ఇద్దరు పిల్లలను సర్కారు బడిలో చేర్పించారు. ఇంటింటికి తిరిగి తల్లిదండ్రులకు నచ్చచెప్పి వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. రంగయ్య కృషిఫలితంగా విద్యార్థుల సంఖ్య 50 నుంచి 280 కి పెరిగింది. ఇక్కడ చదువుకున్న పిల్లలు జిల్లాస్థాయిలో టాపర్స్‌గా నిలిచారు. సామాజిక రుగ్మతలైన బాల్యవివాహాలు, మద్యపానానికి వ్యతిరేకంగా పోరాడారు. బెల్ట్‌షాపులు తొలగింపు కోసం నిరాహార దీక్ష చేశారు. ఫలితంగా బాల్యవివాహాలకు అడ్డుకట్ట పడింది. మద్యపానంపై స్వచ్ఛంద నిషేధం అమలవుతోంది. విద్యార్థుల భవితకు పాటుపడుతున్న ఈ ఉత్తమ ఉపాధ్యాయుణ్ణి ఎక్సలెన్స్ ఇన్ ఎడ్యుకేషన్ అవార్డుతో సత్కరించింది సాక్షి మీడియా గ్రూప్.

**పురస్కార గ్రహీత స్పందన:** పిల్లలను చైతన్యవంతం చేయడం ద్వారా సమాజాన్ని చైతన్యవంతం చేయవచ్చన్నది నా ఆలోచన. నాకు భార్య సహకారం ఉంది. సాక్షి పురస్కారం నా బాధ్యతను పెంచింది. మరింత ఉత్సాహంగా పని చేసి లక్ష్యాన్ని సాధిస్తా.

## డాక్టర్ పద్మావతి పొట్టబత్తిని | ఎక్సలెన్స్ ఇన్ సోషల్ డెవలప్‌మెంట్



వైకల్యం ఆమె అభిరుచిని అడ్డుకోలేకపోయింది. సంకల్పం ఆమెకు కొత్తదారి చూపింది. ఆవిడే పద్మావతి పొట్టబత్తిని. పసితనంలో పోలియో బారినపడ్డా, చెక్కు చెదరని మనోబలంతో తనను తాను తీర్చిదిద్దుకున్నారు. సంగీత పాఠాలు నేర్చుకున్నారు. తనలోని కళాభిరుచికి రెక్కలు తొడిగి రంగస్థల నటిగా గుర్తింపు తెచ్చుకున్నారు. దివ్యాంగుల కోసం ఒక సంస్థను ఏర్పాటుచేసి వారికి కంప్యూటర్స్, నృత్యం, సంగీతం, టైలరింగ్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇప్పించి ఉపాధి కల్పిస్తున్న పద్మావతి పలు జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు వరించడంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది. కళలు, సామాజిక సేవారంగంలో ప్రతిభ చూపుతూ ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తున్న పద్మావతిని ఎక్సలెన్స్ ఇన్ సోషల్ డెవలప్‌మెంట్ అవార్డుతో సత్కరించింది సాక్షి మీడియా గ్రూప్.

**పురస్కార గ్రహీత స్పందన:** చిన్ననాటి నుంచి ఆర్టిస్టుగా ఉండటం వల్ల నాలాగా కళాకారులు అవ్వాలనుకునే దివ్యాంగులకు సాయం చేయాలనుకున్నాను. నేను ఎదుర్కొన్న సమస్యలు మిగతావారు ఫేస్ చేయకూడదని వారికి మెరుగైన అవకాశాల కోసం ప్రయత్నిస్తున్నాను. నా కృషిని గుర్తించి, ఈ అవార్డును ఇవ్వడం ఆనందంగా ఉంది.

## డా. బి. పార్థసారథి రెడ్డి, ఛైర్మన్ (హెటిరో డ్రగ్స్) - బిజినెస్ పర్సన్ ఆఫ్ ద ఇయర్ లార్జ్ స్కేల్ (సుధాకర్ రెడ్డి, హెటిరో గ్రూప్ డైరెక్టర్)



హైదరాబాద్ ప్రధాన కేంద్రంగా పనిచేస్తున్న హెటిరో ఫార్మాస్యూటికల్స్ తమ విభిన్నమైన ఉత్పత్తులతో పరిశోధన, అభివృద్ధి, మార్కెటింగ్ పరంగా దేశవిదేశాల్లో విశేషమైన గుర్తింపు పొందింది. ప్రపంచంలోనే అత్యధికంగా యాంటీ రెట్రోవైరల్ డ్రగ్ ఉత్పత్తి చేస్తున్న ఈ ఫార్మా కంపెనీ హెచ్‌ఐవీ చికిత్సలో వినియోగించే డ్రగ్స్‌ను వందకు పైగా దేశాలకు ఎగుమతి చేస్తోంది. స్వైన్‌ఫ్లూ, కోవిడ్ చికిత్సలో వినియోగించిన ఔషధాలను పెద్దమొత్తంలో ఉత్పత్తిచేసి రికార్డు సృష్టించింది. అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే ఔషధాల ఉత్పత్తికి అంకితమై, విశేష కృషి చేస్తున్న హెటిరో గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఛైర్మన్ డా. బి.పార్థసారథి రెడ్డిని బిజినెస్ పర్సన్ ఆఫ్ ది ఇయర్ లార్జ్‌స్కేల్ అవార్డుతో సత్కరించింది సాక్షి.

**స్పందన:** (సుధాకర్ రెడ్డి, డైరెక్టర్, అవార్డు అందుకున్నారు)
మా వంతు సామాజిక బాధ్యతగా ప్రజలకు అవసరమైన ఔషధాల తయారీలో ముందుంటున్నాం. అదే నిబద్ధతతో ప్రయోగాలను కొనసాగిస్తూ మందులను తక్కువ ధరకు అందించడానికి ప్రయత్నిస్తాం.

## సునీల్ యల్లాప్రగడ | బిజినెస్ పర్సన్ ఆఫ్ ద ఇయర్ (స్మాల్, మీడియమ్)



కాంపోజిట్ మెటీరియల్స్‌తో సరికొత్త ప్రొడక్ట్స్ తయారు చేస్తూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది ట్రియోవిజన్ కాంపోజిట్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్. రైల్వేస్, ఆటోమోటివ్, విండ్, మెరైన్, డిఫెన్స్ తదితర సంస్థలకు అవసరమైన డిజైన్, టూలింగ్, కాంపోజిట్ ప్రొడక్ట్స్ సరఫరా చేస్తోంది. ట్రియోవిజన్ ఉత్పత్తులు కఠినమైన వాతావరణ పరిస్థితులను కూడా తట్టుకుంటాయి. రసాయనాలు, మంటల నుంచి రక్షణ కల్పిస్తాయి. తుప్పుపట్టవు. దేశీయంగానే కాకుండా గ్రీస్, యుఏఈ, నైజీరియా తదితర దేశాలకూ తమ ఉత్పత్తులను ఎగుమతి చేస్తోంది ట్రియోవిజన్. కాంపోజిట్ మాన్యుఫాక్చరింగ్ రంగంలో వినూత్నమైన ప్రయోగాలు చేస్తూ దేశవిదేశాల్లో వేగంగా విస్తరిస్తున్న ట్రియోవిజన్ కాంపోజిట్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత సునీల్ యల్లాప్రగడను సాక్షి స్మాల్ / మీడియం స్కేల్ – బిజినెస్ పర్సన్ ఆఫ్ ద ఇయర్ – అవార్డు వరించింది.

**పురస్కార గ్రహీత స్పందన:** మేం తయారుచేస్తున్న ఉత్పత్తులను స్వదేశంలోనే కాదు విదేశాలకు కూడా ఎగుమతి చేస్తున్నాం. మా కృషిని గుర్తించి బిజినెస్ పర్సన్ ఆఫ్ ద ఇయర్ అవార్డుతో సాక్షి మీడియా సంస్థ సత్కరించడం చాలా గొప్ప అనుభూతిని ఇచ్చింది.

## కొమెర అంకారావు (జాజి) | ఎక్సలెన్స్ ఇన్ ఎన్విరాన్‌మెంట్ కన్జర్వేషన్ (ఇండివిడ్యువల్)



పల్నాడు ప్రాంతానికి చెందిన కొమెర అంకారావుకు విద్యార్థిగా ఉన్నప్పటి నుంచే రోజూ అడవికి వెళ్లి విత్తనాలు చల్లడం... మొక్కలు నాటడం అలవాటు. అడవిలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరేయడం, వేసవిలో మొక్కలకు నీళ్లుపోసి సంరక్షించడం, వారంలో నాలుగు రోజులు అడవుల్లోనే సంచరించడం, రెండురోజులు పర్యావరణం పట్ల పిల్లల్లో అవగాహన కల్పించడం అభిరుచులు. తన పొలంలో సేంద్రియ పద్ధతిలో పంట పండించి పక్షులకు ఆహారంగా వదిలేస్తారు. అంకారావు నిస్వార్థ సేవకుగాను పలు జాతీయ, అంతర్జాతీయ అవార్డులు వరించాయి. వన్యప్రేమికుడైన అంకారావు ఉరఫ్ జాజిని ఎక్సలెన్స్ ఇన్ ఎన్విరాన్‌మెంట్ కన్జర్వేషన్ – ఇండివిడ్యువల్ అవార్డుతో సత్కరించింది సాక్షి.

**పురస్కార గ్రహీత స్పందన:** ఈ పని చేస్తే అవార్డులు వస్తాయని కూడా తెలియదు. నుచిర్ ఇండియా నుంచి సంకల్పతార, దయానంద సరస్వతి సంస్థ నుంచి వృక్షమిత్ర, చెన్నై ప్రైవేట్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పురస్కారాలందుకున్నాను. అవార్డులు వస్తాయని పనిచేయలేదు. అవార్డులు రాకపోయినా పని ఆపను.

## నెక్స్‌ఎరా ఎనర్జీ రీసోర్సెస్ | ఎక్సలెన్స్ ఇన్ ఎన్విరాన్‌మెంట్ కన్జర్వేషన్ (కార్పొరేట్) (ఎమ్.వెంకట నారాయణ రెడ్డి, సీఈవో)



వ్యర్థాల నుంచి ఎనర్జీని ఉత్పత్తి చేయడం, బయో ఇంధనం, సౌరశక్తి ఆధారిత పునరుత్పాదక ఎనర్జీ ప్రాజెక్టులను నిర్వహించడం నెక్స్ ఎరా ఎనర్జీ రీసోర్సెస్ సంస్థ ప్రధాన ఉద్దేశం. వాతావరణ మార్పులను నియంత్రిస్తూ... క్లీన్‌ఎనర్జీతో ఈ సంస్థ పలు వినూత్న కార్యక్రమాలు చేపట్టింది. పునరుత్పాదక ఇంధన పరిజ్ఞానానికి సంబంధించి శిక్షణాకోర్సుల నిర్వహణతోపాటు ఆపరేటర్లు, టెక్నీషియన్లకు అవసరమైన శిక్షణ అందిస్తోంది. వ్యర్థాల నుంచి ఇంధన ఉత్పత్తి, సోలార్ ఆఫ్- గ్రిడ్ ప్రాజెక్టులు ఏర్పాటు చేసింది ఈ సంస్థ. ప్రకృతి వనరుల సద్వినియోగంతో సామాజిక, ఆర్థిక, వ్యవసాయ అభివృద్ధితోపాటు పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటునందిస్తున్న నెక్స్‌ట్ ఎరా ఎనర్జీ రీసోర్సెస్ ప్రతినిధి ఎస్. వెంకట నారాయణరెడ్డిని ఎక్సలెన్స్ ఇన్ ఎన్విరాన్‌మెంట్ – కార్పొరేట్ అవార్డ్‌తో సత్కరించింది సాక్షి.

**పురస్కార గ్రహీత స్పందన:** సాక్షి సంస్థ మా సర్వీస్‌ను గుర్తించి అవార్డు ఇవ్వడం ఊహించని సంతోషం. సేవ చేసే వారిని గుర్తించి గౌరవించడం పెద్ద బాధ్యత. సాక్షి అంత పెద్ద బాధ్యతను నిరంతరాయంగా నిర్వహించడం అభినందనీయం.

## రోటరీ క్లబ్ ఆఫ్ లేక్ డిస్ట్రిక్ట్ మొయినాబాద్ | ఎక్సలెన్స్ ఇన్ ఎన్విరాన్‌మెంట్ కన్జర్వేషన్ (ఎన్జీఓ) (ఉదయ్ పిలాని, ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్)



పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించింది రోటరీ క్లబ్ ఆఫ్ లేక్ డిస్ట్రిక్ట్ మొయినాబాద్. హానికారకమైన ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించడం, వాటిని రీ సైక్లింగ్ చేయడం అనే బృహత్కార్యాన్ని తన భుజాన వేసుకుంది ఈ క్లబ్. గత పదేళ్లుగా విశాఖలోని బీచ్, అపార్ట్‌మెంట్స్, మార్కెట్ ప్రాంతాల్లో ఇండియా యూత్ ఫర్ సొసైటీతో కలిసి జీవీఎం సహకారంతో ఒక ప్రాసెసింగ్ ప్రాజెక్ట్‌ను నిర్వహిస్తోంది. వీరు నిర్వహిస్తున్న అవేర్‌నెస్ ప్రోగ్రామ్స్, సెమినార్స్, వర్క్‌షాప్స్ ఫలితంగా ప్రజల్లో ఆశాజనకమైన మార్పు అంకురిస్తోంది. పుడమితల్లిని కాపాడుకునేందుకు తోడ్పాటునందిస్తున్న రోటరీ క్లబ్ ఆఫ్ లేక్ డిస్ట్రిక్ట్ మొయినాబాద్ తరఫున ఉదయ్ పిలానిని ఎక్సలెన్స్ ఇన్ ఎన్విరాన్‌మెంట్ కన్సర్వేషన్ – ఎన్జీవో అవార్డ్‌తో సత్కరించింది సాక్షి.

**పురస్కార గ్రహీత స్పందన:** పర్యావరణంపై చూపే ప్రేమ ఈ రోజు ఇంతమంది ముందుకు తీసుకువచ్చింది. సాక్షి ఎక్సలెన్స్ అవార్డు సత్కారం మా రోటరీ క్లబ్‌కు ఎంతో ప్రోత్సాహాన్ని అందిస్తుంది. ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి ఈ అవార్డు ఒక మైల్‌స్టోన్ లాంటిది.

## డాక్టర్ చినబాబు సుంకవల్లి | ఎక్సలెన్స్ ఇన్ హెల్త్‌కేర్



క్యాన్సర్ సోకి ఖరీదైన వైద్యం చేయించుకోలేక ప్రాణాల మీద ఆశ వదిలేసుకున్నవారికి నేనున్నానని భరోసా కల్పిస్తున్నారు డాక్టర్ చినబాబు సుంకవల్లి. ముందస్తు రోగ నిర్ధారణ పరీక్షలతో క్యాన్సర్ ముప్పు తప్పించవచ్చనే ఆలోచనతో 2013లో గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ ఏర్పాటు చేశారు. దీని ద్వారా ఆర్థికస్తోమత లేని రోగులకు అవసరమైన వైద్యం అందించి వారికి కొత్త జీవితాన్ని అందిస్తున్నారు. మురికివాడలు, పల్లెలు, పట్టణాలు, గిరిజన తండాల్లో క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్స్ నిర్వహిస్తూ వ్యాధిపై అవగాహన కల్పిస్తోంది ఈ ఫౌండేషన్. ఈ సంవత్సరం ఇప్పటివరకు సుమారు లక్షమందికి వైద్య పరీక్షలు చేశారు. క్యాన్సర్ రోగులకు తనవంతు సేవ చేస్తున్న సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ చినబాబు సుంకవల్లిని సాక్షి ఎక్సలెన్స్ ఇన్ హెల్త్ కేర్ అవార్డ్‌తో పురస్కరించింది.

**పురస్కార గ్రహీత స్పందన:** వైద్యరంగంలో చికిత్స మాత్రమే కాదు. అంతకుమించిన సేవలు కూడా ఉంటాయి. ముఖ్యంగా క్యాన్సర్ రోగులకు ధైర్యం చెప్పి, సాంత్వన కలిగించడం, క్యాన్సర్ స్క్రీనింగ్ గురించి చైతన్యవంతం చేయడం వంటివి. మా సేవలను గుర్తించి సాక్షి ఇచ్చిన ఈ అవార్డు రెట్టించిన ఉత్సాహంతో పని చేయడానికి దోహదం చేస్తుంది.

## నెలకుర్తి సిక్కిరెడ్డి | యంగ్ అచీవర్ ఆఫ్ ది ఇయర్ (స్పోర్ట్స్)



తన ఆటతీరుతో జాతీయ.. అంతర్జాతీయ వేదికలపై సత్తా చాటుతున్న నెలకుర్తి సిక్కిరెడ్డి తండ్రి కృష్ణారెడ్డి జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు. తల్లి గృహిణి. బాల్యం నుంచి క్రీడలపై కూతురికి ఉన్న ఆసక్తిని గమనించి ప్రోత్సహించారు పేరెంట్స్. ఆమెకు బ్యాడ్మింటన్‌లో మెళకువలు నేర్పించేందుకు పుల్లెల గోపీచంద్ అకాడమీలో చేర్పించారు. అక్కడ ఆటలో కఠోరమైన శిక్షణ తీసుకున్న సిక్కిరెడ్డి స్వల్పకాలంలోనే ప్రపంచస్థాయి క్రీడాకారిణిగా ఎదిగింది. 2007లో కెరీర్‌లో తొలి అంతర్జాతీయ జూనియర్ ప్రపంచ కప్ పోటీలో పాల్గొంది. బ్యాడ్మింటన్‌లో విశేష ప్రతిభ చూపిన సిక్కిరెడ్డిని కేంద్రప్రభుత్వం అర్జున అవార్డుతో సత్కరించింది. తనకిష్టమైన క్రీడల్లో సత్తా చాటుతూ ఎంతోమందికి స్ఫూర్తినిస్తున్న సిక్కిరెడ్డిని సాక్షి ఎక్సలెన్స్ యంగ్ అచీవర్ ఆఫ్ ది ఇయర్ – స్పోర్ట్స్ అవార్డు వరించింది.

**పురస్కార గ్రహీత స్పందన:** చెప్పలేనంత ఆనందంగా ఉంది. నేను కెరీర్ మొదలు పెట్టిన తొలిరోజుల్లో ప్రారంభమైన సాక్షి, మొదటి నుంచి నాకు ప్రోత్సాహాన్నిస్తోంది. ప్రతి అవార్డూ దేనికదే ప్రత్యేకం. దేని గొప్పతనం దానిదే. సాక్షి పురస్కారం అర్జున అవార్డు మరోసారి అందుకున్నంత ఆనందాన్నిస్తోంది.

## కృష్ణ కుమ్మరి | యంగ్ అచీవర్ ఆఫ్ ది ఇయర్



జెనిఫర్ లార్సన్ (యు.ఎస్. కాన్సల్ జనరల్, హైదరాబాద్) నుంచి అవార్డు స్వీకరిస్తున్న కృష్ణ కుమ్మరి

ఇస్రోలో సైంటిస్ట్‌గా చేరి తన కల నెరవేర్చుకున్నాడు యువశాస్త్రవేత్త కృష్ణ కుమ్మరి. స్వగ్రామం జోగులాంబ గద్వాల జిల్లాలోని ఉండవల్లి. తల్లిదండ్రులు లక్ష్మీదేవి, మద్దిలేటి. కూలిపనే వారి జీవనాధారం. ఒకవైపు పేదరికం...దానికితోడు చిన్నతనంలో సోకిన పోలియో. టెన్త్ వరకు ప్రభుత్వ పాఠశాలలోనే చదివిన కృష్ణ... తిరుపతిలో డిప్లొమో, హైదరాబాద్‌లో ఇంజినీరింగ్ పూర్తి చేసి క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఉద్యోగం సాధించారు. ఇక చాలు అనుకోలేదు... 2018లో ఇస్రోలో సైంటిస్ట్‌గా చేరారు. చంద్రయాన్ – 3 ప్రాజెక్టులో పనిచేసే అవకాశం లభించింది. గ్రౌండ్ డేటా ప్రాసెసింగ్ విభాగంలో పనిచేసి ప్రాజెక్ట్ విజయవంతం కావడానికి దోహదపడ్డాడు కృష్ణ. చంద్రయాన్ 3 ప్రయోగంతో దేశప్రతిష్ఠను ఇనుమడింపచేసిన శాస్త్రవేత్తల బృందంలో ఒకరైన కృష్ణని యంగ్ అచీవర్ ఆఫ్ ది ఇయర్ అవార్డుతో సత్కరించింది సాక్షి మీడియా గ్రూప్.

**పురస్కార గ్రహీత స్పందన:** ఒక కుగ్రామంలో పుట్టి పెరిగిన నేను, ఎన్నో అడ్డంకులను ఎదుర్కొంటూ ఇస్రో వరకు వెళ్లాను. కానీ, అవార్డులు నన్ను వరిస్తాయని ఊహించలేదు. ఇంత గొప్ప వేదికపైన సాక్షి ఎక్సలెన్స్ అవార్డు అందుకోవడం ఎంతో సంతోషంగా ఉంది.

## స్వర్గీయ సి.ఆర్. రావు | తెలుగు ఎన్నారై ఆఫ్ ద ఇయర్



డాక్టర్ యు.యుగంధర్

పద్మ విభూషణ్ డాక్టర్ కల్యంపూడి రాధాకృష్ణ రావ్... కర్ణాటకలోని బళ్లారి జిల్లా హడగళిలో జన్మించారు. యూనివర్సిటీ ఆఫ్ కోల్‌కతాలో ఎం.ఎ. స్టాటిస్టిక్స్ చదివి... కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేశారు. ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్‌లో డైరెక్టర్‌గానూ, అనంతరం అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ బఫెలోలో రీసెర్చ్ ప్రొఫెసర్‌గానూ సేవలందించారు. 477 పరిశోధన పత్రాలను సమర్పించి 19 దేశాల నుంచి 39 డాక్టరేట్లు అందుకున్నారు. అమెరికా అత్యున్నత నేషనల్ మెడల్ ఆఫ్ సైన్స్ పురస్కారాన్ని అందుకున్నారు. భట్నాగర్ పురస్కారాన్ని కూడా అందుకున్నారు. గణాంక శాస్త్రంలో విప్లవాత్మకమైన ఆలోచనలకు బీజం వేసినందుకు ఆ రంగంలో నోబెల్ బహుమతికి సమానమైన ఇంటర్నేషనల్ ప్రైజ్ ఆఫ్ స్టాటిస్టిక్స్–2023 అవార్డును అందుకున్నారు సీఆర్ రావు. 102 ఏళ్ల వయసులో ఇటీవలే తుదిశ్వాస విడిచారు. గణాంక శాస్త్రంలో ఆయన అందించిన విశేషమైన సేవలను స్మరించుకుంటూ ఎక్సలెన్స్ ఇన్ ఎన్‌ఆర్‌ఐ అవార్డ్‌తో గౌరవించింది సాక్షి మీడియా గ్రూప్. డాక్టర్ సిఆర్ రావు మేనల్లుడు డాక్టర్ యు.యుగంధర్ (చీఫ్ ఎగ్జిక్యూటివ్ -ఏఐఎమ్ఎస్‌సిఎస్, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ క్యాంపస్) అవార్డును స్వీకరించారు.

సాక్షి ఎక్సలెన్స్ అవార్డ్స్ 9th ఎడిషన్ మెగా ఈవెంట్
నేటి సాయంత్రం 5.00 గంటల నుంచి మీ సాక్షి SAKSHI TV లో





● రోజా రమణికి జీవన సాఫల్య పురస్కారం అందిస్తున్న ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్, వై.ఎస్. భారతీ రెడ్డి. చిత్రంలో రోజా రమణి భర్త చక్రపాణి



● నమ్రతా శిరోద్కర్



● కైకాల లక్ష్మీనారాయణ, శ్యామలా దేవి, కాశీనాథుని నాగేంద్రనాథ్, వాడ్రేవు పద్మావతీ దేవి, వై.ఎస్. భారతీ రెడ్డి, స్రవంతి, ఆదిశేషగిరి రావు

# ఆనందం.. భావోద్వేగం 'సాక్షి'గా...

**ప్రతిభను గుర్తించి ఇచ్చే అవార్డు ఎవరికైనా బోలెడంత ఆనందాన్నిస్తుంది. ఎక్సలెన్స్‌ని అభినందిస్తూ 'సాక్షి' మీడియా గ్రూప్ పలువురు చిత్రరంగ ప్రతిభావంతులకు 'సాక్షి ఎక్సలెన్స్' అవార్డులు అందించినప్పుడు అవార్డు గ్రహీతల్లో ఆ ఆనందమే కనిపించింది.**

**నవంబర్ 16న 'సాక్షి ఎక్సలెన్స్' అవార్డుల వేడుక ఆనందం, భావోద్వేగాలతో సంబరంగా జరిగింది. ఆ వేడుక విశేషాలు ఈ విధంగా...**



● భారతీ సిమెంట్స్ మార్కెటింగ్ డైరెక్టర్ రవీందర్ రెడ్డి, నిర్మాత 'దిల్' రాజు నుంచి అవార్డు అందుకుంటున్న నిర్మాత అభిషేక్ అగర్వాల్



● భీమ్స్



● విమల్ కృష్ణ



● వీవీ వినాయక్ నుంచి అవార్డు అందుకుంటున్న కాసర్ల శ్యామ్



● వీఐటీ యూనివర్సిటీ (ఏపీ) వైస్ చాన్స్‌లర్ డా. ఎస్వీ కోటారెడ్డి, శ్యామలాదేవి నుంచి అవార్డు అందుకుంటున్న మోహనా భోగరాజు



● ఆశిష్ రెడ్డి



● శశికిరణ్ తిక్క

మాటల్లో చెప్పలేనంత సంతోషంగా ఉంది. ఎందుకంటే నా తొలి చిత్రం 'భక్త ప్రహ్లాద' విడుదలై 55 ఏళ్లయిన సందర్భంగా ఈ పురస్కారాన్ని అందుకుంటున్నాను. కళలు, కళాకారుల పట్ల 'సాక్షి' ఎంతో ఔన్నత్యంతో వ్యవహరిస్తుందనడానికి ప్రతీక ఈ పురస్కారాలు. ఇంతకాలం ఇండస్ట్రీలో ఉన్నందుకు నాకు దక్కిన ఈ గౌరవం నన్నెంతో సంతోషపరిచింది.

– ప్రముఖ నటి, డబ్బింగ్ ఆర్టిస్ట్ రోజా రమణి (జీవన సాఫల్య పురస్కారం)

★★★

నా భర్త మహేశ్ (మోస్ట్ పాపులర్ యాక్టర్ – 'సర్కారువారి పాట') గారి తరఫున 'సాక్షి ఎక్సలెన్స్' అవార్డు అందుకోవడం గౌరవంగా భావిస్తున్నాను. భారతిగారికి, 'సాక్షి ఎక్సలెన్స్' అవార్డు గ్రూప్‌కి, జ్యూరీ మెంబర్స్‌కి థ్యాంక్స్. ఈ గుర్తింపు, గౌరవం ఇచ్చిన మా ఫ్యాన్స్‌కి కృతజ్ఞతలు. మీ అభిమానం ఎప్పుడూ ఇలాగే ఉండాలి.

– నమ్రతా శిరోద్కర్

★★★

'సాక్షి ఎక్సలెన్స్' అవార్డులవేడుకకు నేను హాజరు కావడం ఇదే తొలిసారి. నైన్త్ ఎడిషన్ రన్ చేస్తున్నందుకు శుభాకాంక్షలు. భారతీ మేడమ్‌కి, 'సాక్షి'కి ధన్యవాదాలు. 'దిల్' రాజు అన్న గారి చేతుల మీదుగా అవార్డు తీసుకోవడం మోర్ స్పెషల్.

– నిర్మాత అభిషేక్ అగర్వాల్ (క్రిటికల్లీ అక్లైమ్డ్ మూవీ – 'కార్తికేయ 2')

★★★

ఈ అవార్డు గురించి మాట్లాడే ముందు నేను ఓ ఎమోషనల్ ఘటన గురించి చెబుతాను. 'బెంగాల్ టైగర్' సినిమా చేసిన తర్వాత నా చేతిలో సినిమాలు లేనప్పుడు, నేను ఆల్మోస్ట్ చివరి దశలో ఉన్నప్పుడు తిరిగి నన్ను ప్రథమ దశకు చేర్చిన నా హీరో, రవి తేజగారికి ఈ వేదికపై నుంచి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు చెబుతున్నాను. ఈ అవార్డుని నేను ఆయనకు అంకితం చేస్తున్నాను. ఏం చేయాలో తెలియని ఓ దిక్కు తోచని స్థితిలో నేను ఉన్నప్పుడు, ఇక జీవనం కొనసాగించడం చాలా దుర్లభమేమో అనే స్థితిలో... నేను, నా ఫ్యామిలీ ఈ భూమి నుంచి, జనం నుంచి దూరం కావాలని.. ఓ సెల్ఫీ వీడియో తీసుకున్నటువంటి బాధాకరమైన ఘటన అది. ఆ తర్వాతి రోజు రవితేజగారు ఫోన్ చేసి, 'ఎక్కడ ఉన్నావ్' అన్నారు. 'ఇంట్లో ఉన్నాను సార్' అన్నాను. 'వెళ్లి సినిమా చెయ్' అన్నారు. ఆ సినిమా పేరు 'ధమాకా'. నేను, నా కుటుంబం ఈ రోజు సజీవంగా ఉన్నామంటే దానికి కారణం మాస్ మహారాజా రవితేజ సార్. 'సాక్షి' టీవీతో నాకు మంచి అనుబంధం ఉంది. ఎన్నో పాటలు రాశాను. జగన్‌మోహన్ రెడ్డిగారికి అంకితం చేశాను. అలా నన్ను ప్రోత్సహించినందుకు, జగన్ సార్‌కి, 'సాక్షి' మీడియాకి రుణపడి ఉన్నాను.

– భీమ్స్ (పాపులర్ మ్యూజిక్ డైరెక్టర్ – 'ధమాకా')

★★★

"నాకు వచ్చిన తొలి అవార్డు ఇది. ప్రతిష్ఠాత్మక అవార్డు ఇచ్చిన 'సాక్షి'కి ధన్యవాదాలు. పాట తల్లి కొంగు పట్టుకుని వరంగల్ నుంచి హైదరాబాద్ వచ్చాను. నన్ను ఆదరించిన సినీ రంగం, అభిమానించిన ప్రేక్షకులు, నాకు అవకాశాలిచ్చి ప్రోత్సహించిన దర్శక-నిర్మాతలు, హీరోలు.. సంగీత దర్శకులు... అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు. 'డీజే టిల్లు'లో నాకు పాట రాసే అవకాశం ఇచ్చిన సంగీత దర్శకుడు రామ్ మిరియాల, దర్శకుడు విమల్ కృష్ణ, హీరో సిద్ధు, నిర్మాతలు చినబాబు, వంశీగార్లకు కృతజ్ఞతలు. మరిన్ని మంచి పాటలు రాస్తాను.

– కాసర్ల శ్యామ్ (మోస్ట్ పాపులర్ లిరిసిస్ట్ – 'డీజే టిల్లు' టైటిల్ సాంగ్)

★★★



● 'నీ జీనూ ప్యాంటు చూసి బుల్లెమ్మో...' పాటకు భార్య జుబైదాతో కలిసి స్టెప్పులేసిన అలీ





కృష్ణగారు 'అందరూ బాగుండాలి.. అందులో నేనుండాలి' సినిమా చూసి, నన్ను ఇంటికి పిలిస్తే వెళ్లాను. 'నీ సినిమా చూశానయ్యా.. బాగా చేశావ్. నువ్వు కూడా చాలా అందంగా ఉన్నావ్' అన్నారు. 'మీ అందం ముందు మాది ఎంత సార్.. మీరు సిమ్లా ఆపిల్‌లా ఉంటారు' అని నేను అనగానే ఆయన మురిసిపోయారు. అలాంటి కృష్ణగారి తమ్ముడు ఆది శేషగిరిరావుగారి చేతుల మీదుగా అవార్డు అందుకుంటానని అనుకోలేదు. భారతిగారికి, 'సాక్షి ఎక్సలెన్స్' అవార్డ్స్‌కి థ్యాంక్స్. మా సినిమాని ఆదరించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు. ఈ అవార్డు నా ఒక్కడిదే కాదు.. నా టీమ్ అందరిదీ.

– అలీ (పాపులర్ ఓటీటీ ఫిల్మ్ – ('అందరూ బాగుండాలి..అందులో నేనుండాలి')



"ఇటీవలే ధనలక్ష్మీ (మేజర్ సందీప్ ఉన్ని కృష్ణన్ తల్లి) గారితో ఓ గంట మాట్లాడాను. ఏంటి శేష్.. నెలకు ఒకసారే మాట్లాడుతున్నావ్.. రెండు నెలలకు ఒకసారే కలుస్తున్నావ్ అన్నారు. బెంగళూరుకు ఏదో ఒక బహుమతితో వస్తానమ్మా అన్నాను. ఈ 'సాక్షి' అవార్డు ఓ చక్కని బహుమతి. కొన్ని రోజుల్లో బెంగళూరు వెళ్తున్నాను. సందీప్ అమ్మగారికి ఈ అవార్డు ఇస్తాను. సందీప్ ఉన్నికృష్ణన్ చేసిన త్యాగానికి ఇదొక చిన్న అభినందనలాంటిది. ఆయన దేశం కోసం చేసిన సేవలకు, త్యాగంతో దేశాన్ని నిలబెట్టిన దానికి నేను ఎప్పుడూ థ్యాంక్‌ఫుల్‌గా ఉంటాను. అమితాబ్ బచ్చన్, రజనీకాంత్‌గార్లకు ఫ్యాన్స్ ఎలా ఉంటారో.. అలా నేను సందీప్‌గారికి అభిమానిని. ఆయన మంచి మానవతావాది. నన్ను ఆశీర్వదించినందుకు థ్యాంక్యూ సార్.. జై హింద్. 'మేజర్'కి నాకు అవకాశం కల్పించిన మహేశ్ సార్, నమ్రత మేడమ్‌లకు, 'మేజర్'ను ప్రారంభించిన నిర్మాత అనురాగ్‌కు, ఈ జర్నీని నిజం చేసిన దర్శకుడు శశికి థ్యాంక్స్.

– అడివి శేష్ (జ్యూరీ స్పెషల్ అవార్డు – 'మేజర్')

ఈ రోజు ఇంతమంది పెద్దల ముందు 'సాక్షి ఎక్సలెన్స్' అవార్డు తీసుకోవడం ఆనందంగా ఉంది. ముఖ్యంగా ప్రభాస్‌గారంటే నాకు చాలా అభిమానం. అలాంటిది శ్యామలాదేవిగారి చేతుల మీదుగా అవార్డు తీసుకోవడం మరింత సంతోషంగా ఉంది. 'బింబిసార'లో ఈ పాట (నీతో ఉంటే చాలు... ) పాడే అవకాశం ఇచ్చిన సంగీత దర్శకుడు కీరవాణి గారికి థ్యాంక్స్. 'సాక్షి' అవార్డు నాకు చాలా స్ఫూర్తినిస్తుంది.. యాజమాన్యానికి ధన్యవాదాలు.

– మోహనా భోగరాజు (మోస్ట్ పాపులర్ సింగర్)

★★★

ఇది నా తొలి అవార్డు. నేను ఎన్ని సినిమాలు తీసినా, ఎన్ని అవార్డులు గెలుచుకున్నా సరే.. 'డీజే టిల్లు', ఈ అవార్డు నాకు స్పెషల్. ఈ సినిమాను మేం కరోనా టైమ్‌లో చిత్రీకరించాం. చాలామంది వారి వ్యక్తిగత జీవితాలను పక్కనపెట్టారు. మానసికంగా కాస్త ఒత్తిడికి లోనైనా వంద శాతం ఎఫర్ట్స్ పెట్టారు. వాళ్లు ఆ విధంగా ఎఫర్ట్స్ పెట్టక పోయినట్లయితే ఈ అవార్డుతో నేను ఇప్పుడు ఇక్కడ నిల్చునేవాణ్ణి కాను. వారందరికీ థ్యాంక్స్. 'ఏంటి మీ అబ్బాయి పదేళ్లుగా ఖాళీగా ఉన్నాడా?' అనే మా చుట్టు పక్కలవారి ప్రశ్నలను భరిస్తూ, నన్ను ప్రోత్సహించిన నా కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు. నేను ఈ కథను చెప్పినప్పుడు, ఈ కథను, నాలోని పిచ్చిని నమ్మి చాన్స్ ఇచ్చిన సిద్ధుకు, నిర్మాతలు చినబాబుగారు, వంశీ అన్న, ముఖ్యంగా త్రివిక్రమ్‌గారికి ధన్యవాదాలు.

– విమల్‌కృష్ణ (డెబ్యూడెంట్ డైరెక్టర్ – 'డీజే టిల్లు)

★★★



నన్ను ఈ వేడుకకు ఆహ్వానించినందుకు 'సాక్షి' టీమ్‌కు ధన్యవాదాలు. విజేతలకు శుభాకాంక్షలు. రెండేళ్లుగా క్యాన్సర్ ట్రీట్‌మెంట్ తీసుకున్నాను. క్యాన్సర్‌తో పోరాడాను. ఇప్పుడు నార్మల్‌గా ఉంది. ఈ వేదిక పై ఉండటం సంతోషంగా ఉంది. త్వరలోనే యాక్టింగ్ స్టార్ట్ చేస్తాను. కెమెరాపై నాకున్న ప్రేమే నన్ను ముందుకు నడిపిస్తుంటుంది. మా అమ్మగారి జ్ఞాపకార్థం ఇటీవలే నేను 'యామిని క్యాన్సర్ ఫౌండేషన్'ను ఆరంభించాను. మహిళల ఆరోగ్యం, జెనెటిక్ కాన్సర్ వంటి అంశాలపై అవగాహన కల్పిస్తాం.

– నటి హంసానందిని

ఈ అవార్డుకు నన్ను ఎంపిక చేసిన 'సాక్షి' టీమ్‌కు ధన్యవాదాలు. నా కెరీర్‌లో తొలి సినిమా 'రౌడీ బాయ్స్' నాకు స్పెషల్ ఫిల్మ్. రాజు ('దిల్' రాజు) గారికి థ్యాంక్స్. నా తొలి సినిమాకు దర్శకుడు హర్ష కొనుగంటి, అనుపమా పరమేశ్వరన్ చాలా సపోర్ట్ చేశారు. నిర్మాత అభిషేక్ అగర్వాల్ అన్న చేతుల మీదుగా అవార్డు అందుకోవడం చాలా సంతోషంగా ఉంది.

– ఆశిష్ రెడ్డి (డెబ్యూడెంట్ లీడ్ యాక్టర్ – 'రౌడీ బాయ్స్')

★★★



అవార్డ్స్ ఫంక్షన్స్‌లో గ్రహీతలు అవార్డులు తీసుకున్నప్పుడు ఎమోషనల్ స్పీచ్‌లు ఇస్తే.. దీనికి ఎందుకు ఇంత చేస్తున్నారు? అనుకునేదాన్ని. అలా అనుకున్నందుకు ఇప్పుడు గిల్టీగా ఫీలవుతున్నాను. ఇప్పుడు ఇలా ఓ వేదికపై అవార్డు తీసుకుంటుంటే.. అవార్డులు ఎంత ప్రత్యేకమో తెలుస్తోంది. ఈ అవార్డుతో 'మసూద' సినిమాను నాకు మరింత స్పెషల్‌గా చేసిన 'సాక్షి'కి, భారతి మేడమ్‌కి ధన్యవాదాలు. 'గంగోత్రి' సినిమా (చైల్డ్ ఆర్టిస్ట్) విడుదలై 20 ఏళ్లయింది. ఇప్పుడు బెస్ట్ డెబ్యూడెంట్ లీడ్ యాక్ట్రెస్ అవార్డు తీసుకున్నాను. మా దర్శకుడు సాయికిరణ్, తిరువీర్, నిర్మాత రాహుల్‌గార్లు.. ఇలా టీమ్ అందరికీ థ్యాంక్స్. 'మసూద'కు ప్రేక్షకులు ఇచ్చిన ఆదరణ మాకు ప్రోత్సాహాన్నిచ్చింది.

– కావ్యా కల్యాణ్‌రామ్

"మా టీమ్ అందరికీ 'మేజర్' ఎమోషనల్ మూవీ. ఈ సినిమా చిత్రీకరణ సమయంలో, రిలీజ్ సమయంలో ఎలాంటి ఎమోషన్‌తో ఉన్నామో.. ఇప్పుడూ అదే ఎమోషన్‌తో ఉన్నాం. గ్రేట్ సోల్జర్‌కు మేం చేయగలిగిన ట్రిబ్యూట్‌గా ఈ సినిమా చేశాం. మహేశ్‌బాబుగారు, నమ్రత మేడమ్, శరత్, అనురాగ్, సోనీ పిక్చర్స్‌కు ధన్యవాదాలు. ముఖ్యంగా నా స్నేహితుడు హీరో అడివి శేష్‌కు. వీరందరూ 'మేజర్' సినిమాకు నన్ను దర్శకుడిగా ఎంపిక చేసుకున్నందుకు ధన్యవాదాలు.

– శశికిరణ్ తిక్క (క్రిటికల్లీ అక్లైమ్డ్ డైరెక్టర్ – 'మేజర్')

**గడచిన ఏడాది నుంచి ఈ ఏడాది వరకూ తెలుగు సినిమా రంగం ఎందరో ప్రముఖులను కోల్పోయింది. కళాతపస్వి కె. విశ్వనాథ్, ప్రజానటి జమున, సూపర్ స్టార్ కృష్ణ, రెబల్ స్టార్ కృష్ణంరాజు, నవరస నటనాసార్వభౌమ కైకాల సత్యనారాయణ, సీనియర్ నటులు శరత్‌బాబు, చంద్రమోహన్, చలపతిరావు, ఎం. బాలయ్య, ప్రముఖ నటుడు నందమూరి తారకరత్న, నటుడు-నిర్మాత రమేశ్‌బాబు, ప్రముఖ దర్శకుడు వి. సాగర్, రచయిత కందికొండ... ఇలా ఎందరో. వీరి మృతికి సంతాప సూచకంగా మౌనం పాటించి, నివాళులు అర్పించింది 'సాక్షి'. దివంగత ప్రముఖుల్లోని కొందరి కుటుంబ సభ్యులను ఆహ్వానించింది. ఈ ప్రత్యేక నివాళి కార్యక్రమంలో పాల్గొన్న వారి స్పందన...**

ఈ రోజు మాకు చాలా సంతోషకరమైన రోజు. 'సాక్షి' సంస్థకి, భారతిగారికి మా కుటుంబ సభ్యులందరి తరఫున కృతజ్ఞతలు చెప్పుకుంటున్నాను. నాన్నగారితో పాటు ఇక్కడ వీడియోల్లో చాలా మంది పెద్దవాళ్లను చూపించారు. వారిని లేట్ (చనిపోయిన) అనలేం. వాళ్లు ఎప్పుడూ మనతోనే ఉన్నారు. మీరు ఇచ్చిన ఈ గౌరవం, ప్రోత్సాహం, ప్రేమ, అభిమానానికి మా కుటుంబంలోని అందరం మళ్లీ మళ్లీ 'సాక్షి'కి, భారతి గారికి కృతజ్ఞతలు చెప్పుకుంటున్నాం.

– కళాతపస్వి కె. విశ్వనాథ్ తనయుడు కాశీనాథుని నాగేంద్రనాథ్

ఈ అవార్డు కృష్ణగారిది. 'సాక్షి' యాజమాన్యానికి, ముఖ్యంగా భారతిగారికి, వారి టీమ్‌కి కృతజ్ఞతలు, అభినందనలు. 'సాక్షి ఎక్సలెన్స్' అవార్డుల్లో ప్రతి ఏడాది ఒక విశిష్టత కనిపిస్తుంటుంది. కేవలం సినిమా వాళ్లకే కాకుండా ఎన్నో రంగాల వారికి అవార్డులు ఇవ్వడం సంతోషం. నేను ఎన్నో అవార్డు వేడుకలు చూశాను కానీ, తొలి నుంచి 'సాక్షి'లో వైవిధ్యం ఉంటుంది.. ఇందుకు హృదయపూర్వకంగా వారికి అభినందనలు.

– సూపర్‌స్టార్ కృష్ణ సోదరుడు, నిర్మాత జి. ఆదిశేషగిరి రావు

ఈ రోజు 'సాక్షి', భారతి గారు ఇంత అద్భుతమైన కార్యక్రమం నిర్వహించడం చాలా ఆనందంగా ఉంది. ఈ వేడుక నా మనసుకు బాగా దగ్గరైంది. ఈ ఏడాది సినీ రంగానికి చాలా పెద్ద నష్టం జరిగింది. అమ్మ కూడా ఈ ఏడాది దూరం అయిపోయారు. 'నా కళ్ల ముందే ఇంతమంది వెళ్లిపోతున్నారు.. నా టైమ్ ఎప్పుడొస్తుందో' అంటుండేవారు అమ్మ. అంతేకాదు.. అమ్మ మరో మాట కూడా అనేవారు. 'ఒక ఆర్టిస్ట్‌కి మరణం ఎప్పుడూ ఉండదు.. తరతరాలుగా వాళ్లని ఎప్పుడూ గుర్తు పెట్టుకుంటారు' అని. 'సాక్షి' అవార్డు అనేది ఆమెకు నిజమైన నివాళి. థ్యాంక్యూ టు సాక్షి.

– ప్రజానటి జమున కుమార్తె స్రవంతి

ఐదేళ్ల వెనక్కి వెళితే.. కృష్ణంరాజుగారు, నేను ఇదే వేదికని అలంకరించాం. ఆయనకి భారతిగారు 'సాక్షి ఎక్సలెన్స్' అవార్డు ఇచ్చారు. అలాగే కృష్ణంరాజుగారి చేతుల మీదుగా రామ్‌చరణ్‌కి, మరికొందరికి అవార్డులు ఇప్పించారు భారతి గారు. ఆ జ్ఞాపకాలను ఎప్పటికీ మరచిపోలేం. ఈ రోజు నిజంగా నాకు చాలా ఆనందంగా ఉంది. నటీనటులకు మరణం లేదు.. ఎందుకంటే ఎంతోమంది అభిమానులను, వారసులను, కుటుంబ సభ్యులను సంపాదించుకున్నారు. వీళ్లందరిలోనూ వాళ్లు ఉంటారు. కృష్ణంరాజు, కృష్ణ, వైయస్ రాజశేఖర రెడ్డిగార్లు... వీళ్లందరికీ మరణం లేదు. అన్ని రంగాల్లో ఉన్న ప్రతిభావంతులను గుర్తించి, వారిని సత్కరించడం భారతిగారి గొప్పతనం.. సంస్కారం. వైయస్ రాజశేఖర రెడ్డి.. కృష్ణంరాజుగార్ల మధ్య ఎంతో అనుబంధం ఉంది. కృష్ణంరాజుగారి ఆశయాలు ఎన్నో ఉన్నాయి.. ఆయన వారసుడిగా వాటన్నింటినీ ముందుకు తీసుకెళతాడు మా ప్రభాస్. అలాగే కృష్ణగారి అబ్బాయి మహేశ్ బాబు కూడా ఎంతో మంది చిన్నారుల వైద్యానికి సాయం చేస్తున్నారు. ఇలా వాళ్ల వారసులు మనలోనే ఉన్నారు కాబట్టి వారికి మరణం లేదు. 'ఒక పత్రికను నడపడం అంటే మామూలు విషయం కాదు.. ఎన్నో ఒడిదుడుకులు ఉంటాయి. అలాంటిది భారతిగారు చాలా సింపుల్‌గా ఉంటూ ఆ సంస్థని ఎంతో ముందుకు తీసుకెళ్లారు.. ఆమెను ఆదర్శంగా తీసుకోవాలి' అంటుండేవారు కృష్ణంరాజు గారు. ఈ సంస్థని మరింత ముందుకు తీసుకెళ్లాలని భారతిగారిని కోరుతున్నాను.

– రెబల్ స్టార్ కృష్ణంరాజు సతీమణి శ్యామలా దేవి

అందరికీ నమస్కారం. నాన్నగారికి ఈ అవార్డు ఇచ్చినందుకు భారతిగారికి, 'సాక్షి'కి అభినందనలు తెలుపుకుంటున్నాను.

– కైకాల సత్యనారాయణ తనయుడు కైకాల లక్ష్మీనారాయణ

**'సాక్షి' అవార్డుల వేడుకలో పలువురు ప్రముఖులు అతిథులుగా పాల్గొన్నారు. వారి స్పందన ఈ విధంగా..**

అందర్నీ ప్రోత్సహిస్తూ ఎన్నో ఏళ్లుగా అవార్డులు ఇస్తున్న 'సాక్షి' యాజమాన్యానికి, ముఖ్యంగా భారతిగారికి ధన్యవాదాలు. కళాకారులైనా, సంఘ సేవకులైనా.. అవార్డులనేవి ఎంతో ఆనందాన్ని ఇస్తాయి. ఆ ఆనందాన్ని ప్రతి ఏడాది అందరికీ పంచుతున్న 'సాక్షి'కి అభినందనలు.

– దర్శకుడు వీవీ వినాయక్

విభిన్న రంగాలవారిని ఎంపిక చేసి, అవార్డులు ఇచ్చి, ప్రోత్సహిస్తున్నందుకు 'సాక్షి' యాజమాన్యానికి, భారతిగారికి థ్యాంక్స్. 'కశ్మీరీ ఫైల్స్'తో ఇండియా మొత్తం హల్‌చల్ చేసిన నిర్మాత అభిషేక్ అగర్వాల్ మా కంటే ఎంతో ముందున్నాడు. గ్రేట్ ఫిల్మ్ 'మేజర్'. ఇండియా మొత్తం 'మేజర్' సినిమాను అప్రిషియేట్ చేశారు. వీరితో పాటు ఇంకా అవార్డు అందుకున్న అందరికీ శుభాకాంక్షలు.

– నిర్మాత 'దిల్' రాజు



సాక్షి ఎక్సలెన్స్' అవార్డ్స్ వేడుకలో పాల్గొనడం ఆనందంగా ఉంది. అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు.

– నిర్మాత నల్లమలుపు శ్రీనివాస్ (బుజ్జి)

## గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

## వధువు కావలెను



2nd మ్యారేజ్ /CNB/ 43Y/ 5.6/ BA/ JOB35K per month/ No Properties/ Hyd వరుడుకు అందమైన వధువు కావలెను. 8978315155 [H-793635]

క్రిస్టియన్ మాల/M.Tech/Govt. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్/ONGC/1.30 Lakhs. PM/ 5'11" ఎత్తు/29 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 9966760501 [HA-13229]

గౌడ/M.Tech/C.Govt.స్టేషన్ మాస్టర్/ రైల్వే/80,000/-PM/6'ఎత్తు/29 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 9618007652 [HA-13229]

కుల ప్రసక్తి లేని, 37 సం॥ల బిజినెస్ చేస్తున్న వరుడికి రెండవ, విడో పిల్లలు ఉన్న వారైనా వధువు కావలెను. జౌరీ ప్రసక్తి లేదు. Ph: 6301055248, 7396730091 [HA-13229]

క్రిస్టియన్ మాదిగ/M.Tech/C.Govt. ఇన్స్‌పెక్టర్/కస్టమ్స్ Dept/80,000/-PM/6' ఎత్తు/29 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 9618008271 [HA-13229]

వడ్డెర/కట్నం ప్రసక్తి లేదు / B.Tech / C. Govt. Asst. మేనేజర్/ SBI / 60,000/- PM/5'10"ఎత్తు/28 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 8341650195 [HA-13229]

SC మాల 43 ఒంటరి రెండవ బిజినెస్ / మంచి ఆస్తి ఇల్లు గల వరునికి 1వ లేదా 2వ వధువు (కుల పట్టింపు లేదు) కావలెను. ఫోన్: 8919914094. (డైరెక్ట్). [H-788498]

రజక/కట్నం ప్రసక్తి లేదు/M.Tech/కెనరా బ్యాంక్ మేనేజర్/80000/-PM/ 5'9" ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. 7013449343 [HA-13235]

రెడ్డి/5'3"/35yrs, Ph.D. Govt. Teacher /Well Settled. Own House/డిగ్రీ & PG చేసిన, అందమైన అమ్మాయి కావలెను. కుల ప్రసక్తి లేదు. Ph: 9908240768 [HA-13235]

పద్మశాలి/CNB/5'10"/ M.Tech (IIT) Gate All India 5th Rank, 1.5 Cr PA వరునికి తగిన వధువు కావలెను. Ph: 9381696641 [H-788166]

CNB క్రిస్టియన్ మాల 46 ఎరువు, లేటు మ్యారేజ్, 3 Cr స్థిరాస్తి, Hyd లో ప్రైవేట్ సర్వేయర్‌కు తగిన వధువు కావలెను. డైరెక్ట్ సంప్ర॥ 9948604039 [Y-1124143]


★

వైశ్య వరుడు RMP డాక్టర్ వరునికి వధువు కావలెను. కుల పట్టింపులేదు మరియు రెండో పెండ్లి వారు కూడ సంప్రదించవచ్చును. ఇది డైరెక్ట్‌గా ఇచ్చినాము. సంప్ర॥ 8790197318 [Y-784403]

రెడ్డి/లేట్ మ్యారేజ్/39y/నెలకు లక్ష రూపాయల ఆదాయం. HYD లో సొంత ఇల్లు కోట్ల ప్రాపర్టీ గల హైదరాబాద్ వరుడికి ఓల్డ్ తెలంగాణ వధువు కావలెను. డైవర్సీ /విడో Ok కుల, కట్నం ప్రసక్తి లేదు డైరెక్ట్ ఫోన్ 7989079290 [H-793432]

ఆర్య వైశ్య / కుల పట్టింపు లేదు/ 32/5'6"/MBA/ 65 వేలు, వరుడుకు చదువుకున్న అందమైన వధువు కావలెను. సంప్ర : 8639798537 [H-193300]

## వరుడు కావలెను



బ్రాహ్మణ/47yr/5'4"PG/ కుల పట్టింపులేదు/ 2వ మ్యారేజ్/షైనర్/Govt ఎంప్లాయి 70K (pm) & 2 సొంత ఇల్లు కలిగి పిల్లలు లేని అందమైన వధువుకు వరుడు కావలెను (ఇల్లరికం OK ) సంప్ర: 7993666235 [H-793635]

MBA డైవర్సీ 2వ పెళ్లి 37 yrs Govt ఎంప్లాయ్ 2,50,000/- (pm) కులపట్టింపు లేని వెల్ సెటిల్డ్ అందమైన వధువుకి వరుడు కావలెను (పిల్లలు ఉన్న) సంప్ర: 7386550413 [H-793635]

రెడ్డి/విడో/ఒంటరి/53Y/hyd lo డెయిరీ ఫామ్/ సొంత ఫ్లాట్ షోరూం/మంచి ఆస్తి గల వధువుకి కుల,ఆస్తి ప్రసక్తి లేని వరుడు కావలెను. (మనీ సపోర్ట్) (నో బ్రోకర్స్) 7799088500, 7886660643 [H-793635]

## అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com, e-mail: avinash11818@gmail.com

### వధువు కావలెను

రెడ్డి Citizen, BS, 28, 6', MicroSoft, Handsome, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Business, 28, 5'10", Rich Family, Hyd, Handsome. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 26, 6', Data Analyst, 25 Crores, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 26, 5'9", Engineer, 110 K, 40 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

### వరుడు కావలెను

రెడ్డి Citizen, BS, MD, 24, 5'2", 50 Crores, Fair & Slim, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Business, MBBS, 30, 5' 2", 75 Crores, Hyd, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Govt, MBA, 27, 5' 3", 18 L P/A, 18 Crores, Hyd, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 26, 5' 5", Sr SWE, 120 K, 4 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.




రెడ్డి BE, MS, 28, 6' 1", SWE, 200 K, 80 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Australia, BE, MS, 29, Analyst, Rich Family, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 29, 5'7", PG Doctor, 30 Crores, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, BE NIT, 40, 5'8", Sr SWE 60 L P/A, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 26, 5'4", 10 Crores, Hyderabad, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 28, 5'4", Amazon, 200 K, USA, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, Residency Doctor, 28, 5' 2", USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, MBBS, MD, 32, 5' 2", Doctor, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

LETTER

కాపు/ విడో /32y / 5'4" / Fair / MA/ Govt.లెక్చరర్ / 95,000/-PM /పిల్లలులేని వధువుకు తగిన వరుడు కావలెను. Ph : 6309344166 [H-787754]

కుల ప్రసక్తి లేదు/ విడో /49y / Dipam Officer/ 2 L PM/Own House/ 40 ఎ॥ ల్యాండ్స్ /కోట్ల ప్రాపర్టీ గల ఆర్థికంగా స్థిరపడిన అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 7842769928 [H-787754]

రెడ్డి/ డైవర్సీ/26y/5'5"/Fair/BE, SWE / ప్రముఖ MNC కంపెనీలో జాబ్ చేస్తున్న పిల్లలు లేని వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ గల వధువుకు వరుడు కావలెను. Ph: 9985746131 [H-787754]

రెండవ పెళ్ళి/విడో/48y/తిరుపతి/Own House (Rents)/Well Settled/Own Lands గల ఏ బాధరబందీలేని అందమైన ఏకైక వధువు కు FC/BC వరుడు కావలెను. Ph: 7997175138 [H-787754]

రెడ్డి/విడో/28y/Fair/ M.Tech / SWE/ 1.5L PM/ Own House/కోట్ల ప్రాపర్టీ గల పిల్లలులేని అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 9985748142 [H-787754]

ముదిరాజ్/B.Tech/Govt.Asst.ఇంజినీర్/ట్రాన్స్‌కో/60,000/-PM/5'4" ఎత్తు /25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618007652 [HA-13229]

వడ్డెర/ఏకైక కుమార్తె/B.Tech/ Govt. సబ్ ఇంజినీర్/ఎలక్ట్రికల్ Dept/80,000/-PM/5'5" ఎత్తు/24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9966760501 [HA-13229]

SC హిందూమాల/B.Tech, IIT, MBA, IIM /C.Govt.Asst.ఇంజినీర్/IOCL/1 Lakh. PM/ 5'5"ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9966760501 [HA-13229]

గౌడ/B.Tech / C.Govt. బ్యాంక్ క్యాషియర్/ ఇండియన్ బ్యాంక్/ 42000/- PM/ 5'4"ఎత్తు/24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9515942275 [HA-13229]

SC హిందూమాదిగ/B.Tech/ C.Govt. టెక్నికల్ Asst./ఇస్రో/60,000/-PM/ 5'5" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618008271 [HA-13229]

బ్రాహ్మణ/విడో/ 58y/ ప్రభుత్వ పెన్షనర్, రెండు ఇళ్ళు గల ఒంటరి వధువుకు కుల ప్రసక్తిలేని వరుడు కావలెను. Ph: 9121509718 [H-793395]

పద్మశాలి/58y/ విడో/5'4"/ Govt. టీచర్/ 80,000/-pm/ 2 సొంత ఇళ్ళు / ట్యూషన్స్ 50,000/- pm ఎవరూలేని ఒంటరి వధువుకు వరుడు కావలెను. కుల ప్రసక్తిలేదు. Ph: 6281731720 [H-793395]

FC/విడో/60y/5'4"/ రిటైర్డ్ పెన్షనర్/ సొంత ఇల్లు & రెంట్స్/ 5 ఎకరాల పొలం/ సాంప్రదాయ కుటుంబానికి చెందిన వెల్‌సెటిల్డ్ ఒంటరి వధువుకు స్నేహభావం గల వరుడు కావలెను. కుల ప్రసక్తిలేదు. Ph: 9030711984 [H-793395]

2వ పెళ్లి/కుల ప్రసక్తిలేదు/35y/ B.Tech, EEE/ Govt. ఆఫీసర్/ 2 లక్షలు (pm), సొంత ఇల్లు + కారు, పిల్లలులేని 100 కోట్ల ఆస్తి గల V. ఫెయిర్, వెల్ సెటిల్డ్ వధువుకి వరుడు కావలెను. (పిల్లలున్నా & ఇల్లరికం Ok). Ph: 8341454870 [H-793395]

SC మాల హిందూ/B.Tech/ 25y/5'4"/ సాఫ్ట్‌వేర్ ఇన్ఫోసిస్ (Hyd), 60K per month/ చాలా అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 9705960270 [H-793395]

హిందూ/ 2వ పెళ్లి, లేట్ మ్యారేజ్ వధువులు కలరు. వరులు కావలెను. 40Yrs+ కుల ప్రసక్తి లేదు. Ph: 8340059430 [HA-13235]

కుల పట్టింపు లేదు/23y&25y&26y&27y& 29y&30y&31y&33y&35y&37y&39y&40y&41y&43y &45y&47y&49y&50y&51&52y&54&55y&57y&59y "మా సేవ" (Since 1998): PH/WA: 9291503949 [HA-13235]

రెడ్డి/2nd మ్యారేజ్ : కుల, మత, ఆస్తి ప్రసక్తి లేదు/Age: 29, Qly: డిగ్రీ/సొంత వ్యాపారం కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను. 1st (or) 2nd (ఇల్లరికం OK) Ph: 9515673252 [HA-13235]

రెడ్డి 30yr/5'4"/కుల పట్టింపులేదు/ఫెయిర్/ MA.B.ed/ Govt ఎంప్లాయ్ 50k (PM) వెల్‌సెటిల్ ఫ్యామిలీ బిజినెస్ & సొంత ఇల్లు కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను. (ఇల్లరికం ok) సంప్ర: 8008474869 [H-793635]

## వేదికలు



శుభమస్తు మ్యారేజ్ బ్యూరో TM/ Est : 1995, గౌడ, ఈడిగ, శెట్టి బలిజ, 1st/ 2nd దేశ/విదేశ సంబంధాలకై సం॥ S.రాములు గౌడ్, లింగాల కాంప్లెక్స్, DSNR, Hyd. వ్యవస్థాపకులు: స్వర్గీయ S.నారదాగౌడ్, Ph: 8790690309 [H-793387]

ధృవ మ్యారేజెస్. అన్ని కులాల వారికి 1/2/విడో/డైవర్స్ తగిన సంబంధాలు చూడబడును. 22 నుండి 60 సం॥ వారికి. 9949395407 [H-793556]

Brahmin పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 9949233422/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13236]

Christian పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 7032018248/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13236]

Padmashali పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 9949233422/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13236]

Madiga - Mala పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 7032018248/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-13236]

Kamma, Kapu, Reddy పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profiles తో నమ్మకమైన సంస్థ. Ph: 9949233422/Blue Trend Matrimonial (P) Ltd. [HA-13236]

పెళ్లి సంబంధాలు-కాపు, మున్నూరు కాపు, తెలగ, బలిజ, చౌదరి, రెడ్డి కులస్తులకు, సాఫ్ట్ వేర్స్, డాక్టర్స్, అబ్రాడ్ వారికి Specialగా చూడబడును, పూర్ణ మ్యాట్రిమోనీ, తిరుపతి, 7093722724. [T-1983]

★

కాపు వధూవరుల స్వయంవరం (Online) 17 Dec. 2023, Free Registration Bhavani Matrimony, ECIL, HYD. Ph: 9704656103/ 9533608887 [HA-679]

Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE, Govt., Doctors, MNC Matches, Late & 2nd Matches కై సంప్రదించండి: 9704656103, 9533608887 (Whatsapp) [HA-663]

సాక్షి పెళ్ళిచూపులు ప్రకటనల కొరకు
3+2 3 ప్రకటనలకు చెల్లించండి 2 ప్రకటనలు ఉచితంగా పొందండి
AP+TS+Metros: 1800/- for 4 Lines (Chennia + Bengaluru + Delhi + Mumbai) 485/- Extra Line
Andhra Pradesh: 1350/- for 4 Lines (Incl. Hyd) 375/- Extra Line
Telangana (Incl. Hyd) 1100/- for 4 Lines 300/- Extra Line
* Color 25% Extra
గమనిక: ప్రకటనలపై 5% GST అదనం
హైదరాబాద్ : 99122 25453
వరంగల్ : 99516 02872
మెదక్ : 99122 25456
నల్గొండ : 95055 08382
నిజామాబాద్ : 99122 20764
మహబూబ్‌నగర్ : 99516 02829
కరీంనగర్ : 97059 33396
ఖమ్మం : 99516 02868
సాక్షి టవర్స్, రోడ్ నం.1, బంజారాహిల్స్, Hyd ✆ 040-23256000 Ext: 6235/6230
Cell : 9912225453, umail2sakshi.ads@sakshi.com

## క్లుప్తంగా...

### దళితులకు అన్ని రకాలుగా అన్యాయం



బి.వెంకట్

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా 17 శాతం కంటే ఎక్కువ ఉన్న దళితులకు అన్ని రకాలుగా అన్యాయం జరుగుతోందని వ్యవసాయ కార్మిక, దళిత, స్వచ్ఛంద సంఘాల ప్రతినిధిబృందం ఆరోపించింది. దళితుల సమస్యలను పరిష్కరిస్తామనే హామీని రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలో చేర్చాలని ప్రతినిధులు మల్లేపల్లి లక్ష్మయ్య, బి.వెంకట్, నిర్మల్, విక్రమ్ తదితరులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వీరంతా ఢిల్లీలో శనివారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆంధ్రభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ అధికారం చేపట్టినప్పటి నుంచి రాజ్యాంగానికి తూట్లు పొడుస్తోందని విమర్శించారు. దళిత హక్కులను కాపాడుకునేందుకు వచ్చే ఎన్నికల్లో బీజేపీని గద్దె దించాలని విజ్ఞప్తి చేశారు.

### అసెంబ్లీలో పాత పింఛను విధానం అమలు ప్రస్తావన హర్షణీయం

సీపీఎస్ ఎంప్లాయీస్ యూనియన్

సాక్షి,హైదరాబాద్: తెలంగాణ ఉద్యోగులకు త్వరలో పాత పింఛను విధానం అమలు చేస్తామని అసెంబ్లీ సాక్షిగా కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పడం పట్ల రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్) ఉద్యోగుల యూనియన్ హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంగాపురం స్థితప్రజ్ఞ, కల్వల్ శ్రీకాంత్ శనివారం ఓ ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. ఏళ్లుగా ఉద్యోగ ఉపాధ్యాయులు ఎదురుచూస్తున్న సీపీఎస్ రద్దు త్వరలోనే జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

### సీపీఎస్ రద్దుపై ఉద్యోగ, ఉపాధ్యాయుల హర్షం

సాక్షి, హైదరాబాద్: సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి సీపీఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం నేతలు కృతజ్ఞతలు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు అసెంబ్లీ మొదటి సమావేశాల్లోనే నిర్ణయం ప్రకటించడంపై ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాముక కమలాకర్, ప్రధాన కార్యదర్శి చీటీ భూపతిరావు, నాయకులు టీవీప్రసాద్, నాగేశ్వర్‌రావు, ఈవీఎస్ రెడ్డి, రవీందర్, హరికృష్ణరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న ఉద్యోగుల్లో పండుగ వాతావరణం ఏర్పడిందని పేర్కొన్నారు. ఉద్యోగుల పోరాటాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించిందని వారు పేర్కొన్నారు.

# సెటైర్లు.. సవాళ్లు.. ప్రతిసవాళ్లు

- గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై వాడీవేడిగా అసెంబ్లీ
- బీఆర్ఎస్‌పై దాడితో ప్రసంగం మొదలుపెట్టిన రేవంత్.. అందెశ్రీ కవితను ప్రస్తావిస్తూ సెటైర్లు
- ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం, దామోదర కూడా అదే దారిలో.
- దీటుగా తిప్పికొడుతూ కేటీఆర్, హరీశ్‌రావు విమర్శలు
- పరస్పరం వ్యంగ్య వ్యాఖ్యానాలు, ఛలోక్తులు, వాదోపవాదాలు
- నేరుగా ఒకరినొకరు ఎత్తిపొడుచుకున్న రేవంత్, కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై శనివారం అసెంబ్లీలో వాడీవేడి చర్చ జరిగింది. కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత తొలిసారిగా అసెంబ్లీలో అధికార, విపక్షాల మధ్య విమర్శలు, ప్రతి విమర్శల పర్వం మొదలైంది. అభ్యంతరాలు, వాదోపవాదాలు, ఆరోపణలు, ప్రత్యారోపణలు, సవాళ్లు, వ్యంగ్య వ్యాఖ్యలతో రోజంతా సభ ఆసక్తికరంగా సాగింది. సభలో ప్రతి పక్షానికి కూడా మాట్లాడే అవకాశం ఇస్తామంటూనే అధికార పక్షం బీఆర్ఎస్‌పై దాడికి దిగింది. దీనికి ప్రతిగా బీఆర్ఎస్ పక్షాన సీనియర్ సభ్యులు కేటీఆర్, హరీశ్ ఇద్దరూ దూకుడుగా కాంగ్రెస్ సర్కారుపై ఎదురుదాడి చేశారు. దీంతో ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్‌ను కట్టడి చేసేందుకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్ తదితరులు ప్రయత్నించారు. కుటుంబ పాలన, వరి పంటకు మద్దతు ధర, తెలంగాణలో రైతుల ఆత్మహత్యలు, 50ఏళ్ల కాంగ్రెస్ పాలన అవస్థలు, ఆ పార్టీ సీఎంలను ఎంపిక చేసిన తీరు తదితర అంశాలపై కాంగ్రెస్, బీఆర్ఎస్ సభ్యులు పరస్పరం వ్యంగ్య విమర్శలు, వాదోపవాదాలకు దిగారు.

**మొదట సీఎం దాడి..**

సీఎం రేవంత్ తన ప్రసంగం ప్రారంభంలోనే బీఆర్ఎస్‌పై విమర్శలు, ఆరోపణలు గుప్పించారు. కుటుంబ పాలనకు వ్యతిరేకంగా ప్రజలు తీర్పునిచ్చినా బీఆర్ఎస్‌లో మార్పు రాలేదంటూ మండిపడ్డారు. ఇక 'మేనేజ్‌మెంట్ కోటా'పేరిట జరిగిన చర్చ ఆసక్తికరంగా సాగింది. ''మేనేజ్‌మెంట్ కోటాలో వచ్చిన వారు కేబినెట్ నిర్ణయాలు, చట్టబద్ధత కల్పించడంపై తేడాను గమనించాలి''అని రేవంత్ వ్యాఖ్యానించగా.. కేటీఆర్ ప్రతిస్పందిస్తూ..''ఢిల్లీని మేనేజ్ చేసి పీసీసీ అధ్యక్ష పదవి, సీఎం పదవి తెచ్చుకున్న వ్యక్తి మేనేజ్‌మెంట్ గురించి మాట్లాడుతున్నారు''అని ఎద్దేవా చేశారు. దీంతో.. ''గవర్నర్ ప్రసంగం చూసి సిగ్గుపడుతున్నానని కేటీఆర్ అన్నారు. నిజంగా గత పదేళ్ల పాలనపై ఆయన సిగ్గుపడాల్సిందే..''అని రేవంత్ సెటైర్ వేయగా.. 'పంటల బీమాకు, రైతు బీమాకు తేడా తెలియని వ్యక్తి సీఎంగా ఉన్నందుకు సిగ్గుపడుతున్నా'నని కేటీఆర్ విమర్శించారు. దీనికి ప్రతిగా 'మేనేజ్‌మెంట్ కోటాలో వచ్చిన వ్యక్తి.. ప్రజల నుంచి వచ్చి సీఎం కుర్చీలో కూర్చున్న వారిపై కుళ్లుకుంటున్నారు'అని రేవంత్ వ్యాఖ్యానించారు. ఇక 50ఏళ్ల కాంగ్రెస్ పాలనలో చీకట్లు, రైతుల ఆత్మహత్యలేనని బీఆర్ఎస్ సభ్యులు విమర్శించగా.. గత పాలనలో అన్యాయం జరిగిందనే అందరం పోరాడి తెలంగాణ తెచ్చుకున్నామని, ఇప్పుడు గత పదేళ్ల పాలన గురించి మాట్లాడుకుందామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

**హరీశ్‌రావుకు మైక్ నిరాకరణపై నిరసన**

ధన్యవాద తీర్మానంపై సీఎం ఇచ్చిన సమాధానానికి బీఆర్ఎస్ పక్షాన హరీశ్‌రావు వివరణ కోరడం కూడా అధికార, విపక్షాల మధ్య వాగ్వాదానికి దారితీసింది. ధన్యవాద తీర్మానంపై జరిగిన చర్చలో పాల్గొన్న కేటీఆర్‌కే వివరణ కోరే అవకాశం ఇస్తామని స్పీకర్ పలుమార్లు ప్రకటించారు. అయినా చివరికి హరీశ్‌రావుకు మైక్ ఇచ్చారు. ''సీఎం పలు అంశాలపై హుందాతనం లేకుండా విమర్శలు చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాట్లాడినట్టుగా ఇప్పుడు సీఎం అయినా గోబెల్స్ ప్రచారం చేస్తున్నారు. తెలంగాణ బిడ్డ పీవీ చనిపోతే చూసేందుకు కాంగ్రెస్ నేతలెవరూ రాలేదు''అని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఈ సమయంలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఉప ముఖ్యమంత్రి భట్టి కల్పించుకుంటూ.. బీఆర్ఎస్ వాళ్లు పదేళ్ల నుంచీ అదే చెప్తున్నారని, ఇంకెన్నాళ్లు చాచా నెహ్రూ, పీవీ నర్సింహారావుల గురించి మాట్లాడుతారని ప్రశ్నించారు. ఇదే సమయంలో ధన్యవాద తీర్మానం తీర్మానాన్ని ఆమోదించినట్టు స్పీకర్ ప్రకటిస్తూ, శాసనసభను బుధవారానికి వాయిదా వేశారు. దీంతో బీఆర్ఎస్ సభ్యులు తమకు నిరసన తెలిపే అవకాశం ఇవ్వలేదని నినాదాలు చేస్తూ సభ నుంచి బయటికి వచ్చారు.

# బీసీ డిమాండ్లను అమలు చేయాలి

- సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేసిన ఆర్.కృష్ణయ్య

కాచిగూడ (హైదరాబాద్): కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన బీసీల డిమాండ్లను అమలు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. శనివారం ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో బీసీ ప్రతినిధి బృందం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపింది. పంచాయతీరాజ్ రిజర్వేషన్లను 20 నుంచి 42 శాతంకు పెంచాలని, విద్యా, ఉద్యోగాల రిజర్వేషన్లను 25 శాతం నుంచి 52 శాతంకు పెంచాలని, జనగణనలో కుల గణన చేపట్టాలని కోరారు. ప్రతి కులానికి ఒక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ధర్నాలు, ర్యాలీలు, బహిరంగ సభలకు అనుమతించాలని కోరారు. బీసీ బంధు ప్రవేశపెట్టి రూ.10 లక్షలు ఇవ్వాలని, పెరిగిన ధరల ప్రకారం మెస్ చార్జీలు, స్కాలర్ షిప్‌లను పెంచాలని కోరారు. అదనంగా 119 బీసీ గురుకులాలు మంజూరు చేయాలని, దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి గురుకుల సీటు ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డిని అభినందిస్తున్న ఆర్.కృష్ణయ్య

### ఇందిర ఉక్కు సంకల్పంతోనే బంగ్లాదేశ్ ఏర్పాటు

సాక్షి, హైదరాబాద్: మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ఉక్కు సంకల్పం వల్లే పాకిస్తాన్‌ను ఓడించి బంగ్లాదేశ్‌ను ఏర్పాటు చేయడం సాధ్యమైందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ ప్రశంసించారు. ప్రపంచం అబ్బురపడేలా భారత సైన్యాన్ని ఆమె నడిపించారని చెప్పారు. శనివారం గాంధీభవన్‌లో బంగ్లాదేశ్ లిబరేషన్ వార్ (బీఎల్‌డబ్ల్యూ)-1971 విజయోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ నేతల దూరదృష్టి, వీరోచిత పాలన కారణంగానే భారతదేశం సురక్షితంగా ఉందని స్పష్టం చేశారు. సమావేశంలో టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు జి.నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

### టమాటాలు దొంగిలించాడని కట్టేసి కొట్టారు



మంచిర్యాల క్రైం: టమాటాలు దొంగిలించాడని కూరగాయల వ్యాపారి ఓ వ్యక్తిని కట్టేసి కొట్టాడు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కూరగాయల మార్కెట్‌లో శనివారం జరిగిన ఈ సంఘటనపై బాధితుడి కథనమిది. జిల్లాలోని దండేపల్లి మండలం రెబ్బెన గ్రామానికి చెందిన జాడి గంగులు గతంలో స్థానిక కూరగాయల హోల్‌సేల్ వ్యాపారి బాసవ కృష్ణ (బీకే) వద్ద పనిచేసి మానేశాడు. కొంతకాలంగా ఇతర వాహనాల్లో తాత్కాలిక క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం ఉదయం మార్కెట్‌కు వచ్చిన గంగులును పట్టుకుని టమాటాలు దొంగిలించాడని బసవ కృష్ణతోపాటు ఆయన కుమారులు కర్రకు కట్టేసి చితకబాదారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గంగులును విడిపించారు. గంగులు ఫిర్యాదు మేరకు బీకేతోపాటు అతని కుమారులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ రాజు తెలిపారు.

# గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నం

**పోలీసుల వేధింపుల వల్లే అని బాధితుడి భార్య ఆరోపణ**

- ఎలాంటి వేధింపులకు పాల్పడలేదన్న సీఐ

మహబూబాబాద్ రూరల్: గడ్డిమందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. శనివారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఈ ఘటన జరిగింది. పోలీసుల వేధింపుల వల్లే తన భర్త ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని బాధితుడి భార్య ఆరోపిస్తుండగా, ఆ వ్యక్తిని తాము వేధించలేదని టౌన్ సీఐ వివరణ ఇచ్చారు. బాధితుడి భార్య కొలిపాక జయమ్మ కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ధర్మారపు కనకయ్య కాలనీలో కొలిపాక ఐలయ్య, జయమ్మ కుటుంబం ఓ గుడిసెలో నివాసం ఉంటోంది. ఈ క్రమంలో అదే కాలనీలో నివాసం ఉండే ఇద్దరు మహిళలు ఐలయ్య తమను దూషిస్తున్నాడని పేర్కొంటూ.. సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నేత హెచ్.లింగన్న సాయంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే తాను దూషించలేదని ఐలయ్య చెప్పినప్పటికీ పట్టించుకోకుండా ప్రతి చిన్న విషయానికి పోలీసులు స్టేషన్‌కు పిలిపించి వేధింపులకు గురి చేస్తున్నట్టు ఆయన భార్య జయమ్మ తెలిపింది. తాము చెప్పే విషయాలను పట్టించుకోకుండా ఎదుటి వ్యక్తులు చెప్పే వాటినే ప్రామాణికంగా తీసుకుంటున్నారని పేర్కొంది. ఆందోళనకు గురైన ఐలయ్య ఇంటి వద్ద గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు వెల్లడించింది. ఐలయ్య ప్రస్తుతం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీనిపై మహబూబాబాద్ టౌన్ సీఐ వై.సతీష్‌ను వివరణ కోరగా ఐలయ్యను తాము ఎలాంటి వేధింపులకు గురి చేయలేదని తెలిపారు. తమను దూషించాడని కల్పన, మున్నీ అనే మహిళలు ఫిర్యాదు చేయడంతో ఐలయ్యను పిలిపించి పద్ధతి మార్చుకోవాలని సూచించామన్నారు.



ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ ఐలయ్య



వివరాలు వెల్లడిస్తున్న ఐలయ్య భార్య జయమ్మ

### రిజర్వేషన్లు పెంచేవరకు ఉద్యోగాలు భర్తీ చేయొద్దు

ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ




దామెర: రిజర్వేషన్లు పెంచే వరకు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాలు భర్తీచేయొద్దని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. హనుమకొండ జిల్లా దామెర మండలంలోని పులుకుర్తిలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు రిజర్వేషన్లు పెంచుతామని ఇచ్చిన హామీ ప్రకారం కొత్త ప్రభుత్వం రిజర్వేషన్లు పెంచే వరకు ఉద్యోగ ప్రకటనలు ఇవ్వకూడదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మూడు విషయాలకు కట్టుబడి ఉన్నంతకాలం ఎమ్మార్పీఎస్.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సహకారం అందిస్తుందని చెప్పారు. అందులో భాగంగా ప్రజాస్వామ్య స్ఫూర్తికి అనుగుణంగా, రాజ్యాంగం కల్పించిన హక్కులకు విఘాతం కలిగించకుండా పాలన కొనసాగాలని సూచించారు. రాష్ట్ర జనాభాలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు 93 శాతం ఉండగా ఐదుగురికి మాత్రమే మంత్రి పదవులు ఇచ్చారని ఆరోపించారు. సామాజిక న్యాయం పాటించకుండా కొత్త ప్రభుత్వం అసమానతలను పెంచేవిధంగా అడుగు వేస్తున్నట్లు కనిపిస్తోందన్నారు.

# ఉద్యోగం రావడంలేదని యువకుడి బలవన్మరణం

**మహబూబాబాద్ జిల్లా డోర్నకల్‌లో ఘటన**

డోర్నకల్: ఉద్యోగం రావడంలేదనే మనోవేదనతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ పట్టణ శివారు ఎర్రమట్టితండాలో శుక్రవారం అర్ధరాత్రి దాటాక చోటుచేసుకుంది. డోర్నకల్ సీఐ బి.ఉపేందర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం... ఎర్రమట్టితండాకు చెందిన భూక్యా అనిల్ అలియాస్ విజయ్(23) డిగ్రీ పూర్తి చేసి హైదరాబాద్‌లో ఉంటూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నాడు. ఇప్పటికే కొన్ని పోటీపరీక్షలకు హాజరైన అనిల్ ఇటీవల స్వగ్రామానికి వచ్చాడు. ఆర్థిక ఇబ్బందులకుతోడు ఉద్యోగం రావడం లేదన్న మనోవేదనలో ఉన్న అనిల్ శుక్రవారం అర్ధరాత్రి తరువాత ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. మరునాడు ఉదయం కుటుంబసభ్యులు గమనించి చుట్టుపక్కల వెతకగా తండా సమీపంలోని ఓ వ్యవసాయబావిలో అనిల్ మృతదేహం లభ్యమైంది. మృతదేహం నుంచి పురుగుమందు వాసన రావడాన్ని కుటుంబసభ్యులు గుర్తించారు. ఉద్యోగం రాలేదనే బాధతోనే అనిల్ ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. అనిల్ తండ్రి జయరాజ్ 20 ఏళ్ల క్రితమే అదృశ్యంకాగా, తల్లి, సోదరుడు ఉన్నారు. తల్లి కల్పన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. అనిల్ ఆత్మహత్యకు ముందు రాసినట్లుగా చెబుతున్న ఓ లేఖ వాట్సాప్‌లో చెక్కర్లు కొట్టింది. ఉద్యోగం రాకపోవడం, ఆర్థిక ఇబ్బందులు ఉండటంతో ఆత్మహత్య చేసుకుంటున్నట్లు లేఖలో అనిల్ పేర్కొన్నాడు. కాగా, లేఖ విషయం తమ దృష్టికి రాలేదని పోలీసులు తెలిపారు.



భూక్యా అనిల్ (ఫైల్)


## జస్ట్ మిస్..



రోడియో.. చాలా ప్రమాదకరమైన క్రీడ. తేడా వస్తే అంతే సంగతులు.. పాపం ఈ కౌబాయ్.. లేత వయసు కుర్రాడట. అనుభవం కూడా తక్కువ. దాంతో ఎక్కి కూర్చోగానే.. ఈ దున్న ఎగిరి.. ఎత్తి కుదేసింది. టైం బాగుంది కాబట్టి.. అది ల్యాండ్ అయ్యేలోగా.. దెబ్బలు తగలకుండా.. ఇతడు అక్కడ్నుంచి తప్పించుకోగలిగాడట. లేకపోతే.. రోలులో పచ్చడి వేసి రుబ్బినట్లు అయిపోయేది మనోడి పరిస్థితి. ఈ మొత్తం పరిస్థితిని క్షణాల్లో క్లిక్‌మనిపించాడు టోనీ లా అనే ఫొటోగ్రాఫర్. 2023 ఇంటర్నేషనల్ ఫొటోగ్రఫీ పోటీల్లో ఈ చిత్రానికి స్పోర్ట్స్ విభాగంలో మొదటి బహుమతి లభించింది.

## టుడేస్ గ్రాఫిక్

సెల్‌ఫోన్ వ్యసనం అత్యధికంగా ఉన్న టాప్ టెన్ దేశాలు..




# ఆ 3 గంటల్లోనే మృత్యు ఘంటికలు

**సాయంత్రం 6 నుంచి 9 గంటల మధ్యే ఎక్కువ రోడ్డు ప్రమాదాలు**

**2022లో దేశంలో 90,663, తెలంగాణలో 4,544 ప్రమాదాల నమోదు**

**ఎన్‌సీఆర్‌బీ-2022 నివేదిక వెల్లడి**

సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల మధ్యే ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆ మూడు గంటల్లోనే ప్రమాదాలు అత్యధికంగా నమోదవుతున్నట్లు నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ)-2022 నివేదిక వెల్లడించింది. 2022లో దేశవ్యాప్తంగా 4,46,768 రోడ్డు ప్రమాదాలు నమోదుకాగా.. ఈ మూడు గంటల్లోనే 90,663 ప్రమాదాలు జరిగినట్టు నివేదిక తెలిపింది. అదే సమయంలో తెలంగాణలో 4,544 రోడ్డు ప్రమాదాలు నమోదయ్యాయి. కార్యాలయాల పనివేళలు ముగించుకుని ఇళ్లకు వెళ్లేవారు, పలు రకాల పనులపై ఇంటి నుంచి బయటికి వచ్చే వాహనదారులతో రోడ్లు రద్దీగా ఉండటం... సాయంత్రం వేళల్లో సరైన వెలుతురు లేకపోవడం, వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు తదితర కారణాలతోనే సాయంత్రం 6 నుంచి 9 గంటల మధ్య రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నట్టు రోడ్డు భద్రత నిపుణులు చెబుతున్నారు.



2022లో రోడ్డు ప్రమాదాల నమోదు గంటల వారీగా ఇలా...

| సమయం | దేశంలో | రాష్ట్రంలో | హైదరాబాద్‌లో |
|---|---|---|---|
| అర్ధరాత్రి నుంచి తెల్లవారుజామున 3 గం. | 23,688 | 1,094 | 203 |
| తెల్లవారుజామున 3 నుంచి 6 గం. | 25,680 | 952 | 136 |
| ఉదయం 6 నుంచి 9 గం. వరకు | 47,793 | 2,163 | 307 |
| ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గం. | 64,473 | 2,988 | 357 |
| మధ్యాహ్నం 12 నుంచి 3 గం. | 66,756 | 3,312 | 381 |
| మధ్యాహ్న 3 నుంచి 6 గం. | 77,514 | 4,051 | 411 |
| సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గం. | 90,663 | 4,544 | 379 |
| రాత్రి 9 నుంచి అర్ధరాత్రి 12 గం. | 50,201 | 2515 | 342 |
| మొత్తం రోడ్డు ప్రమాదాలు | 4,46,768 | 21,619 | 2,516 |

## 19 నుంచి జూనియర్ డాక్టర్ల సమ్మె

సాక్షి, హైదరాబాద్: స్టైఫండ్ పంపిణీలో జాప్యంపై తెలంగాణ జూనియర్ డాక్టర్ల సంఘం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ద్వితీయ, తృతీయ సంవత్సరం జూనియర్ రెసిడెంట్లు, హౌస్ సర్జన్లకు దాదాపు నాలుగు నెలలుగా స్టైఫండ్ రావడం లేదని తెలిపింది. ఈనెల 19వ తేదీ నుంచి విధులు బహిష్కరించి సమ్మె చేపట్టనున్నట్లు హెచ్చరించింది. ఈ మేరకు తెలంగాణ జూనియర్ డాక్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.కౌశిక్ కుమార్, ప్రధాన కార్యదర్శి అఖిల్‌కుమార్ శనివారం వైద్య విద్య సంచాలకులు రమేశ్‌రెడ్డికి సమ్మె నోటీసు ఇచ్చారు. సీనియర్ రెసిడెంట్లు, ఫస్టియర్ పీజీ డాక్టర్లకు సైతం స్టైఫండ్ చెల్లింపుల ప్రక్రియ ఇంకా ప్రాసెస్‌లోనే ఉందని పేర్కొన్నారు. తక్షణమే స్టైఫండ్ నిధులివ్వకుంటే 19 నుంచి ఔట్ పేషంట్ విధులను బహిష్కరిస్తామని, ఆ తర్వాత ఓటీ (ఆపరేషన్ థియేటర్) విధులు సైతం బహిష్కరించనున్నట్లు జూడాల సంఘం స్పష్టం చేసింది.

# అధికారం కోసం అడ్డదారులు



## 10 లక్షలకుపైగా ఓట్ల తొలగింపునకు టీడీపీ కుట్ర

**మైపార్టీ డ్యాష్ బోర్డు.కామ్ పేరుతో ఓటర్ల వ్యక్తిగత సమాచార సేకరణ**

**వైఎస్సార్‌సీపీ ఓట్ల తొలగింపే లక్ష్యం..**

సాక్షి, అమరావతి: ఎన్నికల్లో ప్రజల ఆశీస్సులతో గెలుపొందడానికి రాజకీయ పార్టీలు ప్రయత్నించడం సాధారణం. కానీ.. చంద్రబాబు నేతృత్వంలోని టీడీపీ మాత్రం ఇందుకు భిన్నం. అడ్డదారుల్లో గెలుపొందటానికి ప్రయత్నించడం ఆ పార్టీ నైజం. ఓటర్ల జాబితాలో అక్రమాలకు పాల్పడటం ద్వారా ఎన్నికల్లో గెలుపొందడానికి కుట్రలు చేయడం టీడీపీ రివాజుగా మార్చుకుంది. విభజన నేపథ్యంలో 2014 ఎన్నికల్లో ఓటర్ల జాబితాలో 35 లక్షలకుపైగా దొంగ ఓట్లు చేర్పించి.. కేవలం 5 లక్షల ఓట్ల తేడా అధికారంలోకి రావడం అందరికీ గుర్తుండే ఉంటుంది. అధికారంలోకి వచ్చాక సేవా మిత్ర యాప్‌తో 2015-17 మధ్య 50.23 లక్షల మంది వైస్సార్‌సీపీ మద్దతుదారుల ఓట్లను తొలగించేలా చంద్రబాబు చక్రం తిప్పారు... ఇపుడు ప్రతిపక్షంలోకి మారినా అదే కుట్రను అమలు చేస్తున్నారు. ప్రజాప్రతినిధ్య చట్టం-1950లో సెక్షన్-123(3)కి విరుద్ధంగా మైపార్టీ డ్యాష్ బోర్డు.కామ్ అనే వెబ్ సైట్ ఏర్పాటుచేశారు. ఈ వెబ్‌సైట్ ద్వారా ఏ రాజకీయ పార్టీకి మద్దతు పలుకుతారో వివరాలు సేకరిస్తోంది. వైఎస్సార్‌సీపీకి మద్దతుగా ఉంటామని చెప్పిన వారిని లక్ష్యంగా చేసుకుంటోంది.. బతికున్నప్పటికీ చనిపోయినట్లు చిత్రీకరించి, నకిలీ అంటూ వక్రీకరించి, శాశ్వతంగా వలస వెళ్లారంటూ మాయచేసి, రెండు చోట్ల ఓట్లు ఉన్నాయంటూ బొంకి.. సుమారు పది లక్షలకుపైగా ఓట్లను తొలగించాలంటూ టీడీపీ ఎన్నికల సెల్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ కోనేరు సురేష్ గంపగుత్తగా ఎన్నికల సంఘానికి ఫారం-7లను అందజేశారు. వాటిపై ఆయా జిల్లాల కలెక్టర్లను ఎన్నికల సంఘం విచారణకు ఆదేశించింది. కొనేరు సురేష్ గంపగుత్తగా దరఖాస్తు చేసిన ఫారం-7లపై విచారణ చేసిన బీఎల్వోలు.. అందులో 80 శాతానికిపైగా తప్పుడు సమాచారంతో దరఖాస్తు చేశారని తేల్చారు. ఆ మేరకు జిల్లాల కలెక్టర్లు ఎన్నికల సంఘానికి నివేదికలు సమర్పించారు. ఓట్లను తొలగించేందుకు తప్పుడు సమాచారంతో ఫారం-7లు దరఖాస్తు చేయడం ఐపీసీలో సెక్షన్-182, ప్రజాప్రాతినిధ్య చట్టం-1950లో సెక్షన్-31 ప్రకారం నేరం. ఏడాది జైలు శిక్ష లేదా జరిమానా.. లేదంటే ఏడాది జైలు శిక్షతోపాటు జరిమానా విధించే అవకాశం ఉంటుంది. అలాంటిది లక్షలాది మంది ప్రజల ఓటు హక్కును హరిస్తూ తప్పుడు సమాచారంతో గంపగుత్తగా లక్షలాది ఫారం-7లు దరఖాస్తు చేసిన టీడీపీ ఎన్నికల సెల్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ కొనేరు సురేష్‌పై కేంద్ర ఎన్నికల సంఘం ఎలాంటి చర్యలకు ఉపక్రమిస్తుందన్నది ఆసక్తిగా మారింది.



టీడీపీ సేవామిత్ర హోం పేజీ

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

### రాష్ట్ర ప్రజల వ్యక్తిగత సమాచారం అమెరికాలో నిక్షిప్తం..

ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99.5 శాతం సీఎం వైఎస్ జగన్ అమలు చేశారు. దేశ చరిత్రలో కనివిని ఎరుగని రీతిలో సంక్షేమ పథకాల ద్వారా డీబీటీ, నాన్ డీబీటీ రూపంలో రూ.4.17 లక్షల కోట్ల ప్రయోజనాన్ని ప్రజలకు చేకూర్చారు. సంక్షేమ పథకాల ఫలాలు 87 శాతం కుటుంబాలకు చేరాయి. వికేంద్రీకరణ, విప్లవాత్మక సంస్కరణలతో సుపరిపాలన అందిస్తుండటంతో సీఎం వైఎస్ జగన్‌కు ప్రజల్లో ఆదరణ రోజురోజుకు పెరుగుతోంది. దాంతో వచ్చే ఎన్నికల్లో 2019 ఎన్నికల కంటే ఘోర పరాజయం తప్పదని నిర్ధారణకు వచ్చిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఉనికి కాపాడుకోవడం కోసం ఎప్పటిలానే ఓటర్ల జాబితాలో అక్రమాలకు తెరతీశారు. ఈ క్రమంలోనే అధికారంలో ఉన్నప్పుడు తస్కరించిన ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని మైపార్టీ డ్యాష్ బోర్డు.కామ్‌కు అనుసంధానం చేసి.. రాష్ట్రంలో 175 నియోజకవర్గాల్లో ప్రతి బూత్‌లో ఇంటింటికీ కార్యకర్తలను పంపి.. ఓటరు పేరు, ఓటరు కార్డు నెంబరు దగ్గర నుంచి కులం, మొబైల్ నెంబరు, ఏ రాజకీయ పార్టీకి మద్దతు తెలుపుతారు వంటి వ్యక్తిగత వివరాలను సేకరిస్తున్నారు. ఇది ప్రజాప్రతినిధ్య చట్టం-1950 ప్రకారం నేరం. ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని అమెరికాలో వర్జీనియాలోని యాష్‌బర్న్‌లో అమెజాన్ డేటా సర్వీసెస్‌లో నిక్షిప్తం చేస్తుండటం గమనార్హం.

### పది లక్షలకుపైగా ఫారం-7 దరఖాస్తులు..

ఎన్నికల సంఘం నిబంధనల మేరకు బూత్ లెవల్ ఏజెంట్లను నియమించుకుని.. ఓటర్ల జాబితాలో తప్పులు ఉంటే.. వాటిని తొలగించేందుకు రోజుకు గరిష్ఠంగా 5 వరకు ఫారం-7లను ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసే వెసులుబాటు ఉంది. తప్పుడు సమాచారంతో ఫారం-7లను దరఖాస్తు చేస్తే.. అలా దరఖాస్తు చేసిన వారిపై బీఎల్వో(బూత్ లెవల్ ఆఫీసర్లు) చట్ట ప్రకారం కేసులు పెడతారు. గంపగుత్తగా ఫారం-7లు అందజేయడం నిబంధనలకు విరుద్ధం. కానీ.. మైపార్టీ డ్యాష్ బోర్డు.కామ్ ద్వారా సేకరించిన సమాచారంతో తొలి దఫాలో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు పది లక్షల మంది ఓట్లను జాబితాను తొలగించాలంటూ ఫారం-7లను టీడీపీ ఎన్నికల సెల్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ కోనేరు సురేష్ ఎన్నికల సంఘానికి అందజేయడం గమనార్హం.

### బతికున్నా చనిపోయినట్లు.. నివాసం ఉన్నా వలస వెళ్లినట్లు..

వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు బతికున్నా సరే చనిపోయినట్లు.. నివాసం ఉన్నా సరే ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినట్లు.. చిరునామా పక్కాగా ఉన్నా నకిలీ చిరునామాతో ఓట్లు ఉన్నట్లు.. ఒకే వ్యక్తికి ఒక చోట ఓటు ఉన్నప్పటికీ రెండు చోట్ల ఓట్లు ఉన్నట్లు చిత్రీకరిస్తూ.. పది లక్షలకుపైగా ఓట్లను తొలగించాలని ఫారం-7లను గంపగుత్తగా టీడీపీ ఎన్నికల సెల్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ కోనేరు సురేష్ ఎన్నికల సంఘానికి అందజేశారు. వాటిపై విచారణకు ఆయా జిల్లాల కలెక్టర్లను ఆదేశించింది. దాంతో.. టీడీపీ అందజేసిన ఫారం-7లను బీఎల్వోలకు పంపి క్షేత్ర స్థాయిలో విచారణ చేసింది. అందులో 80 శాతం వరకూ తప్పుడు సమాచారంతో ఫారం-7లను దరఖాస్తు చేసినట్లు బీఎల్వోలు తేల్చారు. ఆ మేరకు ఆయా జిల్లాల కలెక్టర్లు ఎన్నికల సంఘానికి నివేదిక ఇచ్చారు.

### 2019 ఎన్నికలకు ముందు 50.23 లక్షల ఓట్లు తొలగింపు

విభజన నేపథ్యంలో 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ అధినేత చంద్రబాబు.. ఆధార్‌తోసహా ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని ఈ-ప్రగతి నుంచి ప్రైవేటు సంస్థలు ఐటీ గ్రిడ్స్, బ్లూఫ్రాగ్ సంస్థలకు చేరవేశారు. అదే సంస్థలతో టీడీపీ సేవా మిత్ర యాప్‌ను తయారుచేయించి.. తస్కరించిన ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని దానితో అనుసంధానం చేశారు. దీనిపై హైదరాబాద్‌లోని మాదాపూర్ పోలీసు స్టేషన్‌లో కేసు కూడా నమోదైంది. 2015-17 మధ్య ఇంటింటికీ వెళ్లిన టీడీపీ కార్యకర్తలు సేవా మిత్ర యాప్‌లలో ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని సేకరించి, వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలుపుతామని చెప్పిన వారి ఓట్లను తొలగించేలా ఫారం-7లను దరఖాస్తు చేశారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఆ ఓట్లను తొలగించేలా చంద్రబాబు చక్రం తిప్పారు. రాష్ట్రంలో 2015లో 22,76,714, 2016లో 13,00,613, 2017లో 14,46,238 వెరసి 50,23,565 ఓట్లను చంద్రబాబు తొలగింపజేశారు. చంద్రబాబుకు మాత్రమే సాధ్యమైన ఈ కుట్రను ప్రజాసంఘాలు బహిర్గతం చేశాయి. దీనిపై వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు మేరకు కేంద్ర ఎన్నికల సంఘం విచారణకు ఆదేశించింది. అర్హుల ఓట్లను కూడా తొలగించినట్లు తేల్చిన ఎన్నికల అధికారులు 2019 ఎన్నికల నాటికి 31,97,473 ఓట్లను జాబితాలో చేర్చారు. దీంతో గత ఎన్నికల్లో 50 శాతానికిపైగా ఓట్లు సాధించి 151 శాసనసభ, 22 లోక్‌సభ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అఖండ విజయం సాధించింది.

### గుంతకల్లు నియోజకవర్గంలో 4,666 ఓట్ల తొలగింపునకు కుట్ర

అనంతపురం జిల్లాలో గుంతకల్లు నియోజకవర్గంలో 9,582, రాయదుర్గం నియోజకవర్గంలో 6,130, శింగనమల నియోజకవర్గంలో 1904, అనంతపురం నియోజకవర్గంలో 1803, కళ్యాణదుర్గం నియోజకవర్గంలో 6,416 ఓట్లను తొలగించాలంటూ ఫారం-7లను టీడీపీ ఎన్నికల సెల్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ కోనేరు సురేష్ గంపగుత్తగా ఎన్నికల సంఘానికి అందజేశారు. వాటిపై అనంతపురం జిల్లా కలెక్టర్‌ను ఎన్నికల సంఘం విచారణకు ఆదేశించింది.

టీడీపీ దరఖాస్తు చేసిన ఫారం-7లపై అనంతపురం జిల్లా కలెక్టర్ క్షేత్ర స్థాయిలో విచారణ చేయించారు. గుంతకల్లు నియోజవకర్గంలో 4,666, రాయదుర్గంలో 1,630, శింగనమలలో 1137, అనంతపురంలో 406, కళ్యాణదుర్గంలో 2,640 ఓట్లు అర్హమైనవిగా తేల్చారు. అంటే.. టీడీపీ ఎంత భారీ ఎత్తున తప్పుడు ఫారం-7లను దరఖాస్తు చేసిందో విశదం చేసుకోవచ్చు.

### విశాఖ జిల్లాలో 4,632 మంది శాశ్వతంగా వలస వెళ్లినట్లు..

విశాఖపట్నం జిల్లాలో భీమిలి, విశాఖ ఉత్తరం, విశాఖ పశ్చిమ, పెందుర్తి, గాజువాక నియోజకవర్గాల్లో 8,914 మంది చనిపోయినట్లు, 4,862 మందికి రెండు చోట్ల ఓట్లు ఉన్నట్లు, 391 నకిలీ ఓట్లు ఉన్నట్లు, 11,279 మంది శాశ్వతంగా వలస వెళ్లినట్లు, 13,426 మంది చిరునామాలు లేనట్లు చిత్రీకరిస్తూ 38,872 ఓట్లు తొలగించాలని టీడీపీ ఎన్నికల సెల్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ కోనేరు సురేష్ ఎన్నికల సంఘానికి ఫారం-7లను అందజేశారు. వాటిపై ఎన్నికల సంఘం విచారణకు ఆదేశించింది.కొనేరు సురేష్ దరఖాస్తు చేసిన 38,872 ఫారం-7లపై విశాఖపట్నం జిల్లా కలెక్టర్ క్షేత్ర స్థాయిలో సమగ్రంగా విచారణ చేయించారు. ఇందులో 26,123 ఫారం-7లు తప్పుడు సమాచారంతో దరఖాస్తు తేల్చారని తేల్చారు. టీడీపీ దరఖాస్తు చేసిన ఫారం-7ల మేరకు 5,027 మంది చనిపోయినట్లు, 6,647 మంది శాశ్వతంగా వలస వెళ్లినట్లు, 841 మందికి రెండు ఓట్ల ఓట్లు ఉన్నట్లు తేల్చారు. ఇప్పటికే 254 ఓట్లు తొలంచినట్లు తేల్చారు. వీటిని పరిశీలిస్తే.. విశాఖ జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో 3,887 మంది బతికే ఉన్నా చనిపోయినట్లు, 4,632 మంది స్థానికంగా నివాసం ఉన్నా శాశ్వతంగా వలస పోయినట్లు టీడీపీ తప్పుడు సమాచారం ఇచ్చింది. ఆ మేరకు విచారణ నివేదికను విశాఖ కలెక్టర్ ఎన్నికల సంఘానికి నివేదించారు.

### కుప్పంలో 2,435 మందిని చంపేశారు..

టీడీపీ అధినేత చంద్రబాబు సొంత జిల్లా చిత్తూరులో కుప్పం, నగరి, జీడినెల్లూరు, పుంగనూరు నియోజకవర్గాల్లో 27,008 ఓట్ల తొలగింపు కోసం ఫారం-7లను ఆ పార్టీ ఎన్నికల సెల్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ కోనేరు సురేష్ దరఖాస్తు చేశారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వాటిపై చిత్తూరు జిల్లా కలెక్టర్ సమగ్రంగా విచారణ చేయించారు. ఎన్టీఆర్ దెబ్బకు 1983 ఎన్నికల్లో సొంతూరు ఉన్న చంద్రగిరి నియోజకవర్గంలో ఘోరంగా ఓడిపోయి 1989 ఎన్నికలకు కుప్పం నియోజకవర్గానికి చంద్రబాబు వలస వెళ్లారు. అప్పటి నుంచి ఇప్పటిదాకా అంటే ఆరు సార్లు వరుసగా గెలిపించిన పాపానికి కుప్పం నియోజకవర్గంలో 2,435 మంది బతికి ఉన్నప్పటికీ చనిపోయినట్లుగా తేల్చేసిన టీడీపీ వారి ఓట్లు తొలగించాలని ఫారం-7లు దరఖాస్తు చేసినట్లు కలెక్టర్ విచారణలో వెల్లడైంది. ఇక చిత్తూరు జిల్లాలో పుంగనూరు, నగరి, జీడీ నెల్లూరు, కుప్పం నియోజకవర్గాల్లో బతికి ఉన్న 4,780 మందిని కొనేరు సురేష్ చనిపోయినట్లుగా చిత్రీకరించి.. వారి ఓట్లను తొలగించాలని కోరడం గమనార్హం.

### అన్నమయ్య జిల్లాలో బతికి ఉన్న 8,355 మందిని చంపేసిన టీడీపీ..

- అన్నమయ్య జిల్లా రాజంపేట, కోడూరు, రాయచోటి, తంబళ్లపల్లె, పీలేరు, మదనపల్లె నియోజకవర్గాల్లో 18,936 మంది చనిపోయినట్లు, 5071 మందికి రెండు చోట్ల ఓట్లు ఉన్నట్లు, 910 నకిలీ ఓట్లు ఉన్నట్లు, 3,799 మంది శాశ్వతంగా వలస వెళ్లినట్లు, 11,642 మంది నివసిస్తున్నా ఇళ్లు లేనట్లు చూపి మొత్తం 40,358 మంది ఓట్లను తొలగించాలంటూ ఫారం-7లను టీడీపీ ఎన్నికల సెల్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ కోనేరు సురేష్ ఎన్నికల సంఘానికి దరఖాస్తులు అందజేశారు. వాటిపై అన్నమయ్య జిల్లా కలెక్టర్‌ను ఎన్నికల సంఘం విచారణకు ఆదేశించింది.
- టీడీపీ దరఖాస్తు చేసిన 40,358 ఫారం-7లపై అన్నమయ్య జిల్లా కలెక్టర్ క్షేత్ర స్థాయిలో సమగ్రంగా విచారణ చేయించారు. 10,581 మంది చనిపోయినట్లు, 933 మంది శాశ్వతంగా వలసపోయినట్లు, 1397 మందికి రెండు చోట్ల ఓటు ఉన్నట్లు, 2350 ఓట్లను ఇప్పటికే తొలగించినట్లు విచారణలో వెల్లడైంది. అంటే.. టీడీపీ దరఖాస్తు చేసిన ఫారం-7లలో 25,097 నకిలీవని స్పష్టమవుతోంది. అంటే.. 8,355 మంది బతికే ఉన్నా చనిపోయినట్లు టీడీపీ చిత్రీకరించినట్లు స్పష్టమవుతోంది. తప్పుడు సమాచారం ఇచ్చి 25,097 మందికి ఓటు హక్కు లేకుండా చేసేందుకు కుట్ర పన్నింది. దీని నివేదికను ఎన్నికల సంఘానికి అన్నమయ్య కలెక్టర్ పంపారు.

## రూ. 20 కోట్ల శునకం!!

- పెట్ షో కోసం బెంగళూరు నుంచి తీసుకొచ్చిన యజమాని
- సెల్ఫీలు తీసుకొనేందుకు పోటీపడ్డ స్థానికులు

హైదరాబాద్ మియాపూర్‌లో సందడి చేసిన కకేషియన్ షెపర్డ్ జాతి కుక్క..



మియాపూర్: సినిమాల్లో గెస్ట్ అప్పియరెన్స్‌లు.. బడా ఫంక్షన్లలో ప్రదర్శనలు.. ఎక్కడికెళ్లినా విస్తృత మీడియా కవరేజీ.. సెల్ఫీల కోసం ఎగబడే ప్రజలు.. ఇవన్నీ ఏ ప్రముఖుడి లైఫ్ స్టైల్‌ను తెలియజేసే వర్ణన అనుకుంటున్నారా? కానే కాదు.. దేశంలోనే అత్యంత ఖరీదైన, భారత్‌లో అరుదుగా పెంచే కకేషియన్ షెపర్డ్ జాతికి చెందిన ఓ శునకం అనుభవిస్తున్న విలాస జీవితం తాలూకు ఉదాహరణలు. దీని ఖరీదు రూ. వేలు, రూ. లక్షలు కూడా కాదు.. అక్షరాలా రూ. 20 కోట్లు!! కాడబామ్ హేడర్ అనే ఈ శునకం శనివారం హైదరాబాద్‌లోని మియాపూర్‌లో సందడి చేసింది. దీన్ని చూసేందుకు, సెల్ఫీలు దిగేందుకు స్థానికులు ఎగబడ్డారు. ఇండియన్ డాగ్ బ్రీడర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సతీష్ ఈ శునకాన్ని రూ. 20 కోట్లుపెట్టి ఈ ఏడాది జనవరిలో నగరానికి చెందిన ఓ డాగ్ బ్రీడర్ నుంచి కొనుగోలు చేశారు. తాజాగా నగరంలో పెట్ షో నిమిత్తం దీన్ని బెంగళూరు నుంచి తీసుకురాగా అది మార్గమధ్యలో కాస్త అలసటకు గురైంది. దీంతో మియాపూర్ మదీనాగూడలోని విశ్వాస్ పెట్ క్లినిక్‌లో దీనికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో అనేక పోటీల్లో తన శునకం పాల్గొని ఇప్పటివరకు 32 పతకాలు సాధించిందని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా పలు ప్రదర్శనలతోపాటు సినిమాల్లోనూ నటించిందని వివరించారు. దీనితోపాటు రూ. 10 కోట్ల విలువచేసే టిబెటన్ మాస్టిఫ్, రూ. 8 కోట్ల విలువచేసే అలాస్కన్ మాలమ్యూట్ జాతి శునకాలు తన వద్ద ఉన్నాయన్నారు. మూడేళ్ల వయసున్న కాడబామ్ హేడర్ రోజుకు 3 కేజీల చికెన్‌ను ఆహారంగా తీసుకుంటుందని... ఈ కుక్క కోసం నెలకు రూ. 3 లక్షలు ఖర్చు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## ఫోన్ల రికవరీలో దేశంలోనే ప్రథమం

**ఎనిమిది నెలల్లో 15వేల సెల్‌ఫోన్ల స్వాధీనం**

**సీఐడీ అడిషనల్ డీజీ మహేశ్ భగవత్**



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా చోరీకి గురైన, పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ల రికవరీలో 33.71 శాతంతో దేశంలోనే ప్రథమ స్థానంలో ఉన్నట్టు సీఐడీ అడిషనల్ డీజీ మహేశ్ భగవత్ పేర్కొన్నారు. ఎనిమిది నెలల్లో 15,024 మొబైల్ ఫోన్లను గుర్తించడంతోపాటు యజమానులకు అప్పగించినట్టు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) యాప్ ద్వారా మొబైల్ ఫోన్లను తిరిగి గుర్తిస్తున్నట్టు తెలిపారు. పోలీస్ కమిషనర్లు, ఎస్పీలందరి కృషితోనే ఇది సాధ్యమైందని మహేశ్ భగవత్ అభినందించారు.



## నరసింహావతారంలో భద్రాద్రి రామయ్య

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో జరుగుతున్న వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాల్లో భాగంగా స్వామివారు శనివారం నరసింహావతారంలో దర్శనమిచ్చారు. ఉదయం బేడా మండపంలో స్వామివారి ఎదుట వేద పండితులు దివ్యప్రబంధం పఠించారు. అనంతరం నరసింహావతారంలో అలంకరించిన స్వామివారిని పల్లకీ సేవగా మిథిలా స్టేడియంలోని వేదికపై కొలువుదీర్చి హారతి సమర్పించారు. ఈ రూపంలో స్వామివారిని దర్శించుకున్న భక్తులు పులకించిపోయారు.

## 10 రోజుల పాటు శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనం

- నేటి నుంచి తిరుప్పావై పారాయణం
- టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి వెల్లడి

తిరుమల: వైష్ణవాలయాల సంప్రదాయాలను పాటిస్తూ శ్రీవారి ఆలయంలో ఈ నెల 23 నుంచి జనవరి 1 వరకు వైకుంఠ ద్వారాన్ని 10 రోజుల పాటు తెరిచి శ్రీవారి దర్శనాన్ని కల్పిస్తామని టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి శనివారం తెలిపారు. తిరుమలలో గదులు పరిమితంగా ఉన్న కారణంగా ఈ పర్వదినాల్లో రద్దీ దృష్ట్యా తిరుపతిలో గదులు పొందవచ్చన్నారు. ఈ ఏడాది కూడా స్వయంగా వచ్చే ప్రొటోకాల్ వీఐపీలకు పరిమితంగానే బ్రేక్ దర్శనం ఇవ్వనున్నట్లు చెప్పారు. సిఫారసు లేఖలు స్వీకరించబోమని తెలిపారు. వైకుంఠ ద్వార దర్శన ఫలితం 10 రోజుల పాటు ఉంటుందని, తొలిరోజైన వైకుంఠ ఏకాదశి నాడే దర్శనం చేసుకోవాలనే తొందరపాటు లేకుండా 10 రోజుల్లో ఏదో ఓరోజు దర్శనం చేసుకోవడానికి ప్రణాళికలు రూపొందించుకోవాలని కోరారు. కాగా, ఈ నెల 17 నుంచి జనవరి 14 వరకు తిరుమల శ్రీ పెద్దజీయర్ స్వామి మఠంలో ఉదయం 7-8 గంటల వరకు తిరుప్పావై పాశురాలను పారాయణం చేయనున్నారు. దీన్ని ఎస్వీబీసీ ప్రత్యక్ష ప్రసారం చేయనుంది. తిరుమల ఆస్థాన మండపంలో వేదాంత విద్వాంసులు డా.గోవర్ధనం స్వామినాథాచార్యులు (హైదరాబాద్) నెల పాటు ఉదయం 8-9 గంటల వరకు తిరుప్పావై ప్రవచనాలు చేస్తారు. ధనుర్మాసం సందర్భంగా డిసెంబర్ 17-జనవరి 14 వరకు శ్రీవారి ఆలయంలో సుప్రభాత సేవకు బదులుగా తిరుప్పావై నివేదిస్తారు.

## శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి

స్వామి వారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్యాంసుందర్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయాధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం పండితులు వేద ఆశీర్వచనాలను.. అధికారులు ప్రసాదాలను అందజేశారు.



## పోలీస్ కస్టడీకి నటుడు జగదీష్

పంజగుట్ట: దొంగచాటుగా ఓ యువతి ఫోటోలు తీసి సామాజిక మాధ్యమాల్లో పెడతానని బెదిరించి..సదరు యువతి ఆత్మహత్యకు కారణమైన 'పుష్ప' సినిమా నటుడు జగదీష్ అలియాస్ కేశవను పంజగుట్ట పోలీసులు శుక్రవారం కోర్టు అనుమతితో కస్టడీలోకి తీసుకున్నారు. విచారణ అనంతరం రాత్రికి జగదీష్‌ను మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచి జైలుకు తరలించారు.




Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.
Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.